Visit **Dwarkadheeshvastu.com** For

**FREE** Vastu Consultancy, Music, Epics, Devotional Videos Educational Books, Educational Videos, Wallpapers

****

All Music is also available in **CD** format. **CD Cover** can also be print with your Firm Name

****

We also provide this whole Music and Data in **PENDRIVE** and **EXTERNAL HARD DISK.**

Contact : Ankit Mishra ( +91-8010381364, dwarkadheeshvastu@gmail.com )

## ।। श्रीहरि ।।

# श्रीरामचरितमानसमु वचनमु

## ( तेलुगु )

# విషయ సూచిక


| | పుట |
|---|---|
| i) ఒక్కమాట | vii |
| ii) ధ్యాన శ్లోకములు | xiii |
| iii) శ్రీ జానకీ జీవనాష్టకమ్ | xiv |
| iv) శ్రీరామస్తుతి | xiv |
| v) హనుమాన్ చాలీసా | xv |

## I బాలకాండము

| | |
|---|---|
| 1. మంగళాచరణము | 1 |
| 2. దైవ ప్రార్థన | 1 |
| 3. గురుప్రస్తుతి | 2 |
| 4. సజ్జనుల మహిమ | 2 |
| 5. రామాయణ మహత్త్వము | 6 |
| 6. శ్రీరామనామ మహిమ | 11 |
| 7. యాజ్ఞవల్క్య భరద్వాజ సంవాదము | 20 |
| 8. సతీదేవి భ్రమ | 22 |
| 9. దక్షయజ్ఞము-సతీదేవి తనుత్యాగము | 25 |
| 10. పార్వతీజననము | 26 |
| 11. పార్వతీ తపస్సు | 28 |
| 12. కామదహనము | 32 |
| 13. పార్వతీ పరమేశ్వరుల పరిణయము | 34 |
| 14. శివపార్వతుల సంవాదము | 41 |
| 15. శ్రీరామావతార రహస్యము | 45 |
| 16. నారదుని మోహము | 47 |
| 17. శతరూపా స్వాయంభువమనువుల వృత్తాంతము | 51 |
| 18. ప్రతాప భానుని ఉదంతము | 55 |
| 19. రావణాదుల జననములు | 62 |
| 20. భూదేవివ్యాకులపాటు | 64 |
| 21. దేవతలకు భగవంతునిఅభయము | 65 |
| 22. శ్రీరామజననము-బాల్యము | 67 |
| 23. విశ్వామిత్రుని యాగసంరక్షణము | 72 |
| 24. అహల్యాశాప విమోచనము | 74 |
| 25. రామలక్ష్మణులు మిథిలానగర శోభలను తిలకించుట | 77 |
| 26. శ్రీరామలక్ష్మణులు పుష్పవాటికను సందర్శించుట | 80 |
| 27. శివధనుర్భంగము | 84 |
| 28. పరశురాముని ఆగమనము | 93 |
| 29. జనకుడు దూతలద్వారా దశరథుని ఆహ్వానించుట | 99 |
| 30. దశరథుడు సపరివారముగా పెండ్లికి తరలుట | 103 |
| 31. పెండ్లివారికి స్వాగతమర్యాదలు | 105 |
| 32. శ్రీ సీతారాముల, భరతాదుల కల్యాణమహోత్సవవైభవములు | 107 |
| 33. అయోధ్యకు పెండ్లివారి ప్రయాణములు | 117 |
| 34. పెండ్లివారు అయోధ్యకు చేరుట - నిత్యనూతనోత్సవములు | 121 |

## II అయోధ్యాకాండము

| | |
|---|---|
| 35. భగవన్నుతి | 127 |
| 36. యువరాజ పట్టాభిషేక సంకల్పము | 128 |
| 37. దేవతల పన్నాగము-మంథర దుర్బోధ | 131 |
| 38. కైకేయి కోపగృహమునకేగుట - రెండు వరములను కోరుకొనుట | 134 |
| 39. దశరథుని పరితాపము | 138 |
| 40. శ్రీరామునివినతి-తల్లి కౌసల్య అనుమతి | 144 |
| 41. సీతాదేవి అభ్యర్థన-రాముని ఆమోదము | 147 |
| 42. లక్ష్మణుని విన్నపము-అన్న ఆమోదము | 151 |
| 43. లక్ష్మణునకు సుమిత్రామాత అనుజ్ఞ | 152 |
| 44. శ్రీ సీతారామలక్ష్మణుల వనగమనము | 154 |
| 45. శ్రీ రామగుహుల సమాగమము | 157 |
| 46. నావికుని అనుగ్రహించుట - నావపై గంగను దాటుట | 161 |
| 47. శ్రీరాముడు ప్రయాగను చేరుట- భరద్వాజుని దర్శించుట | 162 |
| 48. గ్రామప్రజల ప్రేమ పారవశ్యములు | 166 |
| 49. వాల్మీకి మహర్షితో సమాగమము | 169 |
| 50. చిత్రకూట నివాసము | 172 |
| 51. అయోధ్యకు సుమంత్రుని ఆగమనము | 176 |
| 52. సుమంత్రుడు ఓదార్చుట - పుత్రశోకముతో దశరథుడు స్వర్గస్థుడగుట | 178 |

53. అయోధ్యకు భరతుని ఆగమనము 181
54. భరతుని పరితాపము 182
55. భరతుడు తండ్రికి అంత్యసంస్కారములను ఆచరించుట 185
56. భరతునకు వసిష్ఠునిఉపదేశము 185
57. భరతుని విన్నపము 187
58. భరతుడు సపరివారముగా చిత్రకూటమునకు బయలుదేఱుట 190
59. భరతగుహుల సమాగమము 191
60. ప్రయాగను జేరి భరతుడు భరద్వాజ మహర్షిని దర్శించుట 196
61. భరతునకు భరద్వాజుని ఆతిథ్యము 200
62. ఇంద్రుని భయము - బృహస్పతి అభయము 201
63. భరతుడు చిత్రకూటమునకు చేరుట 205
64. శ్రీరామభరతుల సమాగమము 209
65. అయోధ్యావాసులకు కోలుల భిల్లుల ఆతిథ్యము 213
66. వసిష్ఠభరతుల సమాలోచనలు 215
67. జనకుని ఆగమనము 220
68. ఉభయపక్షముల గౌరవ మర్యాదలు చర్చలు 224
69. భరతునకు శ్రీరాముని ఆదేశము 233
70. సర్వతీర్థ నిమజ్జనము - భరతకూపమహత్త్వము 234
71. శ్రీరామపాదుకాప్రదానము 235
72. భరతుడు అయోధ్యకు మఱలుట - పాదుకా పట్టాభిషేకము 237

## III అరణ్యకాండము

73. భగవత్ప్రార్థన 241
74. జయంతుని గర్వభంగము 241
75. శ్రీరాముడు అత్రి మహర్షిని దర్శించుట 242
76. సీతాదేవికి అనసూయాదేవి ఉపదేశములు 243
77. శరభంగమహాముని దర్శనము 245
78. ఋషులకు అభయ ప్రదానము - సుతీక్ష్ణుని దర్శనము 245
79. అగస్త్యమహామునితో సమాగమము 247
80. శ్రీ సీతారామలక్ష్మణులు పంచవటిలో నివసించుట 248
81. శూర్పణఖకు శృంగభంగము 250
82. ఖరదూషణ సంహారము 250
83. శూర్పణఖ రావణునితో మొఱపెట్టుకొనుట 253
84. రావణమారీచసంవాదము 255
85. సీతాపహరణము 256
86. రావణజటాయువులయుద్ధము 257
87. సీతాన్వేషణము 258
88. జటాయువు పరమపదమును జేరుట 259
89. శ్రీరామునకు శబరిఆతిథ్యము 260
90. శ్రీరామునివిరహము 262
91. నారదునకు శ్రీరాముని ఉపదేశము 263

## IV కిష్కింధాకాండము

92. దైవస్తుతి 267
93. హనుమద్రామసమాగమము - సుగ్రీవునితో మైత్రి 267
94. వాలివధ 270
95. వర్షశరదృతువుల వర్ణనము 273
96. లక్ష్మణుని ఆగ్రహము 276
97. వానరులచే సీతాన్వేషణము 277
98. స్వయంప్రభ వృత్తాంతము 278
99. సంపాతి సహకారము 279
100. కార్యసాధనకై అంగదాదుల చర్చ 280

## V సుందరకాండము

101. దైవప్రార్థన 283
102. మారుతి సముద్రమును లంఘించుట 283
103. హనుమంతుని లంకానగర ప్రవేశము 285
104. పావని విభీషణుని కలియుట - సీతామాతను దర్శించుట 285
105. రావణుని బెదరింపు-సీత హెచ్చరిక 287
106. త్రిజటా స్వప్నము 287
107. అంగుళీప్రదానము-హనుమత్సందేశము 288
108. మారుతి అశోకవనమును విధ్వంసమొనర్చుట రావణుని సభలో ప్రవేశించుట 290

109. లంకాదహనము 293
110. చూడామణి ప్రదానము 294
111. హనుమదాదులు శ్రీరామునకు సీతాసందేశమును విన్పించుట 295
112. సమరసన్నాహములు 297
113. మండోదరి హితముపల్కుట 297
114. విభీషణుని నీతివచనములు 298
115. విభీషణ శరణాగతి 300
116. శుకసారణుల వృత్తాంతము 303
117. సముద్రుని విన్నపము 306


## VI లంకాకాండము


118. భగవత్ప్రార్థన 309
119. వారధి నిర్మాణము-లంకను జేరుట 309
120. రావణునకు మండోదరి విన్నపము 311
121. అంగద రాయబారము 316
122. లంకపై ముట్టడి - రాక్షసులతో వానరభల్లూకముల పోరాటము 325
123. మేఘనాదుని విజృంభణము లక్ష్మణుడు మూర్ఛిల్లుట 329
124. ఓషధికై హనుమంతుడు వెడలుట - కాలనేమిని హతమార్చుట 331
125. సంజీవని పర్వతమును తీసికొని వచ్చు మారుతితో భరతుని సమాగమము 332
126. సోదరుడైన లక్ష్మణునికై శ్రీరాముని ఆవేదన 333
127. కుంభకర్ణుని వధ 334
128. లక్ష్మణ మేఘనాదుల సమరము 338
129. యజ్ఞభంగము మేఘనాదుని వధ 339
130. రావణుడు వానరయోధులతో తలపడుట 341
131. రామరావణ యుద్ధము 345
132. త్రిజట సీతాదేవిని ఓదార్చుట 351
133. రావణవధ-మందోదరీ విలాపము 352
134. విభీషణుడు రాజ్యాభిషిక్తుడగుట 355
135. అవనిజాతకు - అగ్నిపరీక్ష 356
136. బ్రహ్మస్తుతి 357
137. ఇంద్రుడు శ్రీరాముని స్తుతించుట 358
138. పరమశివుని విన్నపము 359
139. పుష్పకముపై శ్రీరాముడు సపరివారముగా అయోధ్యకు బయలుదేరుట 360


## VII ఉత్తరకాండము


140. భగవన్నుతి 363
141. అయోధ్యలో శ్రీరామభరతుల సమాగమము 363
142. శ్రీరామపట్టాభిషేకము 368
143. వేదపురుషులు శ్రీరాముని స్తుతించుట 370
144. పరమేశ్వరుడు శ్రీరాముని స్తుతించుట 371
145 సుగ్రీవాదులకు వీడ్కోలు 372
146. రామరాజ్యము 374
147. సనకాదులు శ్రీరాముని స్తుతించుట 379
148. సోదరులకు శ్రీరాముని ఉపదేశము 380
149. పౌరులకు శ్రీరాముని హితబోధ 382
150. శ్రీరామునకు వసిష్ఠుని విన్నపము 384
151. నారదుడు శ్రీరాముని స్తుతించుట 385
152. కాకభుశుండి వృత్తాంతము 387
153. సంక్షిప్త రామాయణము 389
154. భుశుండి మోహము-శ్రీరాముని ప్రభావము 394
155. భగవంతుని అపారమహిమ 400
156. భుశుండి పూర్వజన్మ గాథ 401
157. కలియుగ లక్షణములు 403
158. పరమేశ్వర స్తవము 407
159. భక్తి మార్గవైశిష్ట్యము 412
160. సప్త ప్రశ్నలు-సమాధానములు 415
161. శ్రీరామకథా శ్రవణ ఫలము 418
162. శ్రీ గోస్వామితులసీదాసు జీవిత విశేషములు 421
163. శ్రీరామశలాకా ప్రశ్నావళి 425
164. శ్రీరామాయణ హారతి, 427
165. శ్రీరామావతారము 428
166. అత్రికృత శ్రీరామస్తుతి 429
167. పరమేశ్వరుడు శ్రీరామునిస్తుతించుట 430
168. రుద్రాష్టకము 431
169. శ్రీరామమంగళాశాసనమ్ 432


* * *

## ఈ కావ్య విశేషములనుగూర్చి
# ఒక్కమాట

పరంపరాగతమైన భారతీయసంస్కృతి అవగాహనమునకును దానిపరిరక్షణమునకును శ్రీ మద్రామాయణ భగవద్గీతలు పట్టుగొమ్మలు. భగవంతుడు స్వయముగా శ్రీరామచంద్రుడై అవతరించి, తన ఆదర్శజీవితముద్వారా మానవధర్మములను, వాటివిలువలను లోకమునకు చాటెను. ఈ రామావతారవైశిష్ట్యమును ప్రకటించునదియే శ్రీమద్రామాయణము. ఆ భగవంతుడే మఱల ద్వాపరయుగమున శ్రీకృష్ణుడుగా అవతరించి, అర్జునుని నిమిత్తముగా జేసికొని, లోకమునకు తనదివ్యప్రబోధమును గావించెను. ఆదివ్యోపదేశమే 'శ్రీమద్భగవద్గీత' శ్రీమద్రామాయణ భగవద్గీతలు లోకమునకు రెండు కన్నుల వంటివి. ఇందలి ఉపదేశములు సమస్తమానవాళికిని సర్వకాలములయందును ఆదర్శప్రాయములు, ఆచరణీయములు.

ఆదికవియైన వాల్మీకిమహర్షి శ్రీరామావతారతత్త్వమును శ్రీమద్రామాయణముగా సంస్కృతమున రచించి, లోకమునకందించెను. అది విశ్వవ్యాప్తమై మిక్కిలి ప్రశస్తిని పొందెను. కాని అది సంస్కృతమున రచింపబడుటచే అందలి విశేషములు పండితులకు మాత్రమే గ్రాహ్యములు. కాని మహాకవి శ్రీ గోస్వామి తులసీదాసు 'శ్రీరామచరిత మానసమును వ్యవహారభాషయైన అవధిభాషలో రచించుటచే అది పండితులకును, పామరులకును సులభగ్రాహ్యమైనది. ఇది సరళమైన సుందరమైన మధురరచన. హాయిగా గానము చేసికొనుటకు అనువైనది. ఇందలి 'దోహా'లు 'సోరఠ'లు 'చౌపాఈ'లు 'ఛంద్'లు పరమానందదాయకములు. ఇవి పండితులకును పనిచెప్పును. పామరులనూ రంజింపజేయును. అంతేగాదు ఆ పరమశివునిగూడ ఆనందింపజేసి, ఆయనఆశీస్సులకును పాత్రములైనవి. ఇందలి శబ్దాలంకారములు, అర్థాలంకారములు నిరుపమానములు. అంత్యప్రాసల, అనుప్రాసల అందచందములు అత్యంతమనోహరములు.

శ్రీరామచరితమానసమునందలి పాత్రపోషణము అమోఘము, సహజసుందరము. దంపతుల అన్యోన్యానురాగములు, మాతాసుతులవాత్సల్యములు, పితాపుత్రసంబంధములు, సోదరులసౌహార్దములు, స్త్రీ పురుషుల మర్యాదా జీవనములు, మన్ననలు, పాలకులయెడ ప్రజల భక్తి విశ్వాసములు, ప్రభువుల ప్రజానురాగములు ఇందు సమయోచితముగా సరసముగా వర్ణింపబడినవి.

శ్రీరాముడు ఈ మహాకావ్యమునకు కథానాయకుడు. ధర్మపరిరక్షణకై భగవంతుడే రఘువంశమున కౌసల్యా దశరథులపుణ్యఫలముగా వారికి పుత్రుడై అవతరించెను. ఆయన భగవదవతారమేయైనను లోకమునకు ఆదర్శప్రాయుడైన ఒక మహాపురుషుడుగా తనలీలలను ప్రదర్శించెను. ఆయన లీలావిలాసములు వినిన వారికిని, చదివిన వారికిని, స్మరించిన వారికిని హృదయములయందు పవిత్ర భావములను కలిగించును. శ్రీరామచంద్రుడు సద్గుణ సముద్రుడు. ఆయన ప్రతిచర్యయు అనుసరణీయము. మాతాపితరులయెడ భక్తి, గురువులయెడ వినయ విధేయతలు, ఏకపత్నీవ్రతనియమము, భ్రాతృప్రేమ, మిత్రులయెడ అనురాగము. శరణాగత వాత్సల్యము, ప్రజాను రాగము మొదగునవి ఆయనకు సహజగుణములు.

శ్రీరాముని వెన్నంటివచ్చిన ఆదిశేషునిఅవతారమే శ్రీలక్ష్మణస్వామి. శ్రీరామునిపాదపద్మసేవయే తనకర్తవ్యమని భావించి, అతడు అందు పరవశుడు అగుచుండును. విశ్వామిత్రునియాగసంరక్షణసమయమునను, శ్రీరామునివనవాసకాలమునను లక్ష్మణుడు నిరంతరము అంకితభావముతో భ్రాతృసేవలొనర్చినతీరు అత్యద్భుతము. శ్రీరామలక్ష్మణులపరస్పరప్రేమానురాగములు అపూర్వములు. వనవాసమునకు సన్నద్ధుడగుచున్న రాముని

అనుసరించుటకై లక్ష్మణుడు ఆయనతో విన్నవించుకొనిన తీరు, అట్లే లక్ష్మణుడు మూర్ఛిల్లినప్పుడు అతనికై శ్రీరాముడు పొందిన వేదన, వారిపరస్పరప్రేమానురాగములకు ప్రబలతార్కాణములు.

భరతుడు శ్రీరామునకు ప్రియసోదరుడేగాక పరమభక్తుడుగూడ. తల్లి కైకేయిమోహకారణముగ కోసల రాజ్యాధికారము తనచేతికందినను దానిని తృణప్రాయముగా త్యజించి, కౌసల్యామాతసమక్షమునను, నిండు సభలో వసిష్ఠాదిమహాపురుషులయెదుటను అతడు ప్రకటించిన పరితాపవచనములు ఆయనహృదయస్వచ్ఛతను వెల్లడించుచున్నవి. ఇంకను చిత్రకూటమున రామునిముందు అతడు ప్రకటించినవేదన, శ్రీరామునిపాదుకలకు పట్టముగట్టుట అనునవి శ్రీరామునియెడ భరతునిఅనన్య భక్తికిని, నిస్వార్థబుద్ధికిని నిదర్శనములు. నంది గ్రామమున ఆయన ఆచరించిన తపోనిష్ఠానియమములు మహామునులకును ఆదర్శప్రాయములు.

అవనిజాత సీత మహాసాధ్వి. నిస్సంగనిష్ఠాజీవనవిధానములతో వాసికెక్కిన జనకునిగారాలబిడ్డ. ఆమె మహాలక్ష్మీదేవి అవతారము. శివధనుర్భంగముగావించిన శ్రీరామునిమెడలో వరమాల వేసి, రామపత్నియై వాసికెక్కిన 'వనితామణి'. కన్న తల్లిదండ్రులకును, ఆశీర్వదించి, ఆదరించిన అత్తమామలకును ప్రేమపాత్రురాలై, అందరి మన్ననలను చూరగొనిన ఉత్తమురాలు. కౌసల్యాదేవి అనుమతిని, శ్రీరాముని ఆమోదమును పొంది, ఆయనవెంట వనములకు నడిచిన పతిసేవాపరాయణ. మునీశ్వరులసేవలతో, మునిపత్నులఆశీస్సులతో పరమపునీతయైన ఆదర్శనారీశిరోమణి. విధివశమున రావణాపహరణమునకు గురియైనను, విధిలేక పరులపంచన అశోకవనములో అవస్థలపాలైనను, పతికి దూరముగా కాలము గడుపవలసివచ్చినను చెక్కుచెదరని సౌశీల్యముతో అగ్నిపరీక్షలో నిగ్గుదేలిన వనితారత్నము. రామానుగ్రహముతో, మారుతిగావించిన సేవలతో కష్టాలకడలిని దాటి, అయోధ్యను జేరి, భర్తృ సహధర్మచారిణియై, శ్రీరామపట్టమహిషిగా వాసిగాంచిన సీతామాత నారీలోకమునకే ఆదర్శప్రాయురాలు.

ఆంజనేయుడు వాయునందనుడు, అంజనాదేవి ముద్దుల బిడ్డడు. శ్రీరామచంద్రస్వామికి పరమభక్తుడు. పరమ శివుని అంశతో ఈ నేలపై అడుగిడిన కారణజన్ముడు. రామలక్ష్మణులను తన భుజములపై నిలుపుకొని, వారిని ఋశ్యమూక పర్వతమునకు జేర్చి, రామసుగ్రీవులకు మైత్రిని గూర్చిన మహాపురుషుడు. సుగ్రీవునిసచివునిగా మసలుచు, వాలివధానంతరము సుగ్రీవునకు కర్తవ్యమును జ్ఞప్తికిదెచ్చి, రామకార్యమునకు తోడ్పడిన పుణ్యమూర్తి. శ్రీరామచంద్రప్రభువు ఒసంగిన అంగుళీయకమును గొని, అంగదాదులతో గూడి, సీతాన్వేషణకు నడుము బిగించినవాడు. స్వయంప్రభ సూచనతో, సంపాతిసహకారముతో అంగదాదులప్రోత్సాహముతో వివిధపరీక్షలలో నెగ్గి, వారిధిని దాటిన వీరాధివీరుడు. లంకిణిని హతమార్చి, లంకలో ప్రవేశించి, అకలంకదీక్షతో అశోకవనమున అడుగిడి రామాంగుళీయకమును సీతామాతకు సమర్పించి, ఆమె ఆశీస్సులనందుకొనినవాడు. అశోకవనమును ధ్వంసమొనర్చి, రాక్షసులను పరిమార్చి, రావణుని హెచ్చరించి, లంకను గాల్చి, అనుయాయులతో రామసమక్షమున నిల్చి, సీతామాత శిరోభూషణమును ఆ ప్రభువునకర్పించిన ధన్యజీవుడతడు. రావణవధలో శ్రీరామవిజయగాథలో వీరోచితపాత్రను నిర్వహించిన ఆ మహామహుడు చిరస్మరణీయుడు. అతడు శ్రీరఘువీరునిప్రశంసలకు పాత్రుడైనవాడు. అంతేగాదు శ్రీరామునిఆలింగనసుఖములకు నోచుకొని, బ్రహ్మానందమును అనుభవించినవాడతడు. శ్రీరామునిసేవలతో పరమపునీతుడైన ఆ పవనసుతుడు సర్వదా సర్వారాధ్యుడు.

శ్రీమన్నారాయణునిఅనుగ్రహమునకు పాత్రులైన శతరూపాస్వాయంభువమనువులు ఈలోకమున కౌసల్యాదశరథులై జన్మించిరి. శ్రీహరిఅవతారమైన శ్రీరాముని తనబంగారు కడుపునగన్న ధన్యాత్మురాలు కౌసల్యామాత. శ్రీరాముడవతరించిన వెంటనే అతడు తనచతుర్భుజరూపమున ఆ కన్నతల్లికి దర్శనమిచ్చెను. అప్పుడామె బ్రహ్మానందభరితురాలయ్యెను. అనంతరము ఆమెకోరికమేరకు అతడు ముద్దులుమూటగట్టు శిశువుగా

మాటి ఆమెఒడిని జేరెను. ఆయన లీలావిలాసములను దర్శించి, ఆ తల్లి మురిసిపోయెను. వచ్చియు రాని బుడి బుడి నడకలతో తన ముందు తారాడు ఆ బాలరామునకు తన చల్లని చేతులతో గోరుముద్దలు తినిపించుచు ఆయనను లాలించి, పాలించిన కృతార్థురాలు ఆ కౌసల్యామాత. తూగుటుయ్యేలలో తన చిన్నారి రామన్నను పరుండబెట్టి, కమ్మని జోలపాటలు పాడుచు, జోకొట్టుచు పరవసించి పోయిన అదృష్టవంతురాలు ఆ రామజనని. యాగరక్షణ నిమిత్తముగా తన వెంటవచ్చిన శ్రీరాముని మేల్కొలుపుచు విశ్వామిత్రుడు "కౌసల్యా సుప్రజా రామ" అని సంబోధించెను. ఆ కమ్మని పిలుపు నేటికిని ఇంటింటా మాఱుమ్రోగుచు కౌసల్యామాతకీర్తిని సమస్తలోకములలో చిరస్థిరము గావించుచున్నది. శ్రీరామునివనగమనసమయమున ఆమె పడిన మనోవేదన వర్ణనాతీతము. వెళ్లవలదన్నచో పతియాజ్ఞను మీఱినట్లగును. దానివలన పాపములంటును. 'వెళ్లుము' అనుటకు పుత్రవాత్సల్యము అడ్డువచ్చును. ఎట్టకేలకు ఈ డోలాయమానస్థితినుండి బయటపడి, పతియాజ్ఞను తలదాల్చి, వనగమనమునకు రాముని అనుమతించెను. భరతుడు తనముందునిల్చి, రామునికై పరిపరివిధముల పరితపించుచుండగా గుండెను దిటవు చేసికొని, విజ్ఞతతో ఆ తల్లి అతనిని ఓదార్చినతీరు అతిశ్లాఘనీయము. సీతాదేవిపై ఆమెకుగలవాత్సల్యము లోకమునకే ఆదర్శము. వేయేల సర్వదా సర్వథా మన రామజననిజన్మ ధన్యము.

తులసీదాసమహాకవి చిత్రించిన పాత్రలలో సుమిత్రాదేవిపాత్ర పరిధినిబట్టి చిన్నది. ఉదాత్తగుణప్రభావమున మిన్నయైనది. లక్ష్మణశత్రుఘ్నుల కన్నతల్లియైన సుమిత్ర తన సాధుస్వభావముచేతను, సత్ప్రవర్తనకారణమునను లోకమున మన్ననలను పొందిన మహితాత్మురాలు. సీతారాములను సేవించుటకై వనగమనమునకు అనుమతిని గోరిన లక్ష్మణునకు సుమిత్రామాత ఒసంగిన ఉపదేశములు అత్యద్భుతములు అపూర్వములు ఆదర్శప్రాయములు.

"శ్రీరాముని తండ్రిగా భావింపుము. సీతమ్మను తల్లిగా సేవింపుము. అడవిని అయోధ్యగా తలంపుము. నిరంతరము వారి సేవలలోనే ఆనందమును అనుభవింపుము"- అను ఈ పల్కులు ఆమెసహనసౌశీల్యములకు మచ్చుతునకలు. తన సుతులలో లక్ష్మణస్వామిని రామునిసేవలకును, శత్రుఘ్నుని భరతునిసేవలకును నియోగించిన త్యాగమూర్తి మన సుమిత్రామాత.

జన్మసార్థక్యమునకై శ్రీహరినిగూర్చి తపమొనర్చి, దైవానుగ్రహమునకు పాత్రుడైన స్వాయంభువమనువు దశరథుడుగా జన్మించెను. పరాక్రమమునను రణకౌశలమునను సాటిలేనివాడు ఆ కోసలదేశాధిపతి. ఇంద్రునకును సాయపడగలిగిన సమరవీరుడు సత్యవాక్యపరిపాలకుడు ఆ అయోధ్యాప్రభువు. పెద్దలమాటలను, గురువచనములను గౌరవించువాడు. వసిష్ఠునిసూచనపై విశ్వామిత్రునివెంట రామలక్ష్మణులను పంపి, యాగరక్షణకు తోడ్పడినవాడు. విధివశమున కైకేయికుతంత్రములకు బలియై, విలవిలలాడినను ఆడినమాటను తప్పని సత్యసంధుడు. మునీశ్వరునిశాపఫలితముగ అంతులేని పుత్రశోకమునకు గురియై, స్వర్గమునలంకరించిన పుణ్యపురుషుడు అతడు. అవతారమూర్తియైన శ్రీరామచంద్రునకు తండ్రియైన దశరథుడు సుచరిత్రుడు.

సూర్యవంశమునకు కులగురువైన వసిష్ఠమహర్షి ఋషిపరంపరలో జగద్విఖ్యాతినందినవాడు. ఈయనకు అన్ని విధములుగ తగినఇల్లాలు అరుంధతీదేవి. కలకాలము ఈ పవిత్రదంపతులు నూతన వధూవరులకు ఆరాధ్యులు. వసిష్ఠుడు వేదశాస్త్రపురాణధర్మమర్మజ్ఞుడు. సందర్భోచితముగా ధర్మప్రబోధము చేయుటలో సమర్థుడు. పుత్రప్రేమచే వెనుక ముందాడుచున్న దశరథునకు హితవచనములను పలికి, విశ్వామిత్రునివెంట రామలక్ష్మణులను పంపుటలో ప్రముఖపాత్ర వహించినవాడు. సీతారామకల్యాణోత్సవసమయమున గురుస్థానమును అలంకరించి, తన ఆశీస్సులను అందించిన ఋషిపుంగవుడు. దశరథుడు స్వర్గస్థుడై విపత్కరపరిస్థితులేర్పడగా సమయోచితముగా కార్యములను చక్కగా నడిపించినవాడు. శోకవిహ్వలుడైన భరతునకు హితోపదేశమును గావించి, ఆయనను ఓదార్చినవాడు. భరతునివెంట చిత్రకూటమునకు వెళ్ళి, శ్రీరాముని పితురాజ్ఞాపరిపాలనదీక్షకును, భరతుని అనన్య భక్తి

తత్పరతకును భంగమురాకుండ సమన్వయమార్గమును సూచించి, సమస్యాపరిష్కారమునకు తోడ్పడినవాడు. శ్రీరాముడు దుష్టులను శిక్షించి, సపరివారముగా అయోధ్యకు విచ్చేసినపిదప శ్రీరామపట్టాభిషేకమహోత్సవమును జరిపించి, లోకకల్యాణమునకు సహాయపడినవాడు ఈ వసిష్ఠమహాముని.

శ్రీరామచరితమానసములో విశ్వామిత్రునిపాత్ర విశిష్టమైనది. యాగరక్షణనెపముతో రామలక్ష్మణులను వెంటబెట్టుకొనివెళ్లి, వారికి 'బల-అతిబల' అను విద్యలను అందించుటయేగాక వివిధశస్త్రాస్త్రప్రయోగములలో వారిని ప్రవీణులును గావించినవాడు ఈ గాధిసుతుడు. యజ్ఞానంతరము రామలక్ష్మణులతో మిథిలకు చేరి, శ్రీరామునిచే శివధనుర్భంగము గావింపజేసిన మహనీయుడితడు. సీతారాములకల్యాణమహోత్సవమును జరిపించి, మిథిలా-అయోధ్యావాసుల మన్ననలను పొందిన మహామహర్షి ఇతడు.

'కర్మయోగి'గా ఖ్యాతివహించిన, మిథిలాధిపతియైన జనకమహారాజు రాజన్యులలో రాణకెక్కినవాడు. అవనిజాతయైన సీతమ్మకు తండ్రి. 'శివధనుర్భంగము గావించిన వానినే సీతవరించును'- అని ప్రతిజ్ఞాపూర్వకముగా ప్రకటించి, శ్రీరాముని శౌర్యపరాక్రమములను లోకమునకు విదితమొనర్చినవాడు. పరశురాముని కోపతాపములకు కలతచెందియు, కథసుఖాంతమగుటతో శ్రీరామవిజయమునకు సంతసించినవాడు. సమర్థులగు దూతలద్వారా దశరథుని సపరివారముగా ఆహ్వానించి, వారికి సకలమర్యాదలతో స్వాగతముపలికిన సౌజన్యమూర్తి. జగన్మోహనముగా కన్నుల పండువుగా శ్రీ సీతారామకల్యాణమహోత్సవమును జరిపించి, సమస్తలోకములకును ఆనందమును గూర్చిన మహాపురుషుడు. తన సాధుస్వభావముచే దశరథాదుల మన్ననలనందిన జనకమహారాజు మహనీయుడు. భరతుడు చిత్రకూటమునకు జేరినప్పుడు తానును సపరివారముగా అచటికేగి, శ్రీరామలక్ష్మణ భరతశత్రుఘ్నుల మనోభావములకు అనుగుణముగా ధర్మవచనములను బలికి, అందఱి గౌరవాదరములను చూరగొనిన ధీశాలి.

శృంగబేరపురపాలకుడైన గుహుడు శ్రీరామవనవాససమయమున చూపిన భక్తితాత్పర్యములు, కావించిన మర్యాదాసహకారములు అపూర్వములు. వనవాసియేయైనను అతనిరామసేవలు ఆదర్శప్రాయములు. అతడు భరతునకు తోడ్పడినరీతియు ప్రశంసనీయము. భరద్వాజమహర్షి తనఆశ్రమమునకు విచ్చేసిన శ్రీరామునకు సాదరముగా పల్కిన ఆశీస్సులు, భరతునకొసంగిన అతిథి మర్యాదలు అమోఘములు. శ్రీ సీతారామలక్ష్మణులను ఆదరించుటలోను, వారినివాసస్థానమును నిర్దేశించుటలోను వాల్మీకిమహర్షి నిర్వహించినపాత్ర విస్మరింపరానిది. అత్రిమహర్షి గావించిన రామస్తుతి, సీతామాతకు అనసూయాదేవి ఉపదేశించిన పతివ్రతాధర్మములు చిరస్మరణీయములు. శరభంగమహర్షి, సుతీక్ష్ణముని, అగస్త్యమహాముని తమ ఆశీస్సులతో శ్రీరాముని ఆదరించి, వారు తరించిన తీరు ప్రశంసార్హము.

పరమభక్తురాలైన శబరి మిక్కిలి భక్తిప్రపత్తులతో రామలక్ష్మణులకొనర్చిన అతిథిసేవలు అపూర్వములు. వానరరాజైన సుగ్రీవుడు శ్రీరామునితో పరస్పరమైత్రీసహకారములకు ఒడంబడి, వాలివధానంతరము కిష్కింధకు రాజై, వానరపరివారములతో సీతాన్వేషణ కొనసాగించుట అతని కృతజ్ఞతకు నిదర్శనము. హనుమదాదుల ద్వారా సీతజాడ తెలియగా వారధినిర్మాణములోను, రామరావణయుద్ధములోను యథాశక్తి సేవలందించిన సుగ్రీవుని జన్మ ధన్యము. వాలిపుత్రుడైన అంగదుడు రావణునితో జరిపిన దౌత్యము రాక్షసులకు దడపుట్టించినది, 'రామదండు'కు సంతోషమును గూర్చినది. శ్రీహరిభక్తుడైన విభీషణుడు తన అన్నయైన రావణునకు చేసిన హితబోధలు విస్మరింపరానివి. అతడు శ్రీరాముని శరణుజొచ్చినవిధము, శ్రీరామునివాత్సల్యమునకు పాత్రుడైన రీతి, ధర్మస్వరూపుడైన శ్రీరామునివిజయమునకు రణరంగమున సహకరించిన పద్ధతి వర్ణనాతీతములు.

రాక్షసకులసంజాతయైనను ధర్మమునే అనుసరించుచుండెడి త్రిజట తనస్వప్నవృత్తాంతమును వినిపించుట ద్వారా రాక్షసపరిచారికలకు భయమును కలిగించిన విధము, సీతమ్మకు ఊరట కల్గించిన పద్ధతి మఱువరానివి. జటాయువు పక్షియేయైనను సీతాపహరణసమయమున రావణుని ఎదుర్కొని పోరుసల్పిన తీరు, రామునిసుఖ కరస్పర్శకు తేరుకొని ఆయనను స్తుతించి, పరమపదమును పొందిన విధము ప్రాతఃస్మరణీయములు. జటాయువు సోదరుడైన సంపాతియొనర్చిన రామసేవలు విస్మరింపరానివి. ఆయా సందర్భములలో సమయానుకూలముగా సుమంత్రుడొనర్చిన సేవలు లోకప్రసిద్ధములు. గంగానదిని దాటించుటలో శ్రీసీతారామలక్ష్మణులకు నావికుడు యుక్తితో భక్తితో పాదప్రక్షాళనాది సేవలందించిన విధము అత్యద్భుతము, పరమానందదాయకము. వనములలో శ్రీసీతారామలక్ష్మణులకును, భరతునకును, అయోధ్యావాసులకును, మిథిలానగరప్రజలకును కోలులు, భిల్లులు చేసిన అతిథిమర్యాదలు, అందించిన సహకారములు అత్యద్భుతములు. శ్రీసీతారాముల అందచందములను, రూపరేఖావయోవైభవవిలాసములను జూచి ఆనందించుటకై తహతహపాటుతో వచ్చినను, ఆయాపల్లెలప్రజలు శ్రీ సీతారామలక్ష్మణులకు భక్తితోనొనర్చిన సహకారములుగూడ ఎల్లకాలమూ గుర్తుపెట్టుకొనదగినవి.

పాత్రపోషణలో తులసీదాసు మహాకవి సిద్ధహస్తుడు. అతడు శ్రీసీతారామలక్ష్మణభరతాదిపాత్రలను తీర్చిదిద్దిన విధముగనే రావణకుంభకర్ణ మేఘనాద ఖరదూషణత్రిశిర శూర్పణఖ మారీచాది రాక్షస ఆపాత్రలను గూడ యథోచితముగ చిత్రించెను. తారా, మండోదరీ, సునయనాదేవి మొదలగు స్త్రీ పాత్రలను రూపొందించుటలోగూడ ఆయన తగిన శ్రద్ధను కనబఱచెను.

వాల్మీకిరామాయణమహాకావ్యమును ఆధారముగా జేసికొనియు, తనకాలమున ప్రచారములోనున్న ఇతర రామాయణగాథావిశేషములను పరిశీలించియు, ప్రజలఅభీష్టములను అనుసరించియు, 'తన రామచరితమానసము' నందు అదనముగా కొన్ని సన్నివేశములను చిత్రించినట్లు తులసీదాసు మహాకవియే స్వయముగా ప్రస్తావించెను. తదనుగుణముగ (1) సతీదేవిభ్రమ, పార్వతీపరమేశ్వరుల వివాహము (2) నారదునిమోహము (3) శతరూపాస్వాయంభువమనువుల ప్రస్తావనము (4) ప్రతాపభానుని చరిత్రము (5) దేవతలపన్నాగము (6) సీతారామలక్ష్మణులచే వాల్మీకిసందర్శనము (7) జనకమహారాజు చిత్రకూటమునకు వెళ్ళి, వనవాసముననున్న సీతారామలక్ష్మణులను పరామర్శించుట (8)భరతకూపమున సర్వతీర్థ నిమజ్జనము (9) మాయా సీతాకల్పనము (10) లంకలో మారుతి విభీషణుని కలియుట (11) సంజీవనిపర్వతమును తీసికొనివచ్చుచున్న హనుమంతునితో భరతునిసమాగమము (12) కాకభుశుండివృత్తాంతము మొదలగు సన్నివేశములు ఇందు అదనముగా చోటుచేసికొనినవి. సీతారాములవివాహమునకు ముందుగనే పరశురామునిఆగమనము, వనవాసమునకు వెళ్ళుచున్న సీతారామలక్ష్మణులను నావికుడు గంగను దాటించుట మున్నగునవి సందర్భోచితముగ ఇందు చేయబడిన మార్పులు.

గోస్వామితులసీదాసు నిజముగా ఒక మహాకవి. మహితాత్ముడైన శ్రీరాముని లీలావిలాసములవలె ఈ కవియొక్క సరసరచనాస్వారస్యములన్నియును పాఠకహృదయములకు మహానందమును గూర్చును. ఈకవి కావించిన ప్రకృతివర్ణనలు అపూర్వములు, ఇతడు వర్ణించిన నగరములకాంతిహేలలు, వనశోభలవైభవములు, ఉద్యానవనలాలిత్యములు, ఋతువుల రామణీయకములు కనులకు మిఱుమిట్లు గొల్పునవి. సీతారామకల్యాణ మహోత్సవ వైభవములు చూడముచ్చట గొలుపునవి, పారవశ్యములను పంచియిచ్చునవి. ఈ కవిగంటమున ఆవిష్కృతమైన 'రామరావణయుద్ధవర్ణనము రణభీరువులగుండెలకు దడపుట్టించునది, యుద్ధవీరులగుండెలలో సమరోత్సాహమును నింపునది. వేయేల ఆ రామరావణ యుద్ధమునకు ఆ రామరావణ యుద్ధమే సాటి. 'ఈ కవి వర్ణనాపటిమ ఆయన కీర్తి కిరీటమున 'ఒక కలికితురాయి'యై విలసిల్లుచున్నది.

మహిమాన్వితములైన శ్రీరాముని దివ్యలీలావిలాసములను భజించుటలో అందఱును మునింగిరి. భక్తితో పరవసించిన స్వాయంభువమనువు, పరమశివుడు, బ్రహ్మ, ఇంద్రాది దేవతలు ఆ ప్రభువును నుతించిరి. అత్రి, శరభంగుడు, సుతీక్ష్ణుడు, అగస్త్యుడు, నారదుడు, సనకాది మహర్షులెల్లరును తన్మయులై శ్రీరాముని కొనియాడిరి. మహాభక్తులైన శబరి, జటాయువు శ్రీరాముని కీర్తించిరి. వేదపురుషులు ప్రస్తుతించిరి. కాకభుశుండిగురువు పరమశివుని స్తుతించెను. శ్రీరామచరితమానసమున తులసీదాసమహాకవిగంటమునుండి జాలువాఱిన ఈ స్తోత్రములన్నియును అద్భుతములు, అమోఘములు. అవి అన్నికాలములకును ఆనందమును పంచియిచ్చు అమృతజలధులు.

ఈ మహాకవి రసవత్తరరచన చేయుచునే తాత్త్విక చర్చలను తక్కువ చేయలేదు. సుజన దుర్జన లక్షణములను విస్పష్టము గావించెను. కలియుగలక్షణములను కన్నులకు గట్టించెను. జ్ఞానభక్తిమార్గములవైశిష్ట్యములను తేటతెల్లము గావించెను. సాకార నిరాకార పరమాత్మ తత్త్వములను చక్కగా వింగడించి, వివరించెను.

భగవల్లీలలన్నియును లోకకల్యాణార్థమే ప్రదర్శితములగుచుండును. కొందఱు ఆ లీలలను ప్రవచించుచుందురు. మఱికొందఱు ఆ లీలాప్రవచనములను శ్రవణము చేసి ఆనందించుచుందురు. మఱికొందఱు ఆ లీలాగానములతో పరమానందభరితులగుచుందురు. భగవత్సేవలలో నిమగ్నులైన వారందఱును పారవశ్యములను పొందుచు కడకు దైవానుగ్రహముచే పరమపదప్రాప్తికి నోచుకొందురు. భగవత్సేవాసాధనమార్గములలో భక్తిమార్గము మిక్కిలి సులభమైనది. అందువలననే "మోక్ష సాధన సామగ్ర్యాం భక్తిరేవగరీయసీ" అను ప్రసిద్ధి ఏర్పడినది.

ఎనుబదినాలుగులక్షల జీవరాసులలో మానవజన్మ ఉత్తమోత్తమమైనది. ఈ జన్మ లభించుట మిక్కిలి దుర్లభము. భగవంతుడు ప్రాణికోటిని అనుగ్రహింపదలచియే ఆయాప్రాణులకు తనపరమపదమును ప్రసాదించుటకై మానవజన్మను ఇచ్చుచుండును. నవవిధభక్తిరీతులలో సాధనచేయువారికి ఉపయోగపడుటకై అనన్యభక్తి సంపన్నుడైన గోస్వామి తులసీదాస మహాకవి శ్రీరామచరిత మానసమును రచించెను. అది భక్తి భండారము. భక్తులు పెక్కుమంది యుందురు. కవులును చాలా మంది ఉండవచ్చును. కాని మహాభక్తులైన కవులు అరుదుగా మాత్రమే ఉందురు. అట్టి మహాభక్తకవివతంసులలో మనగోస్వామితులసీదాసు ఒకపులుగడిగిన ఆణిముత్యము. అట్టివాడు 'నభూతో నభవిష్యతి'. ఆ మహామహుడు ఈలోకమున జన్మించుటయు, అపూర్వమైన శ్రీరామచరితమానసమును రచించి లోకమునకు అందించుటయు సమస్త మానవాళియు, అందును భారతీయులు చేసికొనిన అనంత పుణ్యఫలము.

భక్తి తరంగములను పరవళ్లు త్రొక్కించి, అజరామరుడైన శ్రీగోస్వామి తులసీదాసు మహాకవికి శతకోటి సాష్టాంగ దండప్రణామములు. మధుర భావరత్నాకరమైన 'శ్రీరామచరిత మానసము' అను మహాకావ్యమునకు అనంతమంగళ నీరాజనములు.

శ్లో॥ శ్రీరామకృతి కర్తారం, భక్తలోక శిరోమణిమ్ ।
వందేఽహం తులసీదాసం, మహాకవివతంసకమ్ ॥

# ధ్యాన శ్లోకములు

1) జ్ఞానానందమయం దేవం నిర్మలస్ఫటికాకృతిమ్ ।
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే ॥

2) శుక్లాంబరధరం విష్ణుం శశివర్ణం చతుర్భుజమ్ ।
ప్రసన్నవదనం ధ్యాయేత్ సర్వవిఘ్నోపశాంతయే ॥

3) అగజాననపద్మార్కం గజాననమహర్నిశమ్ ।
అనేకదం తం భక్తానామ్ ఏకదంతముపాస్మహే ॥

4) వాగీశాద్యాస్సుమనసః సర్వార్థానాముపక్రమే ।
యం నత్వా కృతకృత్యాస్స్యుః తం నమామి గజాననమ్ ॥

5) శ్రీరాఘవం దశరథాత్మజమప్రమేయం
సీతాపతిం రఘుకులాన్వయరత్నదీపమ్ ।
ఆజానుబాహుమ్ అరవిందదళాయతాక్షం
రామం నిశాచరవినాశకరం నమామి ॥

6) ఆపదామపహర్తారం దాతారం సర్వసంపదామ్ ।
లోకాభిరామం శ్రీరామం భూయో భూయో నమామ్యహమ్ ॥

7) రామాయ రామభద్రాయ రామచంద్రాయ వేధసే ।
రఘునాథాయ నాథాయ సీతాయాః పతయే నమః ॥

8) అంజనేయమతిపాటలాననం కాంచనాద్రికమనీయవిగ్రహమ్ ।
పారిజాతతరుమూలవాసినం భావయామి పవమాననందనమ్ ॥

9) యత్ర యత్ర రఘునాథకీర్తనం, తత్ర తత్ర కృతమస్తకాంజలిమ్ ।
బాష్పవారి పరిపూర్ణలోచనమ్, మారుతిం నమత రాక్షసాంతకమ్ ॥

10) మనోజవం మారుతతుల్యవేగం, జితేంద్రియం బుద్ధిమతాం వరిష్ఠమ్ ।
వాతాత్మజం వానరయూథముఖ్యం, శ్రీరామదూతం శిరసా నమామి ॥

11) కూజంతం రామరామేతి మధురం మధురాక్షరమ్ ।
ఆరుహ్య కవితాశాఖాం వందే వాల్మీకికోకిలమ్ ॥

12) ఆనందకాననేహ్యస్మిన్ జంగమస్తులసీతరుః ।
కవితామంజరీ భాతి రామభ్రమరభూషితా ॥

--- ✿ ---

# శ్రీ జానకీ జీవనాష్టకమ్

ఆలోక్య యస్యాతిలలామలీలాం సద్భాగ్యభాజౌ పితరౌ కృతార్థౌ ।
తమర్భకం దర్పకదర్పచోరం శ్రీజానకీజీవనమానతోఽస్మి ॥ 1 ॥
శ్రుత్వైవ యో భూపతిమాత్తవాచం వనం గతస్తేన న నోదితోఽపి ।
తం లీలయాహ్లాదవిషాదశూన్యం శ్రీజానకీజీవనమానతోఽస్మి ॥ 2 ॥
జటాయుషో దీనదశాం విలోక్య ప్రియావియోగప్రభవం చ శోకమ్ ।
యో వై విసస్మార తమార్ద్రచిత్తం శ్రీజానకీజీవనమానతోఽస్మి ॥ 3 ॥
యో వాలినా ధ్వస్తబలం సుకంఠం న్యయోజయద్రాజపదే కపీనామ్ ।
తం స్వీయసంతాపసుతప్తచిత్తం శ్రీజానకీజీవనమానతోఽస్మి ॥ 4 ॥
యద్ధ్యాననిర్ధూతవియోగవహ్నిః విదేహబాలా విబుధారివన్యామ్ ।
ప్రాణాందధే ప్రాణమయం ప్రభుం తం శ్రీజానకీజీవనమానతోఽస్మి ॥ 5 ॥
యస్యాతివీర్యాంబుధివీచిరాజౌ వంశ్యైరహో వైశ్రవణో విలీనః ।
తం వైరివిధ్వంసనశీలలీలం శ్రీజానకీజీవనమానతోఽస్మి ॥ 6 ॥
యద్రూపరాకేశమయూఖమాలానురంజితా రాజరమాపి రేజే ।
తం రాఘవేంద్రం విబుధేంద్రవంద్యం శ్రీజానకీజీవనమానతోఽస్మి ॥ 7 ॥
ఏవం కృతా యేన విచిత్రలీలా మాయామనుష్యేణ నృపచ్ఛలేన ।
తం వై మరాళం మునిమానసానాం శ్రీజానకీజీవనమానతోఽస్మి ॥ 8 ॥

# శ్రీరామస్తుతి

శ్రీరామచంద్ర కృపాలు భజు మన హరణ భవభయదారుణమ్ ।
నవకంజలోచన కంజముఖ కరకంజ పదకంజారుణమ్ ॥ 1 ॥
కందర్ప అగణిత అమిత ఛబి నవనీల నీరదసుందరమ్ ।
పటపీత మానహు తడిత రుచి శుచి నౌమి జనకసుతావరమ్ ॥ 2 ॥
భజు దీనబంధు దినేశ దానవ దైత్య వంశ నికందనమ్ ।
రఘునంద ఆనందకంద కోసలచంద దశరథనందనమ్ ॥ 3 ॥
సిరముకుట కుండల తిలక చారు ఉదారు అంగ విభూషణమ్ ।
ఆజానుభుజ శరచాపధర సంగ్రామజితఖరదూషణమ్ ॥ 4 ॥
ఇతి వదతి తులసీదాస శంకర శేషమునిమనరంజనమ్ ।
మమ హృదయకంజ నివాస కురు కామాది ఖల దల గంజనమ్ ॥ 5 ॥

# హనుమాన్ చాలీసా

దోహా :

శ్రీగురుచరణసరోజరజ నిజమనముకురసుధారి,
వరణౌరఘువరబిమలజసు జో దాయక ఫలచారి.

బుద్ధిహీన తను జానికే సుమిరౌం పవనకుమార్,
బల బుధి విద్యా దేహు మోహి హరహు కలేస బికార్.

చౌపాఈ :


జయ హనుమాన జ్ఞానగుణసాగర జయకపీశ తిహుంలోక ఉజాగర,
రామదూత అతులిత బలధామా అంజనిపుత్ర పవనసుత నామా.
మహావీర విక్రమబజరంగీ కుమతి నివార సుమతి కేసంగీ,
కంచన బరణ బిరాజ సువేశా కాననకుండల కుంచితకేశా.
హాథవజ్రఔధ్వజాబిరాజై కాంధేమూంజ జనేవూ సాజై,
సంకరసువన కేసరినందన తేజప్రతాప మహాజగబందన.
విద్యావవాన గుణీ అతి ఆతుర రామకాజకరిబేకో ఆతుర,
ప్రభుచరిత్ర సునిబేకో రసియా రామలఖనసీతామనబసియా.
సూక్ష్మరూపధరి సియహిందిఖావా వికటరూపధరి లంకజలావా,
భీమరూపధరి అసురసంహారే రామచంద్రకే కాజసంవారే.
లాయసజీవన లఖనజియాయే శ్రీరఘువీరహరిషివుతలాయే,
రఘుపతికీన్హీ బహుతబడాయీ తమ మమ ప్రియ భరతహి సమభాఈ.
సహసబదనతుమ్హారో జసగావైం అసకహి శ్రీపతికంఠలగావై,
సనకాదికబ్రహ్మాది మునీసా నారద సారద సహిత అహీసా.
జమకుబేరదిగపాల జహాంత కబికోవిదకహిసకైకహాంతే,
తుమవుపకార సుగ్రీవహిం కీన్హా రామమిలాయ రాజపద దీన్హా.
తుమ్హరోమంత్ర విభీషన మానా లంకేస్వర భయే సబజగజానా,
జుగసహస్రయోజనపరభానూ లీల్యోతాహి మధుర ఫలజానూ.

ప్రభుముద్రికామేలిముఖమాహీ జలధిలాంఘిగయే అచరజనాహీఁ,
దుర్గమకాజజగత కేజేతే సుగమఅనుగ్రహతుమ్హారే తేతే.
రామదుఅరే తుమరఖవారే హోత న అజ్ఞా బినుపైసారే,
సబసుఖల హై తుమ్హారీ సరనా తుమరక్షకకాహూకోడరనా.
అపనతేజసమ్హారో ఆపై తీనోఁ లోక హాంకతే కాంపై,
భూతపిశాచనికటనహిఁ ఆవై మహాబీరజబనామసునావై.
నాసైరోగహరై సబపీరా జపతనిరంతరహనుమతబీరా,
సంకటతేహనుమానఛుడావై మనక్రమబచన ధ్యానజోలావై.
సబపరరామతపస్వీరాజా తినకే కాజ సకల తుమ సాజా,
ఔరమనోరథజోకోయిలావై సోఇఅమితజీవనఫలపావై.
చారోఁజుగపరతాప తుమ్హారా హై పరసిద్ధ జగతఉజియారా,
సాధుసంతకే తుమరఖవారే అసుర నికందన రామదులారే.
అష్టసిద్ధినవనిధి కే దాతా అసవరదీన్హ జానకీ మాతా,
రామరసాయన తుమ్హారేపాసా సదారహో రఘుపతికే దాసా.
తుమ్హారేభజన రామకోపావై జన్మజన్మ కే దుఃఖబిసరావై,
అంతకాలరఘుబర పురజాయీ బహాఁజన్మహరిభక్త కహాయీ.
ఔరదేవతా చిత్తనధరయీ హనుమతాసేయిసర్వసుఖకరయీ,
సంకటహటైమిటైసబపీరా జోసుమిరైహనుమతబలవీరా.
జైజైజై హనుమాన గోసాయీ కృపాకరో గురుదేవకీనాయీ,
యహశతవారపాఠకరజోయీ ఛూటహిబంది మహాసుఖహోయీ.
జో యహ పఢై హనుమాన చలీసా హోయ సిద్ధి సాఖీ గౌరీసా,
తులసీదాస సదాహరిచేరా కీ జైనాథ హృదయ మహఁదేరా.

దోహా:

పవనతనయ సంకటహరన మంగళమూరితిరూప్
రామలఖనసీతాసహిత హృదయ బసహుసురభూప్.

ఇతి శ్రీ హనుమాన్ చాలీసా





गोस्वामी श्रीतुलसीदासजी महाराज

Gosvāmī Tulasīdāsa

पादुका-दान

**Sandals (Pādukās)—Handed Over**




प्रभु करि कृपा पाँवरी दीन्ही। सादर भरत सीस धरि लीन्ही॥





गीध देह तजि धरि हरिरूपा। भूषन बहु पट पीत अनूपा॥
स्याम गात बिसाल भुज चारी। अस्तुति करत नयन भरि बारी॥

हनुमान्‌जीकी प्रार्थना

Hanumān Requesting




एकु मैं मंद मोहबस कुटिल हृदय अग्यान।
पुनि प्रभु मोहि बिसारेउ दीनबंधु भगवान॥





भूधराकार हनुमान्

**Mountain-like Hanumān**




अहह कंत कृत राम बिरोधा। काल बिबस मन उपज न बोधा॥




केकीकण्ठाभनीलं सुरवरविलसद्विप्रपादाब्जचिह्नं शोभाढ्यं पीतवस्त्रं सरसिजनयनं सर्वदा सुप्रसन्नम्।
पाणौ नाराचचापं कपिनिकरयुतं बन्धुना सेव्यमानं नौमीड्यं जानकीशं रघुवरमनिशं पुष्पकारूढरामम्॥




श्रीरामदरबारकी झाँकी

The Court of Śrī Rāma

సత్యం శివం సుందరమ్

శ్రీ గణేశాయ నమః

శ్రీ జానకీ వల్లభో విజయతే

# శ్రీ రామచరిత మానసము

## ప్రథమ సోపానము - బాల కాండము

## మంగళాచరణము

సమస్త వర్ణములకును, వాటి అర్థములకును, నవరసములకును, వివిధ ఛందస్సులకును, సమస్త శుభకార్యములకును అధి దేవతలైన సరస్వతీ దేవికిని శ్రీ గణేశునకును నమస్కరించుచున్నాను. (1)

శ్రద్ధా విశ్వాసములు లేనిదే సిద్ధులు అంతఃకరణ స్థితుడైన పరమేశ్వరుని దర్శింప జాలరు. కావున శ్రద్ధా విశ్వాసములకు ప్రతీకలైన పార్వతీ పరమేశ్వరులకు నమస్కరించెదను. (2)

వక్రరూపుడైన చంద్రుడుగూడ శంకరుని ఆశ్రయించుటవలన ఎల్లజనులచే పూజింప బడుచున్నాడు. జ్ఞాన స్వరూపుడును, నిత్యుడును, ఆదిగురువు ఐన అట్టి శంకరునకు నమస్కరించెదను. (3)

కవీశ్వరుడైన వాల్మీకియు, కపీశ్వరుడైన మారుతియు, సర్వదా శ్రీ సీతారాములగుణగణపుణ్య వనమునందు విహరించు విశుద్ధ విజ్ఞాన ఖనులు. ఆ మహా మహితాత్ములకు ప్రణమిల్లు చున్నాను. (4)

శ్రీరామచంద్రుని ప్రియ పత్ని సీతమ్మ. ఆ తల్లి సృష్టి స్థితి లయ కారిణియైన మహా శక్తి స్వరూపిణి, అవిద్యాది సర్వక్లేశహారిణి, సమస్త శుభప్రదాయిని. ఆ సీతా మాతకు నా నమస్సుమాంజలులు. (5)

శ్రీరాముడు శ్రీ మహా విష్ణువు యొక్క అవతారము. ఆయన మాయకు ఈ సమస్త విశ్వము, బ్రహ్మాది దేవతలు, అసురగణములు వశవర్తులు. ఆయన అస్తిత్వ ప్రభావముచే మిథ్యా జగత్తు అంతయును రజ్జు సర్పభ్రాంతిచే సత్యముగా తోచును. ఆయన పాదములే భవ సాగరమును దాటగోరు వారికి నౌకలు. ఆతడు అశేషకారణములకు అతీతుడు, శ్రేష్ఠుడు. అనగా మూలకారణమైనవాడు. అట్టి శ్రీరామచంద్ర ప్రభువునకు నా ప్రణామములు. (6)

రఘుకుల తిలకుడైన శ్రీరామచంద్రునిగాథ వేదపురాణశాస్త్రసమ్మతము. ఆ కథనే శ్రీమద్రామాయణ మహాకావ్యముగా ఆదికవి వాల్మీకిమహర్షి మనోజ్ఞముగా వర్ణించెను. ఇతర కవులును ఆ గాథను వివిధ రీతుల రచించిరి. అట్లే ఈ తులసీదాసు తన ఆత్మానందముకొఱకై ఆ రామాయణ గాథనే సరళమైన మధురమైన భాషలో వ్రాయుచున్నాడు. (7)

## దైవప్రార్థన

సోరఠ॥ పరమశివుని ప్రమథగణములకు అధిపతియగు గజాననుడు తనను స్మరించినవారికి కార్య సిద్ధిని గలిగించును. అతడు విజ్ఞానఖని (భక్తులకు బుద్ధి ప్రదాత), సుగుణాల రాశి, అట్టి శ్రీ వినాయకుడు నన్ను అనుగ్రహించుగాక. (1)

దయాళువైన భగవంతునిఅనుగ్రహముచే మూగవాడు వక్త యగును. కుంటివాడు దుర్గమములైన పర్వతములను సైతము ఎక్కగలడు. కలి కల్మషములను రూపుమాపు ఆ భగవంతుడు నాపై కృపజూపుగాక. (2)

నల్లగల్వలవలె నీలమైన శరీర కాంతిగలవాడు, విచ్చిన ఎఱ్ఱదామరలవంటి విశాలనేత్రములు గలవాడు, క్షీర సాగర శయనుడైన శ్రీమన్నారాయణుడు సర్వదా నా హృదయమున నివసించు గాక. (3)

పార్వతీ పతియైన పరమేశ్వరుడు మల్లె పూవులవలె, చంద్రుని వలె తెల్లని దేహ కాంతిగలవాడు, కరుణామూర్తి, దీనజనరక్షకుడు, మన్మథమర్దనుడైన ఆ పరమశివుడు నన్ను బ్రోచు గాక. (4)

# గురుప్రస్తుతి

నేను నా గురుదేవులపాదపద్మములకు నమస్కరించుచున్నాను. ఆయన కృపాసముద్రుడు, మనుష్యరూపమునుదాల్చిన శ్రీహరి. సూర్యకిరణములు అంధకారమునువలె. విజ్ఞాననిధియైన ఆయనవచనములు అజ్ఞానమును పటాపంచలు గావించును. (5)

నా గురుదేవునిపవిత్రపాదపద్మములధూళి సుందరమైనది, సురుచిరమైనది, సువాసనలను వెదజల్లునది, అనురాగ మధురిమలను చిలుకునది. అది జన్మమృత్యురూపసాంసారిక బాధలను నశింపజేయు దివ్యౌషధము. అమృత రూపవనస్పతియొక్క దివ్య చూర్ణము. అట్టి గురుపాదపద్మరజమునకు నా వందనములు. ఈ ధూళి శంకరునిశరీరముపై గల విభూతివలె నిర్మలమైనది, శుభకరమైనది, ఆనంద ప్రదమైనది. ఇది భక్తుని మనోదర్పణముపై గల మాలిన్యమును తొలగించును. తిలకముగా ధరించినచో పెక్కు సుగుణములను సమకూర్చును. శ్రీ గురుదేవుని నఖద్యుతులు మణులవలె ప్రకాశించుచు స్మరణ మాత్రముననే అవి అజ్ఞానాంధకారమును రూపుమాపి, ఆత్మానందమును గూర్చును. గురుదేవుల పాద పద్మములను హృదయమున నిలుపుకొనినవాడు భాగ్యశాలి. గురుదేవులకృపచే వానిమనోనేత్రములు విచ్చుకొనును. పాపములును, సాంసారికబాధలును దూరమగును. శ్రీరామకథలు అనెడి మణిమాణిక్యములు ఏగనియందు ప్రక్షిప్త(గుప్త)ములుగామున్నను, ప్రకటితములైనను, అవి ఆహృదయమున ప్రకాశమానములగు చుండును.

(చౌపాఈ॥ 1-4)

సిద్ధాంజనమును కనులలో పెట్టుకొనిన సిద్ధులు, సాధకులు శిఖరములపైనను వనముల మధ్యయందును, భూగర్భములయందునుగల సమస్తనిధులను అనాయాసముగా చూచినట్లు గురుపాదకమలధూళిని కన్నులకద్దుకొనినవారు సిద్ధిని, జ్ఞానమును అవలీలగా పొందుదురు. (దోహా - 1)

# సజ్జనుల మహిమ

గురుదేవునిపాదపద్మరజము కోమలమైనది, మనోజ్ఞమైనది. అది నేత్ర దోషములను రూపు మాపు నయనామృతసిద్ధాంజనము. ఈ అంజనముచే నామనోనేత్రములను నిర్మలమొనర్చుకొని, సంసారబంధములనుండి విముక్తిని ప్రసాదించు శ్రీరామచరితమును వర్ణించెదను. అజ్ఞానజనితములైన సందేహములనుపాఱద్రోలు భూసురోత్తములకు ముందుగా వందనములనాచరింతును. అనంతరము సద్గుణసంపన్నులైన సాధువులకును, సత్పురుషులకును వినయముతో ప్రణమిల్లెదను. ప్రత్తి ఎండినదై, స్వచ్ఛమై గుణమయమై యుండును. అట్లే సాధువులచరిత్ర అనాసక్తమై, పాపరహితమై సద్గుణ సంపన్నమై అలరారును, వడకుట, నేయుట మొదలగు సందర్భములలో ప్రత్తితాను కష్టములను సహించి, ఇతరుల ఛిద్రములను కప్పివేసి, గొప్ప కీర్తిని సంపాదించును. అట్లే సాధువులు ఎన్ని కష్టములనైనను ఓర్చుకొనుచు ఇతరులను ఉద్ధరించెదరు. అట్టి సాధువుల సమాజము ఆనందమయము, కల్యాణ ప్రదము. అది (ఆ సమాజము) ఒక కదలుచున్న ప్రయాగ. (త్రివేణీ సంగమము) అచట

రామ భక్తి అనునది గంగా ప్రవాహము. బ్రహ్మవిచారమే సరస్వతీ నది. విధినిషేధ రూపములైనకథలు కలియుగపాపములను ప్రక్షాళనచేయు యమునా తరంగములు. ఈ మూడును ఇచట కలియును. శివకేశవులగాథలు త్రివేణీ సంగమమై శ్రోతలకు ఆనందమును, శుభములను అందించును. ఈ సాధు సమాజ రూపమైన ప్రయాగ క్షేత్రమున స్వధర్మము నందలి విశ్వాసమే అక్షయవటము. సత్కార్యములే తీర్థ రాజ పరివారములు. తీర్థ రాజ మైన ఇట్టి ప్రయాగ వివిధదేశములలో సర్వకాలములయందును సాధుజనరూపమున అందఱికిని లభ్యమగును. వారిని సాదరముగా సేవించుటచే అవిద్యాదిక్లేశములన్నియును పటాపంచలగును. ఈ తీర్థ రాజము అలౌకికము, వర్ణనాతీతము, సద్యః ఫలదాయకము. దీని ప్రభావము ప్రత్యక్షము. (చౌ॥ 1-7)

ఈ సాధుసమాజరూపమైన ప్రయాగ మహిమను విని, అవగాహన చేసికొని, అత్యంత భక్తితో అందు మునకలు వేయువారికి ఈ జన్మలోనే ధర్మార్థ కామ మోక్ష (చతుర్విధ పురుషార్థ) ఫలములు సిద్ధించును. (దో॥ 2)

సాధుసమాజరూపమైన ఈ ప్రయాగలో మునిగినచో ఫలము వెంటనే లభించును. కాకులు కోయిలలగును. కొంగలు హంసలుగా మాఱును. దీనికి ఆశ్చర్యపడవలసిన పనియేలేదు. సత్సాంగత్యమహిమ జగద్విదితము. వాల్మీకి, నారద, అగస్త్యాదిమహర్షులజీవితగాథలే యిందుకు ప్రబలనిదర్శనములు. భూచరములు, జలచరములు, ఖేచరములు మొదలగు చరాచరప్రాణులన్నియును సత్సంగప్రభావమువలననే ఐశ్వర్యములను, బుద్ధి, కీర్తి, సద్గతులను, పొందినవి. ఈ ఐశ్వర్యాదులను పొందుటకు సత్సాంగత్యము తప్ప మఱియేమార్గమూ లోకమున గాని వేదములలో గాని ప్రస్తావింపబడలేదు. సత్సాంగత్యము లేనిదే వివేకము అబ్బదు. శ్రీరాముని దయ వలననే సత్సాంగత్యము లభించును. ఆనంద ప్రాప్తికిని, శ్రేయోలాభములకును సత్సాంగత్యమే మూలము. సాధనములన్నియును పుష్పములు. సత్సంగప్రాప్తియే ఫలము. ఇనుము పరుస వేదిని తాకిన బంగారమగునట్లు దుష్టులు గూడ సత్సంగతి వలన సత్పురుషులుగా అయ్యెదరు. విధివశమున సత్పురుషులకు దుష్టసాంగత్యము ప్రాప్తించినను పాము పడగపైగల మణివలె వారు సద్గుణములతోడనే విలసిల్లుదురు. సర్పవిషముచే మణి ఏ విధముగను ప్రభావితముగాక స్వయంప్రకాశమానమగును. అట్లే దుష్టసాంగత్యముచే సజ్జనులు ఏ మాత్రమూ ప్రభావితులు గాక తమ సుగుణములతోడనే శోభిల్లుచుందురు. కవులుగాని, విజ్ఞానులుగాని కడకు బ్రహ్మవిష్ణు మహేశ్వరులుగాని సత్పురుషమహిమలను పూర్తిగా వర్ణింపజాలరు. ఇక నేను వర్ణింపబూనుట కూరలమ్మువాడు మణుల నాణ్యతను తెల్పునట్లుండును. (చౌ॥ 1-6)

దోసిట జేరిన పుష్పములు రెండు చేతులకును (అనగా తమను తెంపిన చేతికిని, తమను పట్టుకొనిన చేతికిని) సుగంధమును సమానముగనే పంచియిచ్చును. అట్లే సాధుపుంగవులు అందఱిని సమ భావముతోడనే చూచెదరు. వారికి శత్రువులు గాని, మిత్రులుగాని, ఉండరు. అట్టి సాధుపురుషులకు నమస్కరించెదను. సాధువులు సరళ చిత్తులు, లోకోపకారులు. వారి సద్భావమును స్నేహమును తెలిసికొని, "ఓ సాధువులారా! ఈ బాలుని ప్రార్థనను మన్నించి, శ్రీరామునిచరణకమలములపై ప్రీతికలుగనట్లు అనుగ్రహింపుడు" - అని వారిని తులసీదాసు వేడు కొనుచున్నాడు. (దో॥ 3 క,ఖ)

దుష్టులు తమకు అవ్యాజ ప్రేమతో హితమునుచేకూర్చు వారిని సైతము హింసింతురు. ఇతరులకు హాని చేయుటలోనే తమకు లాభము కలదని భావింతురు. ఇతరుల పతనమును జూచి ఆనందింతురు, ఉన్నతిని జూచి దుఃఖ పడుదురు. అట్టి దుష్టులకుసైతము నేను సద్భావముతో నమస్కరింతును. వీరు హరిహరులకీర్తియనెడి పూర్ణచంద్రునకు రాహువు వంటివారు. (అనగా హరిహరులను కీర్తించినను దానికితట్టు కొనలేక ఆ కీర్తించువారికి విఘ్నములను గూర్తురు.) ఇతరులకు కీడు చేయుటలో వీరు సహస్ర బాహువులు, ఇతరుల దోషములను వేయి కన్నులతో వెదకు చుందురు. నేతిని చెడగొట్టు ఈగవలె వీరి మనస్సులు ఇతరుల హితములను భంగపఱచుటలో నిమగ్నమగుచుండును. వీరు ఇతరులకు తాపమును గూర్చుటలో అగ్నివంటివారు, క్రోధములో యమునివంటివారు,

పాపములు, అవగుణములు అనెడి ధనములకు వీరు కుబేరులు. కేతువు (తోకచుక్క) వలె అందఱిహితములను నాశనముచేయుదురు. వీరు నిద్రించుటలో కుంభకర్ణులగుటయే లోకమునకు మేలు. వడగండ్లు పంటలను పాడుచేసి, తాముగూడ కరగి పోవునట్లే వీరు ఇతరులకు కీడు చేయుటకై తమ ప్రాణములనుగూడ ఒడ్డెదరు. వేయినాలుకలతో ఇతరుల దోషములను ఆక్రోశముతో ఎన్ను వీరిని శేషుడని భావించి, నమస్కరించెదను. ఇతరుల పాప కృత్యములను గూర్చి పదివేల చెవులతో (చెవులప్పగించి) విందురు. భగవత్కథలను వినుటకై పదివేల చెవులను గోరిన పృథురాజుగా వీరిని భావించెదను. సురా(మద్య)పాన ప్రియులైన వీరిని సురానీక (దేవతాసమూహ)ప్రియుడైన ఇంద్రునిగా భావించెదను. కఠినాతి కఠినమైన వజ్రాయుధమే ఇంద్రునకు ఇష్టము. అట్లే కఠినాతి కఠనములైన పరుష వచనములే వీరికి ఇష్టములు. ఇతరుల దోషములను ఎన్నుటలో వీరు సహస్రాక్షులు. (చౌ॥ 1-6)

దుష్టులు తమ మిత్రుల యొక్క, శత్రువుల యొక్క, తటస్థుల యొక్క ఉన్నతిని జూచి, ఈర్ష్యతో మలమల మాడిపోవుదురు. వీరి యీరీతిని గమనించి, వినయముతో ప్రేమతో చేతులు జోడించి వీరికి నమస్కరింతును. (దో॥ 4)

నా ధర్మముగా వారిని నేను ప్రార్థించితిని. కాని వారు తమ స్వభావములను మానుకొందురా? కాకులను ఎంతటి తియ్యని పాయసముతో పోషించినను అవి మాంసమును తినుట మానుకొనునా? నేను సాధువులకును దుష్టులకును నమస్కరింతును. ఉభయులును కష్టపెట్టెడి వారే. కాని వారి మధ్య మిక్కిలి అంతరము గలదు. సాధువులు మనకు దూరమైనప్పుడు మన ప్రాణములే పోయినట్లగును. దుష్టులు మనకు చేరువయైనప్పుడు ఎనలేని బాధకలుగును. ఏకాలమునందైనను సజ్జనులును దుర్జనులును ఈ లోకమున ప్రక్క ప్రక్కనే జన్మించుచుందురు. కాని వారి వారి స్వభావములు వేఱు. కమలములు జలగలు నీటిలోనే పుట్టు చుండును. అమృతము మదిర రెండును సముద్రము నుండియే ఉద్భవించినవి. సజ్జనులును దుర్జనులును వారి వారి కర్మఫలములను అనుసరించి కీర్తి-అపకీర్తులను పొందెదరు. సాధువుల స్వభావములు అమృతము, చంద్రుడు, పవిత్ర గంగానది వంటివి. దుష్టుల స్వభావములు విషము, అగ్ని, కలి పాపములతో గూడిన కర్మనాశనదివంటివి. వీరి గుణావగుణములను ఎల్లరును ఎఱుంగుదురు. ఎవరికి నచ్చిన వాటిని వారుగ్రహింతురు. (చౌ॥ 1-5)

సజ్జనులు మంచినే పట్టుకొందురు. దుర్జనులు చెడును విడిచిపెట్టరు. అమృతము అమరత్వమును ప్రసాదించును. విషము మరణమునే సమకూర్చును. ఈ రెండును తమతమ గుణములకు ప్రసిద్ధములు, దోహదకారులు. (దో॥ 5)

దుర్జనుల పాపకృత్యములను దోషములను, సజ్జనుల సద్గుణములను తెలిపెడి కథలు సముద్రములవలె అపారములు, అగాధములు. ఇందులో సజ్జనులగుణములు, దుర్జనులదోషములును వర్ణింపబడినవి. ఏలనన వారితారతమ్యములను గుర్తింపనిదే సుగుణములను గ్రహించుటకును, దుర్గుణములను నిరాకరించుటకును సాధ్యము కాదు. గుణదోషములు రెండును బ్రహ్మసృష్టిలోని భాగములే. వేదములు వాటి తారతమ్యములను వేర్వేఱుగా స్పష్టముగా విశదీకరించెను. వేదములతోపాటు ఇతిహాసపురాణాదులు గూడ బ్రహ్మసృష్టి గుణదోషములసమ్మేళనమని వక్కాణించెను. ఇట్టి వైరుధ్యములు ఈ సృష్టిలో అనంతములు. సుఖదుఃఖములు, పుణ్యపాపములు, దివారాత్రములు, మంచిచెడులు, సుజాతికుజాతులు, దేవదానవులు, ఉచ్చనీచములు, అమృతవిషములు, జననమరణములు, బ్రహ్మ-మాయలు ఈశ్వర-జీవులు, సంపదలు-దారిద్ర్యములు, రాజు-పేదలు, కాశీ-మగధలు, గంగా-కర్మనాశనదులు, మార్వార-మాళవ దేశములు, బ్రాహ్మణుడు-కసాయివాడు, స్వర్గనరకములు, వైరాగ్యానురాగములు మొదలగునవి ఈ వైవిధ్యములకు ప్రబలనిదర్శనములు. వేదశాస్త్రములు వీటి మంచిచెడులను వివరించినవి. (చౌ॥ 1-5)

భగవంతుడు చేతనాచేతనరూపమైన విశ్వమునందు మంచిచెడులను సృష్టించెను. హంస పాలను గ్రహించి నీటిని వదలినట్లే సాధువులు గుణములను గ్రహించి, దోషములను దూరముగా పరిహరించెదరు. (దో॥ 6)

భగవదనుగ్రమున విచక్షణాశక్తిని కల్గియున్నవారు చెడును విసర్జించి, మంచిని మాత్రమే గ్రహింతురు. ఒక్కొక్కప్పుడు మంచివారు సైతము మాయామోహితులై కాలము, స్వభావము, కర్మల ప్రభావముచే సన్మార్గము నుండి వైదొలగుదురు. భగవద్భక్తులు ఈ పొరపాటును తెలిసికొని, వాటిని సవరించు కొందురు. దుః ఖదోషములను అధిగమించి (పాఱద్రోలి) నిర్మలమైనయశమును పొందుదురు. అట్లే దుష్టులుగూడ ఒక్కొక్కసారి సత్సాంగత్యప్రభావమున సత్కర్మలను ఆచరింతురు. కాని వారిదుష్టస్వభావములు మాత్రము మాఱవు. కపట వేషధారులైన ధూర్తులు మొదట గౌరవింపబడినను కాలక్రమమున వారివారి నిజ స్వరూపములు బట్టబయలగును. కాలనేమి, రావణుడు, రాహువు మొదలగు వారి వృత్తాంతములే ఇందులకు ప్రబలనిదర్శనములు. సజ్జనుల రూపములు, వేషములు ఎట్లున్నను వారు హనుమజ్జాంబవంతాదులవలె అందఱిచే గౌరవింప బడుదురు. దుష్టసహవాసము ప్రమాదకరము. సజ్జనమైత్రి వరప్రసాదము. ఇది లోకవిదితము, వేదప్రామాణికము. వాయు సాంగత్యమున పైకెగురుధూళి ఉన్నతస్థితికి చేరును. అదియే పతనోన్ముఖముగా సాగిపోవు నీటితో కూడినప్పుడు బురదయై అధోగతి పాలగును. సజ్జనులఇండ్లలో పెంచిగినచిలుకలు, గోర్వంకలు, రామ నామమును జపించును. (పలుకును) దుర్జనులఇండ్లలోనిచిలుకలు దుర్భాషలాడును. పొగ మలినములతో కలిసినచో నల్లబారును. కాని సిరాగా మాఱినచో పవిత్రపురాణములనే వ్రాయవచ్చును ఆ పొగయే-నీరు, అగ్ని, గాలితో కలిసి, మేఘముగా మాఱినప్పుడు వర్షజలముల ద్వారా జీవులకు ప్రాణదాత యగును. (చౌ॥ 1-6)

గ్రహములు, ఓషధులు, జలములు, వాయువు, వస్త్రములు - ఇవియన్నియును వాటివాటి సాహచర్యములను బట్టి మంచి, లేక చెడుగా భావింపబడుచుండును. విజ్ఞులైన వారు ఈ లోకసత్యములను ఎఱుంగ గలరు. శుక్ల, కృష్ణపక్షములయందు వెన్నెల, చీకటి సమానముగనే యుండును. కాని విధాత వాటికి వేర్వేఱు పేర్లను పెట్టెను. లోకము చంద్రునికళలవృద్ధికి తోడ్పడు శుక్ల పక్షమును ప్రశంసించును. క్షీణదశకు ఆకరమగు కృష్ణపక్షమును ఏవగించుకొనును. విశ్వమునందలి చేతనాచేతన పదార్థములన్నియును శ్రీరామమయములు. కావున నేను వాటిచరణకమలములకు చేతులుజోడించి మ్రొక్కెదను. దేవతలు, దైత్యులు, మానవులు, నాగులు, పక్షులు, ప్రేతలు, పితరులు, గంధర్వ, కిన్నర, రాక్షసులు మున్నగు సమస్త ప్రాణికోటికిని ప్రణమిల్లుదును. తదనుగ్రహము నాకు లభించునుగాక. (దో॥ 7. క,ఖ,గ,ఘ)

భూమ్యాకాశములయందును జలములయందును జీవించు చతుర్విధములైన (జరాయుజ, అండజ, స్వేదజ, ఉద్భిజములు) (1) మానవులు, జంతువులు. (2) పక్షులు. (3) క్రిమి కీటకాదులు. (4) మొక్కలు. ఎనుబది నాలుగు లక్షల జీవరాసులు సీతారామమయములని భావించి, వాటికి అంజలి ఘటింతును. ఓ దయానిధులారా ! నన్ను మీసేవకునిగా భావించి, నిష్కపటచిత్తములతో నాపై కృపజూపుడు. నాబుద్ధి బలముపై నాకు విశ్వాసము లేదు. కనుక మీకు విన్నవించుచున్నాను. రఘుకులతిలకుడైన శ్రీరామునిగుణములను వర్ణింప గోరుచున్నాను. నా బుద్ధి అల్పమైనది. శ్రీరాముని చరితము అగాధమైనది. నేను ఏ కావ్యాంగములనూ ఎఱుగను, నా మనోరథము, మాత్రము రాజువలె ఉన్నతమైనది కాని నామనస్సు, బుద్ధి నిరుపేదల వలె అల్పములైనవి, నా కోరిక ఘనమైనది, బుద్ధిమాత్రము అల్పమైనది. నేను అమృతమును కోరుచున్నాను. కాని మజ్జిగ సంపాదించు శక్తికూడ నాకు లేదు. సజ్జనులు నా అతిసాహసమును మన్నించి, ఈ బాలుని వచనములను ఆదరముతో ఆలకింతురు గాక. తల్లిదండ్రులు తమపిల్లల చిలుకపలుకులను విని ఆనందించెదరు. కఠినాత్ములు, కుటిలురు, దురాలోచనాపరులు ఇతరుల దోషములనెన్నుటయే ఒక ఘనకార్యముగా భావించి, వారిని పరిహసించుచుందురు. మనోహరముగానున్నను లేక పేలవముగా నున్నను ఎవరి కవిత్వము వారికి మధురముగానే ఉండును. కాని ఇతరులరచనలను విని మెచ్చుకొను

సజ్జనులు చాల అరుదుగా మాత్రమే ఉందురు. కుంభ వృష్టి పడినప్పుడు వరదలతో పొంగిపొరలు నదులు, తటాకముల వలె తమ ఉన్నతికి పొంగి పోవు జనులు లోకమున కోకొల్లలు. కాని పూర్ణ చంద్రుని జూచి గంతులు వేయు సముద్రునివలె ఇతరులఔన్నత్యమును జూచి, సంతసించు సహృదయులు చాలతక్కువగా ఉందురు. (చౌ॥ 1-7)

నా శక్తి అల్పము, కాని లక్ష్యము అనల్పము (ఉన్నతము) దుర్జనులు పరిహసించినను సుజనులు నా రచనకు ఆనందింతురని నా పరమ విశ్వాసము. (దో॥ 8)

దుర్జనుల పరిహాసముగూడ నాకు హితమే. కోయిల పాట కాకులకు కఠోరముగా ఉండును. కొంగలు హంసలను, కప్పలు చాతకపక్షులను పరిహసించుచుండును. నీచులు సచ్చరిత్రలను విని నవ్వెదరు. కవిత్వమునందును శ్రీరామచంద్రుని పాదపద్మములయందును భక్తిలేని కవితారసికులకు ఈ కవిత హాస్యరస ప్రధానమై సుఖమునిచ్చును. నా రచన లౌకికభాషలో సాగినది. పైగా నా బుద్ధి అల్పమైనది. కావున నవ్వదగినది. అందువలన వారు నవ్వుటలో దోషము లేదు. శ్రీహరి చరణకమలములయందు భక్తిలేని వారికిని, అవగాహనారహితులకును ఈ కథ పేలవముగా కనిపింప వచ్చును. హరిహరభక్తులకును, కుతర్కబుద్ధులుకానివారికిని శ్రీ రఘునాథునిచరితము మధురముగా ఉండును, హాయిని గొల్పును. సజ్జనులు ఈ గాథను శ్రీరామభక్తివైభవభూషితమైనదిగా గ్రహించి, (విని) మనోహరముగ ప్రశంసింతురు. నేను కవిని గాను. వాక్చతురుడనూ గాను. వాక్యరచనకళలయందును, నాకు ప్రావీణ్యము లేదు. శబ్దార్థ ప్రయోగములు వివిధములు. అలంకారములు, ఛందస్సులు అనేకములు. భావరసభేదములు అపరిమితములు. కవితాగుణములు, దోషములు వివిధములు ఈ కవితావిశేషములలో ఏ ఒక్కదానిని గూర్చియు నేనెఱుగనేయెఱుగను. ఈ సత్యమును ప్రమాణపూర్వకముగా తెల్పుచున్నాను. (చౌ॥ 1-6)

## రామాయణ మహత్త్వము

నా కవితలో ఎట్టి సుగుణములూ లేవు. కాని జగత్ప్రసిద్ధమైన రామకథయను ఒకే ఒక్క సుగుణము గలదు. జ్ఞానులును, వివేక వంతులును దానిని ఎఱింగి సాదరముగా ఆలకింతురు. (దో॥ 9)

ఇందు సాంబశివుడు సర్వదా జపించు శ్రీరామచంద్రునిపావననామము గలదు. ఇది మిక్కిలి పవిత్రమైనది. వేద, పురాణములసారము, కల్యాణములకు పెన్నిధి, అశుభములను రూపుమాపునది. అనేకాలంకారభూషితయైనను, ఎంతగా సౌందర్యవతియైనను వస్త్రములను ధరింపని స్త్రీ శోభింపదు. అట్లే అది మహాకవిచే వ్రాయబడినను, మిక్కిలి ప్రశంసనీయమైనదేయైనను రామనామము లేని కావ్యము శోభింపదు. కాని అల్పజ్ఞుడైన కుకవిచే వ్రాయబడినను, అది గుణరహితమైనదేయైనను రామనామవైభవముచే అలంకృతమైన కావ్యమును సజ్జనులు సాదరముగా చదివి, విని, ఆనందింతురు. తుమ్మెదలు పుష్పములలోని మధువును గ్రోలినట్లు సత్పురుషులు గుణములనే గ్రహింతురు. ఇందు కవితారసపోషణలేకున్నను శ్రీరామచంద్రునిప్రతాపము బహుధా కీర్తింపబడినది. ఇదియే నా సంపూర్ణ విశ్వాసమునకు మూలము. సత్సాంగత్యమువలన గౌరవము దక్కని వారెవరు? పొగ అగరు సాంగత్యమున తన సహజమైన ఘాటును, కఱుకుదనమును వదలి సుగంధమునే వ్యాపింప జేయును. అట్లే నా కవిత సౌందర్య శోభితము కాకున్నను రామకథావర్ణనామహితమగుటవలన శుభప్రదమైనది. (చౌ॥ 1-5)

తులసీదాసు పలుకు చున్నాడు. శ్రీరఘునాథునిచరితము కలియుగపాపములను కడిగి వేయును, కల్యాణపరంపరను గూర్చును. శోభారహితమైన నా కవితాస్రవంతి పావనగంగానదివలె ఎన్ని మలుపులు తిరిగినను శ్రీహరి వైభవ సాంగత్యముచే సుజనులకు మనోహరముగా ఉండును. స్మశానములోని అపవిత్రమైన భస్మముకూడశంభునిశరీరస్పర్శచేత సుశోభితమై, స్మరణ మాత్రముననే పవిత్ర మొనర్చును. (ఛంద్)

మలయపర్వతమునందలి చందనవృక్షములసమీపమునగల ఏ వృక్షమైనను అది చందన వృక్షముగనే మాఱును. అందఱు దానిని ఆదరింతురు. అట్లే శ్రీరామ వైభవ సాహచర్య ప్రభావమున నా కవిత ఎల్లరకును అత్యంత ప్రీతికరమేయగును. నల్లని ఆవుపాలుగూడ తెల్లగాను, పుష్టికరముగను ఉండును. అందఱును దానిని సేవింతురు. అట్లే నా భాష గ్రామ్యమేయైనను సీతారాములకథను వర్ణించుటవలన సజ్జనులు దానిని గానము చేయుదురు, చెవులప్పగించి విందురు. (దో॥ 10. క,ఖ)

పాములపడగలపైగలమణులును పర్వతములపైగల మాణిక్యములును, గజములమస్తకముల యందుండు ముత్యములును అంతగా శోభింపవు. అవియే రాజులకిరీటములయందును, తరుణీమణులతనువులపైనను చేరి, వింతకాంతులను వెదజల్లును. అట్లే సత్కవులమస్తిష్కములనుండి జాలువారినకవితలు రసజ్ఞులహృదయములయందు శోభిల్లును. "కవిః కరోతి కావ్యాని, రసం జానాతి పండితః" అని ప్రాజ్ఞులు పల్కుచుందురు. కావ్య నిర్మాణమునకు పూనుకొనిన కవి స్మరించినంతమాత్రముననే శ్రీరామభక్తి పారవశ్యమున సరస్వతీదేవి బ్రహ్మలోకమునుండి భూమికి పరుగులుదీయుచు వచ్చును. ఆమెచే కవి శ్రీరామచరితమనెడి సరోవరమునందు స్నానము చేయించినప్పుడే ఆమె యొక్క దూరప్రయాణపుబడలిక తొలగిపోవును. ఇది తప్ప వేఱుగా కోటి ఉపాయములు చేసినను ఆ బడలిక తీరదు. ఈ విషయమును గ్రహించియే కవులును, పండితులును కలిపాపములను రూపుమాపు రామచరితయశోగానమును చేయుదురు. కవులు సామాన్యమానవుల చరిత్రమును పొగడినచో సరస్వతిదేవి తనరాకకు పశ్చాత్తాపపడును. పండితులు కవిహృదయమును సముద్రముతోడను అతని బుద్ధిని ముత్యపు చిప్పతోడను సరస్వతీదేవిని స్వాతివానతోడను పోల్చెదరు. ఇందులో (బుద్ధియనెడి ముత్యపుచిప్పలో) సుందరభావములనెడి వర్షపుచినుకులు పడినచో అందమైన కవితాముక్తామణులరూపములో అది భాసించును.

(చౌ॥ 1-5)

ఈ కవితా ముక్తామణులను యుక్తితో భేదించి, రామకథాసూత్రమున గూర్చి, సజ్జనులు తమ నిర్మల హృదయములయందు ధరించినచో అవి (ఆ హృదయములు) మిక్కిలి అనురాగశోభితములగును, భక్తి భరితములగును. (దో॥ 11)

పాప పంకిలమైన ఈ కలియుగమున పుట్టి, హంసవేషము ధరించి, కాకులవలె ప్రవర్తించువారును, వైదిక మార్గములను వీడి, దుర్మార్గములో సాగిపోయెడి వారును, పాపాత్ములును, రామభక్తులమని చెప్పి కొనుచు లోకులను మోసగించు వంచకులును, కామక్రోధలోభములకు దాసులును, పాషండులును, ధర్మ ధ్వజులును (ధర్మవంచకులును) ఐన వారిలో నేను ప్రథముడను, నా దుర్గుణములకు లెక్కయే లేదు. వాటిని వివరింప సాగినచో ఆ కథయే విస్తృతమగును. వాటిలో కొన్నింటిని మాత్రమే తెల్పితిని. సహృదయులు ఈ మాత్ర వివరణముతో అర్థము చేసికొన గలరు. నా యీ మనవిని గ్రహించి, ఈ నా కథను విన్న వారెవ్వరును నన్ను దోషిగా తలంపరు. ఐనప్పటికిని శంకించిన వారు నా కంటెను మిక్కిలి మూర్ఖులు, మంద బుద్ధులు. నేను కవిని గాను, చతురుడనూ గాను, శ్రీరాముని కథా వైభవమును నా బుద్ధికి తోచినట్లుగా వర్ణించినాను. శ్రీరాముని అపారమైన చరిత్ర యెక్కడ? సంసార వ్యామోహములలో కూరుకొని పోయిన నా బుద్ధి యెక్కడ? మేరు పర్వతమునుగూడ కదలించు శక్తిగల వాయువుముందర దూది యెట్లు నిలువ గలదు. శ్రీరాముని అనంత వైభవములను తలంచినప్పుడు ఈ కథను చెప్పుటకు నాకు ధైర్యము చాలదు. (చౌ॥ 1-6)

వాగ్దేవియు, శేషుడు, పరమశివుడు, పరమేష్ఠియు, వేదశాస్త్రపురాణములు శ్రీరామచంద్రుని గుణములను నిరంతరము గానముచేయుచు పూర్తిగా వర్ణించుచుండును. కాని అతనిఅనంతగుణములను వర్ణింప జాలక నేతి, నేతి (న+ఇతి, న+ఇతి) అనుచు గానము చేయుచునే యుండును. (దో॥ 12)

శ్రీరామునివైభవము వర్ణింపనలవికానిదని ఎఱింగియు ఎవ్వరును వర్ణించుట మానలేదు. ఆయనభజనప్రభావమును వేదములు అనేకవిధములుగా తెల్పినవి. ఏ కొద్దిపాటి గుణగానమైనను మానవులను భవసాగరము నుండి తరింపజేయును. పరమేశ్వరుడొక్కడే. అతడు నిష్కాముడు, నిరాకారుడు, జన్మనామములు లేనివాడు, సచ్చిదానంద స్వరూపుడు, పరంధాముడు, విశ్వవ్యాపి, విశ్వరూపుడు. ఐనను దివ్య శరీరములను ధరించి, పెక్కు అవతారములద్వారా తనలీలలను ప్రకటించుచుండును. భగవంతుడు పరమ కృపాళువు, శరణాగతవత్సలుడు. కావున భక్తసంరక్షణమునకే వారి శ్రేయస్సుకొఱకే తన ఈ లీలలను ప్రదర్శించు చుండును. తన కరుణాదృష్టిని అయాచితముగనే భక్తులపై అతడు ప్రసరింపజేయుచుండును. భక్తులపై ఆయనకు గల కృపావాత్సల్యములు అపారములు. ఒక్కసారి కృపజూపినవారిపై ఎన్నడును ఆయన కోపగింపడు. భక్తులు నష్టపోయినదానిని లభ్యమగునట్లు చేయును. అనగా భక్తులయోగక్షేమములను వహించుచుండువాడతడే. అతడు దీనబంధువు, సరళస్వభావుడు, సర్వశక్తిమంతుడు, అందఱికిని ప్రభువు. దీనిని ఎఱింగియే బుద్ధిమంతులు శ్రీహరియశమును కీర్తించుచు తమవాక్కులను పునీత మొనర్చుకొనుచు జీవితములను సఫలముచేసికొనుచుందురు. ఈ కారణముననే శ్రీరామునిపాదకమలములకు శిరసా ప్రణమిల్లి, ఆయన గుణములను గానమొనర్చెదను. పూర్వము వ్యాస వాల్మీకాది మహర్షులు, శ్రీహరి వైభవములను వర్ణించిరి. వారి మార్గమును అనుసరించుటయే నాకును సులభము. (చౌ॥ 1-5)

ఒక మహానదిపైన ఏ రాజైనను వంతెనను కట్టించినపిమ్మట చిన్న చిన్న చీమలుగూడ ఆ నదిని అవలీలగా దాటగలవు. (దో॥ 13)

ఈ విధముగా నా మనస్సును దృఢపఱచుకొని, మనోహరమైన శ్రీరామ వృత్తాంతమును రచించెదను. శ్రీరామకథావైభవమును వర్ణించినవ్యాసాదిమహర్షులకు నా నమోవాకములు. నా మనోరథమును వారు సఫలము చేయుదురు గాక. శ్రీరఘుపతిగుణములను వర్ణించిన ఈ కలియుగకవులకును నేను ప్రణమిల్లుదును. శ్రీహరిగాథలను వర్ణించిన ప్రాకృతకవులకును, భూత భవిష్యద్వర్తమానకవులందరికిని నిస్సంకోచముగా నమస్కరింతును. నా కవితను సాధుసమాజము గౌరవించును గాక. సహృదయులైన బుద్ధిమంతులుమెచ్చనివ్యర్థ కవిత్వములను వ్రాసినవాడు మూర్ఖుడే. కీర్తి, కవిత, సంపద అనునవి గంగా జలములవలె అందఱికిని హితమును చేకూర్చునవిగా ఉండవలెను. శ్రీరామునికీర్తి అతిమనోహరమైనది అతి సాధారణమైన నా కవితద్వారా దానిని వర్ణించుట అసమంజసమగునేమో యని నా భయము. ఓ మహా కవులారా ! మీ కృపవలన ఈ భయము గూడ దూరము కాగలదు. ఏలనన పట్టు దారముతో చేసిన నగిషీలు గోనెపట్టపై గూడ అందముగానే యుండును. (చౌ॥ 1-6)

కవిత సరళమై, నిష్కళంకమైనపాత్రపోషణ యున్నచో సుజనులు మెచ్చుకొందురు. శత్రువులు గూడ వైరములను విస్మరించి, దానిని ప్రశంసింతురు. అట్టి కవితారచన ప్రజ్ఞావంతులకే సాధ్యము. నేనైతే మంద బుద్ధిని. కావున కవులారా ! నేను శ్రీహరికీర్తిని గానము చేయునట్లు కృపజూపుడు. శ్రీరఘువర చరితమనెడి మానససరోవరమునందు విహరించు హంసలవంటి కవి పండితులారా ! ఈ బాలుని ప్రార్థనను మన్నించి, నాపై కనికరింపుడు అని పదేపదే విన్నవించుకొనుచున్నాను. (దో॥ 14. క,ఖ,గ)

రామాయణము ఖర సహితమైనను (ఖర = ఖరుడను రాక్షసుడు, కఠినము) కోమలము, మంజులము (ఖరుడను రాక్షసవృత్తాంతముతో గూడినను అది కోమలము, మంజులము) దూషణ సహితమైనను (దూషణ = దూషణుడు అను రాక్షసుడు, దోషములు) అది దోషరహితము (దూషణుడను రాక్షసుని వృత్తాంతముతో గూడినను అది (రచన) దోషరహితము.) అట్టి మంజుల కావ్యమును రచించిన వాల్మీకి ముని పుంగవునకు నా నమస్కారములు. సంసారసాగరమునుండి తరించుటకు ఆలంబనమగుటలో నౌకలైన వేదములు నిరంతరము శ్రీహరి వైభవమునే

గానము చేయును. వాటికి నా ప్రణామములు. అమృతము, చంద్రుడు, కామధేనువు వంటి సాధు కోటిని, విషము, మదిరల వంటి దుర్జనులుగల ఈ భవ సాగరమును, సృష్టించిన బ్రహ్మకును నా నమస్కారములు.
(సోరఠ-14. ఘ,జ,చ)

సకల దేవతలకును, బ్రాహ్మణులకును, పండితులకును, గ్రహములకును చేతులెత్తి, నమస్కరించు చున్నాను. వారు నా మనోరథము నెరవేరునట్లు దయదలతురు గాక. (దో॥ 14. ఛ)

సరస్వతీ దేవికిని, గంగాదేవికిని ప్రణమిల్లుదును. ఆ ఇద్దరును మనోజ్ఞ పవిత్ర చరిత్రలు గలవారే. తన పవిత్ర జలములలో స్నానము చేసి, ఆ జలమును సేవించినవారి పాపములను గంగ హరించును. తన గుణ వైభవముల విను వారి, కీర్తించు వారి అజ్ఞానమును సరస్వతీ దేవి తొలగించును. నాకు తలిదండ్రులును, గురువులును ఐన పార్వతీపరమేశ్వరులకు నా ప్రణతులు. వారు దీనజనబాంధవులు, వరప్రదాతలు. సీతాపతి యైన శ్రీరామచంద్రునకు సేవకులు, స్వామి, మిత్రులు, 'తులసీదాసు' అను పేరుగల నాకు నిర్హేతుక హితకరులు. అట్టి ఆదిదంపతులకు అంజలి ఘటింతును. కలికల్మషములను నశింపజేయుటకై, లోకహితమునకై పార్వతీపరమేశ్వరులు శాబరమంత్రములను రచించిరి. అవి అసంబద్ధములై అర్థవంతములు, జపార్హములు కాకున్నను శివమహిమవలన ప్రభావాన్వితములైనవి. నా ప్రియప్రభునైన ఉమాపతి ఈ కథను ఆనందమయము, మంగళ ప్రదము గావించును. ఈ విధముగా శివ పార్వతులను స్మరించి, వారి అనుగ్రహముచే శ్రీరామవృత్తాంతమును భక్తితత్పరత్వములతో వర్ణించెదను. తారకలతో, చంద్రునితో రాత్రి వెలుగొందునట్లు ఈశ్వరునికృపచే నా కవిత శోభిల్లును. భక్తి తత్పరులై దీనిని పఠించిన వారును, శ్రవణముచేసినవారును కలిపాపములనుండి ముక్తులై, సౌభాగ్యశోభితులై, శ్రీరామపాదధ్యానానందములను అనుభవింతురు. (చౌ॥ 1-6)

పార్వతీపరమేశ్వరులఅనుగ్రహము కలలోనైనను నిజముగా నాపై ప్రసరించినచో వ్యవహారభాషలో వ్రాసినను ఈ కవితా ప్రభావము వాస్తవముగా బహుజనరంజకముగానే ఉండును. (దో॥ 15)

కలికాలుష్యములను కడిగివేయు సరయూనదీతీరమునగల పవిత్రమైన అయోధ్యాపురికి నా వందనములు. శ్రీరామునకు అత్యంతప్రేమపాత్రులైనట్టి అయోధ్యాపురపౌరులకు నమస్కరింతును. (అయోధ్యా పురవాసులు శ్రీరామునియెడ అత్యంత ప్రేమపరిపూర్ణులు) సీతా మహా సాధ్వని అపవాదు పాలు చేసినను ఆరజకాదులను క్షమించి, వారి పాపములను, శోకములను పారద్రోలి, దయానిధియైన శ్రీరాముడు వారిని వైకుంఠ వాసులనుగా జేసెను. దశదిశల యందును తన కీర్తి కాంతులను వెదజల్లుచున్న కౌసల్య యనెడి పూర్వదిశకు నా వందనములు. విశ్వమునకే సుఖదాయకుడును, కమలవనమును మంచునష్టపఱచినట్లు దుష్టులనెడి కమలసమూహములను రూపుమాపు శ్రీరాముడనెడి మనోహరుడైన చంద్రుడు ఈ ప్రాగ్దిశ యందే ఉదయించెను. దశరథుని, కౌసల్యాదులను శ్రీరాముని తల్లిదండ్రులుగా సృష్టించి, బ్రహ్మదేవుడు ఖ్యాతికెక్కెను. రామచంద్రునితల్లిదండ్రులుగా వారివైభవము ఇనుమడించెను. పుణ్యమూర్తులైన ఆ దశరథకౌసల్యాదులకు త్రికరణశుద్ధిగా నేను నమస్కరింతును. వారు తమపుత్రునిసేవకుడనైననన్ను కృపజూతురుగాక. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రునిపై మిక్కిలి ప్రేమ గలిగి, ఆయన వియోగమునకు తట్టుకొన లేక తనప్రాణములను తృణప్రాయముగా త్యజించిన అయోధ్యాపతియైన దశరథునకు నా ప్రణామములు. (సో॥ 16)

శ్రీరామచంద్రునిపై తమకుగల ప్రేమానురాగములను యోగభోగములలో దాచినను, ఆయన దర్శనమైన వెంటనే వాటిని ప్రకటిత మొనర్చిన విదేహరాజైన జనకునకును ఆయనపరివారమునకును నా ప్రణామములు. భరతుని నియమములు, వ్రతములు వర్ణనాతీతములు. తుమ్మెదలు మకరందము కొఱకువలె ఆయన మనస్సు నిరంతరము శ్రీరాముని చరణ కమలములకై తహతహలాడు చుండును. అట్టి భరతునకు ముందుగా నేను

నమస్కరింతును. శ్రీరామచంద్రునినిర్మలకీర్తిపతాకకు లక్ష్మణుడు ధ్వజమువంటివాడు. శీతలములై, సుందరములై, భక్తులకు సుఖప్రదములైన ఆయనపాదపద్మములకు వందనములు. జగత్కారణుడు, సహస్రఫణియుఐన ఆదిశేషుడు విశ్వమునందలిభయమును పాఱద్రోలుటకు సుమిత్రానందనుడై అవతరించెను. సద్గుణ ఖని, కృపాసింధువైన అట్టి లక్ష్మణుడు నాకు ప్రసన్నుడగు గాక. రిపుసూదనుడు, వీరుడు, సుశీలుడు, సర్వదా భరతుని అనుగామియైన శత్రుఘ్నునకు ప్రణమిల్లెదను. ప్రత్యక్షముగా శ్రీరాముని ప్రశంసలకు పాత్రుడు, మహా శూరుడు ఐన శ్రీ హనుమంతునకు నేను ప్రణమిల్లుదును. (చౌ॥ 1-5)

మూర్తీభవించినజ్ఞానము, రాక్షసవనమునకు దావాగ్ని, ధనుర్బాణధారియైనకోదండరాముని నిరంతరము తనహృదయమునందు నిలుపుకొను వాయునందనుడైన ఆంజనేయస్వామికి నా అభివాదములు. (సో॥ 17)

వానర రాజైన సుగ్రీవునకును, భల్లూక ప్రభువైన జాంబవంతునకును రాక్షస రాజైన విభీషణునకును, అంగదాది సమస్త వానరవీరులకును నా వందనములు. పశు, రాక్షసాది ఆకృతులను పొందినను, వారు శ్రీరాముని సాన్నిధ్యమును పొందగల్గిరి. శ్రీరాముని పాదకమలములను నిష్కామ భక్తితో ఆరాధించుచు సేవించు పక్షులు, మృగములు, దేవతలు, మనుష్యులు, అసురులు, అందఱికిని నా నమస్కృతులు. శుకయోగికిని, సనకాదిమునులకును, నారదాదిమహర్షులకును, పరమభక్తులకును, జ్ఞానులకును శతధా నమస్కరించెదను. ఓ మునీశ్వరులారా ! నన్ను మీదాసునిగా మన్నించి, కరుణింపుడు. జనకసుతయు, జగజ్జననియు, కరుణామయుడైన శ్రీరామునకుప్రాణప్రియయుఐన జానకీదేవిచరణాబ్జములకు మ్రొక్కెదను. ఆ తల్లి దయతో నాకు నిర్మలబుద్ధిని ప్రసాదించుగాక. సర్వశక్తిసంపన్నుడు, కమలనయనుడు, ధనుర్బాణధారియు, భక్తుల క్లేశములను హరించి, సుఖములను ఒసంగువాడును ఐన శ్రీరామచంద్రునకు త్రికరణ శుద్ధిగా ప్రణమిల్లుదును. (చౌ॥ 1-5)

శబ్దము-అర్థము, జలము-తరంగములు వేర్వేరుగా కనబడుచున్నను యథార్థముగా ఒక్కటియే. అట్లే సీతారాములుభిన్నరూపులుగా కనబడుచున్నను అభిన్నులే. దీనులయెడ, దుఃఖితులయెడ దయచూపెడి ఆ పరమపవిత్రదంపతులకు నా ప్రణతులు. (దో॥ 18)

కృశానుడు (అగ్ని), భానుడు(సూర్యుడు), హిమకరుడు(చంద్రుడు) అను వీరు ర,ఆ,మ అను రూపములలో బీజాక్షరములుగానున్న రామనామమును స్మరించెదను. ఇది సృష్టి స్థితి లయ కారకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల రూపము. వేదములకు ప్రాణము. నిర్గుణము, నిరుపమానము, గుణనిధానము. శివుడు రామనామమహామంత్రమును సదా జపించు చుండును. ముక్తి క్షేత్రమైన కాశీలో మృతిచెందు వారికి విశ్వేశ్వరుడు ఈ మంత్రమును ఉపదేశించుటచే వారికి నేరుగా ముక్తి లభించును. ఈ రామనామ మహిమ వలననే శ్రీ గణేశునకు ప్రథమపూజార్హత లభించినది. (గణేశుడు తనతల్లిదండ్రులైన పార్వతీ పరమేశ్వరులకు ప్రదక్షిణమొనర్చి భూ ప్రదక్షిణ ఫలమును పొందెను. 'రా' అనునది తండ్రికి ప్రతీక, 'మ' అనునది 'తల్లి'కి ప్రతీక. ఆ 'రామ' అను పవిత్రమైన అక్షర ద్వయమును వ్రాసి ప్రదక్షిణము చేసెను. తత్ప్రభావమున గణపతి మహామహిమోపేతుడయ్యెను. రామనామప్రభావము ఇట్టిది.) ఆదికవి వాల్మీకి ఈ మంత్రమును తలక్రిందులుగా (తారుమారుగా) జపించినను పవిత్రుడాయెను. రామనామము విష్ణు సహస్రనామ తుల్యమని శివునివలన యెఱింగిన పార్వతీదేవి సర్వదా దానిని జపించుచునే యుండును. రామనామముపై పార్వతీదేవికిగల మక్కువను తెలిసికొని శివుడు ప్రసన్నుడై తన దేహములో ఆమెకు అర్ధభాగమును ఒసంగెను. రామనామ ప్రభావముననే శివుడు మ్రింగిన కాలకూట విషముగూడ అమృతముగా మాఱెను. (చౌ॥ 1-4)

రామభక్తి వర్షఋతువువంటిది. తులసీదాసు, సుజనులైన రామభక్తులు వరిపంట. వైభవోపేతములైన 'రా,మ' అను రెండక్షరములును శ్రావణ భాద్రపద మాసములు. అనగా వరిపైరునకు వర్షము దోహదకారియైనట్లు భక్తులకు 'రామ'నామము పరమానందదాయకము. (దో॥ 19)

రామనామమునందలి 'రా,మ' అను రెండక్షరములును మధురమైనవి, మనోహరమైనవి. వర్ణమాలా శరీరమునకు నేత్రముల వంటివి. భక్తులకు ప్రాణప్రదములు. స్మరించుటకును సులభములు, సుఖ ప్రదములు. ఇవి ఈ లోకమున సుఖ లాభములను, పరలోకమున ముక్తిని ప్రసాదించును. ఇవి కర్ణపేయములు. స్మరించుటకు మనోహరములు. తులసీదాసునకు రామలక్ష్మణులవలె ఈ రెండక్షరములు అత్యంత ప్రియమైనవి. 'ర' 'మ' అనువర్ణములను వర్ణించుటలో వైవిధ్యమున్నను వాస్తవముగా ఆ రెండింటి మధ్య పరస్పర ప్రేమయేగలదు. (రకారో బ్రహ్మావాచకః, మకారో జీవ సంజ్ఞకః) జీవేశ్వరులవలె అవి సహజముగనే అవినాభావ సంబంధము గలవి. ఇవి నర నారాయణుల వలె సౌభ్రాతృత్వమును నెరపునవి. లోక రక్షకములు. విశేషముగ భక్తులను బ్రోచునవి. భక్తి యనెడి సుందరికి కర్ణాభరణముల వంటివి. జగత్తునకు హితమును గూర్చుటలో నిర్మలసూర్యచంద్రుల వంటివి. ముక్తిసుధవలె మధురమై ఆనందదాయకమైనవి. కూర్మమువలె శేషునివలె భూభారమును మోయునవి. భక్తుల మనస్సుల నెడి కమలముల యందు విహరించెడి తుమ్మెదలు. నాలుక యనెడి యశోదాదేవికి కృష్ణబలరాములనామములవలె, పలుకుటకు మధురములు, ఆనందదాయకములు. (చౌ॥ 1-4)

# రామనామ మహిమ

తులసీదాసు పలుకుచున్నాడు. శ్రీ 'రామ'చంద్రుని నామమునందలి 'రామ' అను రెండక్షరములు అన్ని అక్షరములకును ఉన్నతోన్నతములై ఒకటి ఛత్రము గాను, మఱియొకటి మకుటముగాను విరాజిల్లుచున్నవి. (దో॥ 20)

సరిగా అవగాహన చేసికొన్నచో నామము, నామి అభిన్నములే. కాని ఆ రెండింటిమధ్య స్వామి సేవకులకువలె ప్రీతి గలదు. నామ, రూపములు భగవంతుని ఉపాధులు. అవి అనిర్వచనీయములు. శాశ్వతములు. భక్తితో కూడిన పవిత్రబుద్ధి మాత్రమే వీటి శాశ్వతస్వరూపమును ఎఱుంగ గలదు. నామ రూపములలో 'ఏది గొప్ప' అని ఆలోచించుటయేఒక అపరాధము. వీటి గుణముల తారతమ్యములు సాధువులకే ఎఱుక. రూపము నామమును అనుసరించును. నామము లేనిచో రూపమును తెలసికొనలేము. ఒక ప్రత్యేక రూపముగల వస్తువును చేతిలో ఉంచినను నామము లేనిదే దానిని గుర్తింపజాలము. కాని వస్తు రూపమును చూడకున్నను నామమును స్మరింపగనే రూపము హృదయ ఫలకమున గోచరించును. నామరూపములఅనుబంధరహస్యము చెప్పనలవికానిది. దానిని గ్రహించిన వారు అనుభవించు ఆనందము వర్ణనాతీతము. భగవంతుని సగుణనిర్గుణరూపములకు నామమే సుందరమైన సాక్షి. ద్విభాషాజ్ఞాని వలె ఇది ఆ రెండింటి జ్ఞానమును తెల్పును. (చౌ॥ 1-4)

తులసీదాసు పలుకుచున్నాడు. నీవు లోపల, బయట కూడ ప్రకాశమును కోరుకొనినచో ముఖమనెడిద్వారమున నాలుకయనెడిగడపపై రామ నామమను మణిదీపమును ఉంచుము. (దో॥ 21)

బ్రహ్మసృజించిన ఈ దృశ్యజగత్తునెడ విరక్తులైన జీవన్ముక్తులు, యోగులు ఈ నామజపప్రభావమున తత్త్వజ్ఞానరూపమైన పగటికాలమునందు జాగృతులగుదురు. వారు నామరూప రహితమైన అనుపమ-అనిర్వచనీయ-అనామయ బ్రహ్మానందమును అనుభవించెదరు. జిజ్ఞాసువులుగూడ ఆత్మపరమాత్మల తత్త్వమును నామజపముద్వారా మాత్రమే తెలిసికొనగలరు. అర్థసిద్ధిని గోరుసాధకులు గూడ తదేకమనస్కులై నామమును జపించుటవలన అణిమాద్యష్టసిద్ధులను పొందెదరు. ఆర్తులైన భక్తులు నామ జపమును చేయుటచే ఘోరసంకటములనుండి విముక్తులై సుఖశాంతులను పొందెదరు. ప్రపంచమున రామభక్తులు నాలుగు విధములగా గలరు. ఆర్తులు, జిజ్ఞాసువులు, అర్థార్థులు, జ్ఞానులు. వీరందఱును పుణ్యాత్ములు, ఉదారులు. ఈ భక్తులందఱికిని నామజపమే ఆధారము. కాని వీరిలో జ్ఞానులైన భక్తులు భగవంతునకు అత్యంతప్రియులు. చతుర్యుగములయందును, చతుర్వేదముల యందును నామ ప్రభావప్రశంస గలదు. కలియుగమున మాత్రము నామజపము విశేషప్రభావాన్వితము. ఇంతకుమించిన సులభమైన తరణోపాయము మఱియొకటి లేదు. (చౌ॥ 1-4)

సర్వవిషయవాంఛారహితులై రామభక్తిరసమునందు మునిగినవారియొక్క మనస్సులు రామనామ మనెడి మనోహరప్రేమామృతసరోవరమునందు చేపలవలె హాయిని అనుభవించు చుండును. (దో॥ 22)

పరబ్రహ్మ నిర్గుణ-సగుణరూపుడు. ఈ రెండు రూపములును అనిర్వచనీయములు, అగాధములు. అనాది-నిరుపమానములు. నామము ఈ రెండింటి కంటెను గొప్పది. ఏలనన ఈ రెండు రూపములును నామము యొక్క శక్తికి వశమైయుండును. సజ్జనులు దీనిని నా ప్రౌఢోక్తిగా భావింపరాదు. నేను నా మనస్ఫూర్తిగా శ్రద్ధాదరములతో చెప్పుచున్నాను. పై రెండు రూపములుగల బ్రహ్మజ్ఞానము అగ్నితో సమానము. నిర్గుణబ్రహ్మ కట్టెలోగల అవ్యక్తాగ్ని. మనకు కనబడు వ్యక్తాగ్ని సగుణ బ్రహ్మ. తాత్త్వికముగా ఈ రెండింటిని తెలిసి కొనుట కష్టము. కాని నామజపమువలన రెండును సుగమములగును. నామము నిర్గుణబ్రహ్మ కంటెను, సగుణరామునికంటెను మహిమోపేతమైనది. బ్రహ్మము ఒక్కడే, అతడు సర్వవ్యాపి, శాశ్వతుడు, సచ్చిదానంద ఘన స్వరూపుడు. ఇట్టి నిర్వికారబ్రహ్మ తమ హృదయముల యందే యున్నను జీవులు దీనులును, దుఃఖితులును అగుట జరుగు చుండును. నామమహిమను తెలిసికొని, జపించుటచే రత్నమును గుర్తించినంతనే దాని విలువ తెలిసినట్లు బ్రహ్మము ప్రకటితుడగును. (చౌ॥ 1-4)

ఇట్లు నామవైభవము నిర్గుణబ్రహ్మముకంటెను గొప్పది. నా భావనలో నామము సగుణుడైన రామునికంటెను గొప్పది. (దో॥ 23)

శ్రీరాముడు భక్తులకొఱకు తాను స్వయముగా మానవాకృతిని స్వీకరించి, కష్టములకు ఓర్చి సాధువులను రక్షించెను. కాని భక్తులు ప్రేమాదరములతో నామజపము చేసి, శుభములకును, ఆనందమునకును నిలయములైరి. రామచంద్రుడు స్వయముగా మునిపత్నియైన అహల్యను ఉద్ధరించెను. కాని రామనామము కోట్లకొలది దుర్జనుల మనస్సులను మార్చివేసెను. విశ్వామిత్రుల యాగ రక్షణకై శ్రీరాముడు సుకేతుసుతయైన తాటకను, ఆమె కుమారుడైన సుబాహుని ససైన్యముగా వధించెను. కాని రామ నామము భక్తులపాపములను, కష్టములను సూర్యుడంధకారమును రూపుమాపునట్లు తొలగించును. శ్రీరామచంద్రుడు స్వయముగా శివధనుర్భంగము గావించెను. రామనామవైభవము జననమరణభయ శోకములను దూరమొనర్చును. శ్రీరాముడు దుష్టశిక్షణ, శిష్టరక్షణ కావించి, దండకారణ్యశోభలను ఇనుమడింప జేసెను. రామనామము అసంఖ్యాకులైన మనుష్యులమనస్సులను పవిత్రమొనర్చును. రఘునందనుడు రాక్షస సమూహములను తునుమాడెను. కాని రామ నామము కలి కల్మషములనన్నింటిని నిర్మూలించును. (చౌ॥ 1-4)

రఘునాథుడు శబరి, జటాయువు మొదలగు భక్తులకు మాత్రమే ముక్తిని ప్రసాదించెను. కాని రామ నామము పెక్కుమంది దుర్మార్గులనుగూడ ఉద్ధరించెను. రామనామమహిమను వేదములును ప్రస్తుతించినవి. (దో॥ 24)

శ్రీరాముడు శరణాగతులైన సుగ్రీవుని, విభీషణుని మాత్రమే రక్షించెను. కాని రామ నామము అసంఖ్యాకపామరజనులను గూడ పరిరక్షించెను. ఈ నామయశోవైభవములు లోకములలోను, వేదములయందును ప్రస్తుతింపబడినవి. శ్రీరాముడు వానర భల్లూకములసాయమున పెక్కు శ్రమలకోర్చి వారధిని నిర్మించి, సాగరమును దాటెను. కాని రామనామము స్మరణచేసినంతనే భక్తులను భవసాగరమునుండి దాటించును. సాధువులారా ! గొప్పదనము ఎవరిదో గ్రహింపుడు. శ్రీరాముడు దుష్ట రావణుని సపరివారముగా వధించి, సీతాసమేతుడై అయోధ్యకు విచ్చేసెను. రాజుగా పట్టాభిషిక్తుడాయెను. సురలు, మునులు ఆయనకల్యాణగుణములను మధురముగా గానము చేసిరి. కాని భక్తులు నామ స్మరణ చేయగనే మోహమనెడి దుర్జయసైన్యమునుజయించి, భక్తిపరవశులై (పారవశ్యమున) ఆత్మానందమును అనుభవింతురు. నామస్మరణప్రభావమున స్వప్నమునందును వారికి చింతలుండవు. (చౌ॥ 1-4)

ఈ విధముగా నిర్గుణబ్రహ్మకంటెను, సగుణరూపరామునికంటెను. రామనామము మహత్తరమైనది. ఇది వరప్రదాయకులకును వరములను ప్రసాదించునది. ఈ రహస్యము నెఱింగిన వాడగుటచే శివుడు నూఱుకోట్ల శ్లోకములుగల రామాయణమునుండి అత్యంతమహిమాన్వితమైన 'రామనామము'ను గ్రహించెను. (దో॥ 25)

"మాస పారాయణము - మొదటి విరామము"

శివుడు రామనామమహిమవలననే మృత్యుంజయుడయ్యెను. అమంగళకరవస్తువులను (కపాలములు మొదలగువానిని) ధరించియు మంగళప్రదుడాయెను. శుకమహర్షియు, సనకాదిమహామునులును, సిద్ధులును, యోగులును ఈ రామనామజపప్రభావముననే బ్రహ్మానందమును అనుభవించిరి. లోకములకే శ్రీహరి ప్రియమైనవాడు, ఆ శ్రీహరికి శివుడు బహిఃప్రాణము. రామనామ మహత్త్వరహస్యములను ఎఱింగిన నారదుడు ఆ హరిహరులిద్దఱికిని ప్రేమాస్పదుడు. ఈ నామజప మహత్త్వమువలననే ప్రహ్లాదుడు భక్తశిరోమణియై, శ్రీహరికృపకు పాత్రుడయ్యెను. చింతాక్రాంతుడైన ధ్రువుడు ఈ రామనామమును జపించియే తత్ప్రభావమున నక్షత్ర మండలమున స్థిరమైన, సర్వోన్నత స్థానమును అలంకరించెను. పావనియైన హనుమంతుడు ఈ పావననామస్మరణముచే శ్రీరాముని తనవశమునందుంచుకొనగల్గెను. పతితుడైన అజామీళుడు, ఆర్తుడైన గజేంద్రుడు, చిలుకకు రామనామమును నేర్పిన గణికాంగనయు శ్రీహరినామమహిమచే ముక్తిని పొందిరి. నామమహిమనుగూర్చి నేనేమి (ఎంతని) చెప్పగలను? ఆ శ్రీరాముడు సైతము నామమహిమను వర్ణింపజాలడు. (చౌ॥ 1-4)

కలియుగమునందు రామనామము కల్పవృక్షము. మఱియు ముక్తి ధామము. నామమహిమవలననే గంజాయిమొక్కవలె నికృష్టుడైన తులసీదాసు తులసి మొక్కవలె పవిత్రుడాయెను. (దో॥ 26)

చతుర్యుగములయందును, త్రికాలములయందును, ముల్లోకములయందును రామనామజప మహత్త్వమువలననే జనులు శోకరహితులైరి. రామనామముపై ప్రీతి యేర్పడుట పెక్కు పుణ్యములపంటయని సాధువుల అభిప్రాయము. వేద, పురాణములు గూడ ఈ విషయమునే ప్రకటించు చున్నవి. కృతయుగమున జనులు ధ్యానముచేతను, త్రేతాయుగమున యజ్ఞములవలనను, ద్వాపరయుగమున అర్చనల వలనను భగవంతుడు ప్రసన్నుడగును. కలియుగము కేవలము పాపములకు మూలము. ఈ యుగమున మానవుల మనస్సులు పాప సముద్రములలో చేపలవలె తిరుగాడుచుండును. ఇట్టి భయంకరమైన కలియుగమున రామనామమే జనులకు కల్పవృక్షము. దానిస్మరణ మాత్రముననే సంసారమాయామోహములు మటుమాయమగును. కలియుగమున రామనామము వాంఛితఫలప్రదము. ఈ లోకమున అది తల్లిదండ్రులవలె పోషించి, రక్షించును, పరలోకమున మోక్షమును ప్రసాదించును. కలియుగమున ఈ రామనామముతప్ప కర్మ, భక్తి, జ్ఞానములలో ఏదియు ఆలంబనము కాజాలదు. కలియుగమనెడి కపట కాలనేమిరాక్షసుని కడతేర్చుటకు పరాక్రమశాలియు, జ్ఞానియు ఐన హనుమంతుని వంటిది ఈ రామనామము. (చౌ॥ 1-4)

రామనామము నరసింహుడు. కలియుగము హిరణ్యకశిపుడు. నామజపముచేయువారు ప్రహ్లాదులు. నరసింహుడు హిరణ్యకశిపుని వధించి, ప్రహ్లాదుని కాపాడినట్లు రామనామము కలిపాపములను రూపుమాపి భక్తులను ఆదుకొనును. (దో॥ 27)

నామస్మరణను భక్తి భావముతో గాని, వైరభావముతో గాని, క్రోధముతో గాని, అలసత్వముతో గాని, ఏ రీతిగాజేసినను తత్ప్రభావమున అంతటను, అన్నింటను హితమే చేకూరును. అట్టి కల్యాణప్రదమైన రామనామమును స్మరించి, శ్రీరఘునాథునకు శిరసాప్రణమిల్లి, ఆయనగుణములను వర్ణించెదను. ఆ ప్రభువు నా దోషములనన్నింటిని మన్నించును. దయాళువైన శ్రీరాముని కృప అనంతము. భగవంతుడు భక్తులకు ఎంతగా

కృపను పంచినను కృపాదేవికి తనివియేతీరదు. ఇంకను విస్తృతముగా ప్రదానము చేయవలెనని ఆమె కోరుచుండును. శ్రీరాముడు ఉత్తమోత్తముడైన స్వామి, నేను అధమ సేవకుడను. ఐనను తనసహజదయాగుణమువలన అతడునన్ను కాపాడును. వేదములలో చెప్పబడినట్లు ఉత్తమప్రభువు వినయశీలురప్రార్థనలను మన్నించును. ఇది లోకప్రసిద్ధము. ధనికులు-నిరుపేదలు, నగరవాసులు-గ్రామీణులు, పండితులు-పామరులు, ఖ్యాతి కెక్కినవారు - అపఖ్యాతిపాలైనవారు, సుకవులు-కుకవులు ఐన స్త్రీ పురుషులందఱును తమతమబుద్ధులననుసరించి, యథాశక్తి రాజును ప్రశంసింతురు. సాధువు, కుశలుడు (బుద్ధిమంతుడు) సుశీలుడు, ఈశ్వరాంశ సంభూతుడైన రాజు అందఱి ప్రశంసలను విని, వారి వారి మాటలతీరుతెన్నులను, భక్తి విశ్వాసములను, ఉద్దేశ్యములను గమనించి, మృదుమధురవచనములతో యథాయోగ్యముగ వారిని ఆదరించును. సాధారణ రాజు విషయమే ఇట్లుండగా జ్ఞానస్వరూపుడు, కోసలరాజైన శ్రీరామచంద్రునిగూర్చి ఇక చెప్పనేల? నిర్మల భక్తితో శ్రీరాముడు ప్రసన్నుడగును. కాని ప్రపంచములో నన్ను మించిన మూర్ఖుడు గాని మలిన బుద్ధిగాని ఎవ్వడుండును? (చౌ॥ 1-6)

ఐనను దయామయుడైన శ్రీరామచంద్రప్రభువు అల్పసేవకుడనైన నాప్రేమను భక్తిని తప్పక ఆదరించును. ఏలనన ఆయన రాళ్లను ఓడలుగా వానర భల్లూకములను బుద్ధిమంతులైన మంత్రులుగా చేసిన మహాప్రభువు. "అట్టి మహానుభావునకు ఈ అల్పుడైన తులసీదాసు సేవకుడు - అని అందఱును పలికెదరు. దానిని నేను సిగ్గువిడిచి అంగీకరించుచున్నాను. కృపాళువైన ఆ మహా ప్రభువు ఈ నిందను గూడ సహించును. మహాప్రభువైన ఆ రామచంద్రుడెక్కడ? అల్పసేవకుడైన ఈ తులసీదాసు ఎక్కడ? (దో॥ 28. క,ఖ)

నా అపోహలు, దోషములు కుప్పలుతెప్పలు. నా పాపములను విని, నరకముగూడ ముఖముచాటేసినది. దీనిని తలచుకొన్న కొలదియు, నాకు మిథ్యాభయము కలుగుచున్నది. కాని శ్రీరామచంద్రుడు స్వప్నములో గూడ నా దోషములను తలంపడు. పైగా ఆ ప్రభువు నన్ను గూర్చి విని, సహృదయ నేత్రములతో చూచి, నా భక్తిని, బుద్ధిని ప్రశంసించును. నా వాక్కులలో దోషములు ఉండవచ్చును, కాని హృదయము మాత్రము నిర్మలము. శ్రీరాముడు ఈ దాసునిహృదయమును గ్రహించి ప్రసన్నుడగును. శ్రీరామచంద్రునిహృదయమున దాసుల తప్పిదములకు చోటే ఉండదు. వారిహృదయ నిర్మలత్వమును వందలసార్లు స్మరించుచుండును. ఏ పాపకృత్యమునకు శిక్షగా వేటగానివలె ప్రభువు వాలిని సంహరించెనో సుగ్రీవుడు గూడ ఆ దోషమునే చేసెను. ఒక విధముగా విభీషణుడు గూడ తప్పిదమునే చేసెను. కాని శ్రీరాముడు వారి దోషములను కలలోగూడ పట్టించుకొనడు. పైగా రఘునాథుడు భరతుని కలిసినప్పుడు వారిని గౌరవించి, నిండుసభలో వారి గుణములను ప్రశంసించెను. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్ర ప్రభువు చెట్లక్రింద కూర్చొని యుండగా వానరుల మూకలు కొమ్మలపై ఎగురుచుండెను. (మర్యాదాపురుషోత్తముడు, సచ్చిదానంద ఘన పరమాత్మయైన శ్రీరాముడెక్కడ? శాఖామృగములైన వానరములెక్కడ?) ఐనను ప్రభువు వాటికి తనతో సమానమైన స్థానమునిచ్చెను. తులసీదాసు పలుకుచున్నాడు. శ్రీరామచంద్రునితో సమానులగు దయాశీలురెవ్వరును లేరు. ఓ రామా ! నీ దృష్టిలో ఉత్తముడైనవాడు అందఱిదృష్టిలోను ఉత్తముడే యగును. ఇది సత్యమైనచో తులసీదాసునకు సర్వదా హితమే జరుగును - ఇట్లు నా గుణదోషములను పేర్కొని, అందఱికిని ప్రణామము లాచరించి, కలికల్మషాపహారియైన శ్రీరాముని నిర్మల యశమును ప్రస్తుతించెదను. (దో॥ 29. క,ఖ,గ).

యాజ్ఞవల్క్యముని భరద్వాజమహర్షికి చెప్పిన మనోహరగాథను నేను మీకు తెల్పెదను. సజ్జనులారా! సావధానులై విని ఆనందించుడు. శివుడు ఈ మంజులగాథను రచించి, దయతో పార్వతీ దేవికి వినిపించెను. మఱల అదే కథను శివుడు రామభక్తుడైన కాకభుశుండిని అర్హునిగా తలంచి, అతనికి విన్పించెను. అతడు యాజ్ఞవల్క్య మునికి తెల్పెను. ఆముని మఱల దానిని భరద్వాజమునికి వినిపించెను. వక్తశ్రోతలు ఐన వీరిద్దఱు సచ్ఛీలురు, సమదర్శనులు, శ్రీహరి లీలలను తెలిసిన వారు, విజ్ఞానులు. త్రికాలములును వీరికి కరతలామలకములు. ఇతర భక్తులుగూడ ఈ చరితమును అనేక విధములుగా చెప్పి, విని ఆ లీలలను గ్రహించెదరు. (చౌ॥ 1-4)

నేను అదే కథను వరాహక్షేత్రమున నా గురుదేవులద్వారా వినియుంటిని. అప్పుడు నేను బాలుడనగుటచే దీనిని సరిగా గ్రహింపలేక పోయితిని, శ్రీరామునిగాథ అతినిగూఢమైనది. శ్రోత, వక్త ఇరువురును జ్ఞాననిధులై యుండవలెను. కలియుగ పాపగ్రస్తుడను, మూఢుడను అగు నాకు ఇదియెట్లు బోధపడును? (దో॥ 30. క,ఖ)

ఐనను గురువు గారు మాటి మాటికిని దీనిని చెప్పుటచే నేను నా బుద్ధిననుసరించి, కొద్దిగా గ్రహింప గలిగితిని. అదే కథను సరళమైన భాషలో కవితాబద్ధము చేసి, ఆనందించెదను. నా అల్పమైన బుద్ధి వివేకములతో శ్రీహరి ప్రేరణతో వ్రాయుదును. నేను రచింపబోవుకథ నా సందేహములను, అజ్ఞానమును, దోషములను నివారించి, సంసారసాగరమును దాటించునావగా ఉపయోగపడును. శ్రీరామకథ పండితులకు శాంతిని చేకూర్చును. అందరికిని ఆనందమును ఇచ్చును. కలికల్మషములను హరించును. కలియుగమనెడి సర్పమునకు రామకథ నెమలివంటిది. వివేకాగ్ని ప్రభవింపజేయుటకు అరణి (నిప్పును పుట్టించు కట్టె) వంటిది. శ్రీరామకథ కలియుగమున కామధేనువు, సజ్జనులపాలిటి సంజీవని, అవనిపై అమృతవాహిని, జననమరణభయమును నిర్మూలించునది, భ్రమలనెడికప్పలకు సర్పమువంటిది, నరకయాతనలను కలిగించు అసురులను తుదముట్టించి, ఇది సాధురూపులైన దేవతలను రక్షించుటలో దుర్గవంటిది. శ్రీరామకథ సజ్జనసమాజమనెడి క్షీరసాగరమునకు లక్ష్మీదేవివంటిది. విశ్వభారమును వహించుటలో పృథ్వివంటిది. యమదూతలను పాఱద్రోలుటలో యమునానదివంటిది. జీవులకు ముక్తిని ప్రసాదించుటలో కాశీక్షేత్రము వంటిది. శ్రీరామునకు తులసివలె ప్రియమైనది. తులసీదాసునకు తల్లియైన 'హులసి' వలె మనఃపూర్వకముగా హితకారిణి. శ్రీరామకథ శివునకు ప్రియమైన నర్మదవంటిది. ఇది సకల సిద్ధులను, సుఖ సంపదలను అనుగ్రహించునది. సజ్జనులకు దేవమాతయైన అదితివంటిది. శ్రీరఘునాథుని ప్రేమవాత్సల్యములకు ఈ కథ పరమసీమ. (1-7)

శ్రీరామకథ మందాకినీ నది. భక్తుల నిర్మలహృదయము చిత్రకూటపర్వతము. గాఢమైన ప్రేమయే వనము. అందులో సీతారాములు విహరింతురు. (దో॥ 31)

శ్రీరామునికథ ఒక దివ్యచింతామణి వంటిది. అది సత్పురుషులసద్బుద్ధియనెడి స్త్రీకి అలంకారము. శ్రీరామునికల్యాణగుణసమూహము జగత్కల్యాణకారకము. అది ధర్మబుద్ధిని, సంపదలను, సంసారబంధవిముక్తిని, పరమధామమును ప్రసాదించును. ఇది జ్ఞాన వైరాగ్య యోగములకు సద్గురువు. సంసారరూపభీకరరోగములను నివారించుటలో దివ్యవైద్యులైన అశ్వినీ కుమారుల వంటిది. సజ్జనులకు ఆ గుణసమూహము ఆదివ్యదంపతులపై భక్తివిశ్వాసములను ఉత్పన్నము చేయును. ఫలితముగా సీతారాములు ప్రేమతో వారిని తల్లిదండ్రులవలె పోషించి, పాలింతురు. సమస్త వ్రత ధర్మనియమములకు బీజము ఆ గుణసమూహము. అది (గుణసముహము) పాపసంతాప శోకములను రూపుమాపును, ఈ లోకమునందును, పరలోకమునందును మనలను రక్షించును. జ్ఞాన మనెడి రాజునకు కుశలుడైన మంత్రి వంటిది, సేనాని వంటిది, లోభమను సముద్రమును ఆపోసనము పట్టు అగస్త్యుని వంటిది. శ్రీరాముని గుణములు కామక్రోధాది పాపములనెడి ఏనుగుల సమూహమును అంతమొందించు సింహ కిశోరములు. శ్రీరామచరిత్రము త్రిపురారియైన పరమేశ్వరునకు పూజ్యమైన, ప్రియతమమైన అతిథి వంటిది. ఆయన గుణగణములు దారిద్ర్యదావాగ్నిని రూపుమాపి, కోరికలనుదీర్చుమేఘసమూహము. విషయరూపసర్పములవిషమును నిర్మూలించు మహామంత్రములు, మణులు. లలాటలిఖితమైన అనివార్యదుష్కృతప్రారబ్ధకర్మములను పూర్తిగాతుడిచివేయునట్టివి. అవి అజ్ఞానాంధకారమును మటుమాయమొనర్చు సూర్యకిరణములు, సేవకులనెడి పైరుపంటలనుపోషించుజలధరములు. శ్రీరామచరితము మనోవాంఛలనీడేర్చుటలో కల్పవృక్షము, సేవించు వారికి అది హరిహరులవలె సులభము, సుఖప్రదము. సుకవుల మనస్సులనెడి శరదాకాశమున ప్రకాశించు నక్షత్ర సముదాయము. భక్తులకు అది జీవన సర్వస్వము, సంపూర్ణ పుణ్యఫల స్వరూపము, పరమానందదాయకము. లోకహితమునుగూర్చుటలో సజ్జనతుల్యము. భక్తుల మనస్సరోవరములయందు విహరించెడి రాజహంస. సేవించు వారిని పునీతులను గావించు గంగా తరంగమాల. (1-7)

కలియుగమునందలి దుర్మార్గములు, వితండ వాదములు, అధర్మాచరణములు, కపటములు, దంభములు, పాషండత్వము అనెడి కట్టెలను భస్మమొనర్చుటలో రామచంద్రుని గుణసమూహము ప్రచండాగ్నివంటిది. రామ చరితము అందఱికిని సమానముగా సుఖములనుగూర్చుటలో నిండు పున్నమనాటి వెన్నెలవంటిది. వెన్నెల కలువపూవులకును, చకోరపక్షులకును మిక్కిలిహాయిని గూర్చునట్లు ఈ చరితము భక్తులకు ప్రత్యేకముగా శుభపరంపరను గూర్చును. (దో॥ 32. క,ఖ)

పార్వతీదేవి పరమశివుని ప్రశ్నించిన విషయములను, పరమేశ్వరుడు ఆమెకు ఇచ్చిన సమాధానములను, ఒక విచిత్ర కథా ప్రబంధముగా వ్రాసి, గానము చేసెదను. ఈ కథను ఇదివరలో వినని వారు ఆశ్చర్య పడవలదు. దీనిని వినెడి జ్ఞానులు "జగత్తునందు రామకథలు అనంతములు." అని విశ్వసింతురు. అందులకు ఆశ్చర్యపడరు. శ్రీరామచంద్రుని అవతారములు అనేకములు. రామాయణములు అసంఖ్యాకములు. మహామునులు వేర్వేఱు కల్పములలో శ్రీహరి గాధలను వివిధములుగా వర్ణించిరి. ఈ విషయమును మనస్సులలో ఉంచుకొని నిస్సందేహముగా ఈ కథను భక్తిశ్రద్ధలతో ఆలకింపుడు. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రుడు అనంతుడు. ఆయన గుణములు అనంతములు, కథలు అపరిమితములు. నిర్మల మనస్సుతో వినినవారికి ఇది ఆశ్చర్యమును గొలుపదు. (దో॥ 33)

ఈ విధముగా సంశయములనన్నింటిని దూరమొనర్చుకొని నా గురుపాదుల పాదపద్మరజమును శిరమున దాల్చి, మఱల అందఱికిని అంజలి ఘటించి, నా ఈ కథా రచనలో దోషములు దొరలకుండుటకై ప్రార్థించెదను. మహేశ్వరునకు సాదరముగా ప్రణమిల్లి, శ్రీహరి పాదములచెంత నా శిరమును చేర్చి 1631 వ సంవత్సరమున (క్రీస్తుశకము 1574) పవిత్ర రామకథను తెల్పుచున్నాను. చైత్ర శుద్ధ నవమీ మంగళవారమునాడు అయోధ్యా నగరమున ఈ కథారచన ప్రారంభమాయెను. శ్రీరాముని జన్మదినమునాడు సర్వతీర్థములు అయోధ్యను చేరుకొనునని వేదములు తెల్పుచున్నవి. ఆనాడు అసురులు, నాగులు, పక్షులు, మానవులు, మునులు, దేవతలు వచ్చి, శ్రీరఘునాథుని సేవింతురు. బుద్ధిమంతులు రామజన్మ మహోత్సవమును జరిపి, ఆయన కీర్తిని గానము చేయుదురు. (చౌ॥ 1-4)

ఆనాడు సజ్జనులు గుంపులుగుంపులుగా వచ్చి, పవిత్రసరయూనదిలో స్నానముల నాచరింతురు. శ్రీరాముని శ్యామ సుందరాకారమును మనస్సున ధ్యానించి, ఆయన నామమును జపించెదరు. (దో॥ 34)

సరయూనది దర్శనము, స్పర్శ, స్నానము, జలపానము పాపములను హరించునని వేదములును, పురాణములును తెలుపుచున్నవి. ఈ నది అతి పవిత్రము. దీని మహిమ అనంతము. విద్యా స్వరూపిణియైన సరస్వతీదేవియు ఈ నదీమహిమను వర్ణింపజాలదు. పరమశోభలకు నిలయమైన అయోధ్యా నగరము శ్రీరామచంద్రునిపరమధామమును ప్రసాదించును. ఇది లోకప్రసిద్ధము, పవిత్రము. అయోధ్యలో అసువులు వీడినచో చతుర్విధములైన ప్రాణులకును జన్మరాహిత్యము సిద్ధించును. అయోధ్య సర్వవిధ మనోహరము. సకలసిద్ధిప్రదము, మంగళకరము. అందువలన నిర్మలమైన రామకథారచనకు ఇచటనే శ్రీకారము చుట్టితిని. దీనిశ్రవణమాత్రమున కామ, మద, దంభములు మాయమైపోవును. ఈ కథ 'రామచరితమానసము' అనునామముతో విలసిల్లును. (శ్రీరామచరితమనెడి మానససరస్సు.) దీనిని వినినంతనే మనశ్శాంతి లభించును. దావానలములో ఏనుగువలె విషయవాంఛలలో మలమలమాడిపోవుమనస్సు ఈ సరస్సులో మునింగినంతనే ప్రశాంతికి నోచుకొనును. మునులకు మనఃప్రీతికరమైన పవిత్రరామచరితమానసము పరమేశ్వర రచితము. ఇది త్రివిధ దోషములను, దుఃఖములను, దారిద్ర్యములను పాఱద్రోలును. కలికల్మషములను రూపుమాపును. శివుడు దీనిని తనమనస్సున గుప్త మొనర్చి, తగిన సమయమున పార్వతీదేవికి తెల్పెను. ఈ రామచరితమును శివుడు తనమనస్సులో నిల్పుకొని

ప్రసన్నుడాయెను. కనుక దీనికి "రామచరిత మానసము' అనుపేరు ఏర్పడెను. సుఖదము, సుందరము ఐన ఆ కథను తెల్పుదును. సజ్జనులారా ! సాదరముగా మనస్సులను నిలిపివినుడు. (చౌ॥ 1-7)

ఈ కథాస్వరూపస్వభావములెట్టివి? ఇదియెట్లు రచింపబడినది? ఏ విధముగా ప్రసిద్ధి వహించినది? ఈ విషయములను అన్నింటిని శ్రీ గౌరీ శంకరులను స్మరించుచు విన్నవించెదను. (దో॥ 35)

పరమేశ్వరానుగ్రహము తులసీదాసుపై ప్రసరించినది. తత్ప్రభావమున అతని హృదయమున మధుర భావనలు పెల్లుబికినవి. ఆకారణముగ తలసీదాసు 'రామచరిత మానసము' నకు కవి అయెను. అతడు తనబుద్ధినిఅనుసరించి యథాశక్తి ఈ మనోహరరచన కావించెను. సత్పురుషులారా ! సహృదయులై దీనిని విని, ఆనందించి ఆదరింపుడు. సద్బుద్ధియేభూమి, హృదయము లోతైన స్థానము. వేదపురాణములు సముద్రములు. సాధుజనులనెడి మేఘములు స్వచ్ఛమై, మధురమై, మనోహరమై, శుభప్రదమైన శ్రీరామయశోవైభవమనెడి వర్షమును కురిపించును. ఈ సజ్జనులు వర్ణించు సగుణస్వరూపుడైన భగవంతుని యొక్క లీలలు శ్రీరామునియశోరూపనిర్మలజలములు. ఇవి కలికల్మష పంకములను తొలగించును. వర్ణనలకు అందని ప్రేమపూరితమైన భక్తి ఆ చల్లని నీటిమాధుర్యము. శ్రీరామకథయనెడి జలము పుణ్యకర్మలనెడి పంటపొలాలకు ప్రాణప్రదము. శ్రీరామభక్తులకు అదియే జీవనము. ఈ పవిత్రమనోహరజలము బుద్ధియనెడి భూమిపై బడును. ఆ జలము ఒక చోటచేరి చెవులనెడి చక్కనికాల్వలలోపలికి ప్రవేశించి హృదయములయందు నిలిచిపోవును. అచ్చట చిరకాలము స్థిరముగా నుండి స్వచ్ఛమై, శీతలమై, రుచికరమై, సుఖ ప్రదమగును. (చౌ॥ 1-5)

ఈ రామచరితమానసములో మనోహరముగా వర్ణింప బడిన నాలుగు సంవాదములు ఈ (మానస) సరోవరమునకు పవిత్ర సుందర స్నానఘట్టములు. 1. భుశుండీ-గరుడుల సంవాదము. 2. శివపార్వతుల సంవాదము. 3. యాజ్ఞవల్క్య-భరద్వాజుల సంవాదము. 4. తులసీదాసు-ఇతర సాధువుల సంవాదము. (దో॥ 36)

ఇందలి 7 (ఏడు) కాండములు మానససరోవరమునకు మెట్లు. వీటిని జ్ఞాన నేత్రములతో చూచినంతనే మనస్సు ప్రసన్నమగును. శ్రీ రఘుపతి యొక్క గుణాతీతమైన అపారమహిమ సరోవరజలములవలె గంభీరమైనది. ఇందు వర్ణితమైనసీతారాములయశస్సు అమృతప్రాయమైనజలము. ఉపమాలంకారములు మనోహర తరంగములు. చౌపాఈలు కలువపూవులు. వివిధకవితారీతులు ఇందలి మనోహరములైన ముత్యపుచిప్పలు, సుందరఛందస్సులు, సోరఠాలు, దోహాలు వివిధమైన వన్నెచిన్నెలతో విరాజిల్లు కమలసందోహములు. అనుపమార్థములు, మహోన్నత భావములు, భాషామధురిమలు ఇందలి పరాగమకరంద సుగంధములు. పవిత్రవృత్తాంతములు తుమ్మెదలగుంపులు. జ్ఞానవైరాగ్యవిచార చర్చలు రాయంచలు. కవితా ధ్వనులు, వక్రోక్తులు, గుణ జాతులు వివిధములగు మనోహర మత్స్యములు. ధర్మార్థ కామమోక్షములు, జ్ఞాన విజ్ఞాన చర్చలు, కావ్యమునందలి నవరసములు, జపతపములు, యోగ వైరాగ్య ప్రసంగములు ఇవి యన్నియును ఈ సరోవరమునందలి సుందరజలచరములు. పుణ్యాత్ముల, సాధువుల, శ్రీరామనామములవర్ణనలు ఇందలి జలపక్షులు, సాధుజనులసమావేశములు నాలుగు వైపులనున్న మామిడి తోపులు. శ్రద్ధ వసంత ఋతువుతో సమానము, నానావిధ భక్తిరీతులు, క్షమ, దయ, ఇంద్రియ నిగ్రహము - అనెడిగుణములు ఇందలి లతావితానములు. మనోనిగ్రహము, యమనియమములు ఇందలి పుష్పములు. జ్ఞానమే ఫలము, శ్రీహరిచరణ కమలములపైగల భక్తియే ఈ జ్ఞాన ఫలరసము-అనునవి వేద ప్రతిపాదిత విషయములు. సందర్భానుసారముగా ప్రస్తావింపబడిన ఇతరవిషయములు, కథలు శుకపికాది వివిధవర్ణపక్షులు. (చౌ॥ 1-8)

ఈ కథా శ్రవణమువలనగలుగు రోమాంచము సుందర పుష్పవాటిక లేక ఉద్యానవనము. సుఖమే ఇందలిపక్షులవిహారము. నిర్మలమైనమనస్సే తోటమాలి. అతడు తనసుందరనేత్రములనెడి కుండల ద్వారా ప్రేమ యనెడి జలములతో ఈ తోటను తడుపును. (దో॥ 37)

ఈ కథను గానము చేయువారు ఈ సరోవరమునకు రక్షకులు. దీనిని సాదరముగా వినెడి స్త్రీ పురుషులు ఈ సరోవరమునకు అధికారులైన ఉత్తమదేవతలు. అత్యంత దుష్టులు, విషయలోలురు, కొంగలు, కాకుల వంటివారు. వారు ఈ సరోవరప్రాంతమునకురారు. ఏలనన ఇందు నత్తలు, కప్పలు, నాచువంటి విషయవాంఛాప్రసంగములే లేవు. అందువలన కాకులు, కొంగల వంటి విషయాసక్తులైన దౌర్భాగ్యులు ఈ సరోవరముయొక్క దరిదాపులకు గూడ రాజాలరు. ఈ సరోవరమును చేరుట వారికి మిగుల కష్టము. శ్రీరామునికృప లేనిదే ఎవ్వరూ ఈ సరస్సును చేరలేరు. దుష్ట సహవాసము భయంకరమైన చెడు మార్గము. ఈ దుష్టుల వచనములు పులులు, సింహములు, సర్పముల వంటివి. సాంసారికములైన వివిధకార్యకలాపములు దుర్గమపర్వతములు. మోహము, మదము, అభిమానము అనునవి గహనారణ్యములు, వివిధములైన కుతర్కములు భయంకరములైన నదులు. (చౌ॥ 1-5)

శ్రద్ధయను దారి బత్తెము, సాధు జనుల సాంగత్యము, శ్రీరామచంద్రునియెడ భక్తి అనునవి లేనివారికి ఈ మానససరోవరము చేరవీలులేనిది. (దో॥ 38)

ఎవ్వడైనా పెక్కు కష్టముల కోర్చి, ఆ సరోవరమును సమీపించినను, అచ్చటికి వెళ్లినంతనే నిద్రయను చలిజ్వరము పట్టుకొనును. హృదయములో మూర్ఖత్వమనెడివణకు పుట్టును. అందువలన అచటికి చేరియు ఆ దురదృష్టవంతుడు ఆ మానససరోవరమున స్నానము చేయలేడు. ఈ మానససరోవరమున స్నానమాడుటకును, నీరు త్రాగుటకును అశక్తుడై అభిమానముతో మఱలి పోవును. ఎవ్వరైనను ఈ సరస్సునుగూర్చి అడిగినచో, దానిని నిందించుచు అతడు తనచర్యను సమర్థించుకొనును. కాని శ్రీరామచంద్రుని కృపాదృష్టికి పాత్రులైనవారు ఈ విఘ్నములను (ఇబ్బందులను) అధిగమించెదరు. భక్తి విశ్వాసములతో (సాదరముగా) ఈ సరోవరమున స్నానమాడెడివారు ఆధ్యాత్మిక - ఆదిదైవిక - ఆది భౌతికములైన తాపత్రయముల నుండి రక్షింపబడుదురు. సోదరులారా ! శ్రీరామ చరణ కమలములపై అనన్యభక్తిగల వారు ఈ సరస్సును ఎన్నడును, ఏ విధముగను విడువరు. ఇందు స్నానము చేయగోరెడి వారు శ్రద్ధతో సజ్జనసాంగత్యము చేయవలెను. ఇట్టి మానససరోవరమును మనోనేత్రములతో గాంచి, అందు మునుకలువేసినందున ఈ కవి (తులసి) బుద్ధి నిర్మలమైనది. హృదయము ఉత్సాహభరితమై ప్రేమానందములలో మునిగితేలెను. అట్టి సరస్సునుండి శ్రీరామ యశోవైభవమను జలధార ప్రవహించెను. ఈ నది పేరే సరయు. ఇది సకలశుభములకు కూడలి. లౌకిక వైదిక మతములు రెండును దీని సుందర తీరములు. మనోహరమానససరోవరపుత్రికయైన ఈ పవిత్రసరయూనదీప్రవాహమున చిన్నచిన్న గడ్డిపోచలవంటివియును, పెద్దపెద్ద మహావృక్షములవంటివియును ఐన కలియుగమహాపాపములన్నియును సమూలముగా కొట్టుకొనిపోవును. (చౌ॥ 1-7)

ఈ నదీతీరమునగల పల్లెలు, పట్టణములు, నగరములు మూడు విధములైనశ్రోతలకు నివాసస్థానములు. వీటిలో సాధుసమాజ సమంచితమై నిరుపమానమైన అయోధ్య సమస్త శుభములకును ఆలవాలము. (దో॥ 39)

సద్యశోమూర్తియైన సరయూనది శ్రీరామభక్తి యనెడి సురనదియైన గంగను జేరును. అనంతరము అనుజుడైన లక్ష్మణునితో గూడిన శ్రీరాముని యొక్క ప్రతాపయశోరూపమైన శోణనదము వీటితో చేరును. సరయూ శోణనదులతో కూడిన గంగ జ్ఞాన వైరాగ్యములతో గూడిన భక్తివలె విలసిల్లు చుండును. భవతాపహారిణులైనమూడునదీప్రవాహములును ఒక్కటిగా శ్రీరాముడనెడి సాగరమును జేరును. శ్రీరాముని యశస్సు అనెడి సరయూనది శ్రీరామ చరితమను మానస సరోవరము నుండి బయలుదేఱినది. పైగా రామభక్తియనెడి గంగాస్రోతస్సులో గలసినది. కావున దీనిని వినినసజ్జనులమనస్సులు పవిత్రములగును. మధ్యమధ్యనవచ్చు వివిధ కథలు, ఈ నదీతట సమీపమునగలతోటలు,వనములు, పార్వతీపరమేశ్వరులవివాహ మహోత్సవమును చూడవచ్చిన అతిథులు ఇందలి (ఈ ప్రవాహమునందలి) వివిధములైన అసంఖ్యాక జలచరములు. శ్రీరాముని జన్మదిన శుభాకాంక్షలు నదీ తరంగ శీకరములు. (చౌ॥ 1-4)

నలుగురు దివ్యసోదరుల బాల్యలీలలే రామకథయనెడి గంగయందుగల రంగురంగుల కమలములు. దశరథ మహారాజు, అతని రాణులు, కుటుంబ సభ్యుల పుణ్యములే తుమ్మెదలు, జల పక్షులు. (దో॥ 40)

శ్రీ సీతాదేవి స్వయంవరమనెడి సుందర కథయే ఈ నదికి శోభావహము. వివేకపూరితములైన అనేకప్రశ్నలు ఇందలిపడవలు, వివేక యుక్తములైన వాటిసమాధానములే సమర్థులైన నావికులు. ఈ కథా శ్రవణానంతరము జరుగు చర్చలే యశస్సు అనెడి సరయూ తీరమున సాగిపోవుయాత్రికులు. వారితో ఈ నదీశోభలు ఇనుమడించు చున్నవి. పరశురామునికోపము ఇందలిభయానకమైన ప్రవాహము. శ్రీరాముని శ్రేష్ఠములైన వచనములు సుబద్ధ ఘట్టములు. శ్రీ రాముని, అతని సోదరుల వివాహ మహోత్సవములు ఈ నదీ ప్రవాహపు ఉచ్చల తరంగములు. ఇవి తమ ఇంపు సొంపులతో అందఱికిని హాయిని గూర్చును. ఈ మహోత్సవములు శ్రోతలను వక్తలను హర్షపుల కాంకితులను జేయును. ఈ నదియందు ఓలలాడువారే పుణ్యాత్ములు. శ్రీరామునియువరాజపట్టాభిషేకమునకు చేయు ఏర్పాట్లు ఈ పర్వదినమున నదీతీరమున జేరిన యాత్రికుల సమూహములు. కైకేయి దుర్బుద్ధియే తీరములయందుగల నాచు. దాని వలన ఘోర విపత్తు సంభవించుట సహజము. (చౌ॥ 1-4)

ఉత్పాతములను అన్నింటిని శాంతపఱుచు భరతునిచరిత్రము నదీతీరమున ఆచరింపబడు జప యజ్ఞము. కలియుగపాపములనుగూర్చియు, దుష్టుల అవగుణములనుగుఱించియు చేయబడిన వర్ణనలు ఈ నదియందలి మలినములు, కాకులు, కొంగలు. (దో॥ 41)

శ్రీరామునివైభవమనెడి ఈనది ఆఱుఋతువులయందును, అన్ని వేళలయందును శోభాయమానముగా ఉండును. శివపార్వతులవివాహము హేమంతఋతువు. శ్రీరాముని జన్మదినోత్సవము సుఖదాయకమైన శిశిరఋతువు. శ్రీరామునివివాహమహోత్సవవర్ణన ఆనందమంగళప్రదమైన ఋతురాజైనవసంతము. శ్రీరామునివనవాసగమనము దుస్సహమైనగ్రీష్మఋతువు. వనవాసనమయకథలు తీవ్రవాతాతపములు. భయంకరముగా రాక్షసులతోచేసినయుద్ధములు వర్షఋతువు. ఇది పంటపొలాలకు వర్షములవలె దేవతల పాలిటి వరప్రసాదము. శ్రీరాముని రాజ్య పాలనమునందలి సుఖము, వినమ్రత, వైభవము అనునవి నిర్మలమైన, మనోహరమైన, సుఖప్రదమైన శరదృతువు. పతివ్రతాశిరోరత్నమైన సీతాదేవివర్ణన ఈ నదీజలములనిర్మలత్వము, అపురూపమైన గుణము. భరతుని స్వభావము వర్ణనాతీతమైన నదీ శీతలత్వము. (చౌ॥ 1-4)

నలుగురుసోదరులు పరస్పరము చూచుకొనుట, మాట్లాడుకొనుట, కలియుట, ప్రేమించుట, నవ్వుకొనుట మొదలైన వారియొక్క భ్రాతృప్రేమ రీతులు ఈ నీటి మధురిమలు, సుగంధములు. (దో॥ 42)

నా ఆర్తి, ప్రార్థన, దైన్యము - ఇవియన్నియును నిర్మలములైన ఈ నదీజలముల లఘుత్వమునకు చిహ్నములు. ఈ జలమును గూర్చి విన్నంత మాత్రముననే అది గుణమునిచ్చును. ఇది దాని వైశిష్ట్యము. ఆశాదాహమును, మనోమాలిన్యమును తొలగించును. ఈ జలము శ్రీరామభక్తికి పుష్టిని గూర్చును, కలియుగసమస్తపాపములను, మనస్తాపములను హరించును. జననమరణరూపభవబంధములను త్రుంచి వేయును. సంతోషమునకే సంతసమును గూర్చును. పాప, తాప, దారిద్ర్యములను నశింప జేయును. ఈ నీరు కామక్రోధ లోభ మోహ మద మాత్సర్యములను పాఱద్రోలి, నిర్మలజ్ఞానవైరాగ్యములను పెంపుజేయును. సాదరముగా (భక్తిశ్రద్ధలతో) స్నాన పానములొనర్చిన వారి హృదయములయందలి పాప తాపములను హరించును. శ్రీరాముని యశస్సు అనెడి ఈ నదీజలములతో తమహృదయములను క్షాళనము చేసికొననివారు పిరికివారు. కలి(కాల) ప్రభావమునకు లోనగుదురు. అట్టి జీవులు విషయ వాంఛలకై అఱ్ఱులుచాచుచు మృగతృష్ణకై ఆరాటముతో పరుగులుతీయుజింకలవలె నిరాశోపహతులగుదురు. (చౌ॥ 1-4)

# యాజ్ఞ వల్క్య భరద్వాజ సంవాదము

ఈ ఉత్తమ జలములగుణములను బుద్ధికి అందినంత వఱకు కొనియాడి, ఆ జలములయందు మానసస్నానమునాచరించి, శివపార్వతులను సంస్మరించి, తులసీదాస కవి ఈ మనోజ్ఞమైన కథను వినిపించు చున్నాడు. శ్రీరఘురాముని చరణకమలములను నా హృదయమున నిడుకొని, ఆయన దయకు పాత్రుడనై మునిశ్రేష్ఠులైన యాజ్ఞవల్క్య భరద్వాజుల సంవాదమును తెల్పెదను. (దో॥ 43. క,ఖ)

భరద్వాజముని ప్రయాగనివాసి. ఆయనకు శ్రీరాముని పాద పద్మములపై మిక్కిలి మక్కువగలదు. ఆయన తపస్వి, శమ, దమ, దయానిధానము, పరమార్థ మార్గమున చక్కనికుశలుడు. మాఘమాసమున సూర్యుడు మకరరాశిలో ప్రవేశించినప్పుడు[1] జనులందఱును తీర్థరాజమైన ప్రయాగను దర్శింతురు. దేవతలు, దైత్యులు, కిన్నరులు, మనుష్యులు, అందఱును సాదరముగా గంగా యమునా సరస్వతీ నదుల త్రివేణీ సంగమమున స్నానములనాచరింతురు. వారు ప్రయాగ తీర్థరాజ స్వామియైన వేణీ మాధవుని పాదపద్మములను పూజించి, అక్షయవటమును సేవించి, పులకాంకితులయ్యెదరు. భరద్వాజాశ్రమము అతిపవిత్రమైనది, రమణీయమైననది, మునీశ్వరులకు మనోజ్ఞమైనది. తీర్థరాజమైన ప్రయాగలో స్నానమాచరించిన ఋషులు, మునులు ఈ భరద్వాజాశ్రమమున సభచేయుదురు. ప్రాతఃకాలమున ఉత్సాహముతో స్నాన సంధ్యలనాచరించి, వారు పరస్పరము శ్రీహరిగుణ విశేషములను గూర్చి ముచ్చటించు కొందురు. (చౌ॥ 1-4)

మునులు తమ గోష్ఠులయందు బ్రహ్మనిరూపణము, ధర్మ విధానములు, తత్త్వ విభాగములు (వేదాంత, కర్మమీమాంసా, సాంఖ్య దర్శనములు) చర్చించెదరు. జ్ఞాన వైరాగ్యములతో గూడిన భక్తిని గూర్చియు ముచ్చటింతురు. (దో॥ 44)

ఈ విధముగా మాఘమాసమంతయు ప్రతి దినము త్రివేణీలో స్నానముల నాచరించి, పిదప తమ తమ ఆశ్రమములకు వెళ్లుదురు. ఈ యానందోత్సవము ప్రతి సంవత్సరము జరుగుచుండును. మకర స్నానములఅనంతరము మునీశ్వరులు తమతమ స్థానములకు చేరుదురు. ఒకానొకసారి మునీశ్వరులందఱును మకరస్నానములఅనంతరము తమఆశ్రమములకు వెళ్లిపోయిరి. కాని భరద్వాజముని పరమజ్ఞానియైన యాజ్ఞవల్క్య మహాముని పాదములకు నమస్కరించి, ఆయనను తనఆశ్రమమున నిల్పుకొనెను. ఆయనపాదపద్మములను సాదరముగా కడిగి, ఉన్నతాసనముపై కూర్చుండ బెట్టి, ఆయన కీర్తిని పొగడి, భరద్వాజుడు మృదు మధురముగా ఇట్లనెను. "ఓ మహాత్మా! మీరు వేదవిదులు. నాకొక సందేహము గలదు. దానిని అడుగుటకు భయము, బిడియము కలుగుచున్నవి. ఇప్పుడు మిమ్ము అడుగకున్నచో మఱల నాకు ఇట్టి అవకాశము లభింపదు. (చౌ॥ 1-4)

ఏ విషయమునైనను గురువుగారికడ దాచినచో నిర్మలజ్ఞానము అబ్బదు- అని వేద పురాణములును, సాధు సజ్జనులును చెప్పియుండుట ప్రసిద్ధమే. (దో॥ 45)

అందువలన నా అజ్ఞానమును మీముందు ఉంచెదను. దయతో నా సందేహములను నివృత్తి చేయుడు. సజ్జనుల, పురాణముల, ఉపనిషత్తుల దృష్టిలో రామనామమహిమ అపారమైనది. కల్యాణ స్వరూపుడు, అవ్యయుడు,

1. ఉత్తర భారతమునందు (వింధ్యకుఉత్తరమునందు) (చైత్రాది) ప్రతిమాసము కృష్ణ పక్షముతో ప్రారంభమగును. ఈ సందర్భమునకు తగినట్లు చెప్పవలెనన్న వింధ్యకు దక్షిణమున ఉండువారు పాటించు పుష్య బహుళ (కృష్ణ)పక్ష పాడ్యమిని వారు (వింధ్యకు ఉత్తరమున ఉండువారు) మాఘ బహుళ (కృష్ణ)పక్ష పాడ్యమిగా భావింతురు. బహుళ (కృష్ణ) పాడ్యమితోనే అక్కడ క్రొత్తమాసము ప్రారంభమగును. అనగా మన మాసము శుక్ల పక్షముతోడను, వారి మాసము కృష్ణ పక్షముతోడను ప్రారంభమగును. కావున మాఘ మాసములో మకరసంక్రాంతి వచ్చుట సంభవమే.

జ్ఞాన గుణ నిధియైన శంకరుడు సర్వదా రామనామమును జపించుచుండును. కాశీలో మృతిచెందెడి చతుర్విధ జీవరాసులకును శంకరుడు రామనామమును ఉపదేశించును. తత్ప్రభావమున ఆ జీవకోటికి మోక్షము లభించును. మహాత్మా! ఈ రాముడెవరు? నాకు విశదముగా తెల్పుడు. ఒక రాముడు అయోధ్యాపతియైనదశరథునికుమారుడు. అతడు భార్యా వియోగముచే మిక్కిలి దుఃఖితుడయ్యెను. కడకు అతడు యుద్ధములో క్రుద్ధుడై రావణుని సంహరించెను. ఆయన వృత్తాంతము జగద్విదితము. (చౌ॥ 1-4)

పరమశివుడు నిరంతరము జపించునది ఈ రాముని నామమేనా? లేక మఱియొక రాముని నామమా? మీరు సత్యవ్రతులు, సర్వజ్ఞులు, దయతో తెల్పుడు. (దో॥ 46)

మహాత్మా! "నాభ్రమనివారణకై మీరు నాకు ఆకథను సవిస్తరముగా తెలుపుడు" - యాజ్ఞవల్క్య మహర్షి చిఱునవ్వుతో ఇట్లనెను. శ్రీరాముని వైభవము మీకు ఇదివఱకే తెలియును. మీరు త్రికరణశుద్ధిగా శ్రీరామభక్తులు. మీ చాతుర్యము నాకు తెలియును. శ్రీరాముని గుణగణములను వినగోరి, తెలియని వానివలె నన్ను ఇట్లు ప్రశ్నించుచున్నారు. నాయనా! ఏకాగ్రచిత్తముతో వినుము. శ్రీరాముని మనోహరకథను వినిపించెదను. మహామోహమనెడిమహిషాసురుని కడతేర్చుటకు శ్రీరామకథ కాళీమాతవంటిది. అది చంద్రుని వెన్నెలవంటిది. దానిని చకోరములవంటి సాధుపుంగవులు నిరంతరము పానముచేయుదురు. ఈ సందేహమునే పార్వతీదేవి ప్రకటింపగా మహాదేవుడు రామకథను విశదముగా వర్ణించెను. (చౌ॥ 1-4)

ఇప్పుడు నేను నాబుద్ధిని అనుసరించి, ఆ శివపార్వతులసంవాదమునే నీకు వినిపించెదను. ఆ సంవాదము ఎప్పుడు ఎందులకు జరిగినదో వినుడు. మునీశ్వరా! మీ సందేహము దూరమగును. (దో॥ 47)

త్రేతాయుగమున ఒకసారి శివుడు అగస్త్యుని యొద్దకు వెళ్లెను. జగజ్జననియు భవపత్నియు ఐన సతీదేవి ఆయనను అనుసరించెను. అగస్త్య మహర్షి సర్వేశ్వరుడైన శంకరుని పూజించెను. ఆ సమయమున మునిశ్రేష్ఠుడైన అగస్త్యుడు శ్రీరామకథను సవిస్తరముగా వినిపించెను. దానిని విని మహేశ్వరుడానందించెను. తర్వాత మహిమాన్వితమైన హరిభక్తిని గూర్చి అగస్త్యుడు శివుని అడిగెను. ఆయనను అర్హునిగా తలచి, శివుడు హరిభక్తి మహత్త్వమును దెలిపెను. ఈ విధముగా హరి గుణములను వినుచు వినిపించుచు శంకరుడు అచట కొంతకాలము గడిపెను. పిమ్మట అగస్త్యుని వీడ్కొని, మహేశ్వరుడు సతీసమేతుడై కైలాసమునకు బయలుదేరెను. అదే సమయమున శ్రీహరి భూభారమునుతొలగించుటకు శ్రీరాముడుగా రఘువంశమున అవతరించెను. పితృవాక్యపరిపాలనకై రాజ్యమును త్యజించి, రామచంద్రప్రభువు దండకారణ్యమున మునివేషముతో సంచరించు చుండెను. (చౌ॥ 1-4)

"నేను శ్రీహరిదర్శనమునుచేసికొనుట యెట్లు? ప్రభువు మాఱు రూపమున అవతరించెను. నేనచటికి వెళ్లినచో ఆయన ఎవరో అందఱును తెలిసి కొందురు" అని మహాదేవుడు ఆలోచించుచు వెళ్లెను. శంకరుని హృదయము ఊగిసలాటకు లోనయ్యెను. సతీదేవికి ఈ విషయము తెలియదు. శంకరునికన్నులు శ్రీహరినిదర్శించుటకు తొందరపడుచుండెను. మనస్సు భయాందోళనలకు గురియయ్యెను. అని తులసీదాసు చెప్పుచున్నాడు.

(దో॥ 48. క,ఖ)

"మానవునిచేతిలోనే తనకు మరణము సంభవించునట్లు రావణుడు బ్రహ్మనుండి వరమును పొందెను. బ్రహ్మ వాక్కును సత్యమొనర్చుట శ్రీహరి కార్యము. నేను ఇప్పుడు వెళ్లి, ఆయనను దర్శింపనిచో తరువాత నాకు పశ్చాత్తాపమే మిగులును-" అను ఆలోచనలు శంకరుని మనస్సులో మెదలుచుండెను. ఇంతలోనే నీచుడైన రావణుడు మారీచుడను రాక్షసుని తన వెంటగొని పోయెను. వెంటనే మారీచుడు మాయలేడిగా మాఱెను. శ్రీహరిశక్తిని ఎఱుగని మూర్ఖరావణుడు మోసముతో వైదేహిని అపహరించెను. మాయామృగమును వధించి, శ్రీరాముడు

లక్ష్మణునితోగూడి, ఆశ్రమమునకు వచ్చెను. ఆశ్రమమున సీతనుగానక దుఃఖపడెను. శ్రీరఘునాథుడు సామాన్యమానవులవలె విరహవ్యాకులుడయ్యెను. సోదరులిరువురును సీతాదేవికై వనమంతయు గాలించిరి. సీతారాముల సంయోగమునకు ఎన్నడును వియోగము అనెడి మాటయే లేదు. అట్టి శ్రీరామునియందు విరహశోకము ప్రత్యక్షముగా కనబడెను. (చౌ॥ 1-4)

శ్రీరఘునాథునిచరిత్ర అతివిచిత్రమైనది. దానిని జ్ఞానులే తెలిసికొనగలరు. మందబుద్ధులు మోహవశమున విపరీతముగా అర్థము చేసికొందురు. (దో॥ 49)

ఆసమయమున శివుడు శ్రీరాముని జూచెను. హరునిహృదయము ఆనందముతో పొంగిపోయెను. శోభానిధియైనశ్రీరాముని శివుడు కన్నులపండువుగాజూచెను. కాని తానెవరో చెప్పుటకు అది సమయముకాదని మిన్నకుండెను. "ఓ జగత్కల్యాణకర్తా! సచ్చిదానందరూపా! నీకు జయమగుగాక" అని పల్కుచు కామారియైన పరమేశ్వరుడు వెళ్ళి పోయెను. కృపాళువైన పరమశివుడు మిక్కిలిహర్షమునుబొందుచు పులకితగాత్రుడై సతీదేవితో వెళ్లుచుండెను. శంకరుని స్థితిని జూచి సతీదేవిమనస్సులో ఒకసందేహము గలిగెను. ఆమె తనలోతాను ఇట్లు ఆలోచించెను. "శివుడు జగత్పూజ్యుడు, విశ్వేశ్వరుడు. దేవతలు, మునులు, మనుష్యులు అందఱును ఆయనకు ప్రణమిల్లుదురు. ఐనను అట్టి శివుడు ఒకరాజకుమారుని 'సచ్చిదానందా! పరంధామా!' అని సంబోధించి, ఆయనకు ప్రణమిల్లెను. ఆయనసౌందర్యమునుజూచి, భక్తిపరవశుడయ్యెను. ఆ పారవశ్యము ఇప్పటి వఱకును తగ్గలేదు. (చౌ॥ 1-4)

## సతీదేవి భ్రమ

సర్వవ్యాపి, మాయాతీతుడు, అజుడు, పూర్ణస్వరూపుడు, నిష్కాముడు, భేదరహితుడు, వేదములకును అగోచరుడైన పరబ్రహ్మ మానవదేహమును ధరించునా? (దో॥ 50)

ఒకవేళ విష్ణుమూర్తి దేవతలను రక్షించుటకు మానవదేహమును దాల్చినచో త్రిపురారియైన శంకరునివలె శ్రీహరియు సర్వజ్ఞుడు గదా! అట్టి జ్ఞాననిధి లక్ష్మీపతి, అసురారి, అజ్ఞానివలె భార్యను వెదకుచు తిరుగునా? మఱి శివుడు సర్వజ్ఞుడనుమాట జగద్విదితము. ఆయన వాక్కు అసత్యము కానేరదు"- ఈ విధముగా ఆమె మనస్సు పరిష్కరింపజాలని సందేహములతో నిండిపోయెను. మోహవశమున ఆమెకు జ్ఞానస్ఫురణ కాలేదు. భవాని మౌనముగా ఉన్నను పరమేశ్వరుడు అంతర్యామిగావున ఆమెమనస్సును తెలిసికొని ఇట్లనెను. "సతీ! నీది స్త్రీస్వభావము. ఇట్టిసందేహములను మనస్సులో ఉంచుకొనరాదు. ఈ రఘురాముడే నాఇష్ట దైవము. అగస్త్యుడు వినిపించినది ఈయనకథనే. నేను వివరించినదియు ఈయనభక్తినిగూర్చియే. మునీశ్వరులందఱును సర్వదా ఈయననే సేవింతురు. (చౌ॥ 1-4)

సర్వవ్యాపకుడైన పరబ్రహ్మ, సమస్తలోకములకు స్వామి, మాయాపతి, పరమస్వతంత్రుడు, నిత్యుడు, ఐన ఆ శ్రీహరియే భక్తరక్షణకై రఘువంశమున శ్రీరాముడై అవతరించెను. మునులు, యోగులు, సిద్ధులు నిరంతరము నిర్మల మనస్సుతో ఆయననే ధ్యానించెదరు. వేదములు, పురాణములు, శాస్త్రములు, "నేతి, నేతి" యని ఆయన వైభవమునే ప్రస్తుతించును. (ఛం॥)

పరమశివుడు పెక్కు పర్యాయములు చెప్పినను ఆ ఉపదేశము సతీదేవి మనస్సున నాటుకొనలేదు. అది విష్ణుమాయయని తెలిసికొని శివుడు చిఱునవ్వుతో ఇట్లనెను. (సో॥ 51)

"నీమనస్సున సంశయమున్నచో, స్వయముగా నీవే వెళ్ళి, పరీక్షించి, సంశయ నివృత్తి ఏలచేసికొనవు? నీవు మఱలివచ్చువఱకు నేను ఈ వటవృక్షచ్ఛాయలో కూర్చొనియుందును. అజ్ఞానము, భ్రమతోగూడిన నీసందేహము

తొలగించుకొను ఉపాయమును గూడ నీవే వివేకముతో ఆలోచించుకొనుము"- పరమశివునిఆజ్ఞను పొందినసతీదేవి అచటనుండి వెడలిపోయెను. శ్రీరాముని దివ్యత్వమును ఎట్లు పరీక్షింపదగును? అని ఆమె ఆలోచింపసాగెను. ఇచ్చట శివుడు ఈ విధముగా ఆలోచింపమొదలిడెను." దక్షపుత్రికయగు సతీదేవికి ఏదియో ఆపద రానున్నది. నేను నచ్చజెప్పినప్పటికిని ఆమెసందేహము దూరము కాలేదు. ఇది విధివైపరీత్యము. దైవ సంకల్పమే జరిగితీరును. నేను ఈ విషయమున ఎక్కువగా ఆలోచింపనవసరము లేదు"- అనుకొనుచు శివుడు శ్రీహరినామజపము చేయుచుఉండెను. సతీదేవిమాత్రము శుభప్రదుడైన శ్రీరాముడున్న చోటికి చేరెను. (చౌ॥ 1-4)

మనస్సులో చాలఆలోచించిన తరువాత సతీదేవి సీతాదేవిరూపమును ధరించి, శ్రీరాముడు వచ్చుమార్గమున ముందుకు నడిచెను. (దో॥ 52)

మాఱువేషమునఉన్న సతీదేవిని జూచి, లక్ష్మణుడు చకితుడై, భ్రమకులోనాయెను. కాని అతిగంభీరుడై అతడు ఏమియు మాట్లాడలేకపోయెను. ధీరుడైన లక్ష్మణుడు శ్రీరాముని మహిమను బాగుగా తెలిసిన వాడు. సర్వదర్శియు, సకలహృదయమర్మజ్ఞుడును, దేవాదిదేవుడునుఐనశ్రీరాముడు సతీదేవిమాఱువేషమును గ్రహించెను. సర్వజ్ఞుడైన శ్రీరామునిస్మరణమాత్రముననే అజ్ఞానము పటాపంచలగును. (యాజ్ఞవల్క్యుడు భరద్వాజ మునితో పల్కుచున్నాడు.) స్త్రీస్వభావము విచిత్రమైనది. సర్వజ్ఞుడైన శ్రీరామునికడనే సతీదేవి తనస్వరూపమును దాచుచున్నది. అంతట శ్రీరాముడుతనమాయా ప్రభావమున నిజమును గ్రహించి, నవ్వి, మృదుమధురముగా ఇట్లనెను. మొట్టమొదట ప్రభువు ఆమెకు అంజలి ఘటించి, తనపేరును, తన తండ్రి పేరును తెలుపుచు ప్రశ్నించెను. "పరమ శివుడెక్కడ? ఒంటరిగా నీవు ఈ అడవిలో సంచరించుటకు కారణమేమి?" (చౌ॥ 1-4)

శ్రీరామునికోమలమైనగూఢవచనములను విని, సతీదేవిహృదయము తల్లడిల్లెను. భయముతో ఆమె చింతాక్రాంతురాలై శివుని యొద్దకు బయలుదేఱెను. (దో॥ 53)

"నేను పరమేశ్వరునిమాటలను పరిగణింపలేదు. నాఅజ్ఞానమును శ్రీరామునిపై ఆపాదించితిని, ప్రదర్శించితిని. నేను శివుని యెదుట ఏమని మాట్లాడగలను?" అని అనుకొనినంతనే ఆమెహృదయమున భయసంతాపములు ఉత్పన్నములాయెను. శ్రీరాముడు సతీదేవిభయాందోళనలను ఎఱింగి, తనమహిమను చూపదలచెను. ప్రయాణించుమార్గములో ఆమె ఒక ఆశ్చర్యకరదృశ్యమును గాంచెను. సీతారామలక్ష్మణులు తనకంటె ముందు పోవుచుండిరి. వెనుకకు మఱలి చూచినప్పుడు అచ్చటను సీతారాములే కనబడిరి. ఎటువైపుచూచినను రామచంద్రప్రభువు సిద్ధులతో మునీశ్వరులతో సేవింపబడుచున్నట్లు కనబడెను. పెక్కుమంది బ్రహ్మవిష్ణుమహేశ్వరులను చూచెను. వారు ఒకరికి మఱియొకరు ప్రభావ మహితులుగా కనబడిరి. దేవతలు వివిధవేషములలో శ్రీరామచంద్రునకు ప్రణమిల్లి, ఆరాధించుచుండుటను ఆమె చూచెను. (చౌ॥ 1-4)

ఆమె పెక్కుమంది సతీ, లక్ష్మీ, సరస్వత్యాది దేవతలను చూచెను. బ్రహ్మాది దేవతలు ఏయే వేషములను ధరించియుండిరో వీరును వారికి తగినరీతిగనే వేషములను ధరించియుండిరి. (దో॥ 54)

సతీదేవి అన్నివైపుల యందును శ్రీరామచంద్రుని, శక్తి(పత్నీ) సమేతముగానున్న దేవగణములను కాంచెను. సకల చరాచర ప్రపంచమును సర్వప్రాణికోటిని ఆమె తిలకించెను. దేవతలు అనేకరూపములలో ఆ ప్రభువును ఆరాధించుచుండిరి. సీతారాములు అనేకులున్నను వారిరూపములుమాత్రము ఒక్కటిగానే యుండెను. దేవతారూపములలోనున్న సీతారాములఆకృతులలో భిన్నత్వము లేదు. అంతటను సీతారామలక్ష్మణులనే దర్శించి, సతీదేవి చకితురాలయ్యెను. ఆందోళితచిత్తముతో దేహస్మృతినిగోల్పోయి, కన్నులుమూసికొని, మార్గమధ్యమున కూర్చుండిపోయెను. కన్నులు తెఱచినంతనే పూర్వ దృశ్యములన్నియు మాయమైయుండెను. మాటిమాటికిని సీతారాములకు నమస్కరించుచు శివుని కడకు చేరెను. (చౌ॥ 1-4)

చెంతచేరినసతీదేవిని శివుడు నవ్వుచు కుశల ప్రశ్నలడిగి, "ప్రభువును ఎట్లు పరీక్షించితివి? సవిస్తరముగా నిజముగా తెల్పుము" - అని పలికెను. (దో॥ 55)

మాస పారాయణము - రెండవ విరామము

శ్రీరాముని ప్రభావమును తెలిసికొనినసతీదేవి నిజమును కప్పిపుచ్చి పలికెను. "స్వామీ! నేనేమియు పరీక్షింపలేదు. అక్కడికి వెళ్లి మీ వలెనే శ్రీరామునకు ప్రణమిల్లితిని. మీవచనములు అసత్యములు కానేరవు. నాకు మీపై పూర్తిగా విశ్వాసము గలదు."- అప్పుడు పరమేశ్వరుడు ధ్యానముద్రవహించి, సతీదేవిపొందిన విచిత్రానుభవములను అన్నింటిని గ్రహించెను. సతీదేవి నోటినుండి అనృతవచనములు వచ్చుటకు శ్రీరామునిమాయతప్ప వేఱు కారణము ఉండదు- అని తలంచి, రాముని మాయకు ప్రణమిల్లెను. పిమ్మట శివుడు శ్రీహరి సంకల్పము, విధి నిర్ణయము బలీయములని భావించెను. సతీదేవి సీతాదేవి రూపమును ధరించుటను తెలిసికొని, ఆయన మిక్కిలివిచారపడెను. "నేనిప్పుడు ఈమెను పత్నిప్రేమతో చూచినచో భక్తిమార్గమునకు కళంకమేర్పడును. ఇది నీతి విరుద్ధమగును. (చౌ॥ 1-4)

సతీదేవి పరమపవిత్రచరిత. ఆమెను దూరమొనర్చుటయు ధర్మము గాదు. ప్రేమతో ఆదరించుట దోషమగును."-అని విచారపడుచు మహేశ్వరుడు మౌనమును దాల్చెను. కాని ఆయన హృదయము సంతాపముతో నిండెను. (దో॥ 56)

పరమశివుడు శ్రీరామునిచరణకమలములను స్మరించి "ఈ శరీరముతో సతీదేవిని దాంపత్య భావముతో చూడను"- అని నిశ్చయించుకొనెను. పిదప అతడు స్థిరబుద్ధితో శ్రీరాముని స్మరించుచు కైలాసమునకు వెళ్లెను. అప్పుడొక మనోహరమైన ఆకాశవాణి వినిపించెను. 'మహాదేవా! మీకు జయము. మీరు భక్తితో తీసికొన్న నిర్ణయము ఉత్తమమైనది. మీరు తప్ప ఇట్టి ప్రతిజ్ఞను ఎవరు తీసికొనగలరు? మీరు శ్రీరామభక్తులు, సమర్థులు, సాక్షాత్ పరమేశ్వరులు"- ఆకాశవాణి పల్కులు విని సతీదేవి మనస్సులో భీతిల్లి, సంకోచముతో శంకరుని అడిగెను. "ఓ కృపాళువూ! ప్రభూ! మీరు చేసిన ప్రతిజ్ఞ యేమి? మీరు సత్యస్వరూపులు, దయానిధులు." సతీదేవి ఎంతగా అడిగినను శివుడామెకు సమాధానమియ్యలేదు. (చౌ॥ 1-4)

సతీదేవిమనస్సు ఆందోళనకు గురియయ్యెను. "సర్వజ్ఞుడైన పరమశివుడు అంతయు తెలిసికొనినాడు. స్త్రీస్వభావముచే మూర్ఖురాలను, వివేకహీనురాలనుఐననేను ప్రేమస్వరూపమును తెలిసికొనజాలనైతిని. నీరుగూడ పాలతో గలిసినప్పుడు పాలతో సమానముగ అమ్మబడును. కాని అందులో కపటరూపమనెడి ఆమ్లము పడిన ఆ పాలు విఱిగిపోవును. నీరు వేఱగును. రుచి (ప్రేమ)యే మాఱిపోవును. (దో॥ 57. క,ఖ)

సతీదేవి తానుచేసినపనిని తలచుకొని చాలా చింతించెను. చెప్పలేని విచారమును పొందెను. "కృపాసముద్రుడైన పరమేశ్వరుడు మిగుల గంభీరుడు. అందువలననే నా అపరాధములను గూర్చి బయటికి ఏమియు అనలేదు."- అని తలపోసెను. సతీదేవి శివునిముఖకవళికలలో మార్పులు గమనించి, ప్రభువు తనను పరిత్యజించినాడని తలంచి, మిగులవగచెను. కాని తనతప్పిదమును తలంచుకొని, ఏమియు మాట్లాడలేకపోయెను. ఆమెమనస్సు కొలిమివలె లోలోననే మిక్కిలి మండిపోసాగెను. సతీదేవివిచారమును గ్రహించి, శివుడు ఆమెసంతోషమునకై మార్గములో అనేకకథలను చెప్పుచు కైలాసమునకు చేరెను. తన ప్రతిజ్ఞను జ్ఞప్తికి దెచ్చుకొని, ఒక వటవృక్షచ్ఛాయలో పద్మాసనమును వేసికొని, ధ్యానమగ్నుడాయెను. తనసహజస్వరూపమున స్థితుడై అఖండ సమాధిలో ఉండి పోయెను. (చౌ॥ 1-4)

సతీదేవి కైలాసముననే యుండెను. ఆమె చాల పరితపించుచుండెను. ఈ రహస్యము ఎవ్వరికిని తెలియదు. ఆమెకు దినమొకయుగముగా గడచుచుండెను. (దో॥ 58)

అనుదినము సతీదేవిహృదయము విచారముతో బరువెక్కుచుండెను. "ఈ శోకసముద్రమును ఎట్లు దాటగలను? నేను శ్రీరఘురాముని అవమానపఱచితిని. నా భర్త మాటలను అసత్యములుగా భావించితిని. విధాత నాకు తగినశిక్షనే విధించెను. కాని శంకరుని వీడి, నేను ఎట్లు ప్రాణములతో ఉండగలను?" అని చెప్పలేనంతగా పరితపింపసాగెను. పిదప ఆత్మపరిశీలన చేసికొనినసతీదేవి తనమనస్సులో శ్రీరాముని స్మరించి, ఇట్లు ప్రార్థించెను. "ప్రభూ! నీవు దయానిధివి. వేదములు నిన్ను ఆపద్బాంధవుడని ప్రస్తుతించినవి. ఈ శరీరమును త్యజించుటకు నన్ను అనుగ్రహింపుము. నీకు నా ప్రణామములు. నేను నిజముగా పరమేశ్వరునిచరణకమలములనే నమ్మియున్న దాననైనచో, మనోవాక్కర్మలచే పతివ్రతనేయైనచో అతి త్వరలో నా ప్రాణములు నన్నువిడిచిపోవుగాక. (చౌ॥ 1-4)

కావున సర్వసాక్షీ! ప్రభూ! నేను ప్రాణములను త్యజించుటకు అనువగు ఏదైననొక ఉపాయమును ఆలోచింపుడు. అవిధముగా ఈ పతివియోగబాధనుండి నేను విముక్తురాలను కాగలను. (దో॥ 59)

ఇట్లు దక్షుని కుమార్తెయగు సతీదేవి వర్ణింపనలవికాని దారుణదుఃఖమును అనుభవించెను. 87 వేల సంవత్సరములు గడిచిపోయెను. అంతట శివుడు ధ్యానమును చాలించెను. శివుడు రామనామమును ఉచ్చరింపగనే సమాధినుండి బయటపడిన వానినిగా ఆయనను గుర్తించి, సతీదేవి ఆయనపాదములకు మ్రొక్కెను. శివుడు తనయెదుట ఒక ఆసనమున కూర్చుండుమని ఆమెను ఆజ్ఞాపించెను. ఆమెకు మధురమైన శ్రీహరికథలను వినిపింపసాగెను. అప్పటికి సతీదేవితండ్రియగు దక్షుడు ప్రజాపతి యాయెను. బ్రహ్మ ఆయనను ఆ పదవికి తగిన వానినిగా భావించి, ప్రజాపతులకు నాయకునిగా నియమించెను. అట్టి ఉన్నత పదవి లభింపగనే దక్షునకు గర్వము తలకెక్కెను. ఈ ప్రపంచములో అధికారమదోన్మత్తుడు కానివాడెవడు? (చౌ॥ 1-4)

# దక్షయజ్ఞము - సతీదేవి తనుత్యాగము

దక్షుడు గొప్ప యజ్ఞము చేయసంకల్పించి, మునులనందఱిని పిలిపించెను. వారు యజ్ఞమును ఆరంభించిరి. యజ్ఞహవిర్భాగములను అందుకొనుటకు దేవతలనందఱిని దక్షుడు సాదరముగా ఆహ్వానించెను. (దో॥ 60)

కిన్నరులు, నాగులు, సిద్ధులు, గంధర్వులు, ఇతర దేవతలు, పత్నీసమేతులై యజ్ఞమునకు బయలుదేఱిరి. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు దప్ప ఇతర దేవతలందఱును తమ తమ విమానములపై యజ్ఞవాటికను చేరిరి. అందమైన విమానములు ఆకాశమున సాగిపోవుటను సతీదేవి చూచెను. మునులతపస్సులనుగూడ భంగపఱచెడిఅప్సరసలమధురగానములను వినెను. ఈ కోలాహలములకు కారణమేమని అడిగిన సతీదేవికి శివుడు విషయమునంతయును వివరించెను. తనతండ్రిచేయుచున్న యజ్ఞమునుగూర్చి విన్న సతీదేవి సంతోషముతో ఇట్లాలోచించెను. "మహాదేవుడు అనుమతించినచో ఈ నెపముతోనైనను కొంతకాలము నేను నాపుట్టినింట ఉండవచ్చును. పతిపరిత్యాగఖేదము ఆమెను బాధించుచుండెను. కాని నేరము తనదగుటచే ఏమియు మాట్లాడక మిన్నకుండెను. చివరకు భయసంకోచములతో, ప్రేమపూరితమైన వచనములతో ఇట్లనెను. (చౌ॥ 1-4)

"ప్రభూ! మా తండ్రిగారి ఇంట గొప్ప వేడుకలు జరుగుచున్నవి. దయానిధీ! మీరు అనుమతించినచో నేనువెళ్లి, ఆవేడుకలను సాదరముగా చూచివచ్చెదను." (దో॥ 61)

పరమేశ్వరుడు పలికెను. "నీమాట బాగుగనే యున్నది. నాకును అట్లే అనిపించుచున్నది. కాని నీ తండ్రి నిన్ను ఆహ్వానింపకుండుట ఉచితముగా లేదు. దక్షుడు తనకుమార్తెలను అందఱినీ పిలిచినాడు. నాయెడగల కోపమువలన నిన్ను మాత్రము పిలువ లేదు. ఒకానొకప్పుడు బ్రహ్మసభలో నాయందు మీ తండ్రి అప్రసన్నుడాయెను అందువలన ఇప్పుడుగూడ నన్ను అవమానించుచున్నాడు. భవానీ! ఆహ్వానింపకుండ వెళ్లినచో మనఆత్మగౌరవము,

ఆదరాభిమానములు దెబ్బతినును. స్నేహితులు, యజమాని, తండ్రి, గురువు - వీరికడకు పిలువకున్నను పోవచ్చును. కాని ద్వేషించు వారి కడకు వెళ్లుట శుభము గాదు" అని శివుడామెకు అనేకవిధముల నచ్చజెప్పెను. కాని విధివశమున ఆమాటలు ఆమెచెవికి ఎక్కలేదు. పరమశివుడు మఱల ఇట్లనెను. "పిలువనిపేరంటమునకుపోవుట శుభప్రదము గాదని నా అభిప్రాయము." (చౌ॥ 1-4)

దక్షకుమారిని ఆవుటకు శివుడెంత ప్రయత్నించినను సతీదేవి తనపట్టును విడువకపోవుటచే ముఖ్యగణములను వెంటనిచ్చి, ఆమెను పంపెను. (దో॥ 62)

సతీదేవి తండ్రియింటికి చేరగనే దక్షునికి భయపడి ఎవ్వరును ఆమెను గౌరవముతో చూడలేదు. తల్లి మాత్రమే ప్రేమతో ఆమెను సమీపించెను. చెల్లెండ్రు చిఱునవ్వులతో పరిహాసముతో పల్కరించిరి. దక్షుడు ఆమెక్షేమసమాచారములనుగూడ అడుగలేదు, సతీదేవిని చూచి, క్రోధముతో ఊగిపోయెను. సతీదేవి యజ్ఞశాలకు వెళ్ళి చూడగా అచట శివునికి అర్పించుటకై యజ్ఞభాగము కన్పింప లేదు. అప్పుడు శివుడు చేసినహెచ్చరిక ఆమెకు బోధపడెను. తనస్వామికిజరిగిన అవమానమును తెలిసికొని, ఆమెహృదయము దహించుకొని పోయెను. పతిని అవమానించుటవలన కల్గినదుఃఖము ఆమెకు పతి తనను పరిత్యజించినపుడుకూడ కలుగలేదు. ప్రపంచములోదుః ఖములనేకములున్నను తమవారిని అవమానించినప్పుడు కలిగెడిదుఃఖము భరింపరానది. ఆలోచించినకొలదియు ఆమెకు కోపము అధికమాయెను. తల్లి ఆమెను ఊరడించుటకు చాలా ప్రయత్నించెను. (చౌ॥ 1-4)

ఐనను శివునకు జరిగినఅవమానము ఆమెకు భరింపరానిదాయెను. తల్లి అనునయవాక్యములఫలితము శూన్యమాయెను. యజ్ఞకార్యక్రమమును ఆపి వేసి, యజ్ఞశాలలో ఉన్న వారిని మందలించుచు సతీదేవి ఇట్లనెను. (దో॥ 63)

"సభాసదులారా! మునులారా! వినుడు. శివుని అవమానించిన వారును, దానిని చూచి మిన్నకుండినవారును, అందఱును దానిఫలితమును వెంటనే అనుభవించెదరు. మా తండ్రికూడా తన తప్పునకు పశ్చాత్తాపపడును. సజ్జనులకును, శంకరునకును, విష్ణువునకును నింద జరిగినచోట నియమము ప్రకారము శక్తి యున్నచో ఆ నిందించినవానినాలుకను వెంటనే కోసివేయవలెను. లేదా చెవులు మూసికొని, ఆ స్థలమునుండి వెళ్లిపోవలెను. త్రిపురారియైనపరమేశ్వరుడు జగదాత్మ, జగత్పిత, సర్వ శుభంకరుడు. మందబుద్ధి యైన నా తండ్రి అట్టి మహాదేవుని అవమానపఱచినాడు. అట్టి దక్షునివలన జన్మించినది ఈ శరీరము. కావున చంద్ర శేఖరుడు, వృషభ ధ్వజుడు ఐన పరమ శివుని ధ్యానించుచు నేను ఈ శరీరమును ఇప్పుడే త్యజించెదను" అని పల్కుచు సతీదేవి యోగాగ్నిలోతన తనువును భస్మమొనర్చెను. ఆ దృశ్యమును జూచిన సదస్యులెల్లరును 'హాహా' కారముల నొనర్చిరి. (చౌ॥ 1-4)

సతీదేవి దేహత్యాగదృశ్యమును చూచి, శివునిప్రమథగణములు ఆగ్రహముతో యజ్ఞమును ధ్వంసము చేయనారంభించినవి. యజ్ఞము ధ్వంసమై పోవుట చూచి, భృగుమహర్షి దానిని రక్షించెను. (దో॥ 64)

ఈ సమాచారమునువినినశంకరుడు మిగులక్రుద్ధుడై వీరభద్రుని పంపెను. అతడు యజ్ఞమును ధ్వంసము చేయుటయే గాక అచటి దేవతలను యథోచితముగా శిక్షించెను. శివద్రోహులకు పట్టెడిగతియే దక్షునకు గూడ పట్టెను. ఈ కథ ప్రపంచములోని వారందఱును ఎఱిగినదే. కనుక ఈ వృత్తాంతము సంక్షిప్తముగా వివరింపబడినది. (చౌ॥)

# పార్వతీ జననము

సతీదేవి దేహత్యాగముచేయుటకుముందు తాను జన్మజన్మలకును శివునిపాదపద్మములపై అనురాగమును కల్గియుండునట్లు వరమిమ్మని శ్రీహరిని ప్రార్థించెను. ఆ కారణమున ఆమె హిమవంతునిగృహములో పార్వతిగా జన్మించెను. ఆమె జన్మింపగానే ఆ ప్రదేశము సకలసిద్ధులకును, సంపదలకును నిలయమాయెను. మునులు ఆ

హిమగిరియందు సుందరములైనఆశ్రమములను నిర్మించుకొనిరి. హిమవంతుడుగూడ వారికి యథోచితస్థానములను సమకూర్చెను. (చౌ॥ 1-4)

ఆ మహోన్నతదివ్యపర్వతము నానావిధఫలపుష్పభరితమై నూతనవృక్షములతో శోభిల్లు చుండెను. అనేకములైన మణులగనులుగూడ అచట వెలసెను. (దో॥ 65)

అచటి నదులు నిర్మలజలములతో ప్రవహించుచుండెను. పక్షులు, మృగములు భ్రమరములు హాయిగా అచట తిరుగాడుచుండెను. జీవులన్నియును తమతమ సహజవైరములను విడిచి, పరస్పరప్రేమతో నివసించుచుండెను. గిరిజాదేవి జన్మించినది మొదలుకొని హిమవంతుడును శ్రీరామభక్తినిపొందినవారివలె పరమానంద భరితుడాయెను. ఆ పర్వతరాజుభవనమున ప్రతిదినము మంగళ కరములైన ఉత్సవములు జరుగుచుండెను. బ్రహ్మాదిదేవతలు హిమాలయవైభవమును పొగడుచుండిరి. నారదమహర్షి ఈ విషయమునెఱింగి, మానసోల్లాసమునకై హిమాలయమునకు చనుదెంచెను. పర్వతరాజు ఆయనను సాదరముగా అర్ఘ్యపాద్యాదులతో పూజించి, ఉన్నతాసనముపై ఆసీనుని జేసెను. ఆతడు తనభార్యతోగూడి మహర్షిపాదములకు ప్రణమిల్లెను. మునిపాదోదకములను ఇల్లంతయు చల్లించెను. తన అదృష్టమునకు సంతసించుచు హిమవంతుడు తనకుమార్తెను ఆ మహర్షి పాదములకడ నుంచెను. (చౌ॥ 1-4)

హిమవంతుడు నారదమహామునితో ఇట్లనెను. "మహాత్మా! మీరు సర్వజ్ఞులు, త్రికాలవేదులు, సర్వలోకసంచారులు, కావున బాగుగా యోచించి, ఈ బాలిక గుణదోషములను తెల్పుడు." (దో॥ 66)

నారదుడు నవ్వి కోమలమైన వాణితో పరమరహస్యములను ఇట్లు పలికెను. "మీ కూతురు సకల సద్గుణ రాశి. సహజముగనే సౌందర్యవతి, సుశీల, వివేకవతి. ఈమెకు ఉమ, అంబిక, భవాని అనునవి పేర్లు. ఈ సుకుమారి సర్వసులక్షణ సంపన్న. ఈమె తనపతికి అత్యంతప్రేమపాత్రురాలగును. సుస్థిరమైన దాంపత్యజీవనమును అనుభవించును. తనతల్లిదండ్రులకు యశమును గూర్చును. ఈ కన్య ఈ సకల జగత్తునకు పూజ్యురాలగును. ఈమెను సేవించినవారికి దుర్లభమైనది ఏదియు ఉండదు. ఈమె నామమును స్మరించెడి స్త్రీలందఱును అసిధారావ్రతతుల్యమైన కఠోర పాతివ్రత్య జీవితమును పాటింతురు. ఓ గిరిరాజా! నీ కుమార్తె సులక్షణ. కాని ఈమెహస్తరేఖలలో కొన్ని అవగుణములును గలవు. ఈమెకు కాబోవు భర్త నిర్గుణుడు, అభిమానములేనివాడు, తల్లిదండ్రులు లేనివాడు, ఉదాసీనుడు, సంశయహీనుడు. (చౌ॥ 1-4)

యోగి, జటాధారి, నిష్కామహృదయుడు, దిగంబరుడు, అమంగళ వేషధారి,- ఇట్టి లక్షణములుగల వాడు ఈమెకు భర్తయగునని ఈమె చేతిరేఖలు తెల్పుచున్నవి. (దో॥ 67)

నారదుని వచనములను విని, అవి సత్యములే యగునని తలంచి, హిమవంతుడును, ఆయన భార్యయైన మైనా(మేనాదేవియు) మిగుల వగచిరి. కాని పార్వతీదేవి మాత్రము ప్రసన్నురాలైయుండెను. నారదుడు ఈ భేదమును గ్రహింపలేదు. ఏలనన బయటికి వారిస్థితి ఒకేవిధముగా కన్పించినను వారి అంతర్గతభావములు వేర్వేఱుగా నుండెను. పార్వతియు, ఆమెసఖులును, హిమవంతుడును, మైనా దేవియు అందఱును పులకితగాత్రులైరి, బాష్పాకులితనేత్రులైరి, దేవర్షిమాటలు అసత్యములు కానేరవు, అనితలచి, పార్వతీదేవి ఆ మాటలను తనమనస్సులో నిల్పుకొనెను. ఆమెకు శివపాదపద్మములపై భక్తి అంకురించెను. కాని ఆయనను కలియుట కష్టమని ఆమె తలంచెను. అది సరియైన సమయము కాదని తనప్రేమను మనస్సులోనే దాచుకొని, సఖియొడిలో చేరెను. దేవర్షివచనములు సత్యములే యగునని భావించి, హిమవంతుడు మైనాదేవి, ఆమె సఖులు మున్నగువారు మిక్కిలిచింతాక్రాంతులైరి. పర్వతరాజు ధైర్యమువహించి, కర్తవ్యమును ఉపదేశింపుడని మునీశ్వరుని అడిగెను. (చౌ॥ 1-4)

నారదమహర్షి పలికెను. "పర్వతరాజా! లలాటమున బ్రహ్మవ్రాసినవ్రాతను తప్పించుటకు దేవదానవులకును, మానవులకును, నాగులకును, మునులకును మఱియెవ్వరికిని సాధ్యము గాదు. (దో॥ 68)

ఐనను నేనొక ఉపాయమును చెప్పెదను. దైవము అనుగ్రహించినచో కార్యసిద్ధియగును. నేను వర్ణించినవాడే ఉమకు భర్త కాగలడు. ఇందులో సందేహము లేదు. నేను చెప్పినలక్షణములన్నియు పరమశివునియందుగలవని నా ఊహ. పరమశివుడు ఈమెను పరిణయమాడినచో ఆ దోషములన్నియును గుణములే యగును. శ్రీహరి పాలసముద్రమున పాముపై పడుకొనినను బుధులు (పండితులు) దానిని దోషముగా ఎంచరు. సూర్యాగ్నులు అన్నిరకములగు రసములను గ్రహించినను వారిని ఎవ్వరును నిందింపరు. గంగా జలమున శుద్ధాశుద్ధ జలములు చేరినను గంగను అపవిత్రమైన దానినినిగా ఎవ్వరును భావింపరు. శ్రీహరివలె, సూర్యాగ్నులవలె, గంగానదివలె సమర్థులగు వారికి ఎట్టి దోషములును అంటవు. (చౌ॥ 1-4)

కాని మూర్ఖుడెవ్వడైనను జ్ఞానగర్వమున గొప్పవారితో పోటీపడి అనుకరించినచో వాడు ఒకకల్పమువఱకును నరకమును అనుభవించును. జీవుడెన్నడైనను పరమాత్మతో సమానుడగునా? (దో॥ 69)

మద్యము గంగాజలముతో సిద్ధమైనదని తెలిసినను సజ్జనులు ఎవ్వరును దానిని ముట్టరు. అదేమదిర గంగానదిలో కలిసినప్పుడు పవిత్రమగును. అట్లే జీవేశ్వరులమధ్యగల అంతరముగూడ ఇట్టిదియేయని గ్రహింపవలెను. శివుడు సహజముగనే సర్వసమర్థుడు, భగవంతుడు: అన్ని విధముల ఈ వివాహము శుభప్రదము. కాని మహాదేవుని సేవ చాలక్లిష్టమైనది. ఐనను తపస్సుచేత అతడు శీఘ్రముగా సంతుష్టుడగును. నీ కుమార్తె శివునిగూర్చి తపమాచరించినచో ఆ త్రిపురారి ఆమెకు విధిలిఖితమును గూడ తొలగించును. ప్రపంచములో 'వరులు' పెక్కుమంది కలరు. కాని శంకరుడే ఈమెకు తగినవరుడు. శివుడు వరదుడు. శరణువేడినవారి క్లేశములనుబాపువాడు. కృపాసముద్రుడు. సేవించినవారిమనస్సులను ప్రసన్నమొనర్చువాడు. పరమశివుని సేవింపనిదే కోట్ల కొలది జపయోగములవలనగూడ జనులు తమ వాంఛిత ఫలములను పొందజాలరు. (చౌ॥ 1-4)

ఈ విధముగా పలికి, నారదమహర్షి శ్రీహరిని స్మరించి, పార్వతీదేవిని ఆశీర్వదించి, "పర్వత రాజా! భయమువీడుము. అంతయు శుభమగును"- అని పలికి, వెడలిపోయెను. (దో॥ 70)

యాజ్ఞవల్క్యమహర్షి పలికెను. నారదుడు ఆ విధముగా చెప్పి, బ్రహ్మలోకమునకు వెళ్లెను. మునీశ్వరా! తర్వాతికథను వినుడు. మేనాదేవి తనభర్తతో ఏకాంతమున ఇట్లనెను. "ప్రభూ! మహర్షి మాటలు నాకు అర్థముకాలేదు. వరుడు, అతని కులము, వంశము మనకుమార్తెకు తగినట్లున్నచో వివాహము జరిపింపుడు. లేనిచో కన్నెగానే ఉండిపోనిండు. (అయోగ్యుడైన వరునితో ఆమెపెండ్లి జరిపింప రాదు.) పార్వతి నాకు ప్రాణముతో సమానము. మనగిరిజవివాహము యోగ్యుడైనవానితో కానిచో .లోకులు- "పర్వతరాజు సహజముగనే జడు(మూర్ఖు)డు" అని యందురు. దీనిని మనస్సులో పెట్టుకొని ఆమె వివాహమును నిర్ణయింపుడు. తరువాత విచారించియు ప్రయోజనము లేదు."- అని ఈ విధముగా పలికి, మేనాదేవి తనపతిపాదములకు ప్రణమిల్లెను. హిమవంతుడు ప్రేమతో ఇట్లు ప్రత్యుత్తరమునిచ్చెను "చంద్రుడు అగ్నిని విరజిమ్ముగాక. నారదుని పలుకులు అసత్యములు గావు. (చౌ॥ 1-4)

ప్రియా! నిశ్చింతగా భగవంతుని స్మరింపుము. పార్వతిని సృష్టించినవాడే ఆమెకు శ్రేయస్సును గూర్చును. (దో॥ 71)

## పార్వతీ తపస్సు

నీకు కుమార్తెపై ప్రేమయున్నచో శివునితో పెండ్లిజరుగుటకై తపస్సుచేయుమని ఆమెకు సూచింపుము. ఈ సమస్యనుండి బయటపడుటకు వేఱు ఉపాయము లేదు. నారదునిపలుకులు సాభిప్రాయములు, సకారణములు.

శంకరుడు అతిసుందరుడు. సకలసద్గుణసంపన్నుడు. అన్ని విధముల నిష్కళంకుడు. ఈ విషయమును గ్రహించి, నీ సందేహములను వీడుము"- భర్త మాటలకు మైనాదేవి మిక్కిలి సంతసించెను. వెంటనే పార్వతియొద్దకేగెను. పార్వతిని చూచినంతనే ఆమెకన్నులు అశ్రుపూరితములు ఆయెను. ఆ గారాల బిడ్డను ప్రేమతో తనయొడిలో కూర్చుండబెట్టుకొని, పదేపదే తనగుండెలకు హత్తుకొనెను. కంఠము గద్గదమై, ఆమె యేమియు మాట్లాడలేకపోయెను. జగజ్జననియు, భవానియు, సర్వజ్ఞురాలును ఐన పార్వతి మృదుమధురముగా ఇట్లనెను. (చౌ॥ 1-4)

"అమ్మా! వినుము నేను గాంచిన స్వప్నవృత్తాంతమును దెల్పెదను. ఒక అందమైన తెల్లని బ్రాహ్మణోత్తముడు నాకు ఉపదేశించెను. (దో॥ 72)

"ఓ శైలకుమారీ! నారదుని పలుకులు ముమ్మాటికిని సత్యములు. తపస్సు చేయుము. నీ తల్లిదండ్రులకుగూడ ఈ మాటలు నచ్చినవి. తపస్సు సుఖప్రదమై బాధలను, పాపములను హరించును. ఈ జగత్తును బ్రహ్మ సృష్టించుటకును, విష్ణువు పాలించుటకును, శివుడు లయమొందించుటకును, శేషుడు ఈ భూభారమును మోయుటకును వారివారి తపోబలములే కారణములు. భవానీ! ఈ సమస్తసృష్టికిని తపస్సే ఆధారము. దీనిని గ్రహించి, నీవు తపస్సు చేయుము"- ఈ మాటలు విని తల్లి, మిగులఆశ్చర్యమును పొందెను. హిమవంతునకు మేనాదేవి ఈ స్వప్నవృత్తాంతమును వినిపించెను. మాతాపితరులను అనేకవిధముల ఓదార్చి, ఉమాదేవి హర్షముతో తపస్సునకై బయలుదేఱెను. ఆమెతల్లిదండ్రులు, ఇతరప్రియపరివారములు వ్యాకులచిత్తులైరి. అందఱి కంఠములును మూగ పోయెను. (చౌ॥ 1-4)

వేదశిరుడను మునివచ్చి, వారినందఱిని తనసదుపదేశములతో ఊరడించెను. పార్వతీదేవి మహిమను దెలిసికొని, వారు ప్రసన్నులైరి. (దో॥ 73)

పార్వతీదేవి తనకు ప్రాణసదృశుడైన పరమశివునియొక్కపాదపద్మములను మనస్సునధ్యానించుచు వనమునకువెళ్లి, తపస్సును ప్రారంభించెను. ఆమెసుకుమారశరీరము తపస్సునకు తట్టుకొనలేనిదేయైనను పట్టుదలతో దీక్షబూని తపస్సును చేయసాగెను. సర్వభోగములను త్యజించెను. దినములు గడచుకొలదియు శంకరుని చరణములపై ఆమెకు భక్తి ప్రపత్తులు అతిశయించెను. తపస్సులో లీనమగుటచే ఆమెకు దేహముపై ధ్యాసయే లేకపోయెను. వేయి సంవత్సరములు కందమూల ఫలములను, వందసంవత్సరములు కేవలము ఆకులనుమాత్రమే ఆహారముగా తీసికొనుచు తపమాచరించెను. కొన్ని దినములు నీరు, గాలి మాత్రమే ఆమెకు ఆహారమాయెను. మఱికొన్ని దినములు కఠోరమైన ఉపవాసదీక్షతో గడిపెను. మూడువేల సంవత్సరములు బిల్వవృక్షములనుండి రాలి, ఎండిపోయిన ఆకులనే ఆహారముగా ఆమె స్వీకరించెను. క్రమక్రమముగా ఆ శుష్కపర్ణములను గూడ తినుట మానెను. కనుక ఆమెకు **'అపర్ణ'** అను పేరు ప్రసిద్ధికెక్కెను. తపస్సువలన ఆమె శరీరము రానురాను శుష్కించిపోసాగెను. అంతట ఆకాశమునుండి గంభీరమైన బ్రహ్మవాణి వినవచ్చెను. (చౌ॥ 1-4)

"ఓ గిరి రాజకుమారీ! వినుము నీ మనోరథము సఫలమైనది. ఇంక నీ కఠోర తపస్సును మానుము. త్వరలో త్రిపురారి నీకు భర్త కాగలడు. (దో॥ 74)

ఓ భవానీ! ధీరులు, మునులు, జ్ఞానులు ఎందఱో కలరు. కాని ఎవ్వరును ఇట్టి ఘోరతపమును ఆచరించియుండలేదు. సర్వశ్రేష్ఠమైన ఈ బ్రహ్మవాణిని సర్వదా సత్యముగా నిర్మలమైనదానినిగా తలంచి, దీనిని నీ మనస్సులో ఉంచుకొనుము. నీ తండ్రి నిన్ను ఇంటికి రమ్మని కోరినప్పుడు నీదీక్షను మాని ఇంటికి పొమ్ము. సప్తర్షులు నిన్ను చూచుటకు వత్తురు. అప్పుడు ఈ బ్రహ్మవాణి సత్యమగును."- ఆకసమునుండివినబడిన బ్రహ్మవాణికి పార్వతీదేవి పులకించిపోయెను. (యాజ్ఞవల్క్యుడు భరద్వాజునితో పల్కుచున్నాడు) నేనింత వఱకు పార్వతీదేవి

సుందర కథను దెల్పితిని. ఇప్పుడు శంకరుని పవిత్ర గాథను వినుడు. సతీదేవి తనశరీరమును త్యజించినదిమొదలుకొని శంకరునిలో వైరాగ్యము అధికమాయెను. సదా రామనామమును జపించుచు శ్రీరామునిగుణకీర్తన శ్రవణములయందే నిమగ్నుడాయెను. (చౌ॥ 1-4)

చిదానందుడు, సర్వ సుఖనిధానము, మోహ, మద, కామరహితుడైన శివుడు పరమానందప్రదుడైన శ్రీహరిని స్మరించుచు భువిపై సంచరింప సాగెను. (దో॥ 75)

పరమేశ్వరుడు ఒక చోట మునీశ్వరులకు జ్ఞానోపదేశములను జేసెడి వాడు. వేరొక తావున శ్రీరామచంద్రుని గుణగణములను గానము చేయుచుఉండెడివాడు. మహేశ్వరుడు పరమజ్ఞానియు, కామరహితుడునైనను సతీవియోగముచే దుఃఖితుడగుచుండెను. ఈ విధముగా చాలకాలము గడిచెను. ఆయనలో రామభక్తి పెల్లుబుకుచు నిత్యనూతనమగుచుండెను. శ్రీరాముడు శివునికఠోర నియమములను, అనన్యప్రేమను, దృఢభక్తిని గ్రహించెను. కృతజ్ఞుడు, కృపాళువు, రూపశీలశోభితుడు ఐన శ్రీరామచంద్రుడు గొప్పతేజస్సుతో శివునకు ప్రత్యక్షమాయెను. ఆయన అనేకవిధముల శంకరుని స్తుతించి, "మీరు తప్ప ఈ కఠోరనియమములను ఇతరులెవ్వరు పాటింపగలరు?" అనెను. రఘురాముడు శంకరునకు పెక్కు రీతుల నచ్చజెప్పి, పార్వతీదేవిజన్మ వృత్తాంతమును ఆమె పవిత్రతపఃశ్చర్య గాథను వివరించెను. (చౌ॥ చౌ॥ 1-4)

శ్రీరాముడు శివునితో ఇట్లనెను. "నాపై మీకు భక్తియున్నచో నా ప్రార్థనను వినుడు. మీరు పార్వతిని వివాహమాడుడు. అట్లు నాకు వాగ్దానము చేయుడు." (దో॥ 76)

దీని ఉచితానుచితములమాటయెట్లున్నను మీ ఆజ్ఞ జవదాటరానిది. దానిని శిరసావహించుటయే నా పరమధర్మము. తల్లిదండ్రులు, గురువు యజమాని - మున్నగువారి ఆజ్ఞలను శుభప్రదములని భావించి, ఎట్టి ఆలోచనలను చేయక ఆచరింపవలెను. మీరు నాకు అత్యంత హితమును గూర్చువారు. మీ ఆన నాకు శిరోధార్యము." అని శివుడు పలికెను. శంకరుని భక్తిజ్ఞానధర్మనిరతినిజూచి, శ్రీరామచంద్రుడు మిక్కిలి ప్రసన్నుడాయెను. "ఓ మహేశ్వరా! మీవ్రతము సఫలమైనది. నేనునుడివిన వాక్యములను మీమనస్సులో నుంచుకొనుడు"- అని పలికి శ్రీరాముడు అంతర్ధానమాయెను. శివుడు తనహృదయములో శ్రీహరిని నిల్పుకొనియే యుండెను. అదేసమయమున సప్తమహర్షులు శివునికడకు ఏతెంచిరి. మహాదేవుడు మిక్కిలి మృదుమధురముగా వారితో ఇట్లనెను. (చౌ॥ 1-4)

"మీరు పార్వతికడకు వెళ్లి, ఆమె భక్తిని పరీక్షింపుడు. ఆమెతండ్రియైన హిమవంతుడు ఆమెను ఇంటికి తీసికొని వచ్చునట్లు చేయుడు. ఆమె సందేహములను నివృత్తిచేయుడు." (దో॥ 77)

మూర్తీభవించిన తపస్సువలెనున్న పార్వతీదేవిని చూచి, సప్తమహర్షులు ఇట్లు ప్రశ్నించిరి. "ఓ పార్వతీ! ఈ ఘోరతపస్సును చేయుటకు కారణమేమి? ఎవరిని ఆరాధించుచున్నావు. నీ కోరిక యేమి? నీ మనసులోని మాటను తెల్పుము"- పార్వతీదేవి ఇట్లు ప్రత్యుత్తరమిచ్చెను. "నామనసులోని మాటను చెప్పుటకు సంకోచించుచున్నాను. దానిని విన్నచో మీరు నా జడత్వమునకు నవ్వెదరు. నా మనస్సు ఎవ్వరి మాటలను పట్టించు కొనక, ఒకే విధముగా పట్టుదలవహించియున్నది. అది గాలిలో మేడలు కట్టుకొనుచున్నది. నారదుని మాటలను విశ్వసించి, నేను రెక్కలులేకుండగనే ఎగురుటకు ప్రయత్నించుచున్నాను. ఋషులారా! నా అవివేకమును గమనింపుడు. నేను పరమేశ్వరుని పతిగా పొంద దలచితిని. (చౌ॥ 1-4)

ఈ మాటలను వినగానే ఋషులు నవ్వి ఇట్లు పలికిరి. "నీవు శైలజవు. నీ శరీరము పర్వత సంభవమేగదా! నారదుని ఉపదేశమును విన్నవారి కాపురము ఏది నిలబడినది? చెప్పుము. (దో॥ 78)

నారదుడు దక్షకుమారులకు ఉపదేశములనిచ్చెను. వారు మఱల ఇంటిముఖమే చూడలేదు. చిత్రకేతుకుటుంబముగూడ నారదునివలననే చిక్కులపాలాయెను. హిరణ్యకశిపునిపరిస్థితియు అట్లేఐనది. నారదుని ఉపదేశములను విన్న స్త్రీపురుషులెవ్వరైనను ఇల్లు-వాకిలి వదలి, బిచ్చగాండ్రు కావలసినదే. ఆయనకు శరీరముపైన మాత్రమే సజ్జనలక్షణములు, కాని మనస్సులో కపటము. అతడు ఇతరులను గూడ తనవలెనే చేయనిచ్ఛగించును. ఆయన మాటలను విశ్వసించుచు నీవు శివుని నీభర్తగా పొందగోరు చున్నావు. శంకరుడు సహజముగా ఉదాసీనుడు, గుణహీనుడు, లజ్జారహితుడు, వికృతవేషధారి, కపాలధారి, కులము, గృహము లేనివాడు, దిగంబరుడు, సర్పములను భూషణములుగా ధరించినవాడు. ఇట్టి వరుని పెండ్లియాడి, నీవేమి సుఖపడగలవు? నీవు ఆ నారదునిమాయమాటలకు మోసపోయితివి. ఈశ్వరుడు పరులమాటలను విని, సతీదేవిని పరిణయమాడెను. తరువాత ఆమెను పరిత్యజించి, ఆమె దేహత్యాగమునకు కారణమాయెను. (చౌ॥ 1-4)

ఇప్పుడు శివుడు నిశ్చింతగా హాయిగా నిద్రించుచున్నాడు. బిచ్చమెత్తుకొని జీవించు చున్నాడు. అట్టి ఏకాకికడ ఏ స్త్రీయైనను సుఖముగా జీవింపగలదా? (దో॥ 79)

ఇప్పటికైనను మామాటలను వినుము. నీకొఱకు మేము ఒక మంచివరుని వెదకినాము. అతడు సుందరుడు, పవిత్రుడు, సుఖప్రదుడు, సుశీలుడు. అతని వైభవమును, లీలలను వేదములు గూడ ప్రస్తుతించును. అతడు దోషరహితుడు, సద్గుణరాశి, లక్ష్మీపతి, వైకుంఠవాసుడు, అట్టి వరునితో నీకు వివాహము జరిపింపగలము."- ఈ మాటలను వినగానే భవాని నవ్వి ఇట్లనెను. "మీరు వచించినది సత్యమే. ఈ శరీరము శైలజమే. శరీరము పోయినను హఠముమాత్రము పోదు. బంగారముగూడ రాళ్ల నుండియే జనించును. దానిని నిప్పులలో కాల్చినను దానిస్వభావము మారదు. నేను నారదునిమాటలను విస్మరింపను. నా కాపురము కలకలలాడనిండు లేక పాడుబడనిండు. దానికి నేను భయపడను. గురు వచనములమీద విశ్వాసము లేని వారు కలలోనైనను సుఖమును, జయమును పొందజాలరు. (చౌ॥ 1-4)

మహాదేవుడు దోషములకు నిలయమే కావచ్చును. విష్ణువు సకలసద్గుణ నిధానమే కావచ్చును. కాని మనసు ఎవరియందు లగ్నమగునో వారినే అది కోరుకొనును. (దో॥ 80)

ఓ మునీశ్వరులారా! ఒక వేళమీరు ముందుగనే కలిసియున్నచో మీయుపదేశమునే శిరసావహించి యుండెడి దాననేమో? కాని ఇప్పుడు నా జీవితము ఈశ్వరార్పితమైనది. ఇంక గుణదోషములను ఎవరు విచారింతురు? ఒకవేళ మీకు వివాహమహోత్సవములు జరిపి, ఆనందించుటకు ఆసక్తికలదేని లోకములో కన్యలకు, వరులకు కొదువలేదు. ఇట్టి వినోదములతో కాలముగడుపువారికి అలసటయే యుండదు. కోట్లకొలది జన్మలనెత్తి యైనను నేను పరమశివునే భర్తగా పొందెదను. లేదా కన్యగానే మిగిలిపోయెదను. ఆ శంకరుడే స్వయముగా వచ్చి, వందసార్లు చెప్పినను నారదునిఉపదేశమును నేను ఉల్లంఘింపను. మీకు నమస్కరించెదను. దయచేసి మీరు మీఇండ్లకుచనుడు. ఇప్పటికే ఆలస్యమైనది"- అని పలికెను. మునులు పార్వతీదేవిభక్తివిశ్వాసములను గాంచి, "ఓ భవానీ! జగదంబా! నీకు జయమగుగాక" అని పలికిరి. (చౌ॥ 1-4)

"పరమశివుడు భగవంతుడు. నీవు మాయవు. మీరు ఇరువురును జగత్తునకు మాతాపితరులు." అని పలికి మునీశ్వరులు పార్వతీదేవిపాదములకు ప్రణమిల్లి, పులకితగాత్రులై వెళ్లిపోయిరి. (దో॥ 81)

అక్కడినుండి సప్తర్షులు హిమవంతునికడకేగి, ఆయనను పార్వతీదేవియొద్దకు పంపగా అతడామెను ఇంటికి పిలుచుకొనివచ్చెను. పిదప మహర్షులు శివునియొద్దకు వెళ్లి, ఉమాదేవివృత్తాంతమును అంతయు వినిపించిరి. పార్వతీదేవిప్రేమనుగూర్చి వినిన శివుని మనస్సు ఆనందమగ్నమాయెను. సప్తర్షులు, సంతోషించి, తమతమనివాసములకు చేరిరి. పిమ్మట మహాజ్ఞానియైన శివుడు తన మనస్సును స్థిరపఱచుకొని,

శ్రీరఘునాథునిధ్యానములో మునిగెను. ఆ కాలమున 'తారకుడు' అను రాక్షసుడు తనభుజబలప్రతాపతేజస్సులచే సకలలోకములను, లోకపాలకులను జయించెను. దేవతలు తమసుఖసంపదలను కోల్పోయిరి. బ్రహ్మయిచ్చిన వరములకారణముగ ఆ తారకాసురుడు జరా మరణములు లేనివాడు. కనుక వానిని జయించుట అసాధ్యము. దేవతలు వానితో యుద్ధమొనర్చి పరాజితులైరి. వారు బ్రహ్మదేవునితో మొఱపెట్టుకొనిరి. బ్రహ్మదేవుడు దేవతలు దుఃఖితులగుట గాంచెను. (చౌ॥ 1-4)

వారిని బ్రహ్మ ఓదార్చి, శివాంశసంభూతుడే యుద్ధమున ఈ రాక్షసుని ఓడించి, చంపగలడని పలికెను. (దో॥ 82)

బ్రహ్మ మఱియును ఇట్లు చెప్పెను. "నేను చెప్పినది విని, దానిని ఆచరింపుడు. భగవంతుడు మీకు మేలుచేయును. మనపథకము సఫలమగును. దక్షుని యజ్ఞములో ప్రాణత్యాగమొనర్చిన సతీదేవి మఱల హిమవంతునికూతురుగా జన్మించినది. ఆమె శంకరుని వివాహమాడుటకు తపమును ఆచరించినది. కాని శివుడు సర్వసంగపరిత్యాగియై ధ్యానమగ్నుడై యున్నాడు. సమంజసము కాకపోయినను నేను చెప్పెడి ఉపాయమును వినుడు. మీరు వెళ్లి, శివునికడకు మన్మథుని పంపుడు. అతడు శివునకు మనోవికారములను కల్గించును. దానివలన శివునకు తపోభంగము కలుగును. పిమ్మట మనము అచ్చటికి వెళ్లి, శివుని ప్రార్థించి, పార్వతితో ఆయనకు వివాహము జరుగునట్లు చూతము. దేవతలను రక్షించుటకు ఇది యొక్కటే మార్గము." బ్రహ్మమాటలకు దేవతలందఱును సంతసించిరి. భక్తితో స్తుతింపగా పంచబాణుడు, మీనకేతనుడు ఐన మన్మథుడు వారికి ప్రత్యక్షమాయెను. (చౌ॥ 1-4)

## కామదహనము

దేవతలు మదనునితో తమ ఆపదను గూర్చి విన్నవించిరి. వారిమాటలు విని, అతడు నవ్వి, శివునితో వైరము నాకు శుభముగాదు. (దో॥ 83)

ఐనను నేను మీకు సహాయపడెదను. పరోపకారమే పరమ ధర్మమని వేదములు చెప్పుచున్నవి. ఇతరులమేలుకొఱకు ప్రాణములను సైతము అర్పించువారిని సజ్జనులు మెచ్చుకొందురు. ఇట్లు పలికి అందరకును నమస్కరించి, మన్మథుడు తనధనుస్సును, పుష్పబాణములను ధరించి, వసంతుడు మొదలగు వారితో కార్యసాధనకై బయలుదేఱెను. "శివునితో వైరమువలన తనకు మరణము నిశ్చయము"- అని మనస్సులో అతడు తలపోసెను. తనప్రభావమును విస్తరింప జేసెను. సమస్తప్రపంచమును తనవశము చేసికొనెను. ఈ మత్స్యధ్వజుడు విజృంభింపగానే వేదమర్యాదలన్నియును అడుగంటెను. బ్రహ్మచర్యము, వ్రతములు, సంయమములు, ధైర్యము, ధర్మము, జ్ఞానము, విజ్ఞానము, సదాచారము, జపయోగవైరాగ్యములు మొదలగు వివేకవాహినులు అచట నిలువలేక పలాయనము చిత్తగించెను. (చౌ॥ 1-4)

వివేకము తనసహాయకులతోపాటు పాఱిపోయెను. వివేకయోధులు రణభూమినుండి పలాయితులై సద్గ్రంథరూపములలో పర్వతగుహలలో దాగికొనిరి. ప్రపంచములో అల్లకల్లోలములు చెలరేగినవి. కొందఱు ఇట్లు చెప్పుచుండిరి- "భగవంతుడా! ఏమికానున్నది? మనకు రక్షకుడెవ్వరు? మన్మథుడు తన ధనుర్బాణములను ఎక్కుపెట్టిన ఆ రెండు తలల అసాధారణ వ్యక్తి (శూలధారి) ఎవరు? (ఛంద్)

ప్రపంచములోని స్త్రీపురుషప్రకృతులైన చరాచరజీవులన్నియును తమ జీవన మర్యాదలన్ను విస్మరించి, కామమునకు బానిసలైనవి. (దో॥ 84)

అందఱిహృదయములలో కామక్రీడాభిలాష జనించెను. లతలను జూచి, చెట్లశాఖలు వంగెను. నదులుప్పొంగి సముద్రుని జేరుటకు పరుగులు తీసెను. సరస్సులు, కుంటలుగూడ సంగమించెను. అచేతనముల స్థితియే

యిట్లుండగా ఇక చేతనములసంగతి చెప్పనేల? ఆకాశమునను, నేలపైనను, నీటిలోను ఉండు పశుపక్ష్యాదులు కాలనియమములనుగూడ పాటింపక కామమునకు వశమాయెను. జనులందఱును కామాంధులైరి. చక్రవాకములకు దివారాత్రములవిచక్షణ లేకపోయెను. దేవతలు, దైత్యులు, మానవులు, కిన్నరులు, నాగులు, భూత భేతాళపిశాచాదులు సహజముగా కామమునకు దాసులు. వీరిని గూర్చి చెప్పవలసిన పనియేలేదు కాని సిద్ధులు, విరక్తులు, మహామునులు, యోగులును కామవికారములకు బానిసలై, నియమములకు నీళ్లువదలి, విరహములను అనుభవించిరి. (చౌ॥)

యోగీశ్వరులును, తపస్వినులును కామాతురులైనప్పుడు ఇక పామరులసంగతి చెప్పనేల? సమస్త చరాచరజగత్తును బ్రహ్మమయముగా భావించువారుగూడ దానిని స్త్రీమయముగా చూచుచుండిరి. జగత్తు స్త్రీలకు పురుషమయముగాను, పురుషులకు స్త్రీమయముగాను గోచరించుచుండెను. కామునిలీలలు బ్రహ్మాండమంతటను రెండు గడియల పాటు విజృంభించెను. (ఛం॥)

మనోధైర్యము ఎవ్వరికిని లేకపోయెను. అందఱిమనస్సులను మన్మథుడు దోచివేసెను. శ్రీరఘునాథునిరక్షణలో ఉన్నవారు మాత్రమే నిగ్రహముతో నిలిచియుండిరి. (సో॥ 85)

మన్మథుడు శివుని సమీపించునంతవఱకు ఈ లీలలు కొనసాగుచునే యుండెను. శివుని జూడగనే మన్మథుడు గడగడవణకసాగెను. వెంటనే ప్రపంచము తనయథాస్థితిని పొందెను. త్రాగినవాడు మత్తువీడినంతనే శాంతిని అనుభవించునట్లు జీవులందఱును ప్రశాంతతను పొందిరి. దుర్జయుడును, దుర్గముడును, భగవానుడును, (షడ్గుణైశ్వర్య సంపన్నుడును) ఐన రుద్రుని జూచి, మన్మథుడు భీతిల్లెను. వెనుకకు మఱలిపోవుట సిగ్గుచేటు, ముందుకు పోజాలడు. (ముందు నూయి, వెనుక గొయ్యి) తనకు మరణము నిశ్చయమని తలంచి, అతడు ఒకయుక్తిని పన్నెను. వెంటనే వసంత ఋతువును ప్రేరేపించెను. వృక్షములన్నియును చిగిర్చి, పుష్పశోభితములాయెను. వనములును, ఉపవనములును బావులును, చెఱువులును, ప్రకృతియు ప్రేమమయములై కనబడెను. ఈ దృశ్యము, ప్రేతాత్మలనుగూడ కామ వశములుగా జేసెను. (చౌ॥ 1-4)

మృతులకుగూడ కాముడు జాగృతిగూర్చెను. వనసౌందర్యములు వర్ణనాతీతములయ్యెను. శీతలసుగంధిలమందపవనములు కామాగ్నిని ప్రజ్వలింప జేసెను. సరోవరములలో కమలములు శోభలను వెదజల్లెను. వాటిపై జేరిన అందమైన తుమ్మెదలు రొదచేయసాగెను. కలహంసలు, కోకిలలు, చిలుకలు మధుర గానములను వినిపించెను. అప్సరసలు మధురసంగీతములతో అద్భుతనాట్యములను ప్రదర్శించిరి. (ఛం॥)

మన్మథుడు తనపరివారములతోగూడ అనేకములైన ఉపాయములను పన్నెను. కాని శివునితపస్సమాధి చెక్కుచెదరలేదు- మదనునికి కోపము హెచ్చాయెను. (దో॥ 86)

అతడు అందమైన ఒకమామిడికొమ్మనెక్కి, తనపుష్పధనుస్సునందు పూలబాణములను సంధించెను. ఆకర్ణాంతముగా లాగి అతడు తనతీక్ష్ణమైన పుష్పబాణములను ఐదింటిని ఒకేసారి వదలెను. అవి నేరుగా శివుని హృదయమున గ్రుచ్చుకొనెను. శివునిసమాధి చెదరిపోయెను, మనస్సు క్షోభించెను. పరమేశ్వరుడు కనులు తెఱచి, నలువైపులను చూచెను. మామిడిచెట్టుపై ఆకులలో దాగియున్నమన్మథుని చూడగనే శివుడు క్రుద్ధుడాయెను. ముల్లోకములును కంపించెను. మూడవకంటిని తెఱవగనే మన్మథుడు మసియైపోయెను. విశ్వమునందంతటను హాహాకారములు మిన్నుముట్టెను. దేవతలు భయకంపితులైరి. దైత్యులు సంతసించిరి. విషయలోలురు కామసుఖములను స్మరించుకొనుచు చింతించిరి. యోగసాధకులు నిష్కంటకులైరి. (చౌ॥ 1-4)

యోగులు నిష్కంటకులైరి. కాని మన్మథునిపత్ని రతీదేవి తన భర్తమరణవార్త విని మూర్ఛిల్లెను. ఆమె శోకవిహ్వలయై శివునిసన్నిధికి ఏతెంచి, పరిపరివిధముల ప్రార్థించుచు ఆయనయెదుట నిలబడెను. నిస్సహాయస్థితిలోనున్న ఆమెను జూచి, జాలిగొని కరుణాళువు ఐన పరమశివుడు ఇట్లు పలికెను. (ఛం॥)

ఓ రతీ! నేటినుండి నీ భర్త 'అనంగుడు' అనబడును. దేహము లేకున్నను అందఱిని వ్యాకుల పఱచును. నీ భర్తను పొందెడి మార్గమును వినుము. (దో॥ 87)

పృథ్వీభారమును బాపుటకు శ్రీహరి యదువంశమున శ్రీకృష్ణుడుగా అవతరించును. అప్పుడే నీభర్త ఆయనకు ప్రద్యుమ్నుడనుపేర కుమారుడుగా జన్మించును. నాపలుకులు సత్యములు. శివునిమాటలు విని రతీదేవి వెడలి పోయెను. ఇప్పుడు మఱియొక కథను వినిపించెదను. బ్రహ్మాదిదేవతలు ఈ సమాచారమును విని నేరుగా వైకుంఠమునకు చేరిరి. పిమ్మట విష్ణువు వారిని వెంటబెట్టుకొని పరమేశ్వరునిసన్నిధికి చేరెను. వారు చంద్రశేఖరుని పెక్కువిధముల ప్రస్తుతించిరి. దయాళువైన పరమశివుడు ప్రసన్నుడై "దేవతలారా! మీరాకకు కారణమేమి? అని యడిగెను. బ్రహ్మ "ఓ ప్రభూ ఓ అంతర్యామీ! దయతో మామనవిని ఆలకింపుడు. (చౌ॥ 1-4)

# పార్వతీ పరమేశ్వరుల పరిణయము

దేవతలందఱిహృదయములలో ఒకేకోరిక కలదు. వారు మీవివాహమహోత్సవమును చూడ గోరుచున్నారు. (దో॥ 88)

ఓ మన్మథ గర్వాపహారీ! మీ వివాహమును మేము కనువిందుగా జూచెడి ఉపాయమును దెల్పుడు. కరుణాసాగరా! మదనుని భస్మమొనర్చినపిమ్మట రతీదేవికి వరములనిచ్చి, మేలొనగూర్చితిరి. ప్రభూ! మొదట దండించి, పిదప క్షమించుట మహాత్ముల లక్షణము. పార్వతీదేవి గొప్పతపస్సు చేసినది. దయతో ఆమెను అర్ధాంగిగా స్వీకరింపుడు- "బ్రహ్మదేవునివిజ్ఞాపనను విని, శ్రీరామునిఆజ్ఞను జ్ఞప్తికి దెచ్చుకొని, శివుడు ప్రసన్నుడై 'అట్లే యగుగాక' (తథాస్తు)" - అని అనుగ్రహించెను. పూలవానగుఱిసెను. దేవతలందఱును దుందుభులు మ్రోగించి, 'జయ జయ ధ్వానములు' చేసిరి. ఇదియే తగిన'అదను' అని భావించి, సప్తర్షులు అచటికి వచ్చిరి. బ్రహ్మ వారిని హిమవంతునికడకు పంపెను. వారు మొదట పార్వతీదేవి యొద్దకు వెళ్లి, మధురముగా వినోదవచనములను పలికిరి. (చౌ॥ 1-4)

"ఆ సమయమున నారదుని మాటలను పాటించి, మా పలుకులను వినక పోయితివి. ఇప్పుడు నీ ప్రతిజ్ఞ వమ్మైనది. మహాదేవుడుడిప్పుడు మన్మథునే భస్మము గావించెను. (దో॥ 89)

మాస పారాయణము - మూడవ విరామము

చౌపాఇ॥ ఈ మాటలను విని పార్వతీదేవి చిఱునవ్వుతో ఇట్లనెను. "జ్ఞాన నిధులైన మునీశ్వరులారా! మీరులెస్సగా పలికితిరి. పరమేశ్వరుడు కాముని ఇప్పుడే కాల్చినాడనియు, ఇంతవఱకును అతడు సవికారుడనియు మీ ఉద్దేశ్యము. కాని నా అభిప్రాయములో శివుడు సర్వదా యోగి, జన్మరహితుడు, అనింద్యుడు, నిష్కాముడు, నిర్వికార-నిరంజనుడు. ఈ విషయమును ఎఱింగియు నేను త్రికరణశుద్ధిగా ప్రీతితో ఆయనను సేవించితిని. కావున ఓ మునులారా! వినుడు దయామయుడైన ప్రభువు నా ప్రతిజ్ఞను సఫలము చేయును. శివుడు మన్మథుని భస్మమొనర్చినాడనుట అవివేకము. హిమము ఎట్టి పరిస్థితులలోను అగ్నిని సమీపింపలేదు. ఒకవేళ సమీపించినచో అది కఱిగి పోవును. అట్లే మన్మథుడు తనకైతానే మహాదేవునికడకు వెళ్లి భస్మమైనాడు. ఇది సత్యము, న్యాయము. (చౌ॥ 1-4)

పార్వతీదేవివచనములను విని, సప్తర్షులు ఆమెభక్తివిశ్వాసములకు సంతసించిరి. ఆమెకు శిరసా ప్రణమిల్లి, హిమవంతుని కడకు చేరిరి. (దో॥ 90)

వారు హిమవంతునకు విషయములను అన్నింటిని తెల్పిరి. మదనుడు భస్మమగుటను విని, అతడు మిగుల దుఃఖించెను. రతీదేవికి ఇచ్చినవరమునుగూర్చి విన్నపిమ్మట సంతోషించెను. మనస్సులో శివమహిమను తలచుకొని, మునీశ్వరులను సాదరముగా ఆహ్వానించెను. వారిచే శుభదిననక్షత్ర ఘటికలను పరిశీలింపజేసి, వేదోక్తముగా వివాహముహూర్తమును నిర్ణయించెను. హిమవంతుడు లగ్నపత్రికను వ్రాయించి, దానిని సప్తర్షులకు ఇచ్చి, వారికి పాదాభివందనమాచరించి విన్నవించెను. వారు ఆ పత్రికను బ్రహ్మదేవునకు అందించిరి. బ్రహ్మ దానిని చదివి మహానందభరితుడాయెను. బ్రహ్మ లగ్న పత్రికను చదివి విన్పింపగా మునులు దేవతలు సంతోషపడిరి. ఆకాశమునుండి పుష్పవర్షము కురిసెను. వివిధవాద్యములు మ్రోగెను. దశదిశల మంగళకలశములు అలంకరింపబడెను. (చౌ॥ 1-4)

దేవతలందఱును తమతమ వాహనములను విమానములను సిద్ధపఱచిరి. శుభశకునములు పొడసూపెను. ఆనందముతో అప్సరసలు నాట్యములాడిరి. (దో॥ 91)

భూతగణములు శివుని అలంకరించిరి. జటాజూటములపై సర్పములను అలంకరించిరి. సర్పములతోడనే కుండలములను కంకణములను ధరింపజేసిరి. సుందర శరీరముపై విభూతిని అలందిరి. వ్యాఘ్రచర్మమును ధరింపజేసిరి. పరమశివుని లలాటమున చంద్రుడు, శిరస్సున గంగ, ముఖమున త్రినేత్రములు, నాగయజ్ఞోపవీతము, కంఠమున గరళము, ఉరమున కపాలమాలికలు శోభిల్లుచుండెను. ఈ విధముగా ఆయన విలక్షణవేషధారిగా ఉన్నను శుభప్రదుడు, కృపాళువు. హస్తములయందు త్రిశూలము, డమరుకము ధరించి, మంగళ వాద్యములతో నందివాహనారుఢుడై విచ్చేసెను. శివుని గాంచిన దేవాంగనలు "ఈ వరునికి తగినవధువు ఈ జగత్తులోనే దొరకదు"- అని తమలో తాము చిఱునవ్వులను చిందించుచు అనుకొనిరి. బ్రహ్మ, విష్ణువు మొదలగు దేవతలు తమతమ వాహనములతో ఊరేగింపులో పాల్గొనిరి. దేవతల కోలాహలముతో సాగుచున్న ఈ ఊరేగింపు అత్యద్భుతముగా నున్నను అది వరునకు తగినట్లుగా లేదు. (చౌ॥ 1-4)

అప్పుడు విష్ణుమూర్తి దిక్పాలురను పిలిచి, నవ్వి ఇట్లనెను. "మీరు మీ పరివారములతో వేర్వేఱుగా నడచుచుండుడు. (దో॥ 92)

సోదరులారా! ఈ ఊరేగింపు వరునకు తగినట్లుగా లేదు. క్రొత్తచోట ఏల నవ్వులపాలయ్యెదరు?" విష్ణువచనములను విని, దేవతలు నవ్వి, తమ సేనలతో వేర్వేఱుగా నడవసాగిరి. మహాదేవుడు గూడ విష్ణువు యొక్క ప్రియవచనములను విని నవ్వి, "శ్రీహరి తనవ్యంగ్యధోరణిని ఎన్నడును మానడు."- అనియనుకొనెను. శివుడు భృంగిని పంపి, తన పరివారములను రప్పించెను. శివుని ఆజ్ఞతో వారందఱును వచ్చి, తమ ప్రభువుయొక్క పాదపద్మములకు నమస్కరించిరి: చిత్రవిచిత్రములైన వారివేషములను వాహనములను జూచి, శివుడు నవ్వెను. కొందఱికి నోళ్ళేలేవు. మఱికొందఱికి పెక్కునోళ్ళు గలవు. కొందఱికి చేతులును, కాళ్లును లేవు. మఱికొందఱికి అనేకములున్నవి. నేత్రములు లేనివారు కొందఱు. బహునేత్రములు గలవారు మఱికొందఱు. కొందఱులావుగా బలిష్ఠముగా నుండిరి. మఱికొందరు బక్కగా బలహీనముగా నుండిరి. (చౌ॥ 1-4)

కొందఱు కృశించినదేహములుగలవారు. మఱికొందఱు బలిష్ఠకాయులు. కొందఱు పవిత్రవేషధారులు, వికృతవేషధారులు మఱికొందరు. వారిసొమ్ములు భయమును గొలుపుచున్నవి. చేతులలో పుఱ్ఱెలు కలిగియుండిరి. శరీరములు రక్తసిక్తములై యుండెను. వారు గార్దభముల, శునకముల, సూకరముల, జంబుకముల ముఖములు కలిగియుండిరి. ఈ ప్రమథగణములవేషములను లెక్కింప నలవికాదు. ప్రేత పిశాచ యోగినులు అసంఖ్యాకముగా నుండిరి. (ఛం॥)

ఆ భూతప్రేతములు పరమానందముతో పాటలు పాడుచు నాట్యములు సల్పుచు చూచుటకు వికారముగా నుండి విచిత్ర ధ్వనులను జేయుచుండెను. (సో॥ 93)

ఊరేగింపు ఇప్పుడు పెండ్లి కొడుకునకు తగినట్లు ఉండెను. వారు మార్గమధ్యములో వివిధములగు వినోదములు చేయుచుండిరి. ఇక్కడ హిమవంతుడు ఒక అపూర్వమైన వివాహమండపమును సిద్ధము చేయించెను. ఆయన ప్రపంచములోని చిన్న, పెద్ద పర్వతముల, అడవుల, సముద్రముల, నదుల, తటాకముల అధిదేవతలను ఆహ్వానించెను. కామరూపులైనట్టి వారు సుందరశరీరములతో సతీసమేతులై పరివారములతో హిమవంతుని గృహమునకు చేరిరి. స్నేహపూర్వకముగా మంగళగీతములను పాడిరి. పర్వతరాజు పెక్కు అతిథిగృహములను అలంకరింపజేసి, వారికై ఏర్పఱచెను. వారు తమతమ యోగ్యతలను అనుసరించి, వాటిలో చేరిరి. మనోహరమైన ఈ నగరశోభను తిలకించిన వారు బ్రహ్మసృష్టిని తక్కువగా భావించుచుండిరి. (చౌ॥ 1-4)

నిజముగా ఈ నగరవైభవము బ్రహ్మసృష్టిని మించియుండెను. వన-ఉపవన వాపీకూపతటాకముల శోభలు వర్ణనాతీతములు. ప్రతిగృహము మంగళ తోరణములతో ధ్వజపతాకములతో విలసిల్లుచుండెను. అచటి స్త్రీలు పురుషులు అందమైనవారు, చతురులు. వారి సౌందర్యములు మునుల మనస్సులను గూడ ఆకర్షించుచుండెను. (ఛం॥)

జగన్మాతయే అవతరించిన ఆ నగరశోభను ఎంతని వర్ణింపగలను? ఐశ్వర్యము, జయము, సుఖ సంపదలు అన్నియు ఒక్కచోటనే యుండెను. అవి నిత్య నూతనముగా వృద్ధిచెందుచుండెను. (దో॥ 94)

ఊరేగింపు నగరమును చేరుచున్నదనివినగానే నగరములో కోలాహలము అధికమాయెను. ఆ నగరశోభ ఇనుమడించెను. ఆహ్వానసంఘసభ్యులు తాము అలంకరించుకొని, తమ వాహనములను గూడ అలంకరించి, పెండ్లి కుమారుని, ఆయనపరివారములను సాదరముగా ఆహ్వానించుటకు ముందుకు నడిచిరి. దేవతాబృందములను జూచి, అందఱును ఆనందించిరి. శ్రీహరిని జూచి మిక్కిలి హర్షపులకితులైరి. కాని శివునిపరివారములను గాంచి, వారి వాహనములు భయముతో వెనుదిరిగి పరుగులు దీయసాగెను. యువకులు ధైర్యము వహించి, అచటనే నిలిచిరి. కాని పిల్లలు ప్రాణభీతితో పరుగులు దీసిరి. గృహములకు చేరిన పిమ్మట వారు వణకుచు తల్లిదండ్రులతో ఇట్లు చెప్పదొడంగిరి. "ఏమని చెప్పగలము? మాటలు వచ్చుట లేదు. ఇది పెండ్లి యూరేగింపా? లేక యముని సైన్యమా? పెండ్లికుమారుడు పిచ్చివాడు. ఎద్దుపై నెక్కి వచ్చుచున్నాడు. సర్పములు, కపాలములు, భస్మము ఆయన ఆభరణములు. (చౌ॥ 1-4)

పెండ్లికుమారుడు శరీరముపై భస్మమును పూసికొని, సర్పములను, కపాలములను ధరించి యుండెను. అతడు దిగంబరముగా జటాధారియై భయంకరముగా ఉండెను. ఆయన వెంట భయంకరముఖములుగల భూతప్రేతపిశాచయోగినులును, రాక్షసులును గలరు. ఈ వరుని ఊరేగింపునుజూచి, బ్రతికినవాడు పుణ్యాత్ముడు. అతడే (ఆ బ్రతికి యున్నవాడే) ఈ పార్వతీవివాహమును జూడగలడు"- ప్రతియింటిలోను బాలురు ఈ మాటలనే పలుకుచుండిరి. (ఛంద్)

ఇదియంతయు శివునిపరివారము-అని తెలిసికొని పెద్దలు నవ్వుకొనిరి. వారు పిల్లలకు పెక్కురీతుల నచ్చజెప్పి, భయపడవలదని ధైర్యమునుగొల్పిరి. (దో॥ 95)

ఆహ్వానసంఘసభ్యులు పెండ్లికుమారుని, ఆతనిపరివారములను కలిసికొని, వారిని సాదరముగా తగిన విడిది గృహములకు చేర్చిరి. పార్వతితల్లియగు మేనాదేవి మంగళహారతిని వెలిగించెను. ఇతర స్త్రీలు మంగళగీతములను పాడిరి. ఆమె బంగరుహారతిపళ్లెమును చేతబట్టుకొని ద్వార (వర) పూజ చేయుటకు బయలుదేఱెను. స్త్రీలు ఆ మహాదేవుని జూడగానే భయచకితలైరి. వారు తమఇండ్లలో దూరిరి. శివుడు తనవిడిదిగృహమున ప్రవేశించెను.

మేనాదేవి తనహృదయమున మిక్కిలి పరితాపమునొందెను. పార్వతిని పిలిచెను. ప్రేమతో కుమార్తెను తనయొడిలో కూర్చుండబెట్టుకొని, నల్లకలువలవంటి తనకనులనుండి అశ్రువులను రాల్చుచు ఇట్లనెను. "మూర్ఖుడైన విధాత నిన్ను ఇంత అందముగా సృష్టించి, నీకు ఒక పిచ్చివానిని భర్తగా జేసెను. (చౌ॥ 1-4)

నిన్నింతఅందముగా సృష్టించినవిధాత నీకు ఈ పిచ్చివానిని భర్తగా ఎట్లు నిర్ణయించెను? కల్పవృక్షమునకు కాయవలసినఫలము ఒక తుమ్మచెట్టును ఎట్లు చేరును? నిన్ను నాచేతులలో ఉంచుకొని, గిరిశిఖరములనుండి క్రిందికి దూకెదను. అగ్నిలో పడెదను లేదా సముద్రములో మునిగెదను. నా ఇల్లు ఏమైపోయినను సరే. ప్రపంచమున నాకు అప్రతిష్ఠ వచ్చినను రానిమ్ము. నా కంఠములో ప్రాణమున్నంతవఱకు ఈ పిచ్చివానితో నీ వివాహము జరుగనీయను."- అనివల్కెను. (ఛం॥)

హిమవంతునిపత్ని దుఃఖితురాలగుటజూచి ఇతరస్త్రీలుగూడ మిగులవగచిరి. కుమార్తెపై తనకుగలప్రేమను తలచుకొని, మేనాదేవి మిగుల విలపించెను. (దో॥ 96)

"ఇట్టిపిచ్చివానికొఱకు తపస్సుచేయుమని పార్వతికి ఉపదేశించి, నా ఇంటిని గూల్చుటకుపూనుకొనిన నారదునకు నేను ఏమి అపకారము చేసియుంటిని? నిజముగా ఆయనకు ఎవ్వరిపైనను ప్రేమ, మమకారములు లేవు. నిర్ధనుడు, ఇల్లు-ఇల్లాలు లేనివాడు, ఉదాసీనుడు ఇతరులకాపురములను కూల్చువాడు, సిగ్గు-భయము లేనివాడు, గొడ్రాలికి కడుపుతీపి ఏమి తెలియును?" (గొడ్రాలికి ప్రసవవేదన ఎట్లు తెలియును?) ఇట్లు తల్లి దుఃఖితయగుట చూచి, పార్వతీదేవి వివేకముతో మృదుమధురముగా ఇట్లు పలికెను. "అమ్మా! విధివ్రాతను తప్పించుటకు ఎవ్వరికిని సాధ్యముగాదు. నా ప్రారబ్ధమున పిచ్చివానిని భర్తగా పొందవలసియున్నచో ఇతరులను నిందించి ప్రయోజనము ఏమి? విధివ్రాతను నీవు చెఱపగలవా? అనవసరముగా మనస్సును పాడుచేసికొనవలదు. కళంకమును నెత్తిన వేసికొన వలదు. (చౌ॥ 1-4)

"మాతా! అనవసరమైన కళంకమును పొందవలదు. ఏడుపు మానుము. ఇది విచారింప వలసిన సమయము గాదు. నా నొసట వ్రాయబడిన సుఖదుఃఖములను నేనెచ్చటికిపోయినను అనుభవింపక తప్పదు." పార్వతీదేవి యొక్క ఈ సవినయకోమలవచనములను విని, స్త్రీలందఱును విధాతను నిందించుచు కన్నీరు గార్చిరి. (ఛంద్)

ఈ సమాచారమును దెలిసికొని, హిమవంతుడు నారదుని, ఇతర సప్తర్షులను వెంటబెట్టుకొని వచ్చెను. (దో॥ 97)

అప్పుడు నారదుడు ఉమాదేవి పూర్వజన్మ వృత్తాంతమునుజెప్పి, అందఱిని శాంతింప జేసెను. "మేనాదేవీ! నా మాటలను నమ్ముము. నీ కూతురు జగజ్జనని, భవాని, ఈమె ఆద్యంతములు లేని శక్తి స్వరూపిణి, శివునకు సర్వదా 'అర్ధాంగి' లోకసృష్టిస్థితిలయకారిణి, ఇచ్ఛా మాత్రమున మాయారూపమును ధరింపగలదు. పూర్వజన్మమున దక్షునిపుత్రికగానుండెను. అప్పుడామెనామధేయము సతీదేవి. ఆ అవతారమునగూడ ఆమె శంకరునే వివాహమాడెను. ఇదిలోకవిదితము. ఒకనాడు శివునితో గూడి గృహోన్ముఖురాలై వచ్చుచుండగా రఘుకులతిలకుడైన శ్రీరామునిముఖసరోజమును జూచెను. శివుని మాటలను లెక్కింపక భ్రమవశమున సీతాదేవిరూపమును దాల్చెను. (చౌ॥ 1-4)

సీతాదేవి రూపమును దాల్చిన దోషమునకు శంకరుడీమెను పరిత్యజించెను. పతివియోగమును సహింపజాలక ఈమె తనతండ్రియైన దక్షుని ఇంట యజ్ఞశాలయందు యోగాగ్నిలో దగ్ధమయ్యెను. మఱల మీ గృహమున జన్మించి, శివుని తనపతిగా పొందుటకు కఠోరతపమాచరించినది. ఈ విషయములను ఎఱింగి, మీ సందేహమును వీడుడు. గిరిజాదేవి సర్వదా శివుని అర్ధాంగియే". (ఛం॥)

నారదుని వచనములను వినినంతనే ఎల్లరిశోకములు తొలగిపోయినవి. క్షణములోనే ఈ వృత్తాంతము ఇంటింటికిని వ్యాపించెను. (దో॥ 98)

మేనాదేవియు, హిమవంతుడును పార్వతీదేవిదివ్యత్వమును తెలిసికొని, ఆనందపరవశులై ఆమెకు పాదాభివందనమొనరించిరి. పౌరులెల్లరును స్త్రీలు, పురుషులు, బాలురు బాలికలు, యువకులు, వృద్ధులును మిక్కిలి ఆనందముతో పొంగిపోయిరి. అందఱును మంగళగీతములను పాడిరి. నానావిధసువర్ణకలశములను అలంకరించిరి. పాకశాస్త్ర ప్రావీణ్యముతో కమ్మని భోజన పదార్థములనుసిద్ధపఱచిరి. జగన్మాతయైన భవానీనివాససదనమునందలి వంటలరుచులను వర్ణింపనెవరితరము? హిమవంతుడు బ్రహ్మ,విష్ణువు మొదలగు దేవతలను అందఱిని సాదరముగా ఆహ్వానించెను. అతిథులు బారులుతీరికూర్చుండియుండగా నిపుణులైనవారు ఆహారపదార్థములను వడ్డించిరి. స్త్రీలు కోమల స్వరములతో సరసోక్తులాడిరి. (చౌ॥ 1-4)

సుందరీమణులు మధురగానములతో వ్యంగ్య ధోరణిలో సరసముగా హాస్యములాడిరి. దేవతలందఱును వాటిని విని, అమితానందముతో నెమ్మది నెమ్మదిగా భుజించిరి. అప్పటివేడుకలను ఆనందములను కోటిగొంతులుగూడ పూర్తిగా వర్ణింపజాలవు. భోజనానంతరము వారు తాంబూలములను సేవించి, తమ తమ విడుదులకు జనిరి. (ఛం॥)

మునులు హిమవంతునకు లగ్నపత్రికలను చదివి వినిపించిరి. వివాహ ముహూర్తము సమీపించినదని మఱల దేవతలను ఆహ్వానించిరి. (దో॥ 99)

హిమవంతుడు సాదరముగా దేవతలనందఱిని వివాహవేదికకు ఆహ్వానించి, వారిని ఉచితాసనములపై కూర్చుండబెట్టెను. వేదిక వేదోక్తముగా సిద్ధపఱచబడెను. ముత్తైదువలు కల్యాణ గీతములను పాడిరి. ఒక దివ్యసుందరసింహాసనమును వేదికపై ఏర్పఱచిరి. దానిసౌందర్యము వర్ణనాతీతము. ఏలనన అది బ్రహ్మనిర్మితము. వేదమూర్తులైన బ్రాహ్మణులకు నమస్కరించి, శ్రీరాముని మనసా ధ్యానించి, శివుడాసింహాసనమును అలంకరించెను. పిదప మహర్షులు పార్వతీదేవిని ఆదరముతో ఆహ్వానించిరి. సఖులు ఆమెను అలంకరించి, వెంటబెట్టుకొనివచ్చిరి. ఆమెరూపలావణ్యములకు దేవతలందఱును ముగ్ధులైరి. ఆమెసౌందర్యమును ఎంతటిమహాకవియు వర్ణింపజాలడు. ఆమెను జగన్మాతయైన భవానిగా గుర్తించి దేవతలందఱును మనస్సులలో ప్రణామములాచరించిరి. ఆమె సౌందర్యనిధి. ఆమెరూపరేఖావిలాసములను వర్ణింప ఎవ్వరికిని తరముగాదు. (చౌ॥ 1-4)

జగజ్జనని పార్వతీదేవి సౌందర్యమును వర్ణించుటకు కోటి కంఠములుగూడ చాలవనగా మందమతియైన తులసీదాసు ఎట్లు వర్ణింపగలడు? వేదములు, శేషుడు, సరస్వతీ దేవిగూడ అందుకు చాలరు. సౌందర్యరాశియైన భవానీమాత మండపమునకు వచ్చి, శివుని పాదరవిందములను దర్శించుటకు సిగ్గుపడెను, కాని వాటి మకరందమును ఆమె మనోభ్రమరము గ్రోలెను. (ఛం॥)

మునులఆదేశముప్రకారము శివపార్వతులు మొట్టమొదట మహాగణపతిని పూజించిరి. ఈ పూజావిషయమున ఎవ్వరికిని సందేహము రానక్కర లేదు. ఏలనన దేవతలు అనాది కాలమునుండియు కలరు. (దో॥ 100)

మహర్షులు వేదోక్తపద్ధతిలో వివాహకార్యక్రమమును జరిపించిరి. హిమవంతుడు కుశపాణియై పార్వతిదేవిహస్తమును శివునిచేతిలో నుంచి, వారి 'పాణిగ్రహణ' మహోత్సవమును జరిపెను. ఈ పాణిగ్రహణమహోత్సవమును దర్శించినదేవతలహృదయములు ఆనందడోలికలలో ఊగెను. మునీశ్వరులు వేదాశీర్వచనమంత్రములను పఠింపగా అక్కడివారందఱును 'జయ-జయ' ధ్వానములు గావించిరి.

వివిధవాద్యసంగీతగోష్ఠులు నిర్వహింపబడినవి. ఆకసమునుండి పుష్పవృష్టి గురిసినది. శివపార్వతులకల్యాణమహోత్సవము సకలలోకములకును ఆనందదాయకమయ్యెను. వరదక్షిణగా దాసదాసీలు, రథములు, గుఱ్ఱములు, ఏనుగులు, ఆవులు, వస్త్రములు, మణులు, వివిధములగుఆహారపదార్థములు, సువర్ణపాత్రలు, మొదలగునవి అన్నియును శివునకు సమర్పింపబడెను.అవి బండ్లపై వారి బసలకు చేర్చబడెను. (చౌ॥ 1-4)

అనేకవిధములైన కానుకలను వరదక్షిణగా సమర్పించి, హిమవంతుడు చేతులు జోడించి, యిట్లు పలికెను- "ఓ పరమేశ్వరా! మీరు పూర్ణకాములు. మీకు నేనేమి ఇయ్యగలను?" అని శివుని పాదపద్మములకు ప్రణమిల్లెను. కృపాసాగరుడైన శంకరుడు హిమవంతుని అనేకవిధముల ప్రసన్నునిగా చేసెను. పిమ్మట మేనాదేవియు సంతుష్టాంతరంగయై శివునిపాదములకు మోకరిల్లి ఇట్లనెను. (ఛం॥)

"ఓ ప్రభూ! నా కుమార్తెయైన ఈ ఉమ నాకు ప్రాణాధిక ప్రియమైనది. మీరు ఈమెను ఇల్లాలుగా సేవకురాలుగా స్వీకరింపుడు, ఈమె అపరాధములను అన్నింటిని మన్నింపుడు, దయతో ప్రసన్నచిత్తులై నాకీవరమును ప్రసాదింపుడు. (దో॥ 101)

శివుడామెకు పెక్కురీతుల నచ్చజెప్పెను. ఆమె శివునిపాదములకు నమస్కరించి, 'ఉమ'ను ఒడిలో కూర్చుండబెట్టుకొని ఇట్లుపదేశించెను. "సర్వదా శంకరునిపాదములను పూజింపుము. ఇదియే స్త్రీ ధర్మము. భార్యకు భర్తయే దైవము"- ఇట్లనుచుండగా ఆమె కన్నులు ప్రేమాశ్రువులతో నిండెను. ఆమె మఱల తన కుమార్తెను గుండెకు హత్తుకొనెను. "విధాత స్త్రీలను ఎందులకు సృజించెను? పరాధీనకు స్వప్నములోగూడ సుఖము ఉండదు గదా!" ఇట్లు పలుకుచు మేనాదేవి ప్రేమ విహ్వలయయ్యెను. కాని దుఃఖించుటకు అది సమయముగాదని ధైర్యమువహించెను. మేనాదేవి మాటిమాటికిని పార్వతీదేవిని కౌగిలించుకొనుచు ఆమెకాళ్లపై బడెను. ఆమెప్రేమ మిక్కిలి ఉత్కృష్టముగానుండెను. అది వర్ణింపనలవిగానిదియై యుండెను. భవాని స్త్రీలందఱికిని వీడ్కోలు చెప్పి, తల్లి అక్కున జేరెను. (చౌ॥ 1-4)

పార్వతీదేవి తనతల్లినుండి వీడ్కోలు తీసికొనెను. అందఱుగూడ ఆమెను సముచితముగా ఆశీర్వదించిరి. ఆమె మాటిమాటికిని తల్లివైపు తిరిగి చూడసాగెను. సఖులు ఆమెను శంకరునికడకు చేర్చిరి. శంకరుడు అర్థులను యోగ్యతానుసారముగా తగిన కానుకలతో తృప్తిపఱచి, 'ఉమ'తోగూడి, సపరివారముగా కైలాసమునకేగెను. దేవతలందఱును సంతోషముతో పుష్పవృష్టిని గురిపించిరి. ఆకాశమున నగారాలు మ్రోగెను. (ఛం॥)

హిమవంతుడు అత్యంతప్రేమాదరములతో పార్వతీపరమేశ్వరులను వీడ్కోలుపుటకై వారివెంట వెళ్లెను. శివుడు ఆయనను అన్నివిధముల సాదరవచనములతో సంతృప్తి పఱచి, పంపెను. (దో॥ 102)

వెంటనే పర్వతరాజైన హిమవంతుడు తనయింటికి చేరి, ఇతర పర్వతరాజులను, నదీదేవతలను పిలిచి, ఆదరాభిమానములతో సవినయముగా కానుకలతో సన్మానించి, వీడుకొలిపెను. శివుడు కైలాసమునకు చేరగానే దేవతలందఱును తమతమ నివాసములకు వెళ్ళిరి. పార్వతీపరమేశ్వరులు జగత్తునకే తలిదండ్రులు. కావున ఆ దంపతులశృంగారవర్ణనమును ఈ తులసీదాసు చేయడు. శివపార్వతులు అనేక భోగభాగ్యములతో తులతూగుచు తమప్రమథగణములతో కైలాసమున ఉండిరి. ప్రతిదినము వినోదకాలక్షేపములు జరుగుచుండెను. ఇట్లు చాలకాలముగడిచినపిదప వారికి 'షణ్ముఖుడు' ఐన కుమారస్వామి జన్మించెను. అతడు యుద్ధములో తారకాసురుని సంహరించెను. ఈ కథ వేద,పురాణ,శాస్త్రములలో వర్ణింపబడినది. ఇది జగద్విదితము. (చౌ॥ 1-4)

షణ్ముఖుని జన్మవృత్తాంతము, కర్మకౌశలము, శౌర్యపరాక్రమములు, అద్భుతపౌరుషము లోకప్రసిద్ధములు. కావున పరమేశ్వరతనయుడైన కార్తికేయునిఇతివృత్తము మిక్కిలిసంక్షిప్తముగా తెలిపితిని. శివపార్వతుల వివాహగాథను చెప్పినవారును, వినినవారును, గానముచేసినవారును, స్త్రీ పురుషులందఱును తమతమకార్యములయందు విజయములను, వివాహాది శుభకార్యములయందు సుఖ సంతోషములను పొందుదురు. (ఛం॥)

గిరిజాపతియైనమహాదేవునిచరితము సముద్రమువలె అపారమైనది. వేదములుగూడ దానిని వర్ణింప జాలవు. మందబుద్ధియైన తులసీదాసు ఎట్లు వర్ణింపగలడు? (దో॥ 103)

మనోహరము, సుఖప్రదము ఐన శంభునిచరితము విని, భరద్వాజమహర్షి పరమానందభరితుడాయెను. ఆయనకు ఇంకను వినవలెనను కోరిక కల్గెను. నేత్రములు అశ్రుపూర్ణములాయెను. శరీరము రోమాంచమాయెను. భక్తి పారవశ్యమున ఆయన నోట మాటరాలేదు. ఆయన స్థితిని గమనించి, జ్ఞానియైన యాజ్ఞవల్క్యుడు ప్రసన్నుడై ఇట్లనెను. "మునీశ్వరా! నీ జన్మధన్యము. గౌరీశుడు నీకు ప్రాణసముడు. శంకరుని చరణకమలములయందు భక్తి లేనివాడు శ్రీరామునిదయకు కలలో గూడ పాత్రుడు కాలేడు. విశ్వనాథుడైన శివుని పాదములయందు నిర్మలభక్తి కలిగియుండుటయే శ్రీరామభక్తికి నిదర్శనము. శివునివంటి రామభక్తుడెవడు కలడు? నిరపరాధియైన సతీదేవినిగూడ పరిత్యజించి, శ్రీరఘునాథునియందు తనకుగల భక్తిశ్రద్ధలను ప్రతిజ్ఞాపూర్వకముగ ప్రకటించెను. శ్రీరామునకు శివునివంటి ప్రేమాస్పదుడెవ్వడు? (చౌ॥ 1-4)

నేను మొదటనే శివచరిత్రమును మీకు వినిపించి, మీ హృదయమునందలి రామభక్తి పారవశ్యమును గ్రహించితిని. మీరు శ్రీరాముని పవిత్ర సేవకులు, దోష రహితులు. (దో॥ 104)

నేను మీ గుణములను సత్స్వభావమును తెలిసికొంటిని. ఇప్పుడు శ్రీరాముని దివ్యగాధను మీకు తెలిపెదను. మునీశ్వరా! వినుడు. మీ సమాగమమువలన నాకుకలిగిన ఆనందమునకు మేరయేలేదు. శ్రీరామునిచరిత్రము అపారమైనది. నూఱుకోట్లమంది శేషులుగూడ దానిని వర్ణింపజాలరు. ఆ కోదండరామునిమీదనే నామనస్సును లగ్నమొనర్చి, ఆయనప్రేరణతో (అనుగ్రహముతో) నాకు తెలిసినంతవఱకు మీకు వివరింతును. వాగ్దేవియైన సరస్వతి ఒక ఆటబొమ్మ. అంతర్యామియైన శ్రీరాముడే సూత్రధారుడు. భక్తుడైన కవిపై ఆ రామునకు అనుగ్రహము కలిగినంతనే అతడు ఆ కవి హృదయమున సరస్వతీదేవిని నాట్యమాడించును. కృపాళువైన శ్రీరామునకు ప్రణమిల్లి, ఆయనఉజ్జ్వలగుణములను వర్ణించెదను. పార్వతీపరమేశ్వరుల నివాసస్థానమైన కైలాసము పర్వతములలో శ్రేష్ఠమైనది, రమణీయమైనది. (చౌ॥ 1-4)

సిద్ధులు, తపోధనులు, యోగులు, దేవతలు, కిన్నరులు, మునులు ఆ కైలాసమున నివసించు చుందురు. వారందఱును మిక్కిలిపుణ్యాత్ములు. వారు ఆనందస్వరూపుడైన పరమశివుని ఆరాధించుచుందురు. (దో॥ 105)

హరిహరులయెడ విముఖతగలవారు, భక్తి లేనివారు, కైలాసమును కలలోగూడ చేరలేరు. ఆ పర్వతముమీద విశాలమైన ఒకవటవృక్షము గలదు. అది ఆఱుఋతువులలోగూడ నిత్యనూతనముగా పరమసుందరముగా ఉండును. అచ్చట శీతలమందసుగంధపవనములు వీచుచుండును. ఆ చెట్టునీడ మిక్కిలి ఆహ్లాదకరము. పరమేశ్వరునకు అది విశ్రాంతిస్థానమని వేదములు తెలుపుచున్నవి. ఒకానొకప్పుడు శివుడు ఆ వృక్షచ్ఛాయకు చేరి, దానిచల్లనినీడలో హాయిని అనుభవించెను. ఆయన పులిచర్మముపై కూర్చొని, విశ్రాంతి తీసికొనుచుండెను. ఆయనశరీరము మల్లెపూలు, చంద్రుడు, శంఖములవలె తెల్లనికాంతితో శోభిల్లుచుండెను. ఆజానుబాహువుఐన శివుడు మునులవలె నారవస్త్రములను ధరించియుండెను. పాదములు అప్పుడే వికసించినఎఱ్ఱనిపద్మములవలెనుండెను. నఖకాంతులు

భక్తుల హృదయములలోని అజ్ఞానాంధకారమును రూపుమాపుచుండెను. ఆయన నాగాభరణుడు. భస్మముతో అనులిప్తమైన ఆయనశరీరచ్ఛాయ శరత్కాలపూర్ణిమనాటి చంద్రుని కాంతులను తిరస్కరించుచుండెను. (చౌ॥ 1-4)

శిరమున జటామకుటము, దానిపై గంగ, కమలములవంటి విశాల నేత్రములు, నీలవర్ణ శోభితమైన కంఠము, లలాటమున నెలవంక- ఈ విధముగా శివుడు శోభాయమానుడై యుండెను. (దో॥ 106)

# శివపార్వతుల సంవాదము

కామవిజేతయైన శంకరుడు మూర్తీభవించిన శాంతరసమువలె శోభిల్లుచుండెను. ఇదే మంచి సమయమని తలచి, భవాని ఆయనకడకు వచ్చెను. శివుడు తనఅర్ధాంగిని సాదరముగా తనవామభాగమున కూర్చుండబెట్టుకొనెను. పార్వతీదేవి మిక్కిలిప్రసన్నురాలై కూర్చొని, తన పూర్వజన్మ వృత్తాంతమును జ్ఞప్తికిదెచ్చుకొనెను. భర్తకు తనపైగల అమితానురాగమును గ్రహించి, ప్రసన్నచిత్తముతో మధురముగా ఇట్లనెను. సర్వలోకహితంకరమైన కథను ఆమె పరమేశ్వరునినుండి వినగోరెను. "ఓ విశ్వనాథా! త్రిపురారీ! ప్రభూ! నీ మహిమ ముల్లోకములయందును ప్రసిద్ధము. చరాచరప్రాణులు, నాగులు, మానవులు, దేవతలు- అందఱును మీ పాదపద్మములను సేవింతురు. (చౌ॥ 1-4)

ప్రభూ! మీరు సమర్థులు, సర్వజ్ఞులు, కల్యాణస్వరూపులు. అన్ని సద్గుణములకును, కళలకును కాణాచి. యోగజ్ఞానవైరాగ్యసముద్రులు. శరణాగతులకు మీరు కల్పవృక్షము. (దో॥ 107)

ఓ సుఖనిధీ! మీరు నాయెడ ప్రసన్నులైనచో, నిజముగా నన్ను మీ దాసురాలినిగా భావించినచో శ్రీ రఘురాముని కథలను చెప్పి, నా అజ్ఞానమును దూరము చేయుడు. ఓ శశిశేఖరా! కల్పవృక్షపునీడలో నివసించువానిని దారిద్ర్యదుఃఖము ఎట్లు దఱిజేరును? కనుక మీ సామీప్యము (నీడ)నున్న నాలో మతిభ్రమకు తావు ఉండకూడదు. పరమార్థతత్త్వమును తెలిసిన జ్ఞానులు, బ్రహ్మవాదులైన మునులు శ్రీరామచంద్రుని అనాదిబ్రహ్మగా పేర్కొందురు. శేషుడు, శారద, వేదములు, పురాణములు శ్రీరామునిగుణములను ప్రస్తుతిచేయుచుండును. మీరును అహర్నిశలు 'రామ రామ' యని సాదరముగా జపించుచుందురు. ఈ రాముడు అయోధ్యాపతికుమారుడైన శ్రీరాముడేనా? లేక జన్మరహితుడు, నిర్గుణుడు, ఊహాతీతుడు ఐన మఱియొక రాముడా? (చౌ॥ 1-4)

ఒకవేళ అతడు రాజకుమారుడేయైనచో నిర్గుణ బ్రహ్మ యెట్లగును? నిర్గుణ బ్రహ్మయే యైనచో భార్యావిరహమునకు లోనగుటయేమి? ఒకవైపు ఆయనయొక్క మానవోచితజీవనరీతిని, మఱియొకవైపు ఆయన యొక్క లోకోత్తర మహిమలను చూచుచు వినుచు నా మతి మిక్కిలి భ్రమకు లోనగుచున్నది. (దో॥ 108)

ప్రభూ! ఇచ్ఛారహితుడు, సర్వవ్యాపకుడు, సర్వసమర్థుడును ఐన మఱియొక పరబ్రహ్మయున్నచో ఆయననుగూర్చి నాకు వివరింపుడు. నా అజ్ఞానమునకు కినుకబూనవద్దు. నామోహమును దూరము చేయుడు. పూర్వజన్మలో నేను శ్రీరామునిమహిమలను వనమున చూడగల్గితిని. అప్పుడు మిక్కిలిభీతిచెంది ఆ మహిమలను నేను వివరింపజాలకుంటిని. అందువలన నామనస్సు కుదుటబడలేదు. దానికి తగినఫలితమును చక్కగాఅనుభవించితిని. నాకు ఇంకను ఆవిషయమున కొంచెము సంశయము గలదు. మీకు నమస్కరించెదను. దయతో నా సందేహమునుదీర్పుడు. అప్పుడుగూడ శ్రీరామ తత్త్వమునుగూర్చి నాకు మీరు బోధించియుంటిరి. కాని నేను గ్రహింపలేక పోయితిని. 'నాథా! అప్పటి ఆ ప్రసంగమును గుర్తుకు తెచ్చుకొని, నాపై కోపగింపకుడు. మునుపటిమోహము నాలో లేదు. ఇప్పుడు శ్రీరాముని కథాశ్రవణమునందు నాకు మిక్కిలిఅభిలాష కలదు. ఓ నాగభూషణా! శ్రీరామునిపవిత్ర గుణములవైభవములను వివరింపుడు. (చౌ॥ 1-4)

మీ పాదపద్మములకు శిరసా ప్రణమిల్లుచున్నాను. అంజలిఘటించి, వేడుచున్నాను. వేదముల సారమైన శ్రీరాముని తత్త్వయశో వైభవములను సంగ్రహముగా వర్ణింపుడు. (దో॥ 109)

స్త్రీగా దానిని తెలిసికొనుటకు నేను ఎంతవఱకు అర్హురాలనో ఎఱుంగను. త్రికరణశుద్ధిగా నేను మీదాసురాలను. సజ్జనులు ఆర్తులైన అర్హులకు ఎట్టి రహస్యములనైనను దాచక చెప్పెదరు. ఓ పరమేశ్వరా! నేను దీనురాలనై మిమ్ము ప్రార్థించుచున్నాను. శ్రీరఘునాథ వృత్తాంతమును దయతో వివరింపుడు. నిర్గుణ బ్రహ్మమైన భగవంతుడు సగుణస్వరూపుడుగా ఏల అవతరించెనో తెల్పుడు. శ్రీరాముని అవతారకారణము, ఆయన బాల్యలీలలు, జానకితో వివాహము, రాజ్యత్యాగము మున్నగు విషయములను అన్నింటిని తెల్పగలరు. ఇంకను వనవాససమయమున ఆయనయొక్క అద్భుతకృత్యములు, రావణుని వధించినరీతి, రాజ్యాభిషిక్తుడైన పిదప ఆయన లీలలు - వీటన్నింటిని సమగ్రముగా తెల్పుడు. (చౌ॥ 1-4)

ఓ కృపానిధీ! రఘువంశమణియైన శ్రీరాముడు తనఅద్భుతలీలలను ప్రకటించినపిదప తనను ఆశ్రయించిన వారితోపాటు పరంధామమును చేరినరీతినిగూడ తెల్పుడు. (దో॥ 110)

ప్రభూ! జ్ఞానులైన మునులు సర్వదా నిమగ్నులైయుండు భగవత్తత్త్వమును, భక్తి, జ్ఞాన, విజ్ఞాన, వైరాగ్యములనుగూర్చి వేర్వేఱుగా తెల్పుడు. శ్రీరామునివృత్తాంతమునందుగల ఇతరగోప్యవిషయములనుగూడ విశదపఱచుడు. స్వామీ! మీ జ్ఞానము అత్యంతనిర్మలమైనది. నేను ప్రస్తావింపని విషయములేవైనను ఉన్నచో వాటినిగూడ వివరింపుడు. మీరు సర్వలోకములకును గురువులని వేదములు ప్రకటించుచున్నవి. సామాన్యులకు ఈ తత్త్వరహస్యములెట్లు తెలియును?" పార్వతీదేవిప్రశ్నలు నిష్కపటములై సహజసుందరములగుటవలన శివుడు ఆమెయెడల మిక్కిలిప్రసన్నుడాయెను. శ్రీరామచంద్రునిచరితమంతయును ఆ మహాదేవునిమనసునందు నిండారెను. శ్రీరాముని దివ్య మంగళరూపమూ లీలావిలాసములును ఆయనహృదయదర్పణమునందు ప్రతిఫలించెను. ప్రేమాతిరేకముచే శరీరము పులకరించెను. పరమానందస్వరూపుడైన శంకరునకే అమితానందము కలిగెను.

(చౌ॥ 1-4)

పరమేశ్వరుడు క్షణకాలముపాటు ధ్యానమగ్నుడాయెను. పిదప ఎట్టకేలకు బాహ్యస్మృతికి వచ్చెను. అమితానందముతో శ్రీరామచరితమును వర్ణింప సాగెను. (దో॥ 111)

"అజ్ఞానికి త్రాడు సర్పమువలె తోచినట్లు రామతత్త్వమును ఎఱుగని వారికి ఈ మిథ్యాప్రపంచము సత్యముగా భాసించును. నిదురనుండి మేల్గొనినవారికి స్వప్నజగత్తు మాయమైనట్లు శ్రీరామతత్త్వజ్ఞులకు ఈ మాయాజగత్తు అదృశ్యమగును. శ్రీరామనామమును జపించినంతమాత్రముననే సర్వసిద్ధులును అనాయాసముగా లభించును. దశరథునిప్రాంగణమున క్రీడించు మంగళ మూర్తియు, పాపహారియు అగు శ్రీరామచంద్రునిబాలస్వరూపమునకు నేను ప్రణమిల్లెదను. ఆయనకృప నాపై ప్రసరించుగాక." త్రిపురారియైన శివుడు ఈ విధముగా శ్రీరాముని స్మరించి, నమస్కరించి, ఆనందభరితుడై అమృతమయవచనములను ఇట్లు పలికెను. "పార్వతీ! నీవు ధన్యురాలవు. లోకోపకారమున నీకు ఎవ్వరును సాటిరారు. శ్రీరఘురాముని కథాప్రసంగము జగత్పావనిగంగవలె లోకములను పవిత్రమొనర్చును. ఆ రాఘవుని చరణ కమలములపైగల భక్తిచే లోకకల్యాణమునకై నీవు ఇట్లు ప్రశ్నించితివి.

(చౌ॥ 1-4)

పార్వతీ! శ్రీరామునికృపచే స్వప్నమునగూడ శోకమోహసందేహభ్రమలు నీ మనస్సునందు ప్రవేశింప జాలవు.

(దో॥ 112)

ఐనను నీవు అప్పటి సందేహములనే ప్రకటించితివి. ఆ సందేహములను నివృత్తి చేయువారికిని, వాటిని వినెడి వారికిని శుభములే కలుగును. హరికథలను వినని చెవులు పాములపుట్టలు. సజ్జనులను దర్శింపనివారికన్నులు

నెమలియాకలకన్నులు. శ్రీహరి పాదములపైనను, గురుచరణముల మీదను మోకరిల్లని శిరస్సులు కటుతుంబ(చేదుగుమ్మడి)కాయలు. శ్రీహరిభక్తిశూన్యమైనహృదయముగలవాడు జీవన్మృతుడు. శ్రీరాముని గుణములను కీర్తింపని నాలుక కప్పనాలుక. శ్రీహరి కథలు విని, ఆనందింపని వాని హృదయము వజ్రాయుధము(వజ్రము) వలె అతికఠోరమైనది, నిష్ఠురమైనది. కనుక ఓగిరిజా! దేవతలను ఆనందింపజేయునదియు, దైత్యులను మోహింప జేయునదియు ఐన శ్రీరామలీలాగాథను వినుము. (చౌ॥ 1-4)

రామకథ కామధేనువువలె భక్తులకోర్కెలనుదీర్చి, వారికి సుఖములను గూర్చును. సాధుసమాజము దేవతలకు నివాసస్థానము. ఈ కీలకమును ఎఱిగినవాడు ఈ కథను వినియేతీరును. (దో॥ 113)

శ్రీరామునికథలనెడి కరతాళములు (చప్పట్లు) సంశయములనెడి పక్షులను పాఱద్రోలును. రామకథ కలియుగ మనెడి వృక్షములను (కలియుగ పాపములను) నిర్మూలించు కుఠారము(గొడ్డలి). ఓ గిరిరాజకుమారీ! సాదరముగా వినుము శ్రీరామునిసుందరనామధేయము, గుణములు, చరితము, జన్మ, కర్మలు, అగణితములు(లెక్కింపనలవి కానివి). శ్రీరామచంద్రుడు అనంతుడు. అట్లే అతని గుణ గణములు, కీర్తి, కథలు అపరిమితములు. రాముని యెడల నీకుగల కుతూహలమును జూచి, నేను విన్నరీతిగా యథాశక్తి నీకు తెలిపెదను. నీ ప్రశ్నలు సహజమనోహరములు, సుఖప్రదములు, సజ్జన సమ్మతములు, నాకును హర్షోల్లాసములను గూర్చునవి. కాని "వేదములచే ప్రశంసింపబడువాడును, మునులచే ధ్యానింపబడువాడును అగు రాముడు మఱియొకడు ఉండ వచ్చును." అను నీ వచనము నాకు ఆమోద యోగ్యము గాదు. బహుశా మోహవశమున నీవు అట్లు అనియుండవచ్చును. (చౌ॥ 1-4)

మోహపిశాచముచే ఆవహింపబడిన వారును, పాషండులును, హరిచరణసేవావిముఖులును, సత్యాసత్యములను గ్రహింపజాలనిఅధములును, అట్టి మాటలను పలుకుదురు, విందురు. (దో॥ 114)

అజ్ఞానులు, మూర్ఖులు, అంధులు, నిర్భాగ్యులు, మనోదర్పణములపై విషయమాలిన్యములుగలవారు, సంసారలంపటులు, కపటులు, కుటిలురు, స్వప్నమునగూడ సజ్జనులనుగూర్చి స్మరింపనివారు, యుక్తాయుక్తవిచక్షణలేనివారు వేదవిరుద్ధములైనవచనములను పలికెదరు. హృదయదర్పణము మసిబారి, నేత్రహీనులైనవారు అత్యంతకృపణులు, శ్రీరాముని దర్శింప జాలరు. పరమాత్మయొక్క నిర్గుణసగుణరూపములను ఎఱుగనివారు, అంతులేని అసత్యప్రలాపములను ఆడెడి వారు, హరి మాయకు వశులై జగత్తులో పరిభ్రమించెడివారు ఏమైనను పలుకగలరు. వాయుప్రకోపబాధితులు, భూతవశులు, ఉన్మాదులు తెలివితక్కువగా మాటలాడుదురు. మహామోహమదిరాపాన మత్తులమాటలను లెక్క చేయరాదు. (చౌ॥ 1-4)

ఓ గిరిరాజకుమారీ! నా పలుకులను ఆలకించి, నీ సందేహములను అన్నింటిని విడనాడుము. శ్రీరాముని చరణములను భజింపుము. నా వచనములు భ్రమతమస్సులను పాఱద్రోలు సూర్యకిరణములు. (సో॥ 115)

సగుణనిర్గుణబ్రహ్మలకుమధ్య ఎట్టిభేదమూ లేదని వేదశాస్త్ర పురాణములు ప్రతిపాదించుచున్నవి. పండితులు, మహర్షులు దీనిని ఎలుగెత్తి చాటుచున్నారు. నిర్గుణుడు, నిరాకారుడు, అజుడు, అగోచరుడు ఐన పరమాత్మయే భక్తులప్రేమలకువశుడై సగుణుడు అగుచున్నాడు. నిర్గుణుడు సగుణుడెట్లగు చున్నాడు? నీరు మంచుగా మాఱును. వాస్తవముగా ఆ రెండింటికి మధ్య ఎట్టి భేదమూ లేదు. అట్లే భగవంతుని సగుణ నిర్గుణ స్వరూపములలో భేదము ఏ మాత్రమూ లేదు. శ్రీరామనామోచ్చారణయే భ్రమయనెడి చిమ్మ చీకట్లను సూర్యకిరణములవలె పాఱద్రోలును. అట్టిమహిమాన్వితుడైన శ్రీరాముడు మోహవశుడైనాడనిపల్కుట చెల్లదు. శ్రీరాముడు సచ్చిదానందస్వరూపుడైన భాస్కరుడు. అచట అజ్ఞానమనెడి రాత్రి లేశమాత్రముగూడ నిలువజాలదు. షడైశ్వర్యయుక్తుడగుపరమాత్మ సహజముగనే శాశ్వత ప్రకాశరూపుడు. అచ్చట విజ్ఞానమనెడి ప్రాతఃకాలముగూడ

ఉండదు. (రాత్రియే లేనప్పుడు ఇక ప్రభాతప్రస్తావనకు తావే ఉండదు గదా!) హర్షశోకములు, జ్ఞాన-అజ్ఞానములు, అహంకార-అభిమానములు బద్ధజీవుల లక్షణములు. శ్రీరామచంద్రుడు సర్వవ్యాపియైన పరబ్రహ్మ, పరమానందస్వరూపుడు, పరాత్పరుడు, పరమేశ్వరుడు, పురాణ పురుషుడు. ఇది లోక ప్రసిద్ధము. (చౌ॥ 1-4)

'పురాణపురుషుడు, తేజోనిధి, సకలరూపములలో వ్యక్తమగువాడు, మాయాజీవజగత్తులకు ప్రభువు, అని ప్రసిద్ధి కెక్కిన రఘుకులమణియైన శ్రీరామచంద్రుడు నాకు స్వామి" అని పలికి శ్రీరామునకు పరమశివుడు శిరసానమస్కరించెను. (దో॥ 116)

అజ్ఞానులు తాము భ్రమపడుచు తమమోహములను ప్రభువుపై ఆపాదించెదరు. మూర్ఖుడు మేఘావృతమైనఆకాశమునుజూచి, సూర్యుడు మేఘములచే కప్పబడినట్లు భ్రమపడుచుండును. తన వ్రేలితో కంటిని ఒత్తు కొనినవాడు ఆకాశముననున్న ఒకే చంద్రుని ఇద్దఱుగా చూచును. ఆకాశము నిర్మలమైనది, స్వచ్ఛమైనది, కాని అది అంధకారము, పొగ, ధూళి మున్నగు వానిచే కప్పబడినట్లు అజ్ఞాని భావించును. అట్లే మాయాతీతుడు, నిర్మలుడైన శ్రీరామచంద్రునిపై అజ్ఞాని తనమోహమును ఆపాదించును. విషయవస్తువులు ఇంద్రియముల చేతను, ఇంద్రియములు తదధిష్ఠాన దేవతలవలనను ఇంద్రియదేవతలు జీవాత్మలచేతను చైతన్యవంతములగుచున్నవి. కాని వీటన్నింటిని చైతన్య వంతములుగా చేయువాడు అయోధ్యాపతియు, పరమాత్మయు ఐన ఆ శ్రీరామచంద్రుడే. ఆయనయే ప్రకాశకుడు, అనాది, పరబ్రహ్మ. జగత్తంతయు ప్రకాశ్యము, శ్రీరాముడు ప్రకాశకుడు. అతడు మాయాధీశుడు. జ్ఞానగుణనిధి. ఆయనఅస్తిత్వమువలననే అచేతన (జడ) వస్తువులుగూడ మోహకారణముగ సత్యములుగా తోచును. (చౌ॥ 1-4)

సూర్యకిరణప్రకాశప్రభావమున సముద్రపుఆలిచిప్పలు వెండివలెను, ఎండమావులు జలమువలెను కనబడును. సర్వకాలములయందును ఇవి అసత్యములే యైనను ఈ భ్రమనుండి ఎవ్వరును తప్పించు కొనజాలరు. (దో॥ 117)

అదే విధముగా జగత్తంతయు శ్రీహరిపైననే ఆధారపడియున్నది. స్వప్నములో తల నరికివేయబడినచో మెలకువ వచ్చునంత వఱకును దుఃఖానుభవము కలుగుచునే యుండును. అట్లే అసత్యమేయైనను మోహమనెడి ఈ 'ఊబి' జీవునకు బాధాకరమేయగును. ఓ గిరిజా! ఈ భ్రమను తొలగింపగలవాడు కృపాళువైన శ్రీరాముడే. ఆయన ఆద్యంత రహితుడు, వేదములు గూడ ఊహించియే ఆయనను పొగడినవి. ఆతడు పాదములు లేకుండగనే నడచువాడు. చెవులు లేని శ్రోత, చేతులు లేని కార్య నిర్వాహకుడు, జిహ్వారహితముగ అన్నింటిని రుచి చూడగలవాడు. నోరులేని గొప్ప వక్త. శరీరము లేకున్నను స్పృశించువాడు. కన్నులు లేని ద్రష్ట. నాసిక లేకున్నను ఆఘ్రాణించువాడు. ఆ పరబ్రహ్మలీలలు అన్నియును అలౌకికములే. ఆయన మహిమలు వర్ణనాతీతములు. (చౌ॥ 1-4)

వేదములచే పండితులచే ఇట్లు ప్రస్తుతింపబడువాడును, మునులకు ధ్యేయమైనవాడును అగు ఆ పరమాత్మయే భక్తులకు హితమునుగూర్చుటకై దశరథపుత్రుడుగా, అయోధ్యాపతియైన శ్రీరామచంద్రుడుగా అవతరించెను. (దో॥ 118)

కాశీలో మరణించు ఏ ప్రాణినైనను నేను(శివుడు) రఘువరునినామమహిమచేత ముక్తునిగా జేయుదును. ఈ చరాచరజగత్తునకు ఆయన ప్రభువు. సర్వహృదయములను ఎఱిగినవాడు. యాదృచ్ఛికముగనైనను మనుష్యులు ఆయననామస్మరణచేసినచో అనేకజన్మలసంచితపాపములును దగ్ధములగును. భక్తితో ధ్యానించువారు సంసారసముద్రమును గోష్పాదసదృశమైన దానినిగా సులభముగా దాటగలరు. భవానీ! ఆ పరబ్రహ్మయే శ్రీరామచంద్రుడు. ఆయనవిషయమున ఎట్టి సందేహములకును తావులేదు. సందేహపడువానిమనస్సునుండి

జ్ఞానవైరాగ్యాది గుణములన్నియు తొలగిపోవును." భ్రమ నివారకములైన శివుని మాటలను విని, పార్వతీదేవి యొక్క సందేహములన్నియును తొలగిపోయెను. ఊహాజనితదారుణసంశయములు, తర్కవితర్కములు మటుమాయమయ్యెను. శ్రీరాముని పాదపద్మములయందు ఆమెకు భక్తి విశ్వాసములు ఇనుమడించెను.

(చౌ॥ 1-4)

శివునిపాదపద్మములకు మ్రొక్కి తనకరకమలములతో అంజలి ఘటించి, పార్వతీదేవి అమృతమయవాక్కులను ఇట్లు పలికెను. (దో॥ 119)

ఓ కృపానిధీ! మీ చల్లని మాటలు శరచ్చంద్ర కిరణములవలె ఆహ్లాదకరములు. అజ్ఞానజనితమైన నా మోహము శరదాతపము వంటిది. శరదృతువు నందు చల్లని చంద్రికలచే తాపము ఉపశమించినట్లు మీ శీతలవచనములచే నా మోహము తొలగిపోయినది.[1] మీరు నా సంశయములనన్నింటిని నివృత్తి చేసితిరి. ఇప్పుడు శ్రీరాముని యథార్థస్వరూపము తెలిసినది. నాథా! మీ దయవలన నా విషాదము దూరమైనది. మీ అనుగ్రహముచే నాకు సుఖశాంతులు లభించినవి. నన్ను మీ దాసురాలినిగా భావించి, నాయెడ ప్రసన్నభావము గలవారై, స్త్రీసహజచాపల్యముచే నేనడుగుచున్న ఈ ప్రశ్నకు సమాధానమును తెల్పుడు. శ్రీరాముడు పరబ్రహ్మ, జ్ఞానస్వరూపుడు, అవ్యయుడు, నిర్మలుడు, సర్వహృదయాంతర్యామి. ఓ వృషభధ్వజా! ఆయన మానుషరూపమును ఏల దాల్చెనో విశదీకరింపుడు? పార్వతీదేవియొక్క సవినయవచనములను ఆలకించి, శ్రీరామ వృత్తాంతమునెడ ఆమెకు గల మక్కువను గమనించి, (చౌ॥ 1-4)

జ్ఞానస్వరూపుడు, కామారి, కృపాళువుఐన శివుడు మనస్సులోఆనందించి, బహువిధముల ఆమెను ప్రశంసించుచు ఇట్లు పలికెను. (దో॥ 120. క)

(నవాహ్నిక పారాయణము - మొదటి విరామము)
(మాస పారాయణము - నాల్గవ విరామము)

# శ్రీరామావతార రహస్యము

ఓ భవానీ! శ్రీరామచరిత మానసమనెడి నిర్మలమైన, శుభంకరమైన కథను వినుము. మొదట దీనిని కాకభుశుండిముని పక్షిరాజైన గరుత్మంతునకు చెప్పెను. వారిసంవాదమునుగూర్చి మున్ముందు చెప్పెదను. మొదట రామావతారమునుగూర్చి వినుము. అది అతిసుందరము, పాపనాశకము. శ్రీహరిగుణములు, నామములు, కథలు, రూపములు అసంఖ్యాకములు, అపారములు. ఐనను యథాశక్తిగా తెల్పెదను. సాదరముగా వినుము.

(సో॥ 120. ఖ,గ,ఘ)

గిరిజా! మనోహరమైన, విస్తృతమైన, ఉజ్జ్వలమైన శ్రీహరిచరితములను నిగమాగమములు ప్రస్తుతించినవి. బుద్ధిమంతురాలా! శ్రీహరిఅవతారములకు కారణములను ఇదమిత్థముగా చెప్పలేము. వాటికి కారణములు అనేకములు. శ్రీరాముడు వాఙ్మనోబుద్ధులకు అందని వాడు. ఐనను సత్పురుషులు, మునులు తమతమ ప్రజ్ఞలను అనుసరించి శ్రీరాముని స్తుతించిరి. వేదములును, పురాణములును ప్రస్తుతించినవి. ఓ సుముఖీ! ధర్మమునకు గ్లాని ఏర్పడినప్పుడును, నీచులు, అసురులు, గర్వోన్మత్తులు విజృంభించి, చెప్పుటకువీలులేని అధర్మకార్యములకు పాల్పడినప్పుడును, బ్రాహ్మణులు, గోవులు, దేవతలు దుఃఖములకు లోనైనప్పుడును, భూభారము పెఱిగినప్పుడును కృపాళువైన శ్రీహరి ఆయా అవతారములను ధరించి, సాధు జనుల దుఃఖములను తొలగించుచుండును. (చౌ॥ 1-4)

1) ఆశ్వయుజమాసమున చిత్తకార్తెలో సూర్యకిరణ తాపము అధికముగా ఉండును దానిని 'శరదాతపము' అని యందురు. రాత్రి వేళలో వెన్నెల ప్రభావమున అది చల్లబడును.

హరి రాక్షసులను సంహరించి, దేవతలను రక్షించును. వేదమర్యాదలను కాపాడును. లోకములోతన ఉజ్జ్వలకీర్తిని విస్తరింప జేయును. ఇట్టి కారణములతో గూడినదే రామావతారము గూడా. (దో॥ 121)

ఈ విధముగా భక్తులు ఆయనయశోవైభవములను కీర్తించి, సంసార సాగరమును దాటుదురు. దయానిధియైన శ్రీహరి తనభక్తులహితమునకై అవతారములను దాల్చును. శ్రీరామజననమునకు పెక్కుకారణములు కలవు. ఒకదాని కంటె మఱియొకటి అద్భుతమైనది. భవానీ! ఆ కారణములలో ఒకటి రెండింటినిగూర్చి తెలిపెదను. శ్రీహరికి జయ-విజయులు అను ఇద్దఱు ప్రియమైన ద్వారపాలకులుండిరనుట సర్వవిదితము. సనకాది మునుల శాపకారణమున వీరు తామసస్వభావులైన రాక్షసులుగా జన్మించిరి. వారి పేర్లు హిరణ్యాక్షుడు, హిరణ్యకశిపుడు. వారు సురపతియైన ఇంద్రునిగూడ జయించి, వీరులుగా ప్రసిద్ధి కెక్కిరి. హిరణ్యాక్షుని వధించుటకు శ్రీహరి వరాహావతారమును దాల్చెను. నరసింహావతారమున హిరణ్యకశిపుని వధించి, భక్తప్రహ్లాదునికీర్తిని వ్యాపింప జేసెను. (చౌ॥ 1-4)

వారే మఱల రావణకుంభకర్ణులు-అనుపేర్లతో మహావీరులైన రాక్షసులుగా జన్మించిరి. వారు గొప్ప యోధులై దేవతలను గూడ జయించిరి. ఇది లోకవిదితము. (దో॥ 122)

సనకాదులశాపకారణమున జయ-విజయులు రాక్షసులుగా మూడు జన్మలెత్తవలసి యుండెను. కనుక హిరణ్యాక్ష, హిరణ్య కశిపులను భగవానుడు స్వయముగా సంహరించినను ఆ జన్మతో వారికి శాపవిముక్తి కలుగ లేదు. ప్రతిపర్యాయము తనభక్తులపైగల అనురాగమువలన భగవానుడు అవతారములను ఎత్తుచు వచ్చెను. ఒక అ(వామనా) వతారములో అదితి కశ్యపులు ఆయనకు తలిదండ్రులు. వారే రామవతారమున కౌసల్యాదశరథులు. ఒక కల్పములో ఈ విధముగా అవతారములనెత్తి భగవంతుడు జగత్తులో తన అద్భుత లీలలను ప్రకటించుచు వచ్చెను. మఱొక కల్పమున జలంధరుడను రాక్షసుడు దేవతలనందఱిని యుద్ధములో ఓడించెను. వారిఆపదలను నివారించుటకై మహేశ్వరుడుగూడ పెక్కుమాఱులు అతనితో భయంకరముగా పోరాడెను. కాని మహాశక్తిమంతుడైన ఆ రాక్షసుని వధింపలేకపోయెను. ఆ రాక్షసుని భార్యయైన బృందపాతివ్రత్య మహిమవలన త్రిపురాసుర సంహారియైన శివుడుగూడ వానిని వధింప లేకపోయెను. (చౌ॥ 1-4)

ఒక కపటోపాయముచే విష్ణుమూర్తి ఆమెపాతివ్రత్యమును భంగపఱచి దేవతలను కాపాడెను. ఈమోసమును గ్రహించినబృంద కుపితయై విష్ణువును శపించెను. (దో॥ 123)

లీలావిలాసుడు, కృపాళువు ఐన శ్రీహరి ఆమెశాపమును అంగీకరించెను. ఆ జలంధరుడే మఱొకకల్పమున రావణుడై జన్మించెను. శ్రీరాముడు యుద్ధమున ఆతనిని వధించి, వానికి మోక్షమును ప్రసాదించెను. శ్రీరాముడు మానవుడుగా అవతరించుటకు ఇదియొక కారణము. భరద్వాజా! వినుము. ప్రతి అవతారగాథను కవులు అనేకవిధములుగా గానముచేసిరి. శ్రీహరి మానవుడుగా అవతరించుటకు నారదునిశాపముగూడ ఒకకారణము. ఈ మాట వినగానే పార్వతీదేవి చకితురాలయ్యెను. "ఓ త్రిపురారీ! నారదుడు విష్ణు భక్తుడు, జ్ఞాని. అట్టి దేవర్షి భగవంతుని ఎందులకు శపించెను? లక్ష్మీపతి చేసిన అపరాధమేమి? ఆ గాథను విపులముగా తెల్పుడు. మునీశ్వరుని మనస్సుకూడ మోహావేశమునకు లోనగుట ఆశ్చర్యకరముగదా!" అని పలికెను. (చౌ॥ 1-4)

శివుడు నవ్వి ఇట్లనెను. "ఎవ్వడును జ్ఞానియు కాడు, మూఢుడును కాడు. శ్రీరఘునాథునిసంకల్పానుసారమే అన్నియు జరుగుచుండును. (దో॥ 124. క)

ఓ భరద్వాజా! శ్రీరాముని గుణగణములనుగూర్చి తెల్పెదను. సాదరముగా వినుము. తులసీదాసు చెప్పుచున్నాడు. మనసా! గర్వమును, స్వాభిమానమును వీడి, శ్రీ రఘునాథుని శరణుపొందుము. ఆయన నిన్ను ఈ భవసాగరమును దాటించును. (సో॥ 124. ఖ)

# నారదుని మోహము

హిమాలయ పర్వతమునందు అతి పవిత్రమైన గుహయొకటి గలదు. అది మిక్కిలిమనోజ్ఞము. దానిసమీపమున నిర్మలమైనగంగానది ప్రవహించుచుండును. అట్టి పవిత్రస్థలమునుజాచిన దేవర్షి నారదునిమనస్సు ఆహ్లాదభరిత మాయెను. ఆ పర్వతశిఖరములను, నదులను, వనములను చూచిన నారదమహర్షిలో శ్రీహరిభక్తి పెల్లుబికెను. భగవన్నామస్మరణవలన దక్షునిశాపమునుండి ("ఎచ్చటను నిలుకడలేక నీవు త్రిలోకసంచారమును చేయుచుందువుగాక" అనునది దక్షుని శాపము, దానినుండి) నారదుడు విముక్తుడాయెను. అతడు సమాధిలో మునిగి యుండెను. ఆ ముని యొక్క తపోనిమగ్న స్థితిని గుర్తించి, దేవేంద్రుడు భయపడెను. తపఃప్రభావముచే అతడు తన స్వర్గమును ఆక్రమించునేమో యని భీతిల్లెను. వెంటనే మన్మథుని రప్పించి, ఆదరసత్కారములను కావించి "నా మేలుకొఱకు నీవు నారదునితపస్సును భంగపఱచుము." అని పలికెను. ప్రపంచములో కామలోభ ప్రవృత్తులు గలవారు కాకులవలె ఎల్లప్పుడు ఇతరులను జూచి భయపడుచుండుట సహజము గదా! (చౌ॥ 1-4)

ఎండినఎముకను కొఱుకుచున్న ఒక తెలివిమాలినకుక్క సింహమును గాంచి, ఆ సింహము తననుండి ఆయెముకను లాగుకొనునేమోయని భయపడి, దానిని నోటగఱచుకొని పాఱిపోవును. దేవేంద్రుడు భయపడుట గూడ అట్టిదియే. (దో॥ 125)

నారదుని ఆశ్రమమునకు చేరి, మన్మథుడు వసంతమును సృష్టించెను. వృక్షములపై చిత్రవిచిత్రములగుపూవులు వికసించెను. కోకిలలు పంచమస్వరమును వినిపించెను. తుమ్మెదలు రొద చేయసాగెను. కామాగ్నిని రగిలింపజేయు శీతలమందసుగంధపవనములు వీచసాగెను. నవయువతులు, కామ కేళిలో ప్రవీణలైన రంభాది-అప్సరసలు అనేకరాగములలో పాటలు పాడిరి. కందుకాది వివిధ క్రీడలు సల్పిరి. మదనుడు తన సహాయకులను జూచి, సంతసించెను. అనేక-ఉపాయములను పన్నెను. నారదుని ముందర తనకపటోపాయములు పనిచేయకపోవుటచే మన్మథుడు భయపడెను. శ్రీహరి రక్షణలో ఉన్నవారి హద్దులను ఎవరు భంగపఱచ గలరు? (చౌ॥ 1-4)

మన్మథుడు తనఓటమిని అంగీకరించి, తనసహాయకులతోపాటు నారదుని పాదములపై బడి వినయముతోప్రార్థించెను. (దో॥ 126)

నారదుని మనస్సులో కోపము ఏమాత్రము లేదు. పైగా అతడు ప్రియవచనములతో మన్మథుని ఓదార్చెను. మన్మథుడు ఆయనపాదములకుమ్రొక్కి సెలవుగైకొని సపరివారముగా వెళ్లిపోయెను. అతడు దేవేంద్రునిసభకు వెళ్లి, తన ప్రయత్నవైఫల్యములను, నారదుని తపోనిష్ఠాగరిమనుగూర్చి వివరించెను. అందఱును ఆశ్చర్య పడి, నారదుని గొప్పదనమును పొగడిరి. శ్రీహరికి ప్రణమిల్లిరి. కాముని జయించితినమగర్వముతోగూడిననారదుడు పరమశివునికడకు వెళ్లి, ఆయనసమక్షమున తనస్వాతిశయమును ప్రకటించెను. పరమశివుడాయనను మందలించుచు ఇట్లనెను. "ఓ మునీ! స్వాతిశయముతోగూడిన నీ కామవిజయ గాథను ఎన్నడును విష్ణుమూర్తికడ ప్రస్తావింప వద్దు. సందర్భము వచ్చినను దానిని దాచియుంచుము. (చౌ॥ 1-4)

శివుని హితవచనములు నారదుని చెవికెక్కలేదు. ఓ భరద్వాజా! అనంతరము జరిగిన వినోద గాథను తెలిపెదను వినుము. శ్రీహరి సంకల్పము బలీయమైనది. (దో॥ 127)

శ్రీరాముని సంకల్పమే నెఱవేఱును. దానికి విరుద్ధముగా ఎన్నడును, ఏమియు జరుగదు. శివుని సూచనను పెడచెవిన బెట్టి, నారదుడు బ్రహ్మలోకమునకు వెడలెను. పిమ్మట ఆ గానకళావిశారదుడు మహతీనాదముతో శ్రీహరిని కీర్తించుచు, వేదశిరోభూషణుడైన శ్రీమహావిష్ణువు నివసించుక్షీరసాగరమును జేరెను. లక్ష్మీపతి లేచి, ఎదురేగి

దరహాసముతో నారదుని ఆహ్వానించి, "మునీశ్వరా! చాలాకాలమునకు విచ్చేసితిరి." అని పలికెను. శివుడు వారించినను లెక్కింపక తన కామవిజయగాథను విష్ణువునకు వర్ణించి చెప్పెను. శ్రీరఘునాథునిమాయ అనుల్లంఘ్యము. దానికి లోనుకానివారు ఈ ప్రపంచమున ఉండరు. (చౌ॥ 1-4)

శ్రీమహావిష్ణువు ఉదాసీనభావముతో విని, మృదుమధురముగా నారదునితో ఇట్లు పల్కెను. "మునీశ్వరా! మిమ్ము స్మరించినంత మాత్రముననే జనుల మోహము, మదము, కామము, అభిమానము మున్నగునవి అన్నియును దూరమగును. ఇంక మీ విషయము చెప్పనేల? (దో॥ 128)

"మునీశ్వరా! హృదయమున జ్ఞానవైరాగ్యములు లేనివారు మోహమునకు లోనగుదురు. మీరు బ్రహ్మచర్యవ్రతదీక్షాదక్షులు, ధీరులు. మిమ్ము మన్మథుడేమిచేయగలడు?"- నారదుడు స్వాతిశయముతో "ప్రభూ! ఇదియంతయు నీఅనుగ్రహఫలమే"- అనియనెను. దయాళువైన విష్ణువు ఆలోచించెను. "ఈ నారదుని హృదయములో దురభిమాన బీజము నాటుకొని మొలకెత్తినది. వెంటనే దానిని నిర్మూలించెదను. భక్తులను కాపాడుటయే నా వ్రతము. దీనికై ఒక సంఘటనను సృష్టించెదను.అది నారదునకు శ్రేయస్సును గూర్చును. అట్లు చేయుట నాకు లీలావిలాసము."- నారదుడు విష్ణువునకు వందన మాచరించి, అతి గర్వముతో వెళ్లిపోయెను. విష్ణువు తనమాయను ప్రేరేపించెను. ఆమాయాచర్యల ప్రాబల్యములను వినుము. (చౌ॥ 1-4)

విష్ణుమాయాప్రభావమున మార్గమధ్యమున వెంటనే నూఱుయోజనములవిస్తీర్ణముగల ఒకమహానగరము ఏర్పడెను. అందు నిర్మితములైన వివిధములగు భవన శోభలతో ఆ అద్భుతనగరము వైకుంఠమునుగూడ మించి పోయెను. (దో॥ 129)

ఆ నగరమునగల స్త్రీపురుషులందఱును రతీమన్మథులవలె అతిసుందరులు. ఆ నగరమును 'శీలనిధి' అను రాజు పాలించుచుండెను. అతని మహాసైన్యమున అసంఖ్యాకములైన అశ్వములు, గజములు, పదాతిదళములు గలవు. అతని వైభవము ఇంద్ర వైభవమునకు నూఱు రెట్లు అధికముగా ఉండెను. అతడు సహజముగనే సుందరరూపము, మహాతేజస్సు, గొప్పబలము, నైతికపటుత్వము గలవాడు ఆతనికూతురు విశ్వమోహిని. ఆమె అందచందములకు లక్ష్మీదేవియు ముగ్ధురాలగును. సర్వశుభలక్షణసంపన్నయైన ఆ రాజకుమారి మహా విష్ణువు యొక్క మాయాశక్తియే. ఆమె శోభను ఎట్లు వర్ణింపగలము? ఆమెకు స్వయంవరము చాటింపబడెను. పెక్కుమంది రాజులు అందులకై విచ్చేసియుండిరి. అతికుతూహలముతో నారదుడు అచటికి వచ్చి, నగరవాసులనుండి అన్ని విషయములను తెలిసికొనెను. రాజు తనభవనమునకు విచ్చేసిననారదుని సత్కరించి, ఉచితాసనముపై కూర్చుండ బెట్టెను. (చౌ॥ 1-4)

రాజు తనకుమార్తెను పిలిపించి, నారదమునికి చూపి, "ఓ మునీశ్వరా! ఈమె గుణదోషములను గూర్చి యోచించి, తెల్పుడు" అనియనెను. (దో॥ 130)

రాజకుమారి సౌందర్యమును చూడగనే నారదునివైరాగ్యము అంతయు మాయమై పోయెను. అతడామెను తదేకదృష్టితో చూడసాగెను. ఆమెశుభలక్షణములనుగాంచి నారదుడు తననుతాను మఱచిపోయెను. వెంటనే అతడు ఆమెపై మరులుగొనెను. కానిదానిని అతడు బయటికి ప్రకటింపలేదు. తనలోతాను ఇట్లు తర్కించుకొనెను. "ఈమెను వివాహమాడినవాడు అమరుడగును. వాని జన్మధన్యము. అతడు సర్వవిజేత. రణరంగమున ఆతనిని ఎవ్వరును జయింప జాలరు. ఈమె వరించిన వానికి చరాచర ములన్నియును సేవలొనర్చును." నారదుడు ఈ విధముగా ఆమెశుభలక్షణములను అన్నింటిని మనస్సున తర్కించుకొని, మురిసి పోయెను. బయటికి ఆమె లక్షణములలో కొన్నింటిని మాత్రమే తెల్పుచు, "ఈమె చాలా అదృష్టవంతురాలు" అని చెప్పి, వెళ్లి పోయెను. పిదప

అతడు తనలోతాను ఇట్లు ఆలోచించుకొనసాగెను. ఈ రాజకుమారి నన్ను వరించునట్లు చూచెదను. జపతపములకు ఇది సమయముగాదు. "విధాతా! ఈ కన్య నన్ను వరించునుపాయమేమి?" (చౌ॥ 1-4)

ఈ సమయమున నేను మిక్కిలిసుందరునిగా రూపొందవలెను. రాజకుమారి నన్ను జూచి, తన వరమాలను నామెడలోనే వేయువలెను. (దో॥ 131)

"ఈక్షణముననే శ్రీహరి కడకు వెళ్ళి, ఆయనసౌందర్యమును నాకిమ్మని ప్రార్థించెదను. కాని అచటికి వెళ్లుటకు చాలా సమయము పట్టును. ఆ హరితప్ప నాకు హితమొనర్చువారు మఱియొకరు ఎవ్వరును లేరు. ఈ సమయమున నాకు ఆయనయే దిక్కు." అని భావించి, నారదుడు శ్రీహరిని అనేక విధముల ప్రార్థించెను. లీలామయుడు, కృపాళువు ఐన నారాయణుడు తత్క్షణమే ప్రత్యక్షమాయెను. ఆ ప్రభువును గాంచి మునీశ్వరుడు మిక్కిలి సంతసించెను. ఆనందముతో అతని కన్నులు చెమ్మగిల్లెను. తన కోరిక తప్పక నెరవేరునని దృఢముగా నమ్మెను. తనకు సహాయపడుమని అత్యంత దీనుడై అతడు విష్ణుమూర్తిని వేడుకొనెను. "మీ సౌందర్యమును నాకు ప్రసాదింపుడు. నేను ఆమెను తప్పక వివాహమాడవలెను. ప్రభూ! నాకు త్వరగా మేలు చేయుడు. నేను మీదాసుడను. నాకు హితము కల్గునట్లు అనుగ్రహింపుడు." దీనదయాళువైన శ్రీమహావిష్ణువు తనమాయాప్రభావమును జూచి, నవ్వి ఇట్లనెను. (చౌ॥ 1-4)

ఓ నారద మహర్షీ! నీకు పరమహితమైనదానిని తప్పకచేయగలను. మఱొక విధముగా చేయను. నామాట ఎన్నడును అసత్యము గాదు. (దో॥ 132)

"మునీశ్వరా! వినుము. ఒక వ్యాకులుడైనరోగి తనకు హానికరమైన ఆహారమును అడిగినచో వైద్యుడు దానిని ఇయ్యడు. అట్లే నేను నీకు హితమును గూర్చుటకే నిశ్చయించితిని." అనిచెప్పి, శ్రీహరి అచటినుండి అంతర్ధానమయ్యెను. మాయామోహితుడైన నారదుడు శ్రీహరివచనముల అంతరార్థమును గ్రహింపలేక పోయెను. పిమ్మట అతడు స్వయంవర మంటపమునకు చేరెను. చక్కగా అలంకృతులైన రాజన్యులెల్లరును సపరివారముగా విచ్చేసి, సముచితాసనములపై ఆసీనులైయుండిరి. మహర్షి తనలో తాను ఉప్పొంగి పోవుచుండెను. "నా రూపలావణ్యములను జూచిన రాకుమారి నన్నే వరించును. ఇతరులను వరింపదు." అని తలంచుకొనుచుండెను. మహర్షిహితమునుగోరి భగవంతుడు అతనిని కురూపిగా మార్చెను. కాని ఎవ్వరును అతనిమార్పును గమనింపనేలేదు. నారదుడనియే భావించి, అందఱును ఆయనకు మ్రొక్కుచు ఉండిరి. (చౌ॥ 1-4)

అచ్చట శివునిప్రమథగణములలోనివారు ఇద్దఱుండిరి. వారికి ఈ రహస్యమంతయును తెలిసియుండెను. వారు బ్రాహ్మణ వేషములలో సంచరించుచు ఈ వినోదమును చూచుచు ఆనందించుచుండిరి. (దో॥ 133)

నారదుడు తనసౌందర్యమునుగూర్చి మిక్కిలిగర్వముతో ఉండెను. నారదుడు కూర్చున్నవరుసలోనే ఈ శివగణములవారుగూడ కూర్చొని యుండిరి. వారు బ్రాహ్మణ వేషములలో ఉండుటచే వారినిజస్వరూపములను ఎవ్వరును తెలిసికొనలేక పోయిరి. నారదునికి వినబడునట్లుగా వారు వ్యంగ్య వచనములను పలుకుచుండిరి. "శ్రీహరి ఈయనకు చాల అందమైన రూపమును ఇచ్చినాడు. రాజకుమారి ఈయనను చూడగనే ముగ్ధురాలై హరి (వానరము) అని తలచి ఇతనినే వరించును."- నారదుడు మోహ పరవశుడై యుండెను. వారి పరిహాసములను విన్నను అతడు వాటి వ్యంగ్యార్థములను గ్రహింప లేదు. శివ గణములవారు ఈ వినోదమునకు ఆనందించుచుండిరి. ఈ విశేష దృశ్యమును ఎవ్వరును చూడలేదు. కేవలము రాజకుమారి మాత్రము ఆతని నిజస్వరూపమును జూచెను. అతనివానరముఖమును భయంకరాకారమునుజూచి ఏవగించు కొనెను. (చౌ॥ 1-4)

రాజకుమారి తనసఖులతోగూడి రాజహంసవలె నడచుచు సభలో ప్రవేశించెను. ఆమె వరమాలను చేతబట్టి రాజన్యులను అందఱిని జూచుచు ముందుకు సాగుచుండెను. (దో॥ 134)

నారదుడు కూర్చున్న వైపు ఆమె కన్నెత్తియైనను చూడలేదు. నారదుడు పదే పదే నిలబడుచు వ్యాకులుడగుచుండెను. అతని స్థితిని గాంచి శివగణముల వారు నవ్వుకొనుచుండిరి. కృపాళువైన శ్రీహరి రాజు వేషములో అచటికి (ఆ సభకు) విచ్చేసెను. రాజకుమారి అతిహర్షముతో వరమాలను ఆయనమెడలో వేసెను. లక్ష్మీపతి ఆమెను తనవెంట తీసికొని వెళ్లెను. రాజులందఱును నిరాశకు గుఱియైరి. మోహకారణముగా నారదమహర్షిబుద్ధి భ్రష్టమైనది. కొంగుముడిలోనిమణి జారిపోయినవానివలె అతడు వ్యాకులచిత్తుడాయెను. శివునిగణములవారు నవ్వుచు అతనితో "ఒకసారి నీముఖమును అద్దములో చూచుకొనుము." అనిపల్కి భయముతో పాఱిపోయిరి. నారదుడు నీటిలో తన వికృత రూపమును చూచుకొని మిక్కిలి క్రుద్ధుడాయెను. వెంటనే అతడు శివ గణముల వారిని కఠినముగా శపించెను. (చౌ॥ 1-4)

"ఓ పాపాత్ములారా! వంచకులారా! మీరు రాక్షసులై జన్మింతురుగాక. నన్ను పరిహసించి నందులకు తగినఫలితమును అనుభవించెదరు. మఱల ఏమునినిగూడ పరిహసింపరు గదా?"- అని శపించెను. (దో॥ 135)

నారదముని మఱల నీటిలో తన రూపమును ఒకసారి చూచుకొనెను. అప్పుడు ఆయనకు తననిజస్వరూపమే కనబడెను. ఐనను సంతుష్టుడు కాలేదు. పెదవులు వణకుచుండెను. మనస్సు కోపముతో నిండిపోయెను. వెంటనే అతడు శ్రీహరియొద్దకు పోయెను. "ఇప్పుడే పోయి శ్రీహరిని శపించెదను. లేదా నా ప్రాణములను త్యజించెదను. అతడు లోకములో నన్ను నవ్వులపాలు చేసెను." అనియనుకొనుచు పోవుచుండగా శ్రీహరి త్రోవలోనే నారదుని కలిసెను. లక్ష్మీదేవియు, ఆ రాజకుమారియు అతని వెంటనుండిరి. దేవదేవుడైన విష్ణువు "మునీశ్వరా! వ్యాకులచిత్తుడవై ఎక్కడికి వెళ్లుచున్నావు?" అని మృదుమధురముగా పలికెను. ఈ మాటలు విన్ననారదునికోపము ఇనుమడించెను. మాయా మోహితుడైనమునికి బుద్ధినశించుటచే అతడిట్లనెను. "నీవు ఇతరుల సంపదలనుజూచి ఓర్వలేవు, సముద్రమథనసమయమున దేవతలప్రేరణతో నీవు ఆ భోళాశంకరునిచే విషమును ద్రావించితివి. నీవు ఈర్ష్యాళువు కపటివి. (చౌ॥ 1-4)

రాక్షసులకు మదిర (మద్యము)ను, శివునకు విషమును ఇచ్చి, నీవు మాత్రము సౌందర్యరాశియైన లక్ష్మీదేవిని, కౌస్తుభమణిని తీసికొంటివి. నీవు మిక్కిలి స్వార్థపరుడువు, కుటిలుడవు. (దో॥ 136)

నీవు పరమ స్వతంత్రుడవు. ఎవరిఅధీనములోను ఉండవు. అందువలన నీకు తోచినట్లు చేయుచుందువు. మంచిని చెడుగా, చెడును మంచిగా చేయుచుందువు. నీ హృదయములో హర్ష విషాదములు లేవు. నిరంతరము ప్రతివ్యక్తిని మోసగించుచుందువు. కుయుక్తులకు అలవాటు పడినవాడవు. నీకు భయము లేదు. శుభాశుభకర్మలు నిన్ను బాధింపవు. ఇంతవఱకు ఎవ్వరునూ నిన్ను సరియైనమార్గములో పెట్టలేదు. నీవు ఇచ్చినవాయనమును నీవే పుచ్చుకొనుము. నీవు చేసికొనినకర్మలఫలమును తప్పక నీవే అనుభవింపగలవు. నీవు ఏ రూపమున నన్ను మోసగించితివో ఆ రూపమునే పొందగలవు. ఇదే నీకు నా శాపము. నీవు నాకు వానరాకృతిని ఇచ్చితివి. కావున నీవు వానరులను ఆశ్రయింపక తప్పదు. నేను వరించిన స్త్రీని నాకు దక్కకుండ చేసితివి. కావున నీవు గూడ స్త్రీ వియోగముతో దుఃఖించెదవు. (చౌ॥ 1-4)

ప్రభువు నారదునిశాపమును సంతోషముతో స్వీకరించెను. మఱియు మునిని అనేకవిధముల ప్రార్థించెను. తరువాత తనమాయా ప్రాబల్యమును తొలగించెను. (దో॥ 137)

శ్రీహరి మాయనుతొలగించినంతనే లక్ష్మీదేవియు, రాకుమారియు అదృశ్యమై పోయిరి. నారదుడు భయకంపితుడై, శ్రీహరి పాదములపైబడి "ఓ శరణాగతవత్సలా! నన్ను రక్షింపుము. ఓ కృపాళూ! నాశాపము పనిచేయకుండు గాక" అంతట దీనదయాళువైన ప్రభువు "ఇదియంతయు నా సంకల్పమే" అని పల్కెను. నారదముని మఱల ఇట్లనెను. "ప్రభూ మిమ్ము నేను అనేకవిధముల తూలనాడితిని. నా పాపములకు నిష్కృతియే

లేదు." అందులకు భగవంతుడు ఇట్లు పలికెను. "ఓ మహర్షీ! నీవు వెళ్లి, శంకరుని శతనామ(స్తోత్రము)ములను జపింపుము. నీ మనసు కుదుటబడును. శివుడు నాకు అత్యంత ప్రియతముడు. పొరపాటునగూడ నీవు ఈవిషయమును మఱువవలదు. ఓ మునీశ్వరా! శివునికృపకు పాత్రులు కానివారు నా భక్తులు కాజాలరు. దీనిని విశ్వసించి, భూలోకమునచరింపుము. నామాయ నీదఱికి చేరదు. (చౌ॥ 1-4)

ఇట్లు అనేకవిధముల నారదుని ఊరడించి, విష్ణువు అంతర్ధానమాయెను. నారదుడు శ్రీరాముని గుణములను కీర్తించుచు సత్యలోకమును చేరెను. (దో॥ 138)

మోహరహితుడై, ప్రసన్నుడై వచ్చుచున్న నారదమునిని జూచి, శివగణములవారు భయపడుచు వచ్చి, ఆయన పాదములపైబడి దీనులై ప్రార్థించిరి. "మునీశ్వరా! మేము నిజముగా బ్రాహ్మణులము కాము. శివగణములలోనివారము. మీ యెడ మహాపరాధము చేసి, దాని ఫలితమును అనుభవించినాము. కృపాళూ! మమ్ము శాపవిముక్తులను గావింపుడు."- దీనవత్సలుడైన నారదుడు ఇట్లనెను. "మీరు ఇద్దఱును రాక్షసులుగా జన్మించెదరు. మీకు గొప్పఐశ్వర్యము, తేజస్సు, బలము ప్రాప్తించును. మీరు మీ భుజబలములతో విశ్వమును జయించెదరు. అపుడు విష్ణువు మానవావతారమునుదాల్చును. మీరు యుద్ధమున శ్రీహరిచే నిహతులై మోక్షమును పొందెదరు. ఆపై మీకు పునర్జన్మయుండదు." వారు మునికి ప్రణమిల్లి స్వనివాసములకు చేరిరి. కొలది కాలమునకు పిమ్మట వారు రాక్షసులై జన్మించిరి. (చౌ॥ 1-4)

ఈ కారణమువలననే ఒకకల్పమునందు దేవతలను ప్రసన్నులుగా జేయుటకును, సజ్జనులకు సుఖములను ఇచ్చుటకును, భూభారమును బాపుటకును శ్రీహరి మానవావతారమును దాల్చెను. (దో॥ 139)

ఈ విధముగా శ్రీహరిజన్మకర్మలు అనేకములు. అవి మనోజ్ఞములు సుఖదాయకములు, దివ్యములు. ప్రతికల్పమునందును భగవంతుడు అవతారములను దాల్చి, తనదివ్యలీలలను ప్రదర్శించుచుండును. అపుడు మహర్షులు పరమపవిత్రమైనకావ్యములను రచించి, ఆయనచరితములను పెక్కురీతుల వర్ణించుచుందురు. వాటిని వినినవివేకవంతులు సంభ్రమాశ్చర్యములకు లోనగుదురు. శ్రీహరి అనంతుడు. తత్కథలును అనంతములు. సత్పురుషులు వాటిని అనేకవిధముల వినెదరు, వర్ణించెదరు. శ్రీరామచంద్రునిమనోహరగాథను గానముచేయుటకు ఎన్ని కల్పములైనను చాలవు. భవానీ! జ్ఞానులైన మునీశ్వరులుగూడ శ్రీహరిమాయామోహితులగుదురని తెల్పుటకే నీకు నేనీకథను చెప్పితిని. ప్రభువులీలామయుడు, శరణాగతవత్సలుడు, సులభ సేవ్యుడు, అందఱి దుఃఖములను హరించువాడు. (చౌ॥ 1-4)

# శతరూపా స్వాయంభువ మనువుల వృత్తాంతము

దేవతలు, మునులు, మానవులలో శ్రీహరిమాయకు లోనుకానివారు ఎవ్వరును లేరు. ఈ విషయమును గ్రహించి, మాయాధీశుడైన భగవంతుని పాదపద్మములను భజింపవలెను. (సో॥ 140)

ఓ పార్వతీ! భగవానుడు శ్రీరాముడుగా అవతరించుటకు మఱియొక కారణముగూడ గలదు. అజుడు, నిర్గుణుడు, నిరాకారుడైన భగవంతుడు అయోధ్యాపతిగా ఏల అవతరించెనో సవిస్తరముగా తెల్పెదను, వినుము. మునివేషధారియై తన సోదరునితోగూడి తిరుగుచుండగా ఆ ప్రభువునే పూర్వ జన్మలో నీవు చూచితివి. అతని లీలలను జూచి, సతీ రూపమున నీవు భ్రమకు లోనయితివి. నేటికిని ఆ భ్రమనీడ నిన్నువీడలేదు. ఆ భ్రమజాడ్యమును రూపుమాపు శ్రీరామచరితమును వినుము. ఆ అవతారమున ప్రభువుచూపినలీలలను నా శక్త్యనుసారము వర్ణించెదను. (యాజ్ఞవల్క్యుడు పలుకుచున్నాడు) భరద్వాజా! శంకరుని వచనములను విని ఉమాదేవి బిడియముతో ఒక చిఱునవ్వు నవ్వెను. భగవంతుని అవతార కారణములను వృషకేతుడైన శివుడు వర్ణింప సాగెను. (చౌ॥ 1-4)

ఓ భరద్వాజా! ఆ విషయమునంతయును నేను చెప్పెదను మునీశ్వరా! సావధానముగా వినుడు. శ్రీరాముని చరితము కలిపాపములను నశింప జేయును. అది మనోజ్ఞము, మంగళ ప్రదము. (దో॥ 141)

ఈ మానవ జాతియంతయును స్వాయంభువమనువు-శతరూప అనుదంపతుల సంతతి. వీరు మిక్కిలి ధర్మాచరణపరులని వేదములు స్తుతించుచున్నవి. వీరి కుమారుడు ఉత్తానపాదుడు. అతని కుమారుడు హరిభక్తుడైన ధ్రువుడు. మనువు యొక్క చిన్న కుమారుడైన ప్రియవ్రతుని వేదపురాణములు ప్రశంసించినవి. వారి (ఆ దంపతుల) కుమార్తె దేవహూతి. ఆమెభర్త కర్దముడు. ఈ పుణ్యదంపతులకు కపిలుడు ఉదయించెను. అతడు ఆదిదేవుడు, సమర్థుడు, దీనదయాళువు. కపిలభగవానుడు సాంఖ్య తత్త్వమును విశదముగా ప్రతిపాదించెను. అతడు తత్త్వవిచారణలో అత్యంతకుశలుడు. ఈ స్వాయంభువమనువు చాలాకాలము భగవదాజ్ఞానుసారము రాజ్యపాలనమొనర్చెను. (చౌ॥ 1-4)

అతడిట్లు (మనువు) తలంచెను. "జీవితము యొక్క చరమ (చతుర్థ)దశ ఐన ముసలితనము మీద బడినది. ఇంకను గృహస్థ-ఆశ్రమములోనే యున్నాను. విషయవిరక్తి కలుగలేదు. హరిభక్తి రహితముగా నా జీవితము వ్యర్థముగా గడిచినది". అని తలచి మిక్కిలి దుఃఖితుడాయెను. (సో॥ 142)

మనువు తనకుమారునకు రాజ్యభారమునప్పగించి, భార్యతోగూడి వనములకేగెను. నైమిశారణ్యము పుణ్యతీర్థములలో ప్రసిద్ధిగాంచినది. అది సాధకులకు సిద్ధిప్రదాత. అచ్చట మునులు సిద్ధులు నివసించుచుండిరి. వారినిజూచి మనువు ప్రసన్నుడాయెను. ఆ దంపతులు ఆ మార్గమున నడచుచుండగా జ్ఞానము భక్తి సశరీరములై సంచరించుచున్నట్లుండెను. వారు గోమతీతీరమునకు చేరి ఆనదీజలములలో స్నానములనాచరించిరి. అతనిని ధర్మాత్ముడైన రాజర్షిగా గుర్తించి, సిద్ధులు, మునులు, జ్ఞానులు ఆయనను కలిసికొనుటకు వచ్చిరి. మునులతోగూడి వారు (ఆ దంపతులు) సర్వతీర్థములను సేవించిరి. వారి శరీరములు కృశించినవి. వారు జటావల్కలధారులై సజ్జనులకడ పురాణశ్రవణము చేయుచుండిరి. (చౌ॥ 1-4)

మంత్రరాజమైన ద్వాదశాక్షరీమంత్రమును (ఓమ్ నమో భగవతే వాసుదేవాయ) భక్తితో జపించుచుండిరి. ఆ రాజదంపతులు భగవంతుడైన వాసుదేవునిచరణకమలములయందు మనస్సులను లగ్నము చేసిరి. (దో॥ 143)

వారు కేవలము కూరగాయలు, ఫలములు, కందమూలములు మాత్రమే భుజించుచు, సచ్చిదానందస్వరూపుడైన పరబ్రహ్మను స్మరింపసాగిరి. క్రమక్రమముగా ఫలమూలాదులను కూడ త్యజించి, నీటిని మాత్రమే స్వీకరించుచు శ్రీహరినిగూర్చి తపస్సు చేసిరి. నిరంతరము వారిలో ప్రభు దర్శనాభిలాషయే మెదలుచుండెను. ఆ పరమాత్మ నిర్గుణుడు, అఖండుడు, అనంతుడు, అనాది. బ్రహ్మజ్ఞులు ఆయనను నిరంతరము స్మరించుచుందురు. 'నేతినేతి' వచనములతో వేదములు ఆపరమాత్మను నిరూపించుచున్నవి. ఆయనఅంశనుండియే అసంఖ్యాకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ఆవిర్భవించిరి. అట్టి ఆనంద స్వరూపుడు, ఉపాధిరహితుడు, అసమానుడుఐన పరబ్రహ్మను వారు (ఆ దంపతులు) ప్రత్యక్షముగా చూడగోరిరి. శక్తిశాలియు, సమర్థుడును ఐన ప్రభువు తన భక్తులకువశుడై లీలాశరీరములను ధరించి, వారికి దర్శనమిచ్చుచుండును. "వేదములలో పేర్కొనబడిన పైవిషయములన్నియు సత్యములైనచో మాకోర్కెలు తప్పక సఫలములగును." (చౌ॥ 1-4)

ఈ విధముగా భావించుచు, కేవలము నీటిని మాత్రమే ఆహారముగా గొనుచు, ఆఱు వేల సంవత్సరములు వారు జీవించిరి. తరువాత ఏడు వేల సంవత్సరముల కాలము వాయు భక్షణముతో కాలము గడిపిరి. (దో॥ 144)

అనంతరము పది వేల సంవత్సరములు వాయుభక్షణమునుగూడమాని, ఒంటికాలిపై నిలబడి తపమాచరించిరి. వారిఅపారతపశ్చర్యను గాంచి (త్రిమూర్తులు) బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులు ప్రత్యక్షమై, వారిని వరములను కోరుకొమ్మనిరి. కానివారు ఎట్టి ప్రలోభములకును లోనుకాలేదు. వరములను కోరుకొనలేదు.

వారిశరీరములు అస్థిపంజరములుగామిగిలినను వారి మనస్సులు మాత్రము నిశ్చలముగానుండెను. సర్వజ్ఞుడైన భగవంతుడు వారిని తనఅనన్యభక్తులుగా గుర్తించెను. ఆకాశమునుండి "వరమును కోరుకొనుము"అను అమృతతుల్యమైన వాణి వినిపించెను. మృతులను గూడ సజీవులనుగా జేయు ఈ అమృతవచనము వారి హృదయములకు చేరెను. వెంటనే వారి శరీరములు సర్వాంగ శోభితములై, అప్పుడే రాజభవనములనుండి విచ్చేసినట్లు భాసించెను. (చౌ॥ 1-4)

అమృతప్రాయమైనఆకాశవాణి చెవులబడినంతనే వారితనువులు పులకించెను. హృదయములయందు ప్రేమ పొంగిపొరలగా ఆ దంపతులు సాష్టాంగదండప్రణామములను ఆచరించి, ఇట్లు పల్కిరి. (దో॥ 145)

ఆశ్రయించిన (సేవించు) వారికి కల్పతరువు, కామధేనువు ఐన హే ప్రభో! బ్రహ్మ విష్ణు మహేశ్వరులుగూడ నీ పాదరేణువులను సేవింతురు. సేవించు వారికి నీవు సులభుడవు, సుఖ ప్రదాతవు, శరణాగతవత్సలుడవు, ఈ చరాచర సృష్టికి స్వామివి. ఓ అనాథనాథా! మాపై కృపజూపి మాకొక వరమునిమ్ము. నీ రూపమును పరమశివుడు తనహృదయములో నిరంతరము ధ్యానించుచుండును. మునులు సర్వదా దానిని దర్శించుటకు ఉవ్విళ్ళూరుచుందురు. నీ రూపము భుశుండిమానససరోవరమునందు విహరించెడిహంస. నిన్ను సగుణనిర్గుణ బ్రహ్మముగా వేదములు ప్రస్తుతించును. శరణాగతులదుఃఖములను దూరము చేయునట్టి నీరూపమును నేత్రపర్వముగా మాకు ప్రత్యక్షమొనర్పుము. కోమలములు, వినయశోభితములు, ప్రేమరససిక్తములు ఐన ఆ దంపతుల వచనములలో భగవానుడు సంతుష్టుడాయెను. భక్తవత్సలుడు, సర్వవ్యాపి, కృపాళువు, సర్వసమర్థుడైన ఆ పరమాత్మ వారికి ప్రత్యక్షమాయెను. (చౌ॥ 1-4)

నీలకమలమువలె కోమలము, నీలమణివలె దేదీప్యమానము, నీల మేఘమువలె సరసము అగు పరమాత్ముని ఆ నీల దేహశోభలను గాంచి, కోటి మన్మథులు గూడ లజ్జితులగుదురు. (దో॥ 146)

శరచ్చంద్రునివంటి అపారముఖసౌందర్యము, చెక్కిళ్లమిలమిలలు, చిబుకపు సోయగములు, శంఖమునుబోలుగళము, ఎఱ్ఱనిపెదవులు, మనోహరములైన దంతములు, చూడముచ్చటైన నాసిక, వెన్నెలవంటి చిఱునవ్వు, వికసించిన పద్మములవంటి కన్నులు, ఆకర్షణీయములైన చూపులునుగల ఆ పరమాత్ముని రూపము మిక్కిలి మనోజ్ఞముగా నుండెను. మన్మథుని ధనుస్సును తల దన్ను కనుబొమలు, లలాటతిలకశోభలు, చెవులవ్రేలాడుమకరకుండలములు, శిరముపై నిగనిగలాడు కిరీటము, తుమ్మెదలబోలు ముంగురులు, చూచువారినిసమ్మోహపఱచుచుండెను. వక్షముపై శ్రీవత్సము, సుందరవనమాల, రత్నఖచిత హారములు, మణులుపొదిగినఆభరణములు అత్యంత శోభాయమానముగా నుండెను. సింహమువంటి బలిష్ఠమైనస్కంధముపై పవిత్రయజ్ఞోపవీతము వ్రేలాడుచుండెను. ఏనుగు తొండములవలె బలిష్ఠములైన భుజములపై అందమైన భుజకీర్తులు, మూపు పై భాగమున తూణీరము, చేతులయందు ధనుర్బాణములుగల అత్యంతరమణీయరూపమును వారు దర్శించిరి. (చౌ॥ 1-4)

విద్యుత్కాంతులను అధఃకరించు పీతాంబరము, ఉదరముపై అందమైన త్రివళులు, యమునా జలముల ఆవృతము (సుడు)ల యొక్క గాంభీర్యమును తిరస్కరించు నాభిసొంకము అతి మనోహరముగా ఉండెను. (దో॥ 147)

సర్వదా మునీశ్వరుల మనస్సులనెడి తుమ్మెదలు విహరించు ఆ చరణకమలములసౌందర్యములు వర్ణనాతీతములు. అనుకూలవతి సౌందర్యరాశి, జగన్మాత, ఆది శక్తియైన సీతాదేవి ఆ స్వామి వామభాగమున అలరారుచుండెను. ఆ సీతామాత అంశనుండియే ఉమా లక్ష్మీ సరస్వతులు ఉద్భవింతురు. ఆమె కనుసన్నల మాత్రమున జగత్సృష్టికార్యము జరుగుచుండును. మనువు శతరూపలు శ్రీహరి యొక్క అనంత రూప

సౌందర్యవైభవమును కన్నులార చూచుచునే యుండిరి. ఎంత చూచినను తనివిదీరని ఆ దివ్యాకృతినిగాంచి వారిహృదయములు ఆనందసాగరమున ఓలలాడెను. ఆ పరమానంద పారవశ్యములో వారు శరీరస్మృతినిగూడ వీడిరి. పిమ్మట సాష్టాంగదండప్రణామములనాచరించి, శ్రీహరి పాదములను విడువక పట్టుకొనిరి. కరుణామయుడైన శ్రీహరి వారిశిరస్సులను తాకి, తనకర కమలములతో వారిని లేవనెత్తెను. (చౌ॥ 1-4)

కృపానిధియైన శ్రీహరి ఇట్లు పలికెను. "నేను అత్యంతము ప్రసన్నుడనైతిని. మీరుకోరిన వరమును ఇచ్చెదను. నన్ను మహాదాతగా భావించి, కోరుకొనుడు". (దో॥ 148)

ప్రభువచనములను విని, ఆ దంపతులు అంజలిఘటించి, ధైర్యము వహించి, యిట్లనిరి. "ఓ ప్రభూ! మీ చరణకమలములదర్శనముతోడనే మా కోరికలన్నియు తీరినవి. ఐనను ఒక తీరనికోరిక మిగిలియున్నది. అది సుసాధ్యమో? కష్టసాధ్యమో? మేమెఱుగము. దయామయులైన మీరు ఇచ్చుటకు సమర్థులు. కాని కృపణులమైన మేము పొందుట కష్ట సాధ్యముగా తోచును. దరిద్రుడు కల్పతరువును గాంచి, సంపదలను కోరుకొనుటకు సంకోచించును. ఏలనన అతడు దాని మహిమను ఎఱుగడు. అట్లే మాహృదయములుగూడ సంకోచించుచున్నవి. స్వామీ! నీవు అంతర్యామివి. మా కోరికను నీ వెఱుగుదువు. కావున దానిని నీవు మాకు ప్రసాదింపుము." - భగవంతుడు మఱల ఇట్లు పలికెను. "రాజా! సంకోచపడక, మీకోరికను అడుగుడు. మీరేదడిగినను నేను ఇయ్యగలను". (చౌ॥ 1-4)

మనువు పలికెను. "ఓ మహాదాతా! దయాసాగరా! స్వామీ! నామనస్సులోగల నిజమైన కోరికను తెలిపెదను. నీ యొద్ద దాచవలసినది ఏముండును? నీ వంటి పుత్రుని ప్రసాదింపుము.-" (దో॥ 149)

ఆరాజు (మనువు) యొక్క అనన్యభక్తిని జూచి, ఆతని అనర్ఘవచనములను విని, దయానిధియైన ప్రభువు ఇట్లనెను. "అట్లే కానిమ్ము రాజా! నా వంటివానిని ఎక్కడని వెదకగలను? కావున నేనే మీకు పుత్రుడుగా జన్మించెదను."- చేతులు జోడించి నమస్కరించిన శతరూపాదేవితో ప్రభువు ఇట్లనెను. దేవీ! నీకోరిక ఏమి? అడుగుము"- శతరూపాదేవి పలికెను. "ప్రభూ! కృపాళూ! చతురుడైన రాజుయొక్క కోరికయే నా కోరిక. కాని ప్రభూ! నా ధృష్టత్వమును క్షమింపుము. నాకు మఱియొక కోరిక గలదు. నీవు భక్తవత్సలుడవు. బ్రహ్మాదిదేవతలకు తండ్రివి. లోకరక్షకుడవు. అంతర్యామివి, పరబ్రహ్మవు. ఇట్టి మీ ప్రభావమును జూచి నాకు సంకోచము గలుగుచున్నది. కాని మీరు పలికినదే సత్యము. మీ పరమ భక్తులు ఏ అలౌకిక దివ్యసుఖములను అనుభవించి, పరమగతిని పొందెదరో,- (చౌ॥ 1-4)

అదే దివ్యానందమును, పరమగతిని, మీపాదపద్మములపై భక్తి విశ్వాసములను, వివేకమును, విశిష్ట జీవితమును మాకు దయతో ప్రసాదింపుడు. (దో॥ 150)

కోమలములు, గూఢములు, మనోహరములు ఐన ఆ శతరూపాదేవివచనములు విని, కృపాసింధువైన భగవానుడు మృదుమధురముగా ఇట్లు పలికెను. "మీ మనస్సులలోనున్న కోరికలనన్నింటిని నేను వరములుగా ఇచ్చితిని. సందేహము వలదు. తల్లీ! నా కృపవలన మీ అలౌకికవివేకము చెక్కుచెదరదు."- మఱల మనువు భగవంతునిపాదములకు మ్రొక్కి యిట్లు పలికెను- "ప్రభూ! నాది మఱియొక్క విన్నపము. నన్ను ఎవ్వరైనను పరమమూర్ఖునిగా భావింపవచ్చును. మీ చరణములపై నాకుగలప్రేమ ఒక కుమారునిపైతండ్రికిగల ప్రేమవలె నుండవలెను. ఇదియే నా కోరిక. మణిలేకుండా పాము, నీరులేకుండ చేప నిలువ లేనట్లు మీరు లేకుండ నేను ఉండజాలను." ఇట్టి వరమును గోరి మనువు మఱల ప్రభువునకు పాదాభివందనమును జేసెను. కరుణానిధియైనప్రభువు, "అట్లేయగు గాక" ఇప్పుడు మీరు నా ఆజ్ఞను పాలింపుడు. దేవేంద్రుని రాజధానియైన అమరావతియందు వసింపుడు. (చౌ॥ 1-4)

నాయనా! అక్కడ కొలదికాలము సుఖములను అనుభవించిన పిదప, నీవు అయోధ్యాపతివై జన్మించెదవు. అప్పుడు నేను నీ కుమారుడనగుదును. (సో॥ 151)

ఇచ్ఛాపూర్వకముగ మానవరూపమునుదాల్చి నేను నీయింట జన్మించెదను. నాయనా! నా అంశలన్నింటితో మానవ దేహమును ధరించి, భక్తులకు ఆనందము గూర్చుగాథను నడుపుదును. ఈ కథలను భాగ్యశాలురు భక్తిశ్రద్ధలతో విని, మమతాగర్వములనుత్యజించి, భవసాగరమును దాటుదురు. జగదుత్పత్తికి కారణము, ఆదిశక్తియు ఐన ఈమాయగూడ అవతారమును ఎత్తును. నేను నీ మనోరథములను అన్నింటిని పూర్తిచేయుదును. ఇది ముమ్మాటికిని సత్యము." అని దయానిధి యైన భగవానుడు అంతర్ధానమాయెను. ఆ దంపతులు కొలదికాలము ఆ ఆశ్రమములో భక్తజనమందారమైన ఆ భగవంతునిమూర్తిని హృదయములలో ధ్యానించుచు గడిపిరి. తరువాత సహజముగా అనాయాసముగ దేహత్యాగము చేసి, దేవరాజధానియైన అమరావతిని జేరిరి. (చౌ॥ 1-4)

(యాజ్ఞవల్క్యుడు చెప్పుచున్నాడు.) భరద్వాజా! పరమ పవిత్రమైన ఈ కథను శివుడు పార్వతికి వినిపించెను. శ్రీ రాముని అవతారమునకు మఱియొక కారణము గూడ గలదు, వినుము. (దో॥ 152)

(మాసపారాయణము ఐదవ విరామము)

## ప్రతాపభానుని ఉదంతము

ఓ మునీశ్వరా! ఇదియొక పవిత్రమైన ప్రాచీనగాథ-వినుడు. దీనిని పరమశివుడు పార్వతీదేవికి వినిపించెను. ప్రపంచ ప్రసిద్ధి వహించిన కైకయ రాజ్యమును సత్యకేతుడు అను రాజు పాలించు చుండెను. అతడు ధర్మాత్ముడు, నీతినిధానము, తేజస్వి, పరాక్రమవంతుడు, సుశీలుడు, బలశాలి. అతనికి ఇద్దఱు పుత్రులుండిరి. వారుగూడ యోధులు, సద్గుణ సంపన్నులు. వారిలో జ్యేష్ఠుడైన ప్రతాపభానుడు రాజ్యమునకు ఉత్తరాధికారి. రెండవవాడైన అరిమర్దనుడు మహాబలశాలి. సంగ్రామరంగమున తొణకనివీరుడు. వారి ఐకమత్యము నిరుపమానము, నిష్కళంకము. రాజు జ్యేష్ఠకుమారునకు రాజ్యభారమును అప్పగించి, శ్రీహరిధ్యానముకై వనములకేగెను. (చౌ॥ 1-4)

ప్రతాపభానుడు రాజ్యాధికారమును చేబట్టినట్లు దేశమునందంతటను చాటబడెను. అతని రాజ్యపాలనము వేదోక్తధర్మములను అనుసరించుచు సాగుచుండెను. అతనిపాలనలో రాజ్యమున పాపకృత్యములు మచ్చునకైనను లేకుండెను. (దో॥ 153)

అతనిమంత్రియైన ధర్మరుచి నీతిజ్ఞుడు, బుద్ధిమంతుడు. రాజనీతిలో శుక్రాచార్యునితో సమానుడు. రాజైనప్రతాపభానుడు స్వయముగా పరాక్రమవంతుడు, రణధీరుడు. చతురుడైన మంత్రి, బలశాలియైన తమ్ముడు అతనికి అండగా నుండిరి. అపారమైనచతురంగబలములు గలవు. వీరులైన యోధులు ప్రాణములకు తెగించి పోరాడువారు. సైన్యములు రాజునకు హర్షమును గూర్చునవిగా ఉండెను. నగారాలు మ్రోగుచుండగా మంచిముహూర్తమున రాజు దిగ్విజయయాత్రకు బయలుదేరెను. యుద్ధములలో అతడు రాజులను అందఱిని జయించెను. తన భుజబలముతో సప్తద్వీపములను వశపఱచుకొనెను. పరాజితులైన రాజులనుండి పన్నులను స్వీకరించి, వారిని విడిచిపెట్టెను. ఇట్లు ప్రతాపభానుడు అఖండమండలమునకు ఏకైకచక్రవర్తి ఆయెను. (చౌ॥ 1-4)

ఈ విధముగా సమస్త భూమండలమును జయించి, రాజు తననగరమున ప్రవేశించి, సర్వసుఖములను అనుభవించుచుండెను. ధర్మార్థకామములను యథాయోగ్యముగ అనుసరించుచు ప్రజలను పాలించుచుండెను. (దో॥ 154)

ప్రతాపభానునిపాలనలో భూమి కామధేనువువలె కోరినఫలములను ఒసంగుచుండెను. ప్రజలు దుఃఖమునే ఎఱుంగక హాయిగా జీవించుచుండిరి. స్త్రీపురుషులు సుందరులు, ధర్మాత్ములు. మంత్రియైన ధర్మరుచి

శ్రీహరిభక్తుడు. రాజునకు హితైషి. అందువలన రాజు గురువులను, దేవతలను, సజ్జనులను పితరులను, బ్రాహ్మణులను, భక్తివిశ్వాసములతో సేవించుచుండెను. రాజధర్మములను అన్నింటిని వేదోక్తముగా సాదరముగా నిర్వహించుచుండెను. నిత్యము అనేకదానములనుజేయుచు వేదశాస్త్ర పురాణములను వినుచుండెను. సమస్త తీర్థక్షేత్రములలో బావులను, చెఱువులను, ఉద్యానవనములను ఏర్పాటు చేయించెను. దేవతా మందిరములను, బ్రాహ్మణులకు గృహములను కట్టించెను. (చౌ॥ 1-4)

రాజు వేదశాస్త్రపురాణములలో పేర్కొనబడిన పెక్కు యజ్ఞములను విధ్యుక్తముగా భక్తి శ్రద్ధలతో చేసెను. (దో॥ 155)

ప్రతాపభానుడు మిక్కిలి వివేకముగలవాడు. అతడు ఎట్టి ప్రతిఫలములను ఆసింపక తాను ఆచరించు ధర్మ కార్యములను అన్నింటిని త్రికరణ శుద్ధిగా భగవదర్పణము గావించుచుండెను. ఒక నాడు అతడు ఉత్తమాశ్వమునెక్కి వేటకై వలసిన సాధనములతో వింధ్యాటవికి వెళ్లెను. అచట శాస్త్రోక్తములైన అనేక ఉత్తమ (చంపదగిన) మృగములను వేటాడెను.[1] అడవిలో తిరుగుచు అతడొక వనవరాహమును జూచెను. దాని దంతములు రాహుగ్రస్తమైన చంద్రునివలె భాసించుచుండెను. దాని శరీరము పర్వతాకారసదృశము. గుఱ్ఱపు గిట్టల శబ్దములను విని, అది నిక్కపొడుచు కొనిన చెవులతో సావధానముగా ఇటునటు పరికించుచు ఘుర్ఘురించుచుండెను. (చౌ॥ 1-4)

నీలగిరిశృంగమువలె ఉన్నత (విశాల)మైన ఆ సూకరమును గాంచి, రాజుచిక్కులువేయుచు తనగుఱ్ఱమును అతి వేగముగ పఱుగెత్తించెను. "ఇప్పుడు నీవు తప్పించుకొనలేవు" అని అతడు ఆ వరాహమును కవ్వించెను. (దో॥ 156)

అతి వేగముగా వచ్చుచున్న గుఱ్ఱమును జూచి, తప్పించుకొనుటకై అది వాయువేగముతో పరుగిడ సాగెను. వెంటనే రాజు ధనుస్సున బాణమును సంధించెను. కాని ప్రతిపర్యాయము అది తప్పించు కొనుచునే యుండెను. ఒక సారి పైకికనిపించును. మఱొక సారి దాగుకొనును. వేఱొక సారి పరుగులు తీయును. రాజు మిక్కిలి క్రుద్ధుడై దానిని వెంటాడెను. ఆ వరాహము చాలా దూరము పరుగెత్తి, ఏనుగు గాని, గుఱ్ఱముగాని చొరరానిఘనారణ్యములో ప్రవేశించెను. రాజు ఏకాకిగా అట్టి దట్టమైన అడవిలోనికి పోవుట కష్టము. ఐనను అతడు తనప్రయత్నమును మానలేదు. ధీరుడైన రాజునుజూచి, ఆ వరాహము ఒక పర్వతగుహలోనికి ప్రవేశించెను. ఆ గుహలో ప్రవేశించుటకు వీలులేక అతడు నిరాశతో వెనుకకుమఱలెను. కాని ఆ దట్టమైనఅడవిలో అతడు దారితప్పెను. (చౌ॥ 1-4)

అతిప్రయాసకారణముగా మిక్కిలిడస్సిన ఆరాజు ఖిన్నుడై, ఆకలిదప్పులతో వ్యాకులుడై, గుఱ్ఱమును దీసికొని నదీతటాకములను వెదకుచు నీరుదొరకక స్పృహతప్పి పడిపోయెను. (దో॥ 157)

అతడు కొంతతడవునకు లేచి, వనమున దిరుగుచు ఒక ఆశ్రమమునకు జేరెను. అక్కడ ఒక రాజు కపటమునివేషధారియై నివసించుచుండెను. ఇదివరలో అతడు ప్రతాపభానునిచే పరాజితుడై రాజ్యమునుగోల్పోయియుండెను. యుద్ధములో సైన్యమును వదలివేసి పాఱిపోయియుండెను. ప్రతాపభానునిఅదృష్టమును, తనదురదృష్టమును తలచుకొనుచు అతడు తిరిగి తనరాజ్యమునకు పోలేదు. ప్రతాపభానునితో సంధిచేసికొనుటకు అతనికి అభిమానము అడ్డువచ్చెను. ఆ రాజు క్రోధమును

1) వనవాసులైన మహర్షులు తమ తపశ్శక్తిలో ఆఱవభాగమును రాజులకు ధారపోయుదురు. ఆ శక్తితో ప్రభువులు బలసంపన్నులై, చక్కగా రాజ్యపాలన చేయుచుందురు. కావున వనములలోని క్రూర మృగముల బారి నుండి తపోధనులను రక్షించుచుండుట రాజులకు విధి- వేటాడదగిన మృగములను గూర్చి శాస్త్రముల తెల్పినవి. ఆ మృగములను సూచించుచు తులసీదాసు 'పునీత' అను పదమును ప్రయోగించెను.

తనహృదయములోనే దాచుకొని, అతిదరిద్రునివలె మునివేషముతో ఆయడవిలోనే తలదాచుకొని యుండెను. ప్రతాపభానుడు అతనికడకు చేరెను. వెంటనే అతడు ప్రతాపభానుని గుర్తించెను. దాహబాధలో వికలుడైయున్న రాజు అతనిని గుర్తింప లేదు. రాజు అతనిని మునీశ్వరునిగా భావించి, గుఱ్ఱమును దిగి, వందనమునాచరించెను. కాని చతురుడైన రాజు తనపేరునుమాత్రము అతనికి చెప్పలేదు. (చౌ॥ 1-4)

దాహార్తుడైన ఆ రాజునకు ఆ కుహనా సన్యాసి ఒకసరోవరమునుజూపెను. రాజు గుఱ్ఱముతోగూడ ఆ సరస్తీరమునకు చేరి, అందు స్నానము చేసి నీరు గ్రోలెను. (దో॥ 158)

పూర్తిగా సేదదీరి, సుఖియైనరాజును ఆ కపట సన్యాసి తనఆశ్రమమునకు తీసికొనిపోయెను. సాయం సమయమగుటచే ఆసీనుని గావించి, తపస్వి మృదువచనములతో ఇట్లనెను. "నీవు ఎవరు? అందమైన యువకుడవైనను ప్రాణములను లెక్కసేయక ఈ అడవిలో ఒంటరిగా ఏల తిరుగుచుంటివి? నీలో చక్రవర్తి లక్షణములు కన్పించుచున్నవి. నిన్ను జూచి నాకు జాలివేయుచున్నది."- రాజు సమాధానమును ఇచ్చెను. "మునీశ్వర! ప్రతాపభానుడు అను రాజుగలడు నేను అతని మంత్రిని, వేటకై వచ్చి, దారి తప్పితిని. అదృష్టవశమున ఇచట మీ పాదదర్శనమైనది. మీ దర్శనము అతిదుర్లభము. దీనిని శుభసూచకముగా నేను భావించుచున్నాను." అనంతరము ముని ఇట్లనెను. "నాయనా! చీకటిపడినది. నీ నగరము ఇచ్చటికి డెబ్బది యోజనముల దూరమున ఉన్నది. (చౌ॥ 1-4)

ఓ సజ్జనుడా! ఇది ఘోరాంధకారము అలముకొనిన రాత్రి, కీకారణ్యము, మార్గము చొరరానిది. కావున ఈ రాత్రికి ఇక్కడనేయుండి రేపు ప్రాతఃకాలమున వెళ్లుము. (తులసీదాసు పల్కుచున్నాడు) కానున్నది కాకమానదు. పరిస్థితులు అనుకూలించినప్పుడు అదృష్టము అతనిని వెదకుకొనుచు వచ్చును. లేదా ఆ అదృష్టము వ్యక్తులను తనవైపునకే లాగుకొనును. (దో॥ 159. క,ఖ)

"అట్లే కానిండు మహాత్మా!"- అని చెప్పి, రాజు ఆ సన్యాసిఆజ్ఞను శిరసావహించి, గుఱ్ఱమును చెట్టుకు కట్టివేసి, అచటనే కూర్చుండెను. రాజు అతనిని అనేకవిధముల పొగడి, పాదాభివందనము ఆచరించెను. తనఅదృష్టమును కొనియాడుకొనుచు సవినయముగా మృదుమధురముగా పల్కెను. "మునీశ్వర! నేను మిమ్ము తండ్రివలె తలంతును. నన్ను మీపుత్రునిగా లేక సేవకునిగా భావించి, మీ పేరు మొదలగువివరములు తెల్పగలరు."- రాజు ఆ సన్యాసిని గుర్తింపకున్నను అతడు ఆ రాజును గుర్తించెను. రాజు నిష్కపటి, కాని ఆ ముని కపటి. అతడా రాజునకు శత్రువు, క్షత్రియుడు, పైగా రాజవంశజుడు. కావున తనకార్యమును బలప్రయోగముచేతనో లేక మోసముతోడనో సాధింపనెంచెను. అతడు తన పూర్వపురాజసుఖములను తలంచుకొని దుఃఖపడుచుండెను. అతనిలో ఈర్ష్యాగ్ని కొలిమివలెమండుచుండెను. నిర్మలమనస్కుడైన ప్రతాపభానునిపల్కులు వినియు, తనలోని ద్వేషమును అణచుకొనుచు, అతడు లోలోన సంతసించెను. (చౌ॥ 1-4)

ఆ సన్యాసి మృదువుగనే కపటవచనములను ఇట్లు పలికెను "నా పేరు బికారి" నేను నిర్ధనుడను, ఇల్లు వాకిలి లేనివాడను. (దో॥ 160)

రాజు పల్కెను. "మీవంటి జ్ఞానులు, నిరహంకారులు సర్వదా తమనిజస్వరూపములను దాచియుంచెదరు. ఏలనన దైన్యస్థితిలో కన్పించుటయే సర్వవిధముల క్షేమమని భావింతురు. మిక్కిలి అకించనులు (మమతాహంకార రహితులు) ఐన వారినే శ్రీహరి ప్రేమించునని వేదములు, సజ్జనులు పల్కుట ప్రసిద్ధము. నిర్ధనులు, గృహహీనులు ఐన మీవంటి బికారులను జూచి, వీరు నిజముగనే సజ్జనులా? బికారులా? అని బ్రహ్మకును, పరమేశ్వరునకును సందేహము కలుగుచుండును. మీరు ఎవ్వరైనను కానిండు మీకృపకై ప్రణమిల్లి ప్రార్థింతును."- రాజుయొక్క స్వాభావిక ప్రేమను, తనపై ఆయనకు గల విశ్వాసమును జూచి, ఆ సన్యాసి అన్ని విధముల రాజును తనవశములో నుంచుకొని, అధికప్రేమను ప్రకటించుచు ఇట్లనెను. "రాజా! వినుము. సత్యము చెప్పెదను. నేనిచట చాల కాలము నుండియు నివసించుచున్నాను. (చౌ॥ 1-4)

ఇంతవఱకు నాయొద్దకు ఎవ్వరును రాలేదు. నన్నుగూర్చి ఎవ్వరికిని నేను తెల్పుకొనలేదు. ఎందుకనగా లోక ప్రతిష్ఠ తపస్సనెడివనమును దగ్ధముచేయు అగ్నివంటిది. (దో॥ 161. క)

తులసీదాసు చెప్పుచున్నాడు. సుందరమైన వేషములను జూచి మూఢులేగాదు విజ్ఞులు గూడ మోసపోవుదురు. అందమైననెమలిని చూడుడు దానికంఠస్వరముఅమృతతుల్యము. కాని సర్పములు దానిఆహారము. (సో॥ 161. ఖ)

కపటసన్న్యాసి పల్కెను. "అందులకే ప్రపంచమునకు దూరముగా మసలుచున్నాను. శ్రీహరితోతప్ప నాకుఎవ్వరితోడను పనిలేదు. మనము తెలుపుకొనకున్నను ప్రభువునకన్నియును తెలియును. లోకులను తృప్తిపఱచుటవలనకలుగుప్రయోజనమేమి? నీవు అతిపవిత్రుడవు. నీ బుద్ధి మంచిది. నీపై నాకు ఎంతో ప్రీతిగలదు. నీకును నాపై ప్రేమవిశ్వాసములు మెండుగా గలవు. నాయనా! ఇప్పుడుగూడ నీకడ నేనేమైన దాచినచో నేను దోషినగుదును." ఆ కపట సన్న్యాసి ప్రాపంచికవిషయముల యెడ ఔదాసీన్యము ప్రకటించు కొలదియు రాజునకు అతనిపై విశ్వాసము ఇనుమడింపసాగెను. రాజు మనసా, వాచా, కర్మణా తనకు వశుడైనట్లు తెలిసికొని, ఆ బకధ్యానియైన కపటముని పలికెను. "సోదరా! నా పేరు ఏకతనుడు" ఈ మాటకు రాజు నమస్కరించి, "మీ పేరునకు అర్థమును తెల్పుడు."- అనియడిగెను. (చౌ॥ 1-4)

ఆ బకధ్యాని ఇట్లనెను. "సృష్టి ప్రారంభమైనప్పుడే నేను జన్మించితిని. తరువాత మఱియొకదేహమును దాల్చలేదు. అందువలననే నాపేరు 'ఏకతనుడు'. (దో॥ 162)

"పుత్రా! ఆశ్చర్యపడవలదు. తపస్సుచే సాధ్యము కానిది ఏదియును లేదు. తపోబలముచేతనే బ్రహ్మ లోకములను సృష్టించును. విష్ణువు పరిపాలించును. మహేశ్వరుడు లయమొనర్చును. ప్రపంచములో తపస్సుద్వారా అప్రాప్యమైనదిఏదియును లేదు." ఈ మాటలను వినిన రాజునకు అతనిపై అనురాగము అధికమయ్యెను. అపుడు తపస్వి ప్రాచీనగాథలను, ధర్మకర్మలకు సంబంధించిన ఇతిహాసములను చెప్పసాగెను. జ్ఞానవైరాగ్యములనుగూర్చియు వ్యాఖ్యానింపసాగెను. సృష్టిస్థితి లయములను గూర్చిన ఆశ్చర్యకర గాథలను విస్తారముగా వివరింపసాగెను. వీటినన్నింటిని విని, రాజు అతనికి పూర్తిగా వశుడై, తన పేరును ప్రకటించెను. ఆ సన్న్యాసి "రాజా! నాకంతయు తెలియును నీవు నీపేరును ప్రకటింపక దాచితివి. నీ ప్రవర్తన నాకు మంచిగానే తోచినది. (చౌ॥ 1-4)

రాజా! రాజులు తమ పేర్లను ముందువెనుకలనాలోచింపక సర్వత్ర ప్రకటింపరాదని నీతిశాస్త్రము పేర్కొనుచున్నది. నీ చాతుర్యమునుగ్రహించిన నాకు నీపై ప్రేమ అధికమాయెను. (దో॥ 163)

నీ పేరు ప్రతాపభానుడు, నీ తండ్రిపేరు సత్యకేతువు. గురువుగారికృపవలన నాకంతయు తెలియును. కాని నిజము పల్కుట ప్రమాదకరమని భావించి, నేను ముందుగా చెప్పలేదు. నాయనా! నీ సరళత్వము, ప్రేమవిశ్వాసములు నీతి నైపుణ్యములు చూచి, నాకు నీపై మమత్వము పెఱిగినది. కావున నీవు అడిగిన వెంటనే నా కథను తెల్పితిని. నేను ప్రసన్నుడనైతిని. ఇందు సంశయములేదు. రాజా! నీకు కావలసిన దానిని కోరుకొనుము." ఈ మాటలకు రాజు సంతోషించి, ఆ సన్న్యాసిపాదములకు నమస్కరించి ప్రార్థించెను. "ఓ దయాసాగరా! మీదర్శనము చేతనే నాకు చతుర్విధపురుషార్థములు హస్తగతములైనవి. ఐనను మీరు ప్రసన్నులుగాన దుర్లభమైన ఒకవరమును గోరెదను. దానివలన నా శోకము దూరమగును. (చౌ॥ 1-4)

నా శరీరము జరామరణదుఃఖరహితమగుగాక. యుద్ధమున నన్ను ఎవ్వరును జయింపకుందురు గాక. భూమిపై నూఱుకల్పములు నా ఏకచ్ఛత్రాధిపత్యము నిలిచియుండుగాక. (దో॥ 164)

ఆకుహనాసన్న్యాసి పల్కెను. "రాజా! అట్లేయగుగాక. కాని ఒక జటిల సమస్యగలదు. దానిని వినుము. బ్రాహ్మణులుతప్ప అందఱును నీకు 'దాసోఽహమ్' అనియుందురు. మృత్యుదేవత గూడనీముందు నతమస్తకమగును. ఏలనన తపోబలమువలన బ్రాహ్మణులు శక్తిసంపన్నులౌదురు. వారి క్రోధమునుండి

తప్పించుకొనుట సాధ్యముగాదు. నీవు బ్రాహ్మణులను వశముచేసికొన్నచో నీకు అత్రిమూర్తులును వశమగుదురు. నేను శపథము చేసి, ఎలుగెత్తి చాటగలను. బ్రాహ్మణులపై దౌర్జన్యము పనిచేయదు. విప్రశాపము తప్ప నిన్నెవ్వరును ఏమియు చేయలేరు. కడకు యముడుగూడ నీ జోలికి రాజాలడు. "ఆతని మాటలకు ప్రతాపభానుడు మిక్కిలి ప్రసన్నుడై పలికెను. "స్వామీ! నాకెట్టి ప్రమాదమూలేదు. మీ దయవలన నాకు శుభములే కలుగును. (చౌ॥ 1-4)

"అట్లే కానిమ్ము" అని పలికి ఆ కపటసన్న్యాసి మఱల ఇట్లనెను. "కాని నీవు ఈ అడవిలో దారితప్పినదియు, నాతో కలిసినదియు ఎవ్వరితోడను చెప్పవలదు. చెప్పినచో ఆ దోషము నాదికాదు. (దో॥ 165)

రాజా! మన ఈ ప్రసంగమును ఎవ్వరితోనైనను చెప్పినచో నీకు తీవ్రమైనహాని కలుగును. అందువలన చెప్పవలదని ఆజ్ఞ విధించుచున్నాను. ఈ వృత్తాంతము మూడవవానిచెవిన బడినచో నీవు నశింతువు. ఇది సత్యము. ఓ ప్రతాపభానూ! ఈ రహస్యము బయటికిపొక్కినను, లేక ఏ బ్రాహ్మణుడైనను శపించినను నీవు నశింపక తప్పదు. బ్రహ్మ, మహేశ్వరులు కోపగించినను వేరే ఏవిధముగానైనను నీవు చావవు." మునికి పాదాభివందనమాచరించి రాజు పలికెను. "స్వామీ! బ్రాహ్మణుడు, గురువు ఐన వారికోపములనుండి ఎవరు రక్షించెదరు? బ్రహ్మ కోపించినను గురువు రక్షించును. కాని గురువు విరోధియైనచో ఇక రక్షకులెవ్వరు? మీరు చెప్పినట్లు చేయనిచో నేను నశింపకతప్పదు. దీనినిగూర్చి నాకు చింతలేదు. కాని కేవలము ఒక్క భయము మాత్రము గలదు. బ్రాహ్మణ శాపము మిక్కిలి భయంకరమైనది. (చౌ॥ 1-4)

బ్రాహ్మణులు ఏ విధముగా వశమగుదురు? దయతో తెల్పుడు. ఓ దయాళూ! మీరు తప్ప నా హితము గోరెడి వారెవ్వరును లేరు. (దో॥ 166)

కపటసన్న్యాసి చెప్పెను. "రాజా! వినుము బ్రాహ్మణులను వశపఱచుకొనుటకు ప్రపంచములో పెక్కు ఉపాయములున్నవి. వాటిని ఆచరించుట కష్టము. వాటి సాఫల్యముగూడ సందేహాస్పదమే. ఒక సులభోపాయముగలదు. కాని దానిలోనూ ఒకచిక్కు గలదు. రాజా! ఈ యుక్తి నాఆధీనమున ఉన్నది. నేను నీ నగరమునకు రాజాలను. పుట్టినప్పటినుండియు నేను ఏ గ్రామమునకుగాని, ఎవ్వరిఇంటికిగాని వెళ్లియెఱుగను. నేను రానిచో నీ కార్యము నెరవేరదు. ఇదియొక సందిగ్ధావస్థ"- రాజు ఈ మాటలు విని మృదువుగా ఇట్లనెను. "స్వామీ!. వేదములలో ఒకనీతి తెల్పబడినది. పెద్దవారు చిన్నవారిపై కనికరము చూపుదురు. పర్వతములు తమశిఖరములపై గడ్డిని మోయుచున్నవి. సముద్రుడు శిరస్సుపై నురుగును ధరించును. భూమి తనతలపై ధూళిని భరించును. (చౌ॥ 1-4)

"కావున స్వామీ! నాపై దయ జూపుడు. నాకొఱకై ఈ కష్టములను భరింపుడు" అనుచు రాజు ఆ ముని పాదములపై మోకరిల్లెను. (దో॥ 167)

రాజు పూర్తిగా తనకు అధీనుడైనట్లు తెలిసికొని, కపటియైన ఆ సన్న్యాసి ఇట్లనెను. 'రాజా! వినుము. నిజము పల్కుచున్నాను. ప్రపంచములో నాకు దుర్లభమైనది ఏదియును లేదు. నీవు త్రికరణ శుద్ధిగా నాకు భక్తుడవు. కనుక నేను నీపనిని తప్పక చేసెదను. కాని యోగము, యుక్తి, తపస్సు,"మంత్రము రహస్యముగా సాధన చేసినప్పుడే సఫలములగుచుండును. రాజా! నేను వంట చేసెదను. నీవు దానిని వడ్డింపుము. కాని నేను ఎవ్వరో ఎవ్వరికిని తెలియకూడదు. ఆ అన్నముతినిన వారందఱును నీ ఆజ్ఞకు లోబడియుందురు. వారియిండ్లలో భుజించిన వారును నీకు అధీనులగుదురు. రాజా! ఈ వ్రతమును ఒక సంవత్సరము ఆచరింపవలెను. (చౌ॥ 1-4)

రాజా! ప్రతిదినము ఒక లక్షమంది బ్రాహ్మణులను సకుటుంబముగా భోజనమునకు ఆహ్వానింపుము. వారికి నేను ఒక సంవత్సరము వఱకు వండిపెట్టెదను. (దో॥ 168)

ఈ విధముగా చాల స్వల్పశ్రమతో బ్రాహ్మణులందఱును నీ వశమగుదురు. వారు హవనము, యజ్ఞము, పూజలు, దైవసేవలు చేయుచుండెడివారుగావున దేవతలుగూడ సహజముగనే నీకు వశులయ్యెదరు. ఒక గుర్తును చెప్పెదను. నేను ఈ వేషములో రాను. నామాయాశక్తిచే నేను నీ పురోహితుని అపహరించెదను. నా తపశ్శక్తిచే అతనిని నావలె మార్చి, ఒక సంవత్సరము వఱకు ఇచటనే ఉంచెదను. నేను అతనిరూపమును ధరించి, నీకార్యమును పూర్తిగా నెరవేర్చెదను. రాజా! చాల రాత్రియైనది ఇక నిద్రింపుము. నా తపోబలమువలన నిద్రించుచున్ననిన్ను నీగుఱ్ఱముతోగూడ నీయింటికి చేర్చెదను. మూడవరోజున మఱల నీకు నాదర్శనమగును. (చౌ॥ 1-4)

నేను చెప్పిన ప్రకారము పురోహితునివేషముతో నీయింటికి వచ్చెదను. నిన్ను ప్రక్కకు పిలిచి, ఈ విషయము నంతయును నీకు తెల్పెదను. అప్పుడు నీవు నన్ను గుర్తించెదవు. (దో॥ 169)

ఆ కపటసన్న్యాసియొక్క ఆజ్ఞమేరకు రాజు నిద్రించెను. బాగుగా అలసిపోవుటచే అతడు గాఢనిద్రలో మునిగెను. ఆ కపటసన్న్యాసి పీఠముపై కూర్చుండి, తన యుక్తిని 'కార్యరూపములో పెట్టుటను గూర్చి ఆలోచించుచుండెను. అపుడు వనవరాహరూపములో రాజును దారిమళ్లించిన 'కాలకేతువు' అను రాక్షసుడు అచటికి వచ్చెను. అతడు ఈ కపటసన్న్యాసికి మిత్రుడు. అనేకమాయోపాయములను ఎఱిగినవాడు. అతనికి నూర్గురుకుమారులును, పదిమంది సోదరులును ఉండిరి. వారు దుష్టులు, అజేయులు. వారు దేవతలనుగూడ హింసించువారు. వారివలన బ్రాహ్మణులు, సజ్జనులు, దేవతలు దుఃఖితులగుట జూచి, ప్రతాపభానుడు వారినందఱిని యుద్ధమున చంపియుండెను. దుష్టుడైన ఆ కాలకేతువు ఈ కపట సన్న్యాసితో గలిసి, తమఉమ్మడిశత్రువైన ప్రతాపభానునినాశమునకు కుట్ర పన్నియుండెను. విధివైపరీత్యములవలన రాజునకు ఈ విషయము తెలియదు.
(చౌ॥ 1-4)

తేజశ్శాలియైన శత్రువు ఒంటరివాడైనను వానిని చులకనగా భావింపరాదు. కేవలము తలమాత్రమే మిగిలియున్న రాహువు ఇప్పటికిని సూర్యచంద్రులను దుఃఖితులను జేయుచునే యున్నాడు. (దో॥ 170)

కుహనాముని తనమిత్రుని జూచి సంతోషించి, అతనికి కథనంతయు వినిపించెను. ఆ రాక్షసుడు అందులకానందించి, "రాజా! నీవు నా ఉపదేశానుసారము ఇంతపని చేసితివి. శత్రువు మనవశమైనట్లేయని భావింపుము. ఇంక చింతమాని, హాయిగా నిద్రపొమ్ము. మందులేకుండగనే విధాత రోగమును కుదిర్చెను. శత్రువును వానివంశముతోగూడ నిర్మూలించి, నాల్గవ రోజు నిన్ను కలిసెదను. "ఇట్లు ముని వేషధారియైన రాజును ఓదార్చి, మహా మాయావియు, క్రోధియు ఐన ఆ రాక్షసుడు వెడలిపోయెను. ఆ కాలకేతువు ఒక్క క్షణకాలములో ప్రతాపభానుని వాని గుఱ్ఱముతో పాటు అతనిరాజమందిరమునకు చేర్చెను. రాజును రాణియొద్ద పరుండ బెట్టి, గుఱ్ఱమును అశ్వశాలలో ఉంచెను. (చౌ॥ 1-4)

ఆ కాలకేతువు తనమాయాశక్తితో రాజపురోహితుని అపహరించి, వానికి బుద్ధిమాంద్యమును కల్గించి, ఒక పెద్దగుహలో దాచెను. (దో॥ 171)

పిమ్మట రాక్షసుడు స్వయముగా రాజపురోహితుని రూపమును దాల్చి, వాని సుందరశయ్యపై పరుండెను. తెల్లవాఱకముందే ప్రతాపభానుడు నిద్రనుండి మేల్కొని, తాను తనయింటిలోనుండుట గమనించి, ఆశ్చర్యచకితుడాయెను. ఇదియంతయు ఆ మహర్షితపఃప్రభావమని తలంచి, రాణికి కనబడకుండ మఱల గుఱ్ఱమునెక్కి, ఎవరికిని దెలియకుండ వనమునకు బోయెను. మధ్యాహ్నమునకు రాజు తిరిగి వచ్చెను. ఈ విషయముతెలిసిన ప్రజలు ఇంటింటను మంగళవాద్యములతో ఉత్సవములను జేసికొనిరి. రాజు తనపురోహితుని గాంచి, జరిగిన దంతయును ఒకసారి జ్ఞప్తికి దెచ్చుకొని, ఆశ్చర్య పడెను. రాజు ఆ మూడురోజులను మూడు యుగములుగా భావించెను. ఆ కపటసన్న్యాసిపాదములనే ధ్యానించుచు గడిపెను. అనుకొన్నసమయమునకు ఆ కుహనాపురోహితుడు (రాక్షసుడు) వచ్చి తాము లోగడ అనుకొన్న పథకమును వివరించెను. (చౌ॥ 1-4)

అతనిని గురువుగా భావించి రాజు సంతోషించెను. (వాస్తవముగా అతడు కుహనామునిగాదు, కాలకేతురాక్షసుడు.) అతని మనస్సు పూర్తిగా భ్రమకు లోనైయుండెను. వెంటనే రాజు ఒక లక్షమంది బ్రాహ్మణులను వారి కుటుంబములతో గూడ భోజనమునకు ఆహ్వానించెను. (దో॥ 172)

ఆ కుహనాపురోహితుడు నాలుగురకముల వంటలను షడ్రసోపేతముగ పాకశాస్త్రము ననుసరించి, మాయచేత సిద్ధము చేసెను. లెక్కలేనన్ని వ్యంజనములను కల్పించెను. అనేకజంతువుల మాంసములతోపాటు బ్రాహ్మణులమాంసమునుగూడ కలిపెను. రాజు బ్రాహ్మణులనందఱిని భోజనములకై పిలిచి, పాదప్రక్షాళనమొనర్చి వారిని సాదరముగా కూర్చుండబెట్టెను. రాజు అభోజనపదార్థములను వారికి వడ్డింపగనే కాలకేతువు సృష్టించిన ఆకాశవాణి "ఓ బ్రాహ్మణులారా! లేచి మీరు మీఇండ్లకు పొండు. ఈ భోజనము హానికరము. ఇందులో బ్రాహ్మణులమాంసము కలుపబడినది. దీనిని భుజింపకుడు" అని పలికెను. ఆకాశవాణిని వినగానే బ్రాహ్మణులందఱును లేచినిలబడిరి. రాజు వ్యాకులచిత్తుడాయెను ఆతని నోట మాటరాలేదు. బుద్ధి భ్రమకు లోనయ్యెను. (చౌ॥ 1-4)

బ్రాహ్మణులందఱును కోపముతో ముందువెనుకలాలోచింపక పలికిరి. "మూర్ఖుడవైన ఓ రాజా! నీవుకుటుంబ సహితముగా రాక్షసుడవై జన్మింపుము. (దో॥ 173)

ఓ క్షత్రియాధమా! నీవు బ్రాహ్మణులను ఆహ్వానించి, వారిని సపరివారముగా భ్రష్టులను గావింపదలచితివి. భగవంతుడు మా పవిత్రతను (ధర్మములను) కాపాడినాడు. ఇపుడు నీవే సపరివారముగా నశింపగలవు. ఒక సంవత్సరములోపల నీవు నాశనమయ్యెదవు. నీ వంశమున నీకు తిలాంజలియిచ్చెడివారుగూడ ఉండరు." ఈ శాపమును విని, రాజు భయముతో మిక్కిలి వ్యాకులుడయ్యెను. పిమ్మట ఉత్తమమైన ఆకాశవాణి పలికెను. 'ఓబ్రాహ్మణులారా! వాస్తవమును తెలిసికొనకుండా మీరు ఈతనిని శపించితిరి. ఇతడు ఏ తప్పును చేయలేదు."- ఆకాశవాణిని విని, బ్రాహ్మణులందఱును చకితులైరి. రాజు వెంటనే వంటశాలలోనికి పోయిచూచెను. అక్కడ భోజనపదార్థములుగాని వంటవాడుగాని కన్పించలేదు. రాజు మిగుల చింతించి, వారికడకు వచ్చెను. పిమ్మట అతడు జరిగిన వృత్తాంతమంతయు వారితో చెప్పి, భయముతో విహ్వలుడై నేలపై పడిపోయెను. (చౌ॥ 1-4)

బ్రాహ్మణులు పలికిరి "రాజా! నీవు నిర్దోషివేయైనను విధినెవ్వరూ తప్పింపలేరు. బ్రాహ్మణశాపము భయంకరము, అప్రతిహతము. (దో॥ 174)

ఈ విధముగా పలికి, వారందఱును వెళ్ళిపోయిరి. నగరవాసులు ఈ సమాచారమును విని, మిక్కిలి చింతించి విధాతను నిందించిరి. విధాత హంసనుజేయబోయి కాకినిజేసినాడు. (ఇట్టి పుణ్యాత్ముని దేవతగాజేయక రాక్షసుని జేసినాడు) కాలకేతువు నిజమైన రాజ పురోహితుని ఇంటికి జేర్చి, కపట సన్న్యాసికి ఈ విషయమును అంతయును జెప్పెను. ఆ కపటసన్న్యాసి శత్రురాజులందఱికిని ఉత్తరములను వ్రాయగా వారు సైన్యముతో ప్రతాపభానునిపైకి దండెత్తి వచ్చిరి. నగారాలను మ్రోగించుచు నగరమును ఆక్రమించిరి. పెక్కు దినములు యుద్ధము జరిగెను. ప్రతాపభానునిసైనికులు అందఱును పరాక్రమముతోపోరాడిరిగాని, కడకు మృతులైరి. రాజు, అతనితమ్ముడు రణరంగమున మడిసిరి. సత్యకేతువంశములో ఎవ్వరును మిగులలేదు. బ్రాహ్మణులశాపము ఎట్లు అసత్యమగును? శత్రురాజులు నగరమును పునర్నిర్మించి, వారి వారి రాజ్యములకు వెళ్ళిరి. వారు విజేతలుగా కీర్తిగాంచిరి. (చౌ॥ 1-4)

(యాజ్ఞ వల్క్యుడు పలుకుచున్నాడు) భరద్వాజా! వినుము. విధి ప్రతికూలించినప్పుడు ధూళి మేరుపర్వతముగా, తండ్రి మృత్యువుగా, త్రాడు పాముగా మాఱును. (దో॥ 175)

# రావణాదుల జననములు

ఓ మునీశ్వరా! వినుము. కొలది కాలమునకు పిమ్మట ఆ రాజా అతని పరివారములూ రాక్షసులై జన్మించిరి. ఆతనికి పది తలలు ఇఱువది భుజములు ఉండెను. అతని పేరు రావణుడు. అతడు ప్రచండుడు, శూరుడు, వీరుడు. రాజుతమ్ముడైన అరిమర్దనుడు మహాబలశాలియైనకుంభకర్ణుడుగా జన్మించెను. మంత్రియైనధర్మరుచి రావణునిసవతితమ్ముడుగా పుట్టెను. ఆతనిపేరు విభీషణుడు. అతడు విష్ణుభక్తుడు, విజ్ఞానఖని, అని ప్రసిద్ధి గాంచెను. రాజు యొక్క కుమారులు, సేవకులు, ఇతరులు భయంకర రాక్షసులుగా జన్మించిరి. వారు కామరూపులు, దుష్టులు, కుటిలురు, వివేకహీనులు, నిర్దయులు, హింసాపరులు, పాపులు. ప్రపంచమును పీడించువారు. వారి దుష్కృత్యములకు అంతమేలేదు. (చౌ॥ 1-4)

వారు పవిత్రమైన, నిర్మలమైన నిరుపమానమైన పులస్త్యుని వంశమున జన్మించినను బ్రాహ్మణ శాపము వలన పాపులైరి. (దో॥ 176)

ముగ్గురు సోదరులును ఘోరతపస్సు చేసిరి. వారి ఉగ్రతపస్సులకు బ్రహ్మ ప్రత్యక్షమై "నాయనలారా! నేను ప్రసన్నుడనైతిని. వరములను కోరుకొనుడు."- అనియనెను. రావణుడు సవినయముగా పాదాభివందనమాచరించి, "ప్రభూ! నర వానరులవలనతప్ప మఱియెవ్వరివలనగూడ నాకు చావులేకుండ వరమిమ్ము." అని అర్థించెను. (శివుడు పలుకుచున్నాడు) నేను, బ్రహ్మ కలిసి, అట్లే కానిమ్ము" అని వరమిచ్చితిమి. " పిమ్మట బ్రహ్మ కుంభకర్ణుని యొద్దకు వచ్చెను. ఆతనిని జూచి ఆశ్చర్యము వేసెను. "ఈ దుష్టుడు నిత్యము భుజించినచో ప్రపంచమే నాశనమగును" అని తలచి, వానితలలో ప్రవేశింపుమని శారదామాతను కోరెను. అతడు తనకు ఒక్కనాడు మాత్రము జాగృతిని ఆఱు మాసములు నిద్రను ప్రసాదింపుమని ప్రార్థించెను. (చౌ॥ 1-4)

చివరకు బ్రహ్మ విభీషణుని యొద్దకు వచ్చెను. అతడు విష్ణుపాదపద్మములపై అనన్య భక్తిని ప్రసాదింపుమని కోరెను. (దో॥ 177)

వారు కోరుకొనిన రీతిగా వరములనిచ్చి, బ్రహ్మ సత్యలోకమును చేరెను. ముగ్గురు సోదరులును సంతుష్టులై గృహోన్ముఖులైరి. మయుడను దానవునకు 'మండోదరి' అను కూతురుండెను. ఆమె నారీశిరోమణి. మయుడామెను రావణునకు సహధర్మచారిణినిగా జేసెను. రావణుడు రాక్షసరాజుగునని ఆతనికి తెలియును. అట్టి అందాలరాశిని పొంది, రావణుడు సంతుష్టుడాయెను. తన ఇద్దఱుసోదరులవివాహములనుగూడ అతడే జరిపించెను. సముద్ర మధ్యభాగమున బ్రహ్మ నిర్మితమైన 'త్రికూటపర్వతము' ఉండెను. అది అతివిశాలము, దుర్గమము ఐన కోట. మయదానవుడు మాయావి, శిల్పి. దానిని అతడు మణిమాణిక్యములతో అలంకరించెను. అందు రత్నఖచితములైన బంగారు భవనములు అనేకములుండెను. నాగజాతి నివసించు పాతాళలోక రాజధానియగు 'భోగవతి' కంటెను, దేవతలు నివసించు స్వర్గరాజధానియైన 'అమరావతి' కంటెను మిన్నయై, దుర్గమమై యుండెను. అది 'లంక'యను పేరుతో సాటిలేనిదిగా ప్రసిద్ధి గాంచెను. (చౌ॥ 1-4)

దానికి నాలుగువైపులగల సముద్రము 'అగడ్త'గా నుండెను. మణులుచెక్కిన బలిష్ఠములైన ప్రాకారకుడ్యములు మహావైభవోపేతములు. ప్రతికల్పమునందును శూరుడును, వీరుడును, ప్రతాపవంతుడును, బలశాలియు అగు రాక్షసరాజు గొప్ప సేనలతో ఆ లంకానగరమున నివసించుచుండుట భగవంతుడైన ఆ శ్రీహరి సంకల్పమే. (దో॥ 178. క,ఖ)

మొదట ఆ లంకలో రాక్షసయోధులు నివసించుచుండిరి దేవతలు వారినందఱిని యుద్ధములో హతమార్చిరి. ఇంద్రుని ఆజ్ఞానుసారము కుబేరుని భటులైన ఒక కోటిమంది యక్షులు దానికి రక్షకులుగా నుండిరి. రావణునకు ఈ వార్త తెలిసినంతనే సైన్యముతో ఆ కోటను ముట్టడించెను. ఆ సైన్యమును జూచి, యక్షులు ప్రాణభయముతో

పాఱిపోయిరి. విజేతయైనదశకంఠుడు ఆ నగరమునంతయును తిరిగిచూచెను. తనకుతగినరాజధాని లభించినదని సంతోషపడెను. సహజముగా అందమైన, దుర్గమమైన ఆ నగరమును అతడు తనరాజధానిగా జేసికొనెను. రాక్షసులకు వారివారి యోగ్యతలను బట్టి గృహములను ఇచ్చి సంతోష పఱచెను. రావణుడు ఒకసారి కుబేరునిపై దండెత్తి, అతనిని ఓడించి, అతని పుష్పక విమానమును గొనివచ్చెను. (చౌ॥ 1-4)

మఱియొక సమయమున రావణుడు అవలీలగా కైలాసపర్వతమును ఎత్తి తనభుజబలమును పరీక్షించుకొని, సంతోషముతో తిరిగి వచ్చెను. (దో॥ 179)

లాభమధికమైన లోభముగూడ అధికమగునట్లు, రావణుని సుఖసంపదలు, పుత్రులు, సైన్యము, జయము ప్రతాపము, బలము, బుద్ధివైభవము, కీర్తి నిత్యనూతనముగా వృద్ధిచెందుచుండెను. అతి బలశాలియైన కుంభకర్ణుడు అతని సోదరుడు. అతడు సాటిలేని యోధుడు. మద్యము త్రాగి ఆఱునెలలు వరుసగా నిద్రించును. అతడు నిద్రలేవగానే లోకములన్నియు భయముతో వణకును. అతడు ప్రతిదినము భోజనము చేసినచో లోకములే మిగులవు. సంగ్రామ రంగమున అతడప్రతిమానవీరుడు. కుంభకర్ణుని వంటి పరాక్రమవంతులు లంకలో పెక్కుమంది గలరు. మేఘనాదుడు రావణుని పెద్ద కుమారుడు. యుద్ధములో అద్వితీయుడు. అతనిని ఎదిరించు వారు ఎవ్వరును లేరు. ఆతనిభయముతో సురపురి యందు దేవతలు అనుక్షణము గడగడలాడుచుండెడివారు. (చౌ॥ 1-4)

ఇంకను కుముఖుడు, అకంపనుడు, వజ్రదంతుడు, ధూమకేతువు, అతికాయుడు మొదలగు యోధులు, పెక్కుమంది గలరు. వారిలో ఒక్కొక్కడు ప్రపంచమునే జయింపగల సమర్థుడు. (దో॥ 180)

ఈ రాక్షసులందఱును కామరూపులే. రాక్షసమాయలలో ప్రవీణులు. వారి హృదయములలో దయా ధర్మములు స్వప్నమునగూడ కనబడవు. దశకంఠుడైన రావణుడు ఒకసారి సభలో గూర్చొని తన అపరిమితపరివారమును జూచెను. అతనికుమారులు, మనుమలు, బంధువులు, సేవకులు, రాక్షసయోధులు అసంఖ్యాకముగా ఉండిరి. సహజముగా దురభిమానియైనరావణుడు తన సేనలను జూచి, క్రోధముతో గర్వముతో ఇట్లనెను. "ఓ రాక్షస వీరులారా! వినుడు. దేవతలు మనకు శత్రువులు. వారు మనకు ఎదురుగా నిలిచి యుద్ధము చేయరు. బలశాలియైన శత్రువును జూచి వారు పాఱిపోవుదురు. వారియందఱిమృత్యువునకు ఒకటే ఉపాయమున్నది. మీకు తెల్పెదను వినుడు. వారి బలమును వృద్ధిపఱచు బ్రాహ్మణ భోజనములు, యజ్ఞములు, హోమములు, శ్రాద్ధములు ధ్వంసమొనర్పుడు. (చౌ॥ 1-4)

దేవతలు ఆకలితో క్రుంగి కృశించి, గత్యంతరములేక మనలను శరణు జొచ్చెదరు. అప్పుడు వారిని మనము చంపవచ్చును. లేదా మనకు అధీనులనుగా జేసికొనవచ్చును. (దో॥ 181)

పిమ్మట మేఘనాదుని పిలిపించి, అతనిపరాక్రమము, దేవతలయెడఅతనికిగల వైరము అధికమగునట్లు అతనిని ప్రేరేపించెను. "కుమారా! దేవతలలో రణధీరులు బలశాలురు, యుద్ధోత్సాహులు ఐన వారిని జయించి, బందీలుగా దీసికొని రావలయును. మేఘనాదుడు లేచి, తండ్రికి నమస్కరించి, ఆయన ఆజ్ఞను పాటించుటకు బయలుదేఱెను. ఇట్లు రావణుడు ఎల్లరకును ఆజ్ఞలను ఇచ్చి, తాను స్వయముగా గదాధారియై దేవతలను జయించుటకు బయలు దేఱెను. ఆతనినడకకు భూమి దద్దరిల్లెను, అతనిగర్జనలవలన సురకాంతలకు గర్భపాతములయ్యెను. కోపోద్రిక్తుడైన రావణుడు వచ్చుటను విని, దేవతలు అందఱును పాఱిపోయి, మేరుపర్వతగుహలలో తలదాచుకొనిరి. దిక్పాలకప్రదేశములు అన్నియును రావణునకు శూన్యములై కన్పించెను. మాటిమాటికిని అతడు గర్జనలతో దేవతలను దూషించుచు కవ్వించుచుండెను. యుద్ధోన్మాదముతో తనకు దీటైన యోధునకై వెదకుచు విశ్వమంతయు గాలించెను. కాని అట్టి వీరుడెవ్వడును దొరకలేదు. సూర్యచంద్రులను, ఇంద్రాగ్నియమవరుణవాయుకుబేరాది దిక్పాలకులను, దేవ, కిన్నర, సిద్ధ, నాగ, మనుష్యాది వివిధ గణములను

పట్టుబట్టి తరిమికొట్టెను. బ్రహ్మ సృష్టిలోగల శరీరధారులైన స్త్రీ పురుషులెల్లరును రావణునకు వశవర్తులైరి. భయభ్రాంతులై అందఱును అతని ఆజ్ఞలను పాలించుచుండిరి. ప్రతిదినము సవినయముగా అతనికి పాదాక్రాంతులై జీవించుచుండిరి. (చౌ॥ 1-7)

రావణుడు తనభుజబలముచే జగత్తునంతయు వశపఱచుకొనెను. ఎవ్వడును స్వేచ్ఛగా ప్రవర్తించుటకు వీలులేదు. రావణుడు సమస్తభూమండలాధిపతియై తనయిష్ట ప్రకారము రాజ్యపాలన చేయుచుండెను. దేవయక్షగంధర్వకిన్నరనాగమనుష్యజాతి కన్యలను, ఇతరసుందరీమణులను తనబాహు బలముచే జయించి పెండ్లియాడెను. (దో॥ 182. క,ఖ)

ఇంద్రజిత్తు రావణునిఆజ్ఞలను ఎప్పటికప్పుడు వెంటనే ఆచరించుచుండెడివాడు. ఇతరులుగూడ రావణాజ్ఞలను శిరసావహించుచుండెడివారు. భయంకరులు, పాపులుఐన ఆరాక్షసులు రావణునిఅండచూచుకొని దేవతలను హింసించుచుండిరి. మాయాప్రయోగములనుజేయుచు ఉపద్రవములను సృష్టించుచుండిరి. కామరూపధారులై ఇతరులను భయకంపితులనుగా జేయుచుండిరి. ధర్మ కార్యములకు విఘాతములను గల్గించుచు వేదవిరుద్ధముగా కర్మలను ఆచరించుచుండిరి. గోవులు, బ్రాహ్మణులుఉన్ననగరములను, పురములను, గ్రామములను అగ్నికి ఆహుతి జేయుచుండిరి. వారి భయమువలనశుభకార్యములునుఆగిపోవుచుండెను. దేవతలు, బ్రాహ్మణులు, గురువులు అగౌరవములపాలగుచుండిరి. హరిభక్తి, యజ్ఞాచరణములు, తపశ్చర్యలు, జ్ఞాననిష్ఠలు క్రమముగా అడుగంటి పోవుచుండెను. వేద పురాణ ప్రవచనములు స్వప్నమున గూడ వినబడుట లేదు. (చౌ॥ 1-4)

జపతపములు, యోగవైరాగ్యములు, యజ్ఞ యాగములు మున్నగు మాటలు చెవిసోకినంతనే రావణుడు స్వయముగా వెళ్ళి, వాటిని విధ్వంసముచేయుచుండెను. 'ధర్మము' అను మాటయే విన్పింపకుండెను. భ్రష్టాచారములు ఎల్లెడల వ్యాపించెను. వేదపురాణపఠనము చేసెడివారిని భయపెట్టుచు, బాధించుచు, దేశబహిష్కరణకు గుఱిచేసెడివారు. (ఛం॥)

ఆ నిశాచరులు చేయు దుష్కృత్యములను వర్ణించుటకు మాటలు చాలవు. వారికి హింసాకృత్యములే అత్యంతప్రీతిపాత్రములయ్యెను. వారిపాప కార్యములకు పరిమితియే లేకుండెను. (సో॥ 183)

(మాసపారాయణము-ఆఱవ విరామము)

## భూదేవి వ్యాకులపాటు

పరధనములను, పరస్త్రీలను అపహరించువారును, దుష్టులును, చోరులును జూదరులును ఎక్కువైరి. తలిదండ్రులను, దేవతలను గౌరవించువారే కఱవైరి. పైగా వారు సజ్జనులచేతనే సేవలు చేయించుకొనుచుండిరి. (శివుడు పల్కుచున్నాడు) భవానీ! ఈ విధముగా ప్రవర్తించువారిని అందఱిని నీవు రాక్షసులనుగానే భావింపుము. ఇట్టి ధర్మశైథిల్యమును జూచి భూదేవి మిక్కిలి వ్యాకులత నొందెను. "పర్వతములు, నదులు, సముద్రములు నాకు ఏ మాత్రము బరువు గావు. కాని ఈ పాపాత్ములు మిక్కిలి బరువైనారు."- అని భావించుచు భూదేవి అధర్మకార్యములను చూచుచుగూడ రావణునకు వెఱచి, పెదవిని విప్పకుండెను. మనసులో ఎంతగానో ఆలోచించి, భూదేవి గోరూపమును దాల్చి, దేవతలకడకు, మునుల యొద్దకు వెళ్ళి, విలపించుచు తనదుఃఖకారణములను వారికి వినిపించెను. కాని ఎవ్వరును ఆమెకు సహాయపడుటకై ముందుకు రాలేదు. (చౌ॥)

దేవతలు గంధర్వులు మునులుగలిసి, బ్రహ్మలోకమునకు వెళ్లిరి. శోక భయములతో పృథ్వియు గోరూపమున వారిని అనుసరించియే యుండెను. వారివలన బ్రహ్మదేవుడు విషయములనన్నింటిని గ్రహించియు, తనఅశక్తతను ప్రకటించుచు, భూదేవితో ఇట్లనెను. నీ సేవలను అందుకొనుచున్న ఆ స్వామియే (ఆ శ్రీమహావిష్ణువే) మనలను అందఱినీ కాపాడగలడు. మన అందఱికిని రక్షకుడు అతడే. (ఛం॥)

బ్రహ్మ పలికెను. "ఓ ధరిత్రీ! మనస్సును పదిలపఱచుకొని, శ్రీహరి చరణములను స్మరింపుము. ప్రభువు తనభక్తులకష్టములను ఎఱుగును. దారుణమైన నీ ఆపదను తొలగించును. (సో॥ 184)

దేవతలందఱును కూర్చొని ఆలోచించిరి. మన బాధలను విన్నవించు కొనుటకు ప్రభువును ఎచ్చట వెదక వలెను? స్వామి వైకుంఠమున దొరకునని కొందఱును, క్షీరసాగరమున వసించునని మఱికొందఱును పలికిరి. తనయెడ ప్రగాఢభక్తివిశ్వాసములుగలవారిహృదయములయందు ప్రభువు ప్రకటితుడగుచుండును. పార్వతీ! ఆ సదస్సులో నేనునుఉంటిని. ఆ సందర్భమున నేను ఒకమాటను పలికితిని. "శ్రీహరి సర్వవ్యాపి, భక్తిశ్రద్ధలు గలచోట తననుతాను ప్రకటించుకొనునని నావిశ్వాసము. ప్రభువులేని ప్రదేశము, కాలము, దిశ ఉండవు. చరాచరజగత్స్వరూపుడైనను అతడు వికారరహితుడు, విరక్తుడు. రాపిడిద్వారా అగ్ని ప్రకటితమగునట్లు భక్తిద్వారా ఆయన ప్రకటితుడగుచుండును."- నా మాటలను అందఱును అంగీకరించిరి. బ్రహ్మయు "బాగు బాగు" అనెను. (చౌ॥ 1-4)

నా వచనములను విని బ్రహ్మదేవుడు తన మనస్సులో ఎంతో ఆనందించెను. ఆయనశరీరము పులకరించెను. కనులనుండి ఆనందాశ్రువులు పొంగిపొరలెను. ఆస్థితినుండి బయటపడి అతడు చేతులు జోడించి, పరమాత్మను స్తుతింప సాగెను. (దో॥ 185)

ఓ దేవాది దేవా! భక్తసుఖదాయకా! శరణాగతరక్షకా! నీకు జయము జయము. గోబ్రాహ్మణులకు అభయప్రదాతా! అసురవినాశకారీ! సింధుకన్యాపతీ! నీకు జయము జయము. దేవతలను, భూదేవిని పాలించు ప్రభూ! నీ లీలలు అద్భుతములు. వాటి రహస్యములను ఎవ్వరును ఎఱుంగరు. నీవు అవ్యాజ కృపాళుడవు, దీనదయాళుడవు. మాపై కృపజూపుము. ఓఅచ్యుతా! సకల హృదయనివాసీ! సర్వవ్యాపకా! పరమానందస్వరూపా! వాచామగోచరా! అనిర్వచనీయా! మాయాతీతా! ఇంద్రియాతీతా! పవిత్రచరిత్రా! మోక్షప్రదాయకా! నీకు జయము జయము. విరాగులై-మోహరహితులైనమునులు అత్యంత- అనురాగముతో సర్వదాధ్యానించుచు నీగుణములను కీర్తించుచుందురు. అట్టి సచ్చిదానంద స్వరూపుడవైన నీకు జయమగుగాక. సత్త్వరజస్తమోమయమైన జగత్తును సృష్టించు నీవు సర్వస్వతంత్రుడవు. బ్రహ్మవిష్ణుమహేశ్వరరూపములలో నీవే సృష్టిస్థితిలయములకు కారకుడవు. మాప్రార్థనలను ఆలకింపుము. భక్తి అనగా ఏమో మాకు తెలియదు. మేము పూజలను చేసిఎఱుగము. నీవు జననమరణ భయములను రూపుమాపువాడవు. మునుల మనస్సులను ఆనందింప జేయువాడవు. వారిఆపదలను తొలగించువాడవు. అట్టి భగవానుడవైన నిన్ను దేవతలమైన మేము మనసా వాచా కర్మణా శరణుజొచ్చుచున్నాము. ఋషులు, వాగ్దేవి, వేదములు, ఆదిశేషుడుగూడ నీమహిమలను ఎఱుగజాలరు. నీవు దీనజనబాంధవుడవు. మాపై కృపజూపుము. సంసార సముద్రమునకు మందరాచలరూపుడవు. సర్వవిధసుందరుడవు. కల్యాణగుణములకు నిధివి. ప్రభూ! మునులు, సిద్ధులు, దేవతలు అందఱు మిక్కిలివ్యాకులపాటుతో నీపాదపద్మములకు ప్రణమిల్లు చున్నారు. (చౌ॥ 1-4)

దేవతలను భూదేవిని మిక్కిలి భయగ్రస్తులనుగా తెలిసికొని, వారి భక్తి ప్రపూర్ణవచనములను విని, శోకసందేహములను దూరమొనర్చుచు గంభీరముగా ఆకాశవాణి ఇట్లనెను. (దో॥ 186)

## దేవతలకు భగవంతుని అభయము

ఓ మునులారా! సిద్ధులారా! దేవతలారా! భయపడకుడు. నేను నా సర్వాంశలతో సర్వోత్తమమైన సూర్యవంశమునందు మానవాకృతితో అవతరించెదను. పూర్వము అదితికశ్యపులు గొప్ప తపమాచరించిరి. వారికి ఇదివఱకే వరములను ఇచ్చియుంటిని. వారు అయోధ్యానగరమున కౌసల్యాదశరథులుగా జన్మించినారు. వారియింట నేను నలుగురుసోదరులరూపములలో అవతరించెదను. రఘువంశమునకు వన్నెతేగలను. నారదుని మాటలనన్నింటిని వాస్తవములు చేయగలను. నా ఆదిశక్తియు నాతోపాటు అవతరించును. దేవతలారా!

భూభారమును తొలగించెదను. నిర్భయముగా మీరు మీ స్థానములకు చేరుడు."- ఈ ఆకాశవాణి పల్కులను దేవతలు చెవులార విని, చల్లబడిన హృదయములతో తమతమస్థానములకు వెళ్లిరి. బ్రహ్మదేవుడు భూదేవిని ఓదార్చెను. ఆమెభయము తొలగెను, మనసు కుదుట బడెను. (చౌ॥ 1-5)

దేవతలతో "మీరుగూడ వానరులై జన్మించి, భూమిపై భగవత్సేవ చేయుడు."- అని చెప్పి బ్రహ్మ సత్యలోకమునకు వెళ్లెను. (దో॥ 187)

దేవతలందఱును స్వస్థానములకు చేరిరి. వారికిని, భూమాతకును మనశ్శాంతి లభించెను. వారు ప్రసన్నహృదయములతో బ్రహ్మదేవునిఆజ్ఞను పాటించుటకు సన్నద్ధులైరి. వారు వెంటనే మిక్కిలిబలపరాక్రమములతో భూమిపై వానరులై జన్మించిరి. వారు శూరులు, వీరులు. గిరులు, తరువులు, నఖములు వారి ఆయుధములు. వారు ధీరులు, బుద్ధిమంతులు. వారు భగవంతుని ఆగమనమునకై నిరీక్షించుచుండిరి. పర్వతములలో, అడవులలో గొప్పసైన్యముగా ఏర్పడి పెక్కుచోట్ల నివాసములను ఏర్పఱచుకొనిరి. భవానీ! మనోహరమైన ఈ కథను తెల్పితిని. మధ్యలో వదలివేసినకథను గూడ వినుము. రఘుకుల శిరోమణి యైన దశరథమహారాజు అయోధ్యానగరమును పాలించుచుండెను. ఆయన పేరు వేదములలోగూడ ప్రసిద్ధమైనది. అతడు సర్వసద్గుణనిధి, జ్ఞాని, ధర్మధురంధరుడు. ఆయన హృదయము విష్ణుభక్తితో నిండియుండెను. ఆయన మనస్సు నిరంతరము ఆ శ్రీహరినే స్మరించుచుండెను. (చౌ॥ 1-4)

ఆయన ధర్మపత్నులైన కౌసల్య మొదలగు రాణులు పరమపవిత్రలు. పతియాజ్ఞను జవదాటరు. శ్రీహరిచరణకమలములయందు అత్యంతభక్తి గలవారు. (దో॥ 188)

దశరథ మహారాజు తనకు సంతానము లేకుండుటచే విచారపడుచుండెను. ఒకసారి ఆయన తనకులగురువైన వసిష్ఠునికడకేగి ఆయనచరణములకు నమస్కరించి, తనసుఖదుఃఖములనన్నింటిని ఆయనకు విన్నవించుకొనెను. వసిష్ఠుడు ఆయనను పెక్కు విధముల ఓదార్చెను. "ధైర్యము వహింపుము, త్వరలో నీకు నలుగురుకుమారులు కలిగెదరు. వారు ముల్లోకములలో ప్రసిద్ధి కెక్కెదరు. భక్తుల భయమును పోగొట్టెదరు."- పిమ్మట వసిష్ఠుడు శృంగి మహర్షిని ఆహ్వానించి, ఆయనచే 'పుత్రకామేష్టి' యాగమును చేయించెను. ముని శ్రద్ధాదరములతో ఆహుతులను సమర్పించెను. హవిష్యాన్నపాయసముతో అగ్నిదేవుడు ప్రత్యక్షమై, దశరథునితో పలికెను. వసిష్ఠుడు చెప్పినట్లు నీ మనోభీష్టములన్నియును సిద్ధించును. రాజా! నీవు ఈ పాయసమును తీసికొని ఉచితరీతిని నీ భార్యలకు పంచుము. (చౌ॥ 1-4)

అగ్నిదేవుడు ఈవిషయములను సభాసదులకును వివరించి అదృశ్యుడాయెను. రాజు పరమానంద భరితుడాయెను. ఆయన హృదయము ఆనందముతో ఉప్పొంగి పోయెను. (దో॥ 189)

దశరథ మహారాజు వెంటనే తనప్రియపత్నులను రప్పించెను. కౌసల్యాది రాణులు విచ్చేసిరి. రాజు పాయసములో సగభాగమును కౌసల్యకొసంగెను. మిగిలిన పాయసమును రెండు భాగములుగా జేసెను. అందులో ఒక భాగమును కైకేయికి ఇచ్చెను. మిగిలిన దానిని మఱల రెండు భాగములగా జేసెను. వాటిని కౌసల్యా, కైకేయీలచేతులయందుఉంచి, వారిని ప్రసన్నులనుగాజేసి వారి అనుమతితో వాటిని సుమిత్రకు ఇచ్చెను. రాణులు ముగ్గురును గర్భవతులైరి. వారి హృదయములలో సుఖానందములు ఇనుమడించెను. శ్రీహరియంశలు వారిగర్భములయందు చేరినప్పటినుండి లోకములలో సుఖసంపదలు ఎక్కువయ్యెను. సౌందర్యసౌశీల్యతేజోరాసులైన రాణులతో రాజమందిరములు శోభిల్లెను. ఇట్లు ఆనందముగా కొంతకాలము గడిచెను. భగవంతుడవతరించు సమయము ఆసన్నమాయెను. (చౌ॥ 1-4)

# శ్రీరామ జననము - బాల్యము

యోగలగ్నగ్రహతిథివారములన్నియును అనుకూలములాయెను. సృష్టియందలి ప్రాణులన్నియు ఆనందముతో నుండెను. ఏలనన శ్రీరాముని జననము సర్వప్రాణికోటికిని సుఖదాయకము. (దో॥ 190)

పవిత్ర చైత్రశుద్ధనవమితిథినాడు మధ్యాహ్నసమయమున అభిజిల్లగ్నమున ఎక్కువ చలిగానివేడిగాని లేకుండెను. సర్వలోకములకును ప్రశాంతిని చేకూర్చుసమయమది. చల్లనివాయువులు సువాసనలను వెదజల్లుచు మెల్లగావీచుచుండెను. దేవతలు ఆనందించుచుండిరి. సజ్జనులమనస్సులు ఉత్సాహభరితములాయెను. పర్వతములు మణిమయములై కాంతులను విరజిమ్ముచుండెను. వృక్షములు నానావిధపుష్పములతో విరాజిల్లుచుండెను. నదులు అమృత ప్రవాహములతో నిండియుండెను. ఈ విధముగా వృక్షముల మీది సుమశోభలు, పర్వతములపైగల మణులకాంతులు, నదీప్రవాహ తరంగముల తళతళలు కనువిందుగావించుచుండగా ప్రకృతి అంతయునుఅపూర్వ శోభావిలసితమై, చూడముచ్చటగానుండెను. భగవంతుడు అవతరించు సమయము ఆసన్నమైనదని గ్రహించి, బ్రహ్మాదిదేవతలు తమతమవాహనములపై విచ్చేసిరి. నిర్మలాకాశము దేవతలసమూహములతో నిండిపోయెను. గంధర్వులు భగవద్గుణములను గానము చేయసాగిరి. వారు అంజలిఘటించి, పుష్ప వర్షములను గురిపించిరి. ఆకసమున నగారాలు మ్రోగెను. దేవతలు, నాగులు, మునులు భగవంతుని వేనోళ్ల పొగడుచు అపూర్వములైన ఉపాయనములతో తమ సేవలనందించిరి. (చౌ॥ 1-4)

అపుడు లోకకల్యాణార్థమై జగదాధారుడైన ప్రభువుఅవతరించెను. దేవతాగణములు అనేక విధముల ప్రస్తుతులొనర్చి, తమతమలోకములకు వెళ్లి పోయిరి. (దో॥ 191)

కృపాళువు, పరమదయానిధి, కౌసల్యానందవర్ధనుడైన శ్రీరామచంద్ర ప్రభువు ఉదయించెను. మునిమనోహరుడైనప్రభువుయొక్కఅత్యద్భుతరూపమునుగాంచి, కౌసల్యామాత పరమానంద భరితురాలయ్యెను. ప్రభువు యొక్క నీలమేఘచ్ఛాయయు ఎల్లరకును నేత్రానందకరమైయుండెను. చతుర్భుజములయందు దివ్యాయుధములను, మెడలో మణిహారములను, వనమాలను ధరించియుండెను. విశాలనేత్రములతో సౌందర్యరాశియైన ఆ ఖరారి అద్భుత రీతిలో అవతరించెను. కౌసల్యామాత చేతులు జోడించి ఇట్లు పల్కెను."ఓ ప్రభూ! నీవు అనంతుడవు. నిన్ను ఎంతని స్తుతింపగలము? నీవు మాయాజ్ఞానగుణములకు అతీతుడవనియు, సర్వప్రమాణములకును అందనివాడవనియు, వేదపురాణాదులు ప్రస్తుతించుచున్నవి. కరుణాసముద్రుడు, సర్వసుఖనిధానమూ, సద్గుణరాశియు అని శ్రుతువులచే, సజ్జనులచే స్తుతింపబడు భక్తపరాధీనుడైన లక్ష్మీపతి నేడు నాకు ప్రత్యక్షమాయెను. ప్రభూ! నీ ప్రతిరోమమునందును మాయావిరచిత బ్రహ్మాండసమూహములున్నవని వేదములు తెలుపుచున్నవి. అట్టి నీవు నాగర్భమున చేరితివి. ఇది మిక్కిలి ఆశ్చర్యకరము. ఈ విషయమును వినిన ధీరపురుషుల బుద్ధులును భ్రమకులోనగును."- ఇట్లు తల్లి కౌసల్యకు జ్ఞానోదయమైన వెంటనే భగవంతుడు ఒక చిఱునవ్వు నవ్వెను. ప్రభువు అనేక లీలలను ప్రకటింపదలంచెను. ఆమెపూర్వజన్మవృత్తాంతములనన్నింటిని ఆమెకు దెల్పెను. దానివలన ఆమెకు భగవంతునిపైగల అనన్యభక్తి పుత్రవాత్సల్యముగామాఱెను. మఱల కౌసల్యామాత ఇట్లు పలికెను. "నాయనా! ఈ రూపమును వీడి, ముద్దులను మూటగట్టు శిశురూపమున నీ ప్రియమైన లీలలను చూపుము. నాకాసుఖమే నిరుపమానమైనది."- తల్లి మాటలు విని ఆ దేవదేవుడు చిన్న శిశు రూపమును దాల్చి ఏడ్వసాగెను. (తులసీదాసు చెప్పుచున్నాడు) ఈ ఘట్టమును గానము చేయువారు ఈ సంసారకూపమునుండి విముక్తులై, ఆ శ్రీహరి పాదపద్మములను చేరుదురు. (చౌ॥ 1-4)

దేవతలను, బ్రాహ్మణులను, సజ్జనులను, గోవులను కాపాడుటకై భగవంతుడు మానవుడుగా అవతరించెను. ఆయన త్రిగుణాత్మకమైన మాయకు అతీతుడు. ఇంద్రియములకు అగోచరుడు. ఆయన తనువు సంకల్ప సిద్ధమైనది. అది అలౌకికము, కర్మబంధములకు అతీతము. (దో॥ 192)

అత్యంతమధురము, ప్రియతమము ఐన శిశురోదనమును వినగానే రాణులందఱును ఉత్కంఠతో పరుగెత్తుకొనివచ్చిరి. దాసీలు ఇటునటు సంతోషముతో తిరుగసాగిరి. పురవాసులు ఆనంద నిమగ్నులైరి. దశరథుడు పుత్రజననవార్తను విని పరమానందభరితుడాయెను. ప్రేమాతిశయముతో ఆయన తనువు పులకరించెను. ఆనందాతిరేకమున అధైర్యమును వీడి, బుద్ధిని పదిలపఱుచుకొని, ప్రేమాధిక్యముతో పులకరించినశరీరమును సంబాళించుకొని, పుత్రదర్శనకుతూహలముతో లేచెను. "నామశ్రవణమాత్రముననే సమస్తశుభములను ప్రసాదించుప్రభువు నాయింట వెలసినాడు.'- అని తలపోయుచు ఆయన అమితానందభరితుడాయెను. మంగళవాద్యములను మ్రోగింపజేయుటకై ఆజ్ఞను ఇచ్చెను. కులగురువైనవసిష్ఠమహర్షిని పిలిపించెను. ఆయన బ్రాహ్మణులతో గూడి, రాజాంతఃపురమునకు విచ్చేసెను. అందచందాలరాశి, అగణితగుణఖనియైన ఆ అపురూప బాలకుని వారందఱును దర్శించిరి. ఆ బాలరామునియనంతగుణరూపవైభవములు వర్ణింపనలవికానివి. (చౌ॥ 1-4)

రాజు నాందీముఖశ్రాద్ధమును ఆచరించి, జాతకర్మసంస్కారములను జరిపించి, బ్రాహ్మణులకు బంగారమును, ఆవులను, వస్త్రములను, మణులను దానముగా ఇచ్చెను. (దో॥ 193)

ధ్వజపతాకతోరణములతో వర్ణింపనలవికానిరీతిలో నగరము అలంకరింపబడెను. ఆకాశమునుండి పూలవానగురిసెను. ప్రజలందఱును బ్రహ్మానందభరితులైరి. ఎట్టి అలంకారములను చేసికొనకయే, ఎట్లున్నవారు అట్లే వనితలు గుంపులుగుంపులుగా వచ్చిరి. స్వర్ణకలశములను, బంగారు పళ్లెరములలో సుగంధమంగళద్రవ్యములను తీసికొని, వారు మంగళ గీతములను పాడుచు రాజద్వారమున ప్రవేశించిరి. బాలునకు దీపహారతులను చూపిరి, దిష్టి తీసిరి, బాలునకు మంగళాశాసనములను పలికిరి. పదేపదే బాలునిపాదములపై బడి కానుకలను సమర్పించిరి. వందిమాగధులు, సూతులు, గాయకులు రఘుకుల స్వామిగుణములను గానముచేసిరి. అందఱును తమసకలసంపదలను విరివిగా దానముచేసిరి. దానములను తీసికొనినవారుగూడ వాటిని తమకడ ఉంచుకొనక ఇతరులకు ఇచ్చివేసిరి. నగర వీథులన్నియును కస్తూరి, చందనము, కుంకుమలకలయంపితో తడిసిపోయెను. (చౌ॥ 1-4)

అందాలరాశియైన ఆబాలునిజననమునకు ఇంటింటా మంగళవాద్యములు మ్రోగెను. స్త్రీ పురుషులందఱును ఆనందసాగరమున ఓలలాడిరి. (దో॥ 194)

కైకేయీ సుమిత్రలు గూడ అందమైన కుమారులను ప్రసవించిరి. ఆ సుఖ సంపదలను, ఆ సంతోష సమయమును, ఆ సమాజమును వర్ణించుటకు శారదా దేవికి గాని, శేషునకు గాని అలవి కాదు. రాత్రి యనెడి కాంత(నిశాదేవి) తన ప్రభువును చూచుటకు వచ్చి, సూర్యునిజూచి, లజ్జతో వెనుకకు మఱలి, సంధ్యగా మాఱినట్లు అయోధ్యా నగర శోభ భాసిల్లెను. అగరుధూపములపొగ సంధ్యాకాలపుచీకటివలె ఒప్పుచుండెను. ఒకరిపై నొకరు చల్లుకొను ఎఱ్ఱనిరంగు సూర్యాస్తమయసమయమునందలి అరుణకాంతివలె మందిరములపైగలమణులు నక్షత్రములవలెను, రాజప్రాసాదముపైగలకలశము చంద్రునివలె శోభిల్లుచుండెను. రాజభవనమున అత్యంతమృదుమధురముగా సాగు వేదఘోషలు సమయానుకూలముగా పక్షులుకావించు కలకలారావములవలె నుండెను. ఈ ఉత్సాహపూర్ణదృశ్యములను గాంచి, సూర్యుడుగూడ తనవేగమును మఱచినాడా అనునట్లు, మందగమనుడయ్యెను. ఆ సూర్యునకు తెలియకుండగనే ఒక నెల గడిచి పోయెను. (చౌ॥ 1-4)

ఒక మాసకాలము ఒకదినముగా అయ్యెను. ఈ రహస్యము ఎవ్వరికిని తెలియదు. సూర్యుడు తనరథమును ఆపి, అచటనే నిలబడి పోయెను. మఱి రాత్రి యేవిధముగా వచ్చును? (దో॥ 195)

ఈ రహస్యమును ఎవ్వరును ఎఱుగరు. సూర్యభగవానుడు శ్రీరాముని గుణములను గానముచేయుచు వెళ్లెను. దేవతలు, నాగులు, మునులు ఈ యుత్సవమును గాంచి, తమమహద్భాగ్యమును అదే పనిగా

కొనియాడుకొనుచు వెళ్లిరి. ఓ గిరిజా! శ్రీరామునిచరణములపై నీకుగలభక్తిని నేనెఱుగుదును. నీకొక పరమగోప్యమును వెల్లడించెదను వినుము. కాకభుశుండియు, నేనును అప్పుడు అక్కడనే యుంటిమి. కాని మనుష్యరూపములలో ఉన్నందున మమ్ము ఎవరును గుర్తింపనే లేదు. పరమానందభరితులమై మేము వీధులన్నియును తిరుగుచుంటిమి. శ్రీరామునికృపకు పాత్రుడైనవాడే ఈ మంగళకరమైన ఉత్సవమును చూచుటకు నోచుకొనును. ఆ శుభసందర్భమున అర్థులు కోరిన వాటినెల్లను రాజు దానము చేసెను. ఏనుగులు, రథములు, గుఱ్ఱములు, గోవులు వెండి, బంగారములు, రత్నములు, వస్త్రములు దానము చేయబడెను. (చౌ॥ 1-4)

తులసీదాసునకు ప్రభువులైన ఆ నలుగురు రాకుమారులను చిరంజీవులై యుండునట్లు సంతుష్టులైన నగరవాసులందఱును మంగళాశాసనములను పలికిరి. (దో॥ 196)

ఇట్లు కొంతకాలము గడిచెను. రాత్రింబగళ్లు గతించిపోవుచున్నట్లు అనిపింపనే లేదు. నామకరణ సంస్కార సమయము వచ్చినదని గమనించి, రాజు జ్ఞానియైన వసిష్ఠమహామునిని పిలిపించెను. ఆయనను పూజించినపిదప రాజు ఇట్లు పలికెను. "మునీశ్వరా! వీరికి నామకరణ సంస్కారములను జరుపుడు. మీరు నిర్ణయించిన పేర్లను పెట్టుడు."- వసిష్ఠ మహర్షి పలికెను. రాజా! వీరికి అపూర్వములైన నామములు అనేకము గలవు. ఐనను నాబుద్ధికి స్ఫురించినవాటిని తెల్పెదను. సర్వసుఖనిధానమైన ఈ ఆనందసింధువు యొక్క ఒక్క బిందువుతోడనే ముల్లోకములు సుఖమయములగును. ఈ సుఖనిధి పేరు 'శ్రీరాముడు'. ఇతడు సర్వలోకసుఖశాంతిప్రదాత. ఈ రెండవవాడు జగత్తును భరించిపోషించువాడు. కావున ఈతనిపేరు 'భరతుడు' మఱియొకడు 'శత్రుఘ్నుడు' ఈతనినామస్మరణచేతనే శత్రువులు మృతులగుదురు- ఈతనినామము వేదప్రసిద్ధము. (చౌ॥ 1-4)

మఱియు సర్వసులక్షణలక్షితుడు, శ్రీరామచంద్రునకు అత్యంత ప్రీతిపాత్రుడు జగదాధారుడైన సుమిత్రా కుమారునకు వసిష్ఠమహర్షి 'లక్ష్మణుడు' అను పేరు పెట్టెను. (దో॥ 197)

కులగురువైనవసిష్ఠుడు బాగుగాఆలోచించి, ఆనలుగురు రాకుమారులకును 'నామకరణము' చేసెను. పిమ్మట ఇట్లనెను. "రాజా! నీ నలుగురు కుమారులును వేదస్వరూపులు. వారిలో శ్రీరాముడు మునులకు పెన్నిధి(సర్వార్థసిద్ధిప్రదాత), భక్తులకు సర్వస్వము, పరమశివునకు ప్రాణము. ఇప్పుడతడు మీప్రేమకు పరవశుడై తన లీలానందరసములో నిమగ్నుడు అయ్యెను."- బాల్యమునుండియు లక్ష్మణుడు శ్రీరాముని తన పరమ హితైషిగా, స్వామిగా భావించి, ఆయన చరణములను ప్రేమతో ఆశ్రయించియుండువాడు. భరత శత్రుఘ్నులమధ్యగల ప్రేమ స్వామి సేవకుల ప్రేమవంటిది. శ్రీరామభరతులు శ్యామవర్ణ శోభితులు. లక్ష్మణశత్రుఘ్నులు గౌరవర్ణ విలసితులు. ఈ రెండు జంటలను జూచి, తల్లులు ఆనందించుచుండిరి, దిష్టిదీయుచుండిరి. సోదరులు నలుగురును రూపశీల గుణనిధానములు. ఐతే అందఱికిని శ్రీరాముడు అత్యంతసుఖానందదాయకుడు. ఆయన హృదయమున ఎల్లప్పుడు కృపారూపచంద్రుడు విలసిల్లుచుండును. ఆయనచిఱునవ్వువెన్నెలద్వారా ఆ కృప సర్వదా ప్రకటితమగుచుండును. తనయొడిలోనున్నప్పుడును, ఊయెలలో ఉన్నప్పుడును తల్లి "నా ముద్దులనాయనా!" 'జోఅచ్యుతానంద! జోజో ముకుందా! లాలిపరమానంద! రామ! గోవిందా! జో!జో!' అనుచు ఆయనకు జోలలు పాడుచుండును.(1)

(చౌ॥ 1-4)

1. *జో అచ్యుతానంద! జో జో ముకుందా!*
రార పరమానంద! రామ! గోవిందా! ॥ జో జో ॥
తొలుత బ్రహ్మాండంబు తొట్టిగావించి,

సర్వవ్యాపియు, నిరంజనుడును, నిర్గుణుడును, లౌకికవినోదరహితుడును, అజుడును ఐన ఆ పరబ్రహ్మ కౌసల్యా దేవి యొక్క భక్తి వాత్సల్యములకు వశుడై, ఆమె యొడిలో ఆడుకొనుచుండెను. (దో॥ 198)

నీలకమలమును, గంభీరమేఘమునుబోలు అతనిశ్యామసుందరవిగ్రహము కోటిమన్మథులశోభలతో వెలుగొందుచుండెను. ఎఱ్ఱనిచరణపంకజములపై తెల్లనినఖములకాంతి ఎఱ్ఱనికమలపత్రములపై ముత్యములవలె ప్రకాశించుచుండెను. ఆయనపాదములఅడుగుభాగమున వజ్ర ధ్వజ-అంకుశ చిహ్నములు అలరారుచుండెను. నూపుర ధ్వనులు మునీశ్వరుల మనస్సులను మోహింపజేయు చుండెను. నడుముచుట్టునుగలమొలనూలుకింకిణులు, ఉదరముపై త్రివళులు, గంభీరనాభిశోభలు, సర్వమనోహరములై ఒప్పారుచుండెను. విశాలభుజములు భూషణశోభితములు. ఎదపైగల పులిగోరు అందములను చిందించుచుండెను. వక్షస్థలమున మణిమయహారములును, భృగుమహర్షి పాదముద్రలును చూచువారిని ముగ్ధులనొనర్చుచుండెను. శంఖమునుబోలుకంఠము, సుందరమైన చిబుకము, మనోజ్ఞమైన ముఖము, అసంఖ్యాక మన్మథ శోభలను గలిగియుండెను. తెల్లని పలువరస ఎఱ్ఱని పెదవులచే కప్పబడుచుండెను. అతులములైన ఆ నాసికాతిలకములపరమశోభలు వర్ణనాతీతములు. చెవులు సుందరములు. బుగ్గలు అత్యంతసుందరములు. మధురములైన చిలుకపలుకులు వినసొంపుగా నుండెను. దట్టముగా పుట్టుకతోవచ్చిన ఆఉంగరాలజుట్టును తల్లి అనేకవిధములుగా సింగారించుచుండెను. మేనిపై పచ్చనిజిలుగువస్త్రములు మిలమిలలాడుచుండెను. చేతులపై మోకాళ్లపై దోగాడు ఆబాలరాముడు చూచెడివారికి ముచ్చట గొలుపుచుండెను. శ్రీరాముని సౌందర్యములను వేదములేగాదు సహస్రఫణియైన ఆదిశేషుడుగూడ వర్ణింపజాలడు. స్వప్నమున ఆ సౌందర్యములను అనుభవించినవారు మాత్రమే దానిని గ్రహింపగలరు. (చౌ॥ 1-6)

ఆనంద స్వరూపుడు, మాయాతీతుడు, జ్ఞానమునకును వాక్కులకును, ఇంద్రియములకును గోచరముగాని వాడును ఐన ఆ ప్రభువు కౌసల్యా దశరథుల వాత్సల్యములకువశుడై బాల్య లీలలను ప్రదర్శించుచుండెను. (దో॥ 199)

జగత్పితయైన శ్రీరాముడు అయోధ్యావాసులందఱికిని ఇట్లు ఆనందము గూర్చుచుండెను. భవానీ! శ్రీరామచంద్రుడు తనపాదపద్మములను నమ్మినవారిప్రేమలకువశుడై పరమానందమును పంచియిచ్చుచుండెను. శ్రీరామునియెడ భక్తివిశ్వాసములు లేనివారు ఎంతగా ప్రయత్నించినను భవబంధములనుండి విముక్తులుకాలేరు. చరాచరజీవులను తనఅధీనములో నుంచుకొను మాయా శక్తియే ప్రభువునకు భయపడి, ఆయన కనుసన్నలకు నృత్యము చేయుచుండెను. ఎవ్వరైనను ఇట్టి ప్రభువును వదలి ఎవ్వరిని భజింతురు? అభిమానమును వీడి త్రికరణశుద్ధిగా అనన్యభక్తితో తనను సేవించువారిపై శ్రీరఘునాథుడు తప్పక కృపజూపును. శ్రీరామచంద్రుడు తన బాల్య లీలలచే పురజనులందఱిని సంతోష పఱచుచుండెను. కౌసల్యాదేవి బాలరాముని తనయొడిలో ఆడించుచు ఊయలలో ఊపుచు, తాను ఎంతగానో మురిసిపోవుచుండెను. (చౌ॥ 1-4)

కౌసల్యామాత పుత్రప్రేమలో మునిగితేలుచు రాత్రింబవళ్లు ఎన్నెన్ని గడచిపోవుచున్నదియు గమనింపకుండెను. పుత్రవాత్సల్యమునకువశమై శ్రీరామునిబాల్యలీలలను ప్రస్తుతించుచు గానము చేయుచుండెను. (దో॥ 200)

ఒకనాడు కౌసల్యాదేవి రామచంద్రునకు స్నానము చేయించి, అలంకరణ చేసి, ఉయ్యాలలో పరుండబెట్టెను. తానును స్నానముచేసి, తమఇష్టదేవతారాధనమునకు సిద్ధపడుచుండెను. ఆరాధనసమయమున నైవేద్యమును భగవంతునికడ ఉంచి, తాను వంటఇంటిలోనికి వెళ్లెను. తిరిగి వచ్చుసరికి ఆ నైవేద్యమును శ్రీరాముడు ఆరగించుచుండుట చూచెను. ఆ దృశ్యమునుగాంచి, భయపడి ఆమె ఊయెల మందిరమునకు వెళ్లెను అచట ఊయెలలో బాలరాముడు నిద్రించుచుండెను. మఱల పూజా మందిరమునకు వచ్చి అచటగూడ తనరాముడు ఉండుటచూచి చకితురాలయ్యెను. ఆమె హృదయము కంపించెను. మనస్సు కలవరపాటునకులోనయ్యెను. "ఇచట-మఱియు అచ్చట ఇద్దఱు రాములు ఉండుట ఎట్లు సంభవము? ఇది నా భ్రమయా? దైవ లీలయా?" అని తర్కించుకొన సాగెను. శ్రీరాముడు తన తల్లి వ్యాకులపాటును జూచి ఒక చిఱునవ్వు నవ్వెను. (చౌ॥ 1-4)

అపుడు ప్రభువు తన తల్లికి అత్యద్భుతమైన తన 'అఖండరూపము'ను జూపెను. ఆ రూపమున ఆమె కోటానుకోట్ల బ్రహ్మాండములను చూడగల్గెను. (దో॥ 201)

ఆ అసంఖ్యాక సూర్య చంద్రులను, బ్రహ్మలను, పరమేశ్వరులను పెక్కు పర్వతములను, నదులను, సముద్రములను, భూగోళములను, వనములను, కాల కర్మ స్వభావ గుణ జ్ఞానములను, కని విని యెఱుగని దృశ్యములను ఆమె ఆ రూపమున గాంచెను. సర్వశక్తి స్వరూపిణియైన మాయ భయముతో చేతులుజోడించి, ఆయన ముందు నిలబడియుండుటను జూచెను. మాయకువశుడైఆడునట్టిజీవుని, జీవునివిముక్తుని జేయు భక్తినిగూడ ఆమె దర్శించెను. కౌసల్య పులకితగాత్రయయ్యెను. ఆమెనోట మాటరాలేదు. కనులుమూసికొని శ్రీరామునిపాదములపై బడెను. విస్మితురాలైన తల్లిని జూచి, ఖరారియైన శ్రీరాముడు తనబాలరూపమును దాల్చెను. ఆమె కనులు తెఱచి చూడగా తనముందు బాలరాముడు దర్శనమిచ్చెను. అంతట ఆమె సంభ్రమాశ్చర్యములకులోనై, ఆయనను స్తుతించుటకుగూడ అశక్తయయ్యెను. "జగత్పితయైన పరమాత్ముని నా కుమారునిగా భావించితినే"- అని పలురీతులవగచెను. శ్రీహరి ఆమెను అనేకవిధముల ఓదార్చి, "దీనిని రహస్యముగానే ఉంచుము" అనియనెను. (చౌ॥ 1-4)

కౌసల్య మాటిమాటికిని వినయముతో చేతులుజోడించి "ప్రభూ! మఱల నీమాయ నన్నెప్పుడును కప్పకుండును గాక"- అని ప్రార్థించెను. (దో॥ 202)

శ్రీరాముడు తనబాల్యలీలలచే తనభక్తులనందఱిని మిక్కిలి ఆనందపఱచుచుండెను. ముద్దులొలుకు ఆ నలుగురు సోదరుల బాల్య క్రీడలను జూచుచు తల్లిదండ్రులే గాక ఆ అంతఃపురవాసులందఱును మిక్కిలి మురిసిపోవుచుండిరి. వసిష్ఠగురువులు ఆ చిన్నారులకు చూడాకర్మ సంస్కారములను జరిపించిరి. బ్రాహ్మణులకు పుష్కలముగా దక్షిణలొసంగబడెను. ఆ నలుగురు రాజకుమారులును వివిధ వినోద క్రీడలలో ఆరితేరిరి. మనోవాక్కర్మలకు అగోచరుడైన ప్రభువు దశరథుని భవనప్రాంగణములయందు ఆడుకొనుచుండెను. రామా! భోజనమునకు రారా! రారా! (1) అని దశరథుడు ఎంతగా పిలిచినను రాముడు తనమిత్రులను వీడివచ్చెడి వాడుకాదు. పిమ్మట కౌసల్య తీసికొనివచ్చుటకు పోగా ఆ బాలరాముడు తన బుడిబుడినడకలతో తల్లికి అందకుండా పాఱిపోవుచుండెడివాడు. నేతినేతి (న+ఇతి, న+ఇతి) యని శ్రుతులచే వర్ణింపబడువానిని, శివునకును అందని తత్త్వస్వరూపుని తల్లి బలవంతముగా పట్టుకొనప్రయత్నించెను. క్రీడలలో దుమ్ముకొట్టుకొనియున్న దేహముగల కుమారుని రాజు తనయొడిలో కూర్చుండ బెట్టుకొనెను. (చౌ॥ 1-5)

భోజన సమయమునందును ఆ చిన్నారి రాముడు కుదురుగా ఉండెడివాడు కాడు. అదనుచూచుకొని నోటిలో పెఱుగన్నమును ఉంచుకొని ఇటునటు పఱుగెత్తుచు నవ్వుచుండెడి వాడు. (దో॥ 203)

శ్రీరామునిబాల్యలీలలు మిక్కిలి సరళమైనవి, మనోజ్ఞములైనవి. ఆ లీలలను వాగ్దేవియు, శేషుడును, పరమశివుడును, వేదపురుషుడును తన్మయత్వముతో గానము చేయుచుండిరి. ఈరామబాల్యలీలలయందు అనురాగమును పొందనివానిజీవితము వ్యర్థమని విధాత పలికెను. కౌమార దశకు చేరగనే ఈ నలుగురు కుమారులకును తల్లిదండ్రులు ఉపనయన సంస్కారములనొనర్చిరి. శ్రీరఘునాథుడు సోదరులతోగూడి

1. శ్రీరామ రఘురామ శృంగారరామయని చింతింపరాదె ఓ మనసా! ॥ శ్రీరామ ॥

1) తళుకు చెక్కుల ముద్దుపెట్టు కౌసల్య మును తపమేమి చేసెనో చెలియా!

2) దశరథుడు శ్రీరామ రారా యని బిల్వ మును తపమేమిచేసెనో చెలియా! ॥ శ్రీరామ ॥ (త్యాగరాజ)

విద్యాభ్యాసమునకై గురుకులమునకు వెళ్లెను. కొలదికాలములోనే వారు అస్త్రశస్త్రాది సకలవిద్యలలో పారంగతులైరి. తనశ్వాసలద్వారా నాలుగువేదములఆవిర్భావమునకు కారణభూతుడైన ఆరామచంద్రభగవానుడు మఱల వాటిని అభ్యసించుటకు గురువు నాశ్రయించుట నిజముగా ఒక లీలావిలాసము. ఆ నలుగురును విద్యావినయగుణశీలసంపన్నులైరి. రాజోచితవిద్యలయందును వారుకౌశలమును సంపాదించిరి. ధనుర్బాణములు వారిచేతులలో మిక్కిలిమనోహరముగాశోభిల్లుచుండెను. చరాచరసృష్టియంతయు వారిరూపసౌందర్యములకు మోహపరవశమగుచుండెను. వారివిహారములనుగాంచి, నగరములోనివారు అందఱును ముగ్ధులై, ప్రేమవిహ్వలురై, ఎచటివారచటనే నిలిచిపోవుచుండిరి. (చౌ॥ 1-4)

అయోధ్యలోని స్త్రీలు, పురుషులు, బాలురు, వృద్ధులు - అందఱును శ్రీరాముని తమప్రాణములకన్న మిన్నగా ప్రేమించుచుండిరి. (దో॥ 204)

శ్రీరామచంద్రుడు తనసోదరులతో, సహచరులతో ప్రతిదినము వనములకు వెళ్లి మోక్షార్హమైన మృగములను వేటాడుచుండెను. (శాస్త్రములలో రాజులకు చెప్పబడిన రీతిగా వేటాడదగిన మృగములనే వారు వేటాడుచుండిరి) రామ బాణములకు గురియై మృతి చెందిన మృగములను దశరథుడు చూచి, అతని కౌశలమునకు తృప్తి పడుచుండెడి వాడు. శ్రీరాముని బాణములచే అసువులను వీడిన జంతువులు నేరుగా పరమధామునకు పోవుచుండెను. ఆ జంతువుల పురాకృతసుకృతఫలమట్టిది. శ్రీరామచంద్రుడు తన తమ్ములతోమిత్రులతో కలిసి భుజించుచుండెడివాడు. అతడు మాతాపితరులఆజ్ఞలను శిరసావహించు చుండెను. తనప్రజలందఱికిని సుఖములను కూర్చుచుండెడివాడు. అతడు వేదపురాణములను శ్రవణమాత్రమునగ్రహించి, వాటిఅంతరార్థములను సోదరులకు విశదీకరించుచుండెడివాడు. ప్రాతఃకాలముననే లేచి, శ్రీరఘునాథుడు తల్లిదండ్రులకును, గురువులకును ప్రణమిల్లి వారి ఆజ్ఞలతో నగర కార్యకలాపములలో పాల్గొనుచుండెడివాడు. అతని నిత్యకార్యక్రమరీతులకు రాజు సంతుష్టుడగు చుండెను. (చౌ॥ 1-4)

సర్వవ్యాపి, అవిభాజ్యుడు, ఇచ్ఛారహితుడు, అజుడు, నిర్గుణుడు, నామ, రూప రహితుడు ఐన పరమాత్మ శ్రీరామునిఅవతారమున తనభక్తులకై నానావిధములైన అలౌకికలీలలను ప్రదర్శించు చుండెను. (దో॥ 205)

## విశ్వామిత్ర యాగ సంరక్షణము

భవానీ! ఈ కథను ఇంతవఱకు గానము చేసితిని. తరువాతి కథను శ్రద్ధగా వినుము. జ్ఞానియైన విశ్వామిత్రమహాముని ఒక వనమునందు పవిత్రమైన ఆశ్రమమున వసించుచుండెను. అచట ఆ ముని జపయోగయజ్ఞములను ఆచరించుచుండెడివాడు. కాని మారీచసుబాహువులు అనురాక్షసులవలన ఆయనకు క్లేశములు సంభవించుచుండెను. ఆయన యజ్ఞములను చేయునప్పుడు వారు వాటిని అపవిత్రముచేయుచు ఉపద్రవములను సృష్టించుచుండిరి. ముని చాల దుఃఖితుడగుచుండెను. ఆ శ్రీహరిసహాయము లేకుండ ఈ క్రూరరాక్షసులబాధలనుండి బయటపడుట అసాధ్యమని తలంచెను. అతడు ఇంకను ఇట్లు ఆలోచించెను. "భూభారమును తొలగించుటకై శ్రీహరి అయోధ్యలో శ్రీరామునిగా ఇప్పటికే అవతరించియున్నాడు. శ్రీరామునిసహాయమున ఈ రాక్షసులను తుదముట్టింపజేయవలెను. ఈ నెపముతో అయోధ్యకు వెళ్లి, ప్రభు పాదపద్మములదర్శనమును చేసికొందును. రాజునకు విన్నవించుకొని, ఆయన అనుమతితో రామలక్ష్మణులను ఇచ్చటికి తీసికొని వచ్చెదను. జ్ఞాన వైరాగ్య సద్గుణనిధియైన ప్రభువును కన్నులార దర్శించెదను. ఆహా! శ్రీరామచంద్ర భగవానుని దర్శింపబోవుచున్న నా అదృష్టమే అదృష్టము." (చౌ॥ 1-4)

తనలో మనోరథములు పెక్కు మెదలుచున్నను రాక్షససంహారమిషతో విశ్వామిత్రుడు ఏ మాత్రము జాగుచేయక అయోధ్యకు బయలుదేఱెను. సరయూనదిలో స్నానమాడి, రాజ సభలో ప్రవేశించెను. (దో॥ 206)

మునీశ్వరుని ఆగమనమును తెలిసికొని, దశరథ మహారాజు బ్రాహ్మణులతో గూడి ఎదురేగి, దండ ప్రణామములాచరించి, స్వాగతసత్కారములతో తీసికొని వచ్చి, ఉన్నతాసనమున కూర్చుండబెట్టెను. మునీశ్వరునకు అర్ఘ్యపాద్యాది పూజలను చేసి, అతడు "నేడు నా జన్మధన్యమైనది. నావంటి భాగ్యశాలి మఱియొకడుండడు"- అనియనుకొనుచు చక్కని అతిథిమర్యాదలతో ఆమునిని సంతృప్తిపఱచెను. ముని మిక్కిలి సంతుష్టుడాయెను. పిదప తననలుగురు కుమారులను అచటికి రప్పించెను. వారు మునికి ప్రణమిల్లిరి. శ్రీరామచంద్రుని దర్శించినంతనే ముని తనను తాను మఱచిపోయెను. చంద్రుని గాంచిన చకోరమువలె శ్రీరామునిసౌందర్యమునకు ఆయన ముగ్ధుడాయెను. రాజు మిక్కిలి సంతోషముతో ఇట్లనెను. "మునీశ్వరా! దయతో మీరు ఇచటికి వచ్చి, మమ్ము అనుగ్రహించితిరి. ఇదివరలో ఈ విధముగా మీ కృప మాపై ప్రసరింపలేదు. నేడు మీ ఆగమనమునకు కారణమేమి? దయతో తెల్పుడు. మీ ఆజ్ఞను తత్క్షణమే శిరసావహించెదను."- అందులకు ముని ప్రత్యుత్తరమునిచ్చెను. "రాజా! రాక్షసులు నన్ను మిక్కిలి బాధలపాలుచేయుచున్నారు. కావున మీసహాయమును అర్థించుటకై వచ్చితిని. రామలక్ష్మణులను నా వెంటపంపుము. వారి సహాయమున రాక్షసులను నిర్మూలించి నేను రక్షణ పొందగలను. ఇదియే నారాకకు కారణము."- (చౌ॥ 1-5)

"రాజా! మోహము, అజ్ఞానము వదలి ప్రసన్నచిత్తుడవై వారిని నాకు అప్పగింపుము. దానివలన ధర్మము (పుణ్యము) సత్కీర్తి ప్రతిష్ఠలు నీకు ప్రాప్తించును. వారికి పరమశ్రేయోలాభములు కలుగును."- (దో॥ 207)

మునీశ్వరునిపలుకులు రాజునకు మిక్కిలి అప్రియములాయెను. ఆయన హృదయము కంపించెను. ముఖము వెలవెలబోయెను. అప్పుడు అతడు ఇట్లనెను. (దుఃఖావేశముతో) "బ్రాహ్మణుడా! ఈ నలుగురు కుమారులు నాకు వృద్ధావస్థయందు కలిగిరి. మీరు ఇట్లు కోరుకొనుట సముచితముగాదు. మునీశ్వరా! భూములు, గోవులు, ధనధాన్యములు, సంపదలు మొదలగువానిని కోరుకొనుడు. వాటిని సంతోషముతో ఇయ్యగలను. ఎవ్వరికైనను దేహప్రాణములకన్న ప్రియమైనదేదియును లేదు. వాటిని గూడ ఈ క్షణమే ఇయ్యగలను. నాకుమారులందఱును నాకు బహిఃప్రాణములు. ఎట్టి పరిస్థితులలోనైనను శ్రీరామునివదలియుండలేను. అతిభయంకరులైన ఆరాక్షసులెక్కడ? మిక్కిలిసుకుమారులైన నాచిన్నారులెక్కడ?" రాజుయొక్క ప్రేమరససిక్తములైన వచనములువిని, రామునియెడ ఆయనకు గల ప్రేమకు మునియెంతో ముగ్ధుడాయెను. పిమ్మట వసిష్ఠుడు రాజునకు తగువిధముగా నచ్చజెప్పి, ఆయన భయసందేహములను దూరముచేసెను. అంతట దశరథుడు ప్రేమతో తనఇద్దఱుకుమారులను (రామ లక్ష్మణులను) దగ్గరకు తీసికొని, హృదయమునకు హత్తుకొని, అనేకవిధముల ఉపదేశవచనములను పలికెను. పిమ్మట ఆయన మునితో ఇట్లనెను. "స్వామీ! ఈ నా కుమారులు నాకు పంచప్రాణములు. ఇపుడు మీరేవారికి తండ్రి, గురువు, సంరక్షకులు." (చౌ॥ 1-5)

తరువాత రాజు తన కుమారులను పెక్కురీతుల ఆశీర్వదించి, వారిని ఋషీశ్వరునకు అప్పగించెను. రామలక్ష్మణులు తల్లులకడకు వెళ్ళి, పాదాభివందనములను ఆచరించి, వారి ఆశీస్సులను గైకొనిరి. (దో॥ 208. క)

కృపా సాగరులు, మహాధీరులు, చరాచరాత్మక సృష్టికి కారణభూతులైన ఆ పురుష సింహములగు రామలక్ష్మణులు విశ్వామిత్రుని భయవిముక్తునిగా జేయుటకు ప్రసన్నమనస్కులై బయలుదేఱిరి.(1) (సో॥ 208.ఖ)

1. వెడలెను కోదండపాణి, అనుజ సౌమిత్రితోగూడి, ॥ వెడలెను ॥
పుడమిలో జనులెల్ల పొగడ, పూజితులై మునితోగూడి, ॥ వెడలెను ॥
శిరమున కొండెయు జారా, ఉరమున హారములు మెరయ,
కరమున శరచాపములు ఘనముగ మెరయా
సురుచిర వాద్యములు మ్రోయ, సురలెల్లను స్తుతి చేయ,
వర త్యాగరాజనుతుడు వసుధ భారమును బాప ॥ వెడలెను ॥ ॥ త్యాగరాజ ॥

అరుణకమలనయనుడు, విశాలవక్షుడు, ఆజానుబాహుడు, నీలోత్పల తమాలసదృశశ్యామలగాత్రుడైన శ్రీరామచంద్రుడు, పీతాంబరధారియై చేతులయందు ధనుర్బాణములతో, భుజమున తూణీరముతో శోభిల్లుచుండెను. శ్యామగౌరవర్ణశోభితులైన ఆ సోదరులు ఇరువురును అత్యంతసుందరులు. ఆయిరువురితోగూడివెళ్లుచున్న విశ్వామిత్రుడు అమూల్యధనరాసులను పొందినట్లు సంతసించెను. ఆయన తన మనస్సులో ఇట్లనుకొనెను. "ప్రభువు నిజముగా భక్తపరాధీనుడని, బ్రాహ్మణ ప్రియుడని తెలిసికొంటిని. నా కొఱకై తల్లిదండ్రులనుగూడ వదలివచ్చెను." మార్గమధ్యమున తాటకయను రాక్షసి వీరి అలికిడినివిని, కోపముతో వీరిపై విరుచుకొనిపడెను. ఆమెను ముని వారికి చూపెను. అంతట రాముడు ఒకేబాణముతో ఆమెను తుదముట్టించి, కనికరముతో పరమధామునకు చేర్చెను. దీని ద్వారా రామచంద్రప్రభువు సాక్షాత్తుగా పరమేశ్వరుడే యని ముని తనఅంతరంగమున ఎఱింగెను. ప్రభువు విజ్ఞాననిధియని తెలిసినప్పటికిని విశ్వామిత్రుడు మిక్కిలి హర్షముతో వారికి 'బల, అతిబల' అనుమంత్రములను ఉపదేశించెను. దాని వలన క్షుత్పిపాసాబాధలు వారిని దరిజేరవు. పైగా అవి వారికి బలమును, శక్తిని కూర్చును. (చౌ॥ 1-4)

మునీశ్వరుడు తనఅస్త్రశస్త్రములను అన్నింటిని వారికి సమర్పించి, వారిని తనఆశ్రమమునకు తీసికొని వచ్చెను. పరమహితైషులైన ఆ రామలక్ష్మణులకు అత్యంతశ్రద్ధాదరములతో కందమూల ఫలముల విందొనర్చెను. (దో॥ 209)

ప్రాతఃకాలమున శ్రీరాముడు మునీశ్వరునితో యజ్ఞమును నిర్భయముగా ఆరంభింపుడని పలికెను. మునీశ్వరులతో గూడి విశ్వామిత్రుడు యజ్ఞారంభము గావించెను. సోదరులిరువురును యజ్ఞరక్షకులై నిల్చిరి. 'స్వాహా' అను శబ్దములు చెవినబడినంతనే మునులకువిరోధులైన మారీచసుబాహువులు తమ పరివారములతో విజృంభించిరి. యజ్ఞమునకు విఘ్నములను కల్గించుటకై పూనుకొనిరి. శ్రీరాముడు ఫలకము (ములికి) లేని ఒకే ఒక బాణముతో మారీచుని శతయోజనములకావల సముద్ర తీరమున పడునట్లు కొట్టెను. ఆగ్నేయాస్త్రముతో సుబాహువును వధించెను. లక్ష్మణుడు రాక్షససైన్యములను పూర్తిగా రూపుమాపెను. ఈ విధముగా రామలక్ష్మణులసంరక్షణలో యజ్ఞము నిర్విఘ్నముగా ముగిసెను. వారు మునులను భయరహితులనుగా జేసిరి. దేవతలు, విశ్వామిత్రాదిమునులు వారిని ప్రస్తుతించిరి. లక్ష్మణసహితుడైన శ్రీరఘునాథుడు వారిని అనుగ్రహించుచు ఆచట కొంతకాలము ఉండెను. రాముడు అన్నింటిని ఎఱిగినవాడేఐనప్పటికిని, విశ్వామిత్రుడు భక్తిపరవశుడై వారికి పెక్కుపురాణగాథలను వినిపించెను. పిదప విశ్వామిత్రమహర్షి సాదరముగా ఇట్లు పలికెను. "ప్రభూ! ఒక ధనుర్యజ్ఞమహోత్సవమును తిలకింతము రండు"- ఆ మాటలు వినగానే రఘునాథుడు సలక్ష్మణుడై ఆయనవెంట సంతోషముతో బయలుదేఱెను. మార్గమధ్యమున వారు పశుపక్ష్యాదులు, ఏ ఇతర ప్రాణులు లేని ఒక ఆశ్రమమును జూచిరి. అచట ఒక ఱాయిమాత్రము పడియుండెను. శ్రీరాముడు దానిని గూర్చియడిగెను. ముని ఆకథను సవిస్తరముగా తెలిపెను. (చౌ॥ 1-6)

## అహల్యాశాప విమోచనము

"గౌతమమహర్షిధర్మపత్నియైన అహల్య శాపవశమున శిలయై నీ పాదకమల రేణువును కాంక్షించు చున్నది. రఘువీరా! ఆమెపై కృపజూపుడు." అని విశ్వామిత్రుడు పలికెను. (దో॥ 210)

పవిత్రమైన, శోకనాశకారియైన శ్రీరామపాదము సోకినంతనే మహా తపస్వినియైన అహల్య లేచినిలబడి అంజలిఘటించెను. భక్తులకు ఆనందప్రదుడైన శ్రీరాముని గాంచి ఆమె ప్రేమవిహ్వలయైనది, పులకితగాత్రయైనది. ఆమెనోట మాటయేరాలేదు. అత్యంత భాగ్యశాలినియైన అహల్య ప్రభుచరణములకు ప్రణమిల్లెను. కన్నీరు సంతతధారగా ప్రవహించెను. ఆమె ధైర్యమును కూడగట్టుకొని భక్తిపారవశ్యముతో నిర్మలవాణితో శ్రీరామచంద్రుని

ప్రభువుగా గుర్తించి, స్తుతింపసాగెను. "బ్రహ్మజ్ఞానులకే గోచరమగు ఓ రఘురామా! మీకు జయము. నేను అపవిత్రురాలను. మీరు లోకపావనులు, భక్తులకు సుఖప్రదులు. ఓ రావణారీ! కమలనయనా! జననమరణక్లేశములను తొలగించు వాడా! నేను మీ శరణు జొచ్చితిని. నన్ను రక్షింపుడు రక్షింపుడు. ముని నాకు శాపమిచ్చి మేలే చేసెను. దానిని నేను పరమానుగ్రహముగా భావింతును. దానివలన మోక్ష ప్రదాతయైన శ్రీహరిని నేత్ర పర్వముగా దర్శించుకొనగల్గితిని. మీ దర్శన భాగ్యమునకై ఆ పరమశివుడుగూడ తహతహలాడును. నేను మంద బుద్ధిని. నాకు ఒక వరమును ప్రసాదింపుడు. నా మనస్సనెడి మధుపము(తుమ్మెద) సర్వదా మీ పాదకమల రసాస్వాదనమును చేయుచుండునట్లు అనుగ్రహింపుడు. మీ పాదములనుండియే పరమపవిత్రమైన గంగ ఉద్భవించి, శివుని జటాజూటమునలంకరించినది. మీ శ్రీపాదములను కడిగి, బ్రహ్మ వాటిని భక్తితో సేవించెను. అట్టి మీ పాదము నా శిరముపై మోపబడెను. నేను ధన్యురాలను."- అని పల్కుచు అహల్య పదే పదే భగవంతునకు ప్రణమిల్లెను. తానడిగినవరములను పొంది, అహల్య మహదానందముతో తనపతిదేవుని పాదముల చెంతకు చేరెను. (చౌ॥ 1-4)

శ్రీరామచంద్రప్రభువు దీనజనబాంధవుడు. అవ్యాజకరుణాపారీణుడు. ఓ మూఢమనసా! ఈ కపటములైనజంజాటములను వదలి, ఆయనను భజింపుము. (అని తులసీదాసు తెలుపుచున్నాడు) (దో॥ 211)

(మాసపారాయణము - ఏడవ విరామము)

రామలక్ష్మణులు విశ్వామిత్రునివెంట పవిత్రగంగానదీతీరమునకు చేరిరి. అచట ముని శ్రేష్ఠుడు గాధిసుతుడు దేవనదియైనగంగ భూమికి అవతరించినకథను వినిపించెను. వారు మునులతో గూడి గంగానదిలో స్నానములనాచరించిరి. బ్రాహ్మణులకు అనేకదానములను ఒసంగిరి. మునిసమాజముతోగూడి శ్రీరాముడు సహానుజుడై వెంటనే మిథిలానగరమును సమీపించెను. రామలక్ష్మణులు మిథిలానగరశోభలను గాంచి మిక్కిలి హర్షితులైరి. వాపీకూపతటాకములలోని అమృతతుల్యములగు జలములు, మణిమయ సోపానములు వారిని ఎంతయో ఆశ్చర్యమున ముంచెత్తెను. పుష్పరసాస్వాదనమైకమున తుమ్మెదలు ఝంకారములు చేయుచుండెను. వివిధవర్ణశోభితపక్షులకలకూజితములు మనోజ్ఞములుగా నుండెను. పలువన్నెలుగలకమలములు వికసితములై చిత్రవిచిత్రములుగా గోచరించుచుండెను. శీతలమందమారుతములు పరిమళభరితములై ఆహ్లాదకరముగా వీచుచుండెను. (చౌ॥ 1-4)

నగరమునకు నలువైపుల ఉద్యానవనములు, పుష్పవాటికలు నానావిధపక్షులకావాసములై, పుష్ప ఫలములతో అలరారుచుండెను. (దో॥ 212)

ఆనగర శోభలు వర్ణనాతీతములు. అత్యంతమనోహరములు. సుందరములైన అంగడివీధులు, మణిమయములై చిత్రవిచిత్రముగానున్నఅట్టాలికలు, బ్రహ్మయే స్వయముగా తీర్చిదిద్దినట్లుండెను. కుబేరునితోతులదూగు ధనికులు, వ్యాపారులు అంగళ్లలో అమూల్యములైన వివిధవస్తువులను ప్రదర్శించియుంచిరి. పరిశుభ్రములైన వీధులు, కూడళ్లు, సుగంధ జలములచే తడుపబడి యుండెను. ఆ పురవాసులగృహములు మంగళకరములై యుండెను. మదనుడే స్వయముగా చిత్రించినాడాయనునట్లు మిక్కిలిఅందమైన చిత్రపటములు గోడలపై వ్రేలాడదీయబడియుండెను. ఆనగరములోని స్త్రీ పురుషులు సుందరులు, పవిత్రులు, సాధుస్వభావులు, ధర్మాత్ములు, జ్ఞానులు, గుణవంతులు. నిరుపమానమైన జనకుని నివాసస్థానమును, ఐశ్వర్యవైభవములను గాంచి, దేవతలే ఆశ్చర్యచకితులగుచుండిరి. ఆ రాజ ప్రాసాదముల చుట్టునుగల వాటిప్రాకారశోభలు తిలకించినవారికి సమస్త లోకములలోని సౌందర్యములన్నియు ఇచట కుప్పబోయబడినట్లు తోచుచుండెను. (చౌ॥ 1-4)

ధవళకాంతులతో ధగధగలాడుచున్న రాజభవనములలో వివిధరీతుల రత్నఖచితములైన బంగారుజరీతెరలు వ్రేలాడదీయబడియుండెను. సీతాదేవి ప్రాసాదశోభలు వర్ణింపనలవిగానివి. (దో॥ 213)

రాజభవనద్వారములు వజ్రఖచిత కవాటములతో అలరారుచుండెను. అట సామంతులు, నటులు, భటులు, వందిమాగధులు నడయాడుచుండిరి. విశాలములైన అశ్వశాలలు, గజశాలలు, రథశాలలు అసంఖ్యాకములైన హయ, గజ, రథములతో నిండి యుండెను. ముఖ్యయోధుల, మంత్రుల, సేనాపతుల హర్మ్యములు రాజప్రాసాదములకు దీటుగా నుండెను. విచ్చేసిన రాజన్యులకై నగరమునకు వెలుపల నదీతటాక సమీపములయందు పెక్కు వసతి గృహములు చక్కగా ఏర్పఱచబడియుండెను. విశ్వామిత్రుడు అన్ని వసతులుగల ఒక మామిడితోపును చూచి "రఘువీరా! ఈ ప్రదేశము నాకు నచ్చినది. మనము ఇక్కడనేయుందము."- అనెను. వినయాంచితుడైన శ్రీరాముడు "అట్లే స్వామీ!" అని ఆమోద ప్రమోదములను తెలిపెను. మునిబృందములతో వారు అచటనే ఉండిరి. విశ్వామిత్రుని ఆగమన వార్త జనక మహారాజునకు తెలిసెను. (చౌ॥ 1-4)

జనక మహారాజు తనకు విశ్వాసపాత్రులైన మంత్రులను, యోధులను బ్రాహ్మణులను, గురువైన శతానందుని, రాజ బంధువులను వెంటనిడుకొని, అత్యంత ప్రసన్నచిత్తుడై మునీశ్వరుడైన విశ్వామిత్రుల వారిని దర్శించుటకు వచ్చెను. (దో॥ 214)

జనకమహారాజు విశ్వామిత్రునిపాదములకు సాష్టాంగప్రణామములాచరించెను. ముని ప్రసన్నుడై అయనను ఆశీర్వదించెను. జనకుడు విప్రబృందములకు వందనములాచరించి, తాను ధన్యుడనైతినని వినమ్రవచనములను పలికి, అమితానందమును పొందెను. కుశలప్రశ్నలు ముగిసిన పిదప విశ్వామిత్ర మహర్షి రాజును సుఖాసీనుని గావించెను. ఉద్యానవనశోభలను తిలకించుటకువెళ్లినరామలక్ష్మణులు ఆదేసమయమున అచటికి వచ్చిరి. కౌమారావస్థలో కనువిందుగావించుచు శ్యామ, గౌరవర్ణములతో అలరారుచున్న ఆరాకుమారులు అందఱిహృదయములను చూరగొనిరి. శ్రీరామునిరాకతో అందఱును లేచి నిలుచుండిరి. విశ్వామిత్రుడు అయనను తనకడకూర్చుండబెట్టుకొనెను. చూడముచ్చటైన వారి అందచందములను గాంచి, అచటి వారినేత్రములు ఆనందాశ్రుపూరితములయ్యెను, శరీరములు పులకించెను. శ్రీరామునిమనోహరరూపలావణ్యములకు అబ్బురపడి, విదేహరాజు (జనకుడు) నిజముగా విదేహు(విస్మృతదేహు)డాయెను. (చౌ॥ 1-4)

ఆనందపరవశమైన తనమనస్సును పదిలపఱచుకొని, జనకుడు మునిపాదములకు ప్రణమిల్లి, గంభీరగద్గదస్వరముతో ఇట్లనెను. (దో॥ 215)

"స్వామీ! ఈ బాలకులు ఇద్దఱును మునికులభూషణులా! లేక రాజకులదీపకులా? లేదా వేదములచే 'నేతి, నేతి'అని వర్ణింపబడిన నిర్గుణ నిరాకార పరబ్రహ్మము యొక్క రెండు సగుణసాకార స్వరూపములా? పరబ్రహ్మస్వరూపులా? దయతో తెలుపుడు. సహజముగా వైరాగ్యపూర్ణమైన నామనస్సుసైతము వీరిని జూచి 'చంద్రునిజూచినచకోరమువలె' ముగ్ధమగుచున్నది. "మునీశ్వరా! నిండు మనస్సుతో అడుగుచున్నాను వీరెవరు? ఏమియు దాచక దయతో వివరముగా తెల్పుడు. వీరిని గాంచినపిమ్మట నామనస్సు ప్రేమపరవశమై బ్రహ్మానందసుఖమునుగూడ కోరుకొనుట లేదు."- అంతట మునివరుడు నవ్వి, ఇట్లు పలికెను. "రాజా! మీరు లెస్సపలికితిరి. మీ వచనములెన్నడును అసత్యములు కానేరవు. ప్రపంచములోని సమస్త ప్రాణులకును వీరు ప్రియతములు."- మునిపల్కులు విని, శ్రీరాముడు మనస్సులోనే నవ్వుకొనెను. రహస్యమును విప్పవలదనినట్లు సంజ్ఞచేసెను. అపుడు ముని వచించెను. "వీరు రఘుకులశ్రేష్ఠులైన దశరథమహారాజు కుమారులు. నాకు సహాయముగా నుండటకై పంపబడిరి. (చౌ॥ 1-4)

రామలక్ష్మణ నామధేయులైన ఈ సోదరులు రూప, శీల, బల సంపన్నులు. వీరు రాక్షసులను యుద్ధములో తునుమాడి, నా యజ్ఞమును సంరక్షించిరి. ఇది లోకవిదితము. (దో॥ 216)

జనక మహారాజు పలికెను. "మునీశ్వరా! నా పుణ్యవిశేషమువలన మీ పాదదర్శనభాగ్యము కలిగినది. శ్యామ, గౌర వర్ణవిలసితులైన ఈ సోదరులు ఆనందమునకే ఆనందమును చేకూర్చినారు. ఈ సోదరులప్రేమానురాగములు మనోహరములైనవి, అత్యంతపవిత్రములైనవి. లోకమునకు ఆదర్శప్రాయములైనవి. బ్రహ్మజీవుల అనుబంధములవలె వీరిప్రేమ సహజమైనది. వాక్కుల కందనిది."- విదేహభూపతి శ్రీరామచంద్ర ప్రభువును తదేకదృష్టితో చూచుచు ఆనందపులకితగాత్రుడాయెను. ఆయనహృదయము భక్తి పరిపూర్ణమైనది. మునిని ప్రశంసించుచు ఆయన పాదములకు ప్రణమిల్లి, రాజు వారిని నగరమునకు తోడ్కొని పోయెను. అన్ని ఋతువులలోను సుఖకరములైన భవనములలో వారిని నివసింప జేసెను. ఉచితరీతిని మునిని సేవించి, ఆయనఅనుజ్ఞతో రాజు తన ప్రాసాదమును జేరెను. (చౌ॥ 1-4)

రఘువంశ శిరోమణియైన శ్రీరాముడు ఋషులతో గూడి, భోజనాదికమును ముగించుకొని, విశ్రమించి, లక్ష్మణునితోపాటు కూర్చొని యుండెను. అపుడు సూర్యాస్తమయమునకు ఇంకను ఒక జాము ప్రొద్దు ఉండెను. (దో॥ 217)

## రామలక్ష్మణులు మిథిలా నగర శోభలను తిలకించుట

జనకపురశోభలను తిలకింపవలెననుకోరిక లక్ష్మణునకు ప్రగాఢముగానుండెను. విశ్వామిత్రమహర్షియు, అన్న శ్రీరాముడును అందులకు ఆమోదింతురో లేదోయను భయసందేహములతో సంకోచపడుచు దానిని ప్రకటింపలేక లక్ష్మణుడు తనలోతాను నవ్వుకొనుచుండెను. (నూతన నగరశోభలను దర్శింపవలెననుకుతూహలము బాలురకుండుట సహజముగదా!) లక్ష్మణుని మనోభావములను గమనించినశ్రీరామునిలో భక్త(సోదర) వాత్సల్యము పెల్లుబికెను. ఆతడు గుర్వాజ్ఞబడయుటకు వినయసంకోచములతో ముసిముసి నవ్వులతో ఇట్లనెను. "స్వామీ! లక్ష్మణుడు నగర విశేషములను చూడగోరు చున్నాడు. భయసంకోచములతో మిమ్ము అడుగలేక యున్నాడు. మీ ఆజ్ఞయైనచో పట్టణశోభలను తిలకించిరాగలము."- ఈ మాటలకు విశ్వామిత్రుడు ప్రీతితో ఇట్లనెను. "నాయనా! రామా! నీతిని, ధర్మమును రక్షించుటలో నీవు అసమానుడవు. భక్తికి వశుడవై, నీవు సేవకులకు సుఖానందములను గూర్చుచుందువు. (చౌ॥ 1-4)

మీ ఇరువురు సోదరులును వెళ్లి నగర శోభలను తిలకించిరండు. మీ తను సౌందర్య విలాసములతో నగరప్రజలకు నేత్రసాఫల్యములను గూర్చుడు. మిమ్ము కన్నులారగాంచిన పౌరులజన్మలు ధన్యములగును."- (దో॥ 218)

మునిపాదములకు నమస్కరించి, సోదరులిద్దఱును లోకులకు (చూచువారికి) నయనానందకరముగా బయలుదేఱిరి. పౌరులనేత్రములు, మనస్సులు వారి అద్భుతసౌందర్యములకు ఆకర్షితములై, వారివెంట నడిచినవి. రామలక్ష్మణులు పీతాంబరములను దాల్చి, నడుములకుతూణీరములను బిగించుకొని, చేతులతో ధనుర్బాణములనుబూని, శ్యామగౌరవర్ణశరీరములకు తగినచందనతిలకములతో విలసిల్లుచు చూపరులకు అమితానందములను గూర్చుచుండిరి. సింహసదృశ కంధరములతో, ఆజానుబాహువులతో, విశాల వక్షములపై గజముక్త (ముత్యాల) మాలలతో, రాజీవలోచనములతో, తాపత్రయములను హరించెడి చంద్రవదనశోభలతో అలరారుచుండిరి. వారి సువర్ణమయకర్ణకుండలములు, అందములనువిరజిమ్ము చూపులు, ధనుస్సౌందర్యములను నిలువరించుకనుబొమలు, అత్యంతమనోజ్ఞములై ఒప్పాఱుచుండెను. ముఖములపై దిద్దినతిలకములు వారి అందచందములకు ముద్రలు వేసినట్లుండెను. (చౌ॥ 1-4)

వారు శిరములపై చతురస్రాకారములుగల టోపీలు ధరించియుండిరి. నల్లని కుటిల కుంతలముల (ఉంగరాల జుట్టు) తో నఖ శిఖపర్యంతము వారు సౌందర్య రాసులై ఒప్పారిరి. (దో॥ 219)

నగర సందర్శనోత్సుకులై ఇద్దఱు రాకుమారులు బయలుదేఱినారనివిన్న పౌరులఆరాటము చెప్పనలవికానిదిగా ఉండెను. వారిని జూచుటకై ఆపురవాసులు తమపనులను ఎక్కడికక్కడ మానివేసి, నిర్ధనులు నిధులను దోచుకొనుటకు పరుగెత్తినట్లుగా పరుగులుదీసిరి. ఆ సోదరులసహజసౌందర్యములను జూచి, తమ నేత్రములు సఫలములైనవని వారు ఆనందించిరి. యువతులు కిటికీల ద్వారా గాంచుచు శ్రీరామునిఅపూర్వసౌందర్యామృతమును అనురాగముతో జుఱ్ఱుకొనసాగిరి. వారు ప్రేమవిహ్వలలై పరస్పరము ఇట్లు సంభాషించు కొనసాగిరి. "సఖీ! కోటి మన్మథులసౌందర్యములుగూడ ఈయన అంద చందాలముందు దిగదుడుపే. మానవులలో, మునులలో,నాగులలో, అసురులలో, కడకు దేవతలలో సైతము ఇట్టిసౌందర్యములు గలవారున్నట్లు ఇప్పటివఱకు వినియుండలేదు. విష్ణువేమో నాలుగు భుజములవాడు, బ్రహ్మఅయితే నాలుగు శిరస్సులు గలవాడు, ఇక శివుని సంగతి సరేసరి ఆయన ఐదు ముఖముల వాడే గాక భయంకర వేషధారి. కనుక చెలీ! అందమున ఈయనతో పోల్చదగినవారు దేవతలలోగూడ ఎవ్వరునులేరు. (చౌ॥ 1-4)

అత్యంతమనోహరములైన మేనిఛాయలతోనొప్పుచు కౌమారదశలోనున్న ఈ రాజకుమారుల అంగసౌష్ఠవము కోటి మన్మథుల సౌందర్యములను గూడ అధఃకరించుచున్నది. (దో॥ 220)

"సఖీ! ఈ రూపసౌందర్యమును జూచి, ముగ్ధులు కానివారు ఎవరుందురు?" మఱొక సఖి తనమృదువచనములతో ఇట్లు పలికెను. "ఓ చతురమతీ! నేను విన్నవిషయమును తెల్పెదను వినుము. బాలరాజహంసలవలె అందముగానున్న ఈ జంట దశరథమహారాజకుమారులు, యుద్ధములో రాక్షసులను సంహరించి, విశ్వామిత్రయాగమును సంరక్షించినారు. శ్యామలవర్ణగాత్రుడు, కమల నేత్రుడు, ధనుర్బాణధారి, మారీచసుబాహులమదమణచినవాడు, జ్యేష్ఠుడు, కౌసల్యానందవర్ధనుడు ఐనవాడు ఈ శ్రీరాముడు. బంగారు వన్నెవాడు, కిశోరదశలో నున్నవాడు, సురుచిరవేషభూషణములతో విల్లంబులతోగూడి శ్రీరాముని వెన్నంటినడచువాడు, అతని అనుజుడు సుమిత్రానందవర్ధనుడైనవాడు లక్ష్మణుడు. (చౌ॥ 1-4)

విశ్వామిత్రుని యజ్ఞకార్యములను నెఱవేర్చి, మార్గములో గౌతమపత్ని అహల్యను ఉద్ధరించి, ఈ మిథిలలో ధనుర్యాగమును చూడవచ్చినారు." ఈ మాటలను విని, ముదితలందఱును ముదము జెందిరి. (దో॥ 221)

శ్రీరామచంద్రుని సౌందర్యమును తిలకించి మఱియొక తరుణి ఇట్లనెను. "ఈ వరుడు జానకీదేవికి తగినవాడు. చెలీ! జనకమహారాజు ఈయనరూపలావణ్యములను బాగుగా జూచినచో తన ప్రతిజ్ఞను వీడి జానకీదేవివివాహము తప్పక ఈయనతోనే జరిపించును."- మఱియొక భామిని ఇట్లు భాషించెను. "జనకరాజు వీరిని గుర్తించినాడు. మునితో పాటు వీరిని గూడ సాదరముగా సమ్మానించినాడు. కాని రాజు తనప్రతిజ్ఞను వదలడు. విధివశుడై అతడు పట్టుదలతో అవివేకమునే ఆశ్రయించును. "వేఱొక వధూటి(అందాలరాశి) ఇట్లు వచించెను. "విధాత బుద్ధిమంతుడు, యోగ్యతానుసారమే ఫలములనిచ్చును- అని వినియుంటిమి. కనుక సీతమ్మకు ఇతడే వరుడగును. ఇందు సందేహము లేదు. ఒకవేళ దైవికముగా ఆయిరువురికిని మూడుముడులు పడినచో మనమందఱమూ కృతార్థులమే. నా హృదయమున మిక్కిలి ఆతురత కలుగుచున్నది. ఈ పెండ్లి జరిగినచో ఆనెపముతోడనైనను ఇతడు మఱల మఱల మన నగరమునకు రాగలడు. (చౌ॥ 1-4)

లేనిచో మఱల ఈయనను జూచుటకు వలనుపడదు. మనపూర్వజన్మపుణ్యఫల ప్రభావముననే ఇట్టి సంఘటన జరుగును." (దో॥ 222)

మఱియొక లావణ్యవతి ఇట్లనుడివెను. "నెచ్చెలీ! నీవు లెస్స పలికితివి. ఈ వివాహము అందఱికిని శుభప్రదము." వేఱొక ముదిత ఇట్లు వచించెను. "శివధనుస్సు చాల కఠినమైనది. ఈ రాకుమారుడు మిక్కిలి సుకుమారుడు. ఒకవిధముగా ఇది అసమంజసము." ఈ మాటలు విని, మఱియొక మానిని తన కోమలవాణితో

ఇట్లనెను. "ఓ సఖీ! ఈ విషయమున నేను విన్నది ఏమనగా- ఇతడు చూచుటకు చిన్నవాడుగా ఉన్నను గొప్ప ప్రతిభాశాలి. ఘోరశాపమునకు గురియైన అహల్య ఈతని పాద ధూళిసోకినంతనే పవిత్రయై తరించినదట. ఇక శివధనుస్సును విఱుచుట ఈయనకు అదెంతపని? ఈ విశ్వాసమును ఎన్నడును పొరపాటుననైనను వదలరాదు. సీతాదేవిని సృష్టించిన ఆ బ్రహ్మయే ఈ శ్యామలాంగుని ఆమెకు తగిన వరునిగా నిర్ణయించియుండును." ఈ పలుకులకు అందఱును ప్రసన్నులైరి. అట్లే జరిగితీరునని పలికిరి. (చౌ॥ 1-4)

పరమానందముతో ఆ సులోచనలు వారిపై పుష్పవృష్టిని గురిపించిరి. ఆ సోదరులు వెళ్లిన తావులన్నియును ఆనందమయములాయెను. (దో॥ 223)

సోదరులిద్దఱును నగరమున తూర్పుదిశగా నడిచిరి. అచట ధనుర్యాగమునకై రంగము సిద్ధమొనర్పబడియుండెను. అతి విశాల ప్రాంగణము మధ్య భాగమున ఒక సమున్నత రమ్యవేదిక నిర్మింపబడియుండెను. ఆ వేదికకు నలువైపుల రాజకుమారులు కూర్చొనుటకు సమున్నతస్వర్ణాసనములు సిద్ధపఱచబడినవి. వీటిచుట్టును నగరవాసులు కూర్చుండుటకు అనువుగా వలయాకారమున ఎత్తైన మెట్లు నిర్మింపబడియున్నవి. వాటివెనుక ధవళకాంతులనీనుచు వివిధవర్ణచిత్రములతో గూడిన మందిరములు నిర్మితములై యున్నవి. అందు స్త్రీలు తమతమయోగ్యతలను అనుసరించి, ఆసీనులై ధనుర్యాగమును జూచెదరు. నగరములోని బాలకులు తమ జిలిబిలి పలుకులతో శ్రీరామచంద్ర ప్రభువునకు ధనుర్యాగశాలారచనను జూపుచు సాదరముగా వివరించుచుండిరి. (చౌ॥ 1-4)

బాలురందఱును ఈనెపముతో శ్రీరాముని స్పృశించుచు ప్రేమపరవశులై, మురిసి పోవుచుండిరి. ఆ సోదరులిద్దఱిని జూచి, వారు మహదానందమునునుభవించిరి. (దో॥ 224)

బాలురందఱును తమపై ప్రదర్శించు అనురాగములకు సంతుష్టుడైన శ్రీరాముడు వారు చూపినస్థలములనన్నింటిని మెచ్చుకొనెను. బాలురందఱును తమయిష్టానుసారము చనవులతో వారిని పిలిచిరి. ఆ సోదరులును ఆ బాలురయొద్దకు మిక్కిలిప్రేమతో వెళ్లిరి. శ్రీరాముడు తన మృదుమధురవచనములతో తమ్మునకు రంగభూమిరచనావైశిష్ట్యమును వివరించెను. క్షణమాత్రమున తనమాయద్వారా అనేకవిశ్వములను సృజించినపరమాత్ముడైన శ్రీరాముడు ఆ ధనుర్యాగశాలను బాలురసైగల వాత్సల్యకారణమున అత్యాశ్చర్యముతో తిలకించెను. ఈ విధముగా రంగభూమివిచిత్రములనన్నింటిని చూచినపిదప వారు తమఆలస్యమునకు భయపడుచు గురువుగారి యొద్దకు చేరిరి. భయమునకేభయమునుగొలుపు ప్రభువు భక్తిని ప్రకటించెను. వారు తమవెంటవచ్చిన బాలురను ఎట్టకేలకు మృదుమధురవచనములతో వీడ్కొలిపిరి. (చౌ॥ 1-4)

సోదరులిద్దఱు భయము, ప్రేమ, వినయసంకోచములతో గురువుగారికి పాదాభివందనముల నాచరించి కూర్చుండిరి. (దో॥ 225)

సంధ్యాసమయమయ్యెను. అంతట విశ్వామిత్రుని ఆజ్ఞతో అచటివారందఱును సంధ్యా వందనములను ఆచరించిరి. రాత్రి రెండుజాములవఱకును ముని వారికి ప్రాచీనపురాణేతిహాసములను గూర్చి చెప్పెను. విశ్వామిత్రుడు శయనింపగా రామలక్ష్మణులు ఆయనకు పాదసేవలొనర్చిరి. జపతపములచే, యోగములచే భగవదుపాసనలొనర్చుపరమవిరాగులు మహాయోగులు ఎవని పాదపద్మములను పొందుటకు నిరంతరము సేవలొనర్చుచుందురో అట్టిశ్రీరాముడు సలక్ష్మణుడై ఇప్పుడు తమగురువైన విశ్వామిత్రునకు పాదసేవలు చేయుచుండెను. గురువు పదేపదే చెప్పగా రఘురాముడు శయనించెను. లక్ష్మణుడు తనఅన్నగారిపాదములను హృదయమున స్మరించుచు భయభక్తులతో రామునిపాదములనొత్తుచు, అనిర్వచనీయపరమానందమును

అనుభవించెను. శ్రీరామచంద్ర చరణముల సేవను వదలి వెళ్ళుటకతనికేమాత్రము ఇష్టము లేకుండెను. కాని రామచంద్రప్రభువు 'నాయనా! ఇక వెళ్లి విశ్రమింపుము' అని పదేపదే చెప్పిన పిమ్మట లక్ష్మణుడు ప్రభుపాదములను ధ్యానించుచు పరుండెను. (చౌ॥ 1-4)

## శ్రీరామలక్ష్మణులు పుష్పవాటికను సందర్శించుట

తెల్లవారుజామున కోడికూత (కోడి=కాలజ్ఞాని, కోడికూత=కాలసూచి) వినగానే మొదట లక్ష్మణుడు మేల్కొనెను. జగన్నాథుడైన శ్రీరాముడుగూడ గురువుగారికంటెను ముందుగనే నిద్రలేచెను. (దో॥ 226)

అందఱును కాలకృత్యములను దీర్చుకొని, నిత్యానుష్ఠానములను ముగించుకొనిరి. విశ్వామిత్రమహర్షికి నమస్కరించిరి. గుర్వాజ్ఞబడసి, పూవులను తీసికొనివచ్చుటకై రామలక్ష్మణులు తోటకు బయలుదేఱిరి. వారు జనకమహారాజుగారి సుందరోద్యానవనమున ప్రవేశించిరి. అచట వసంత ఋతుశోభ మూర్తీభవించి యుండెను. వివిధవర్ణములపుష్పములు వికసించి యుండెను. మనోహరమైన వృక్షములు నూతనఫలపుష్పములతో కల్పతరువులనుగూడ తలదన్నుచుండెను. లతామండపములయందు చాతకపక్షుల, కోయిలల, చిలుకల, చకోరముల మధురస్వరములు మిక్కిలి ఆహ్లాదమును గొలుపుచుండెను. నెమళ్లు నాట్యమాడు చుండెను. ఆ వనమధ్య భాగమున ఒక రమణీయ సరోవరము గలదు. మణిమయసోపానములతో నిర్మలమధురజలములతో వికసితవివిధవర్ణ కమలములతో శోభిల్లుచున్న ఆ సరస్సునందు జలపక్షులకలకలారావములు, తుమ్మెదల ఝుంకారములు మనోజ్ఞములై ఒప్పాఱుచుండెను. (చౌ॥ 1-4)

ఆతోటను, సరోవరమునుజూచి, రామలక్ష్మణులు మిక్కిలి ముగ్ధులైరి. అందఱికిని సర్వసుఖ ప్రదుడైన శ్రీరామునిగూడ ఆహ్లాదపఱచునట్టి ఆ ఉద్యానవనము ఎంత అందముగానున్నదో? (దో॥ 227)

నలుదెసల తోటరామణీయకమును గాంచినపిమ్మట ప్రశాంతచిత్తులై, వారు తోటమాలి ఆమోదముతో పూజకై తులసీదళములను, బిల్వ పత్రములను, పుష్పములను ఏఱుచుండిరి. అదే సమయమున సీతాదేవి గౌరీదేవిని పూజించుటకు తల్లి అనుమతితో అచటికి వచ్చెను. ఆమెవెంట ఆమెసఖులైన సుందరీమణులును వచ్చిరి. వారు మధురముగా పాటలు ఆలపించుచుండిరి. సరోవర సమీపముననే గిరిజాదేవిమందిరము గలదు. ఆ మందిరశోభ వర్ణనాతీతము. అది చూచిన వారి మనస్సులను హరించు చుండెను. సఖులతో గూడి, సరోవరమున స్నానమాడి, సీతాదేవి ప్రసన్న చిత్తముతో గిరిజా మందిరమునకు బోయెను. మిక్కిలి భక్తి శ్రద్ధలతో గౌరీదేవిని పూజించి, తనకు తగిన సుందరుడైన వరుని గోరెను. వారిలో ఒకసఖి సీతాదేవినివదలి తోటను జూచుటకు బయలుదేఱెను. ఆమె రామలక్ష్మణులను చూచి, వారి అందచందములకు అబ్బురపడి, సీతాదేవికడకు వచ్చెను. (చౌ॥ 1-4)

పులకితగాత్రయై ఆనందాశ్రువులతో అచటికి చేరిన ఆమెదశనుజూచి, సఖులు ఆమె సంతోషమునకు కారణములను అడుగసాగిరి. (దో॥ 228)

ఆమె ఇట్లనెను. "కౌమారదశలోనున్న ఇద్దఱు రాకుమారులు తోటనుజూడవచ్చిరి. వారు అతిసుందరులు. ఒకడు శ్యామసుందరుడు, మఱియొకడు గౌరవర్ణశోభితుడు. వారిని నేను వర్ణింప జాలను. వాక్కునకు కనులు లేవు. చూచెడి కనులు మాట్లాడ జాలవు."- ఈ మాటలు విని చతురలైనసఖులు సంతోషించిరి. సీతాదేవి ఉత్కంఠను జూచి, ఒక చెలికత్తె ఇట్లనెను. ఓ నెచ్చెలీ! "విశ్వామిత్రుని వెంట ఇద్దఱు రాకుమారులు వచ్చియున్నారని వింటిమి. బహుశా వారేవీరుకావచ్చును. వారు తమసౌందర్యవైభవములతో మననగరమునందలి స్త్రీపురుషుల మనస్సులను దోచినారు. ఎక్కడ విన్నను వారి అందములనుగూర్చిన చర్చలే. వారు దర్శనీయులు, తప్పక చూడవలెను. "ఆ సఖివచనములు సీతాదేవికి అత్యంతప్రియములాయెను. వారిని దర్శించుటకై ఆమె కన్నులు ఆరాటపడసాగెను.

ఆసఖిని ముందుంచుకొని, తాను ఆమె వెంటనడిచెను. అది శాశ్వత ప్రేమానుబంధమని ఎవ్వరును ఎఱుగరు. (శ్రీరాముడు విష్ణ్వవతారము, సీతాదేవి శ్రీ మహాలక్ష్మి). (చౌ॥ 1-4)

నారద మహర్షి వచనములు జ్ఞాపకమునకు రాగా సీతాదేవి మనస్సులో పవిత్రప్రేమ అంకురించెను. చకితయై భీతహరిణివలె నలుదిశలను పరికించెను. (దో॥ 229)

చేతికంకణములగలగలలను, ఒడ్డాణపుగంటలసవ్వడులను, కాలియందెలి ఘలంఘలలను విని, శ్రీరాముడు నివ్వెరపాటుతో లక్ష్మణుని జూచుచు ఇట్లనెను. "మన్మథుడు విశ్వమును జయించు కోరికతో దుందుభినివాయించుచున్నట్లు మధురధ్వనులు వినిపించు చున్నవి" అని చెప్పి, అతడు ఆ ధ్వనులు వినబడుచున్నదిశకు జూచెను. వెంటనే ఆతడు సీతాదేవిముఖచంద్రునిజూచు చకోరమాయెను. కన్నులప్పగించిచూచుచు అతడు అట్లే ఉండి పోయెను. ఆ వంశమున జనకునకుపూర్వికుడైన 'నిమి' సీతారాముల మధ్య ఉండుటకు సంకోచించి, అటనుండి వెడలి పోయెనాయన్నట్లు శ్రీరాముడు రెప్పలార్పక సీతాదేవిని చూచుచు అట్లే నిలబడిపోయెను. ఆమెసౌందర్యమునకు ఆతడు ముగ్ధుడై, లోలోన ఎంతగానో మెచ్చుకొనెను. కాని నోట మాటరాక పోయెను. బ్రహ్మదేవుడు తన సృష్టిరచనాకౌశలమునకు ఆకృతిని ఇయ్యగోరి, ప్రపంచములోని సౌందర్యమును అంతయు ఒక చోట కుప్పబోసి సీతాదేవిగా రూపొందించెనా యనునట్లు ఆమె విలసిల్లుచుండెను. ఆమె నిజముగానే మూర్తీభవించినసౌందర్యము, అందములకే అందమును చేకూర్చునది. సుందరరూపభవనమునందు ఆమె ఒక దీపశిఖయై వెలుగొందెను. కవుల ఉపమానములన్నియును ఆమె సౌందర్యముముందు వెలవెల బోవును. వాస్తవముగా ఆమె సౌందర్యమునకు పోల్చదగిన ఉపమానమే లేదనుట ముమ్మాటికి నిజము. ఆమెకు ఆమెయేసాటి. (చౌ॥ 1-4)

ఈ విధముగా జానకీసౌందర్యమును మనస్సులోనే మెచ్చు కొనుచు, తన స్థితిని తలచుకొనుచు సందర్భాను సారముగా ప్రభువు తనతమ్మునితో పవిత్రమనస్కుడై ఇట్లనెను. (దో॥ 230)

"తమ్ముడా! ఈమె జనకునికూతురు. ఈమెవివాహముకొఱకే ధనుర్యాగము జరుపబడుచున్నది ఈమె గౌరీపూజకై సఖులతోపాటు ఇచటికి వచ్చినది. ఈ వనమును ప్రకాశింప జేయుచున్నది. సహజముగా పునీతమై, నిశ్చలముగానుండు నామనస్సు ఈమెఅపూర్వ సౌందర్యమును జూచి, చలించు చున్నది. కారణము ఆ విధాతకే యెఱుక. కాని సోదరా! నాకుడికన్ను అదరుట శుభమునే సూచించుచున్నది. రఘువంశజుల మనస్సు ఎప్పుడును చెడుత్రోవకు బోదు. అది వారికి సహజము. నా మనస్సుపై నాకు పూర్తి విశ్వాసముగలదు. పరస్త్రీని కలలోగూడ అది కన్నెత్తి చూడదు. యుద్ధములో శత్రువులకు వెన్నుచూపనివారు, పరస్త్రీలఆకర్షణలకు లొంగనివారు, యాచకులను రిక్తహస్తములతో పంపనివారు అయినట్టి ఉత్తమపురుషులు లోకమున అరుదు. (చౌ॥ 1-4)

ఈ విధముగా శ్రీరాముడు తనతమ్మునితో మాట్లాడుచున్నను తుమ్మెద పూదేనెనువలె ఆయన మనస్సు సీతాదేవి సౌందర్యామృతమునే గ్రోలుచుండెను. (దో॥ 231)

అటునుండి సీతాదేవి బిత్తర బిత్తరచూపులతో నలుదిశల పరికించుచు వచ్చుచుండెను. ఈ రాజకుమారులెక్కడ? కనబడరేమి? అని కలవరపడుచు వచ్చెను. ఆ మృగనయన చూచినచోట్లెల్ల తెల్లని కమలములు సంతతధారగా వర్షించుచున్నట్లుండెను. అనగా అన్నిచోట్ల సాత్త్వక భావమే వ్యాప్తమగుచుండెను. అపుడు లతానికుంజముల వెనుకనున్న శ్యామలగౌరవర్ణశోభితులైన ఆ రాకుమారులను సఖులామెకు చూపిరి. నయనానందకరములైన రాముని రూపవైభవములచే ఆకర్షితురాలై, ఆమె తనచూపులతోడనే ఆయనసౌందర్యసుధలను గ్రోలెను, కోల్పోయిననిధిని పొందినవారివలె ఆమె సంతసించెను. శ్రీరాముని రూపలావణ్యములను గాంచి ఆమె నేత్రములు నిశ్చలములయ్యెను. కనురెప్పలకదలికలు ఆగిపోయెను.

స్నేహాధిక్యమువలన ఆమె ప్రేమ విహ్వలయయ్యెను. శరత్కాల చంద్రుని జూచిన చకోరివలె పరవశురాలాయెను. జానకి చూపులద్వారా శ్రీరామచంద్రుని తనహృదయమున బంధించి, తెలివిగా కనురెప్పలనెడి కవాటము (తలుపు)లను మూసివేసెను. చెలులు ఆమెతాదాత్మ్యస్థితిని జూచియు, చూడనట్లే మిన్నకుండిరి. (చౌ॥ 1-4)

ఆ సమయమున మేఘములనెడితెరలను తొలగించుకొనివచ్చెడి చంద్రునివలె సోదరులిరువురును లతానికుంజములనుండి బయటికి వచ్చిరి. (దో॥ 232)

ఈ సాటిలేని వీరులసౌందర్యములకు అవధులు లేవు. వారిశరీరకాంతులు నీల సువర్ణ కమలములను బోలియున్నవి. పూలగుత్తులతో అలంకరింపబడి, నెమలిఈకలతో శోభిల్లుచున్న శిరోభూషణములను వారు ధరించియుండిరి. లలాటమున తిలకములు, కనుబొమలపై స్వేదబిందువులు మిలమిలలాడుచుండెను. చెవులయందు కర్ణాభరణములు అలరారుచుండెను. ధనురాకారమున కనుబొమలు, మంజులకుటిలకుంతలములు, కెందామరలవంటి కన్నులు, శోభాయమానములై ఒప్పుచుండెను. చిబుకములు, నాసికలు, కపోలములు మిక్కిలి మనోజ్ఞములైయుండెను. వారి దరహాసములు చూచువారి మనస్సులను దోచుకొనుచుండెను. వారి ముఖ సౌందర్యములు అసమానములై మన్మథసౌందర్యములను త్రోసిరాజనుచుండెను. వక్షఃస్థలములపై మణిమాలలు, శంఖములవంటి కంఠములు, ఏనుగుతొండముల వంటి అపారశక్తి సంపన్నములైన బాహువులు, నిరుపమానములై విలసిల్లు చుండెను. ఒక యువతి ఇట్లు పలికెను. "ఎడమ చేతిలో పూలతోనిండినదొన్నెగల ఆ శ్యామవర్ణుడు మిక్కిలి అందగాడు. (చౌ॥ 1-4)

సింహమధ్యముడు, పీతాంబరధారి, పరమశోభానిధానము, ఉత్తమ శీలసంపన్నుడు, సూర్యవంశ భూషణుడు ఐన శ్రీరామచంద్రుని జూచి, చెలులు తమను తాము మఱచిరి. (దో॥ 233)

తనను తాను సంబాళించుకొని, ఒకసఖి సీతాదేవిచేయిపట్టుకొని ఇట్లనెను. "గిరిజాదేవిని తరువాత ధ్యానింపవచ్చును. ఇపుడీ రాజకుమారులను ఏలచూడవు?" అపుడు సీతాదేవి బిడియముతో కనులు తెరచెను. ఎదుట రెండురఘుకులసింహకిశోరములను జూచెను. శ్రీరాముని వర్చస్సును నఖశిఖ పర్యంతము పరికించెను. వెంటనే తన తండ్రి ప్రతిజ్ఞ జ్ఞప్తికి రాగానే ఆమె ఆందోళనకు గురియాయెను. సీతాదేవిప్రేమపారవశ్యములను గమనించి, నెచ్చెలులు భయపడిరి. "చాల ప్రొద్దుపోయినది. రేపు ఇదే సమయమునకు మఱల ఇక్కడికి చేరుదము"- అనుచు ఒకసఖి తనలోతాను నవ్వుకొనెను. గూఢార్థ విలసితమైన ఈ వాక్యమును విని, సీతాదేవి సిగ్గుపడెను. ప్రొద్దుపోయినందులకు తల్లియేమనునోయని భయపడుచుండెను. ధైర్యముతో శ్రీరామచంద్రుని తనహృదయమున దాచుకొని, తాను తండ్రిచాటుబిడ్డనని తలంచుచు వెళ్లెను. (చౌ॥ 1-4)

జింకలను, పక్షులను, వృక్షములను చూచునెపమున సీతాదేవి మాటిమాటికిని వెనుకకుదిరిగి శ్రీరామునిఅనుపమసౌందర్యమును చూచుచున్నకొలది ఆమెప్రేమ అధికము కాజొచ్చెను. (దో॥ 234)

సీతాదేవి శివునిధనుస్సు అతికఠినమైనందులకు వగచుచు, తనహృదయములో శ్రీరాముని సుమకోమలమూర్తిని నిలుపుకొని వెడలెను. శ్రీరామచంద్రుడుగూడ సుఖస్నేహశోభాసుగుణములఖనియగు జానకీదేవివెళ్లుటను గమనించి ఆమెరూపమును తనచిత్తమనెడి భిత్తిపై ప్రేమయను సిరాతో చిత్రించుకొనెను. సీతాదేవి మఱల భవానీమందిరమునకుచని, అంజలిఘటించి, గౌరీదేవిని ఇట్లు ప్రార్థించెను. "ఓ గిరిరాజసుతా! నీకు జయము. శివునిముఖచంద్రునకు నీవు చకోరివి. గజాస్యుడైన గణాధిపతికిని, షణ్ముఖుడగు కుమారస్వామికిని మాతవు. జగజ్జననీ! నీ తనువు విద్యుల్లతా శోభలతో విలసిల్లునది. నీకు జయము. నీవు ఆద్యంతములు లేనిదానవు. నీ అపరిమితప్రభావమును వేదములు గూడ వర్ణింపజాలవు. సృష్టిస్థితిలయకారిణివి నీవు. ప్రపంచమును మోహింప జేయగల మహత్త్వమునీది. నీవు స్వతంత్రముగా విహరింతువు. (చౌ॥ 1-4)

ఓ మాతా! నీవు పతివ్రతాలలామవు. నీ అపారమహిమలను వేలకొలది సరస్వతులు గాని, ఆదిశేషులుగాని సంపూర్ణముగా వర్ణింప జాలరు. (దో॥ 235)

ఓవరప్రదాయినీ! త్రిపురారిప్రియపత్నీ! నీ సేవలను చేయుటవలన ధర్మార్థకామమోక్షములనెడి (చతుర్విధ) పురుషార్థములు సులభముగా ప్రాప్తించును. నీ చరణ కమలములను ఆశ్రయించి, నిన్ను పూజించుటచే దేవతలు, మునులు కడకు మనుష్యులుగూడ సుఖులయ్యెదరు. నీవు అన్నిప్రాణులహృదయములలో నివసించెదవు. నా మనోరథము నీవెఱింగినదే. కావున నేను దానిని ప్రకటించుటలేదు." అని సీతాదేవి భవానీపాదములను ఆశ్రయించెను. సీతాదేవిభక్తికిని, వినయమునకును గౌరీదేవి ప్రసన్నురాలయ్యెను. భవానీకంఠసీమనలంకరించినమాల క్రిందికి జాఱెను. విగ్రహము దరహాసము చేసెను. సీతాదేవి ఆమాలను తనశిరస్సున ధరించెను. గిరిజాదేవి ఆనందముతో ఇట్లు పలికెను. "ఓ సీతా! వినుము. నా ఆశీర్వచనము అమోఘము. నీ అభిలాష నెరవేరును. నారదుని పవిత్ర వచనములు సత్యములు. నీవు మనసుపడిన వరుడే నీకు పతియగును. (చౌ॥ 1-4)

నీ అనురక్తికి ఆలవాలమైన ఆ సహజసుందరశ్యామవర్ణుడే నిన్ను చేపట్టును. అతడు పరమదయాళువు, సర్వజ్ఞుడు, నీ శీలమును, భక్తిని(స్నేహమును) అతడెఱుగును."- గౌరీదేవి ఆశీర్వాదములకు సీతతోపాటు ఆమెసఖులుగూడ హర్షితలైరి. సీతాదేవి భవానికి పదేపదే మ్రొక్కులిడుచు, పూజలొనర్చి, ప్రశాంతచిత్తయై తనభవనమునకు చేరెను. అని- తులసీదాసు పలుకుచున్నాడు. (ఛం॥)

తనమనోరథమును ఎఱింగి గిరిజాదేవి ఆశీర్వదించుటచే సీతాదేవి చెప్పలేనంతగా ఆనందించెను. ఆమెశరీరవామభాగము అదరుట శుభసూచకమయ్యెను. (సో॥ 236)

శ్రీరాముడు సీతాదేవి లావణ్యమును మెచ్చుకొనుచుండెను. సోదరులు ఇద్దఱు గురువుగారి కడకు వచ్చిరి. సరళస్వభావుడు, కపటమును ఎఱుగనివాడు ఐన శ్రీరాముడు విషయమునంతయును విశ్వామిత్రునకు నివేదించెను. మునీశ్వరుడు పూలతో దేవతార్చనను ముగించెను. పిమ్మట "మీ మనోరథములు నెరవేరుగాక" అని ఆ ఇరువురు సోదరులను ఆశీర్వదించెను. అది విని రామలక్ష్మణులు ప్రసన్నచిత్తులైరి. విజ్ఞానఖనియైన విశ్వామిత్రముని భోజనానంతరము వారికి అనేకపౌరాణికగాథలను వినిపించెను. ఆ విధముగా దినమంతయు గడిపి, సాయంకాలమున గుర్వాజ్ఞనుబడసి, ఆ ఇద్దఱును సంధ్యోపాసనకై వెళ్ళిరి. పూర్వదిశయందు చంద్రోదయమాయెను. సీతాదేవిముఖమునుబోలిన చంద్రబింబమును గాంచి శ్రీరామచంద్రుడు సంతసించెను. కొంచెమాలోచించిన పిదప ఈ చంద్రుడు సీతాదేవి ముఖముతో సమానుడు కాడని భావించెను. (చౌ॥ 1-4)

సముద్రమీతనిజన్మస్థానము. ఆ సముద్రమునందే విషముగూడ జన్మించెను. కనుక విషము ఇతని తోబుట్టువు. ఇతడు కళంకితుడు. పగలంతయు శోభాహీనుడు. పాపము! అట్టి కళావిహీనుడైన చంద్రుడు సీతాదేవి ముఖమునకెట్లు సాటియగును? (దో॥ 237)

అంతేగాక చంద్రుడు వృద్ధిక్షయములు గలవాడు. విరహాతురులను దుఃఖితులనుగా జేయును. అప్పుడప్పుడు ఇతడు రాహువుచే కబళింపబడుచుండును. ఇతడు చక్రవాకములకు శోకప్రదుడు. కమలములకు ద్రోహము చేయువాడు. "చంద్రా! నీలో ఇన్ని అవగుణములు ఉన్నందున జానకీదేవి ముఖమును నీతో పోల్చుట అనుచితము, దోషము"- అని ఈ విధముగా చంద్ర నెపముతో సీతాదేవి ముఖసౌందర్యమును స్మరించుచు, చాల రాత్రియైనదని గమనించి, గురువునొద్దకు వెళ్లెను. ముని చరణములకు ప్రణమిల్లి, ఆయన అనుమతితో శ్రీరాముడు విశ్రమించెను. రాత్రి గడిచిన పిదప మేల్కొని, తమ్ముని జూచి ఇట్లనెను. "తమ్ముడా! చూడుము. కమలములకును, చక్రవాకములకును, సమస్త లోకములకును సుఖప్రదమైన అరుణోదయమైనది"- లక్ష్మణుడు చేతులుజోడించి, ప్రభుప్రతాపమును ప్రకటించుచు మృదువచనములతో ఇట్లనెను. (చౌ॥ 1-4)

అరుణోదయముతో కలువలు ముకుళించెను. తారకలు కాంతి విహీనములయ్యెను. అట్లే మీ రాక కారణముగ రాజన్యులందఱును దుర్బలులైరి. (దో॥ 238)

రాత్రులయందు నక్షత్రములవలె మినుకుమినుకులాడుచున్న ఈ రాజులు చీకటివలె దుర్భేద్యమైన ఈ ధనుస్సును భంగపఱచజాలరు. రాత్రి గడిచినంతనే కమలములు, చక్రవాకములు, తుమ్మెదలు, వివిధములైన పక్షులు సంతసించును. అట్లే ధనుర్భంగము జరిగినచో మీభక్తులు సంతసించెదరు. ఇదిగో సూర్యోదయమైనది. అదిగో అంధకారము దూరమైనది. నక్షత్రములు అదృశ్యములైనవి. ప్రపంచమున వెలుగులు నిండినవి. ఓ రఘునాథా! రాజులందఱికిని మీ ప్రతాపమును ప్రకటించుటకే సూర్యుడు ఉదయించుచున్నాడు. మీ భుజబలమును నిరూపించుటకే ఈ ధనుర్భంగము చాటింపబడినది."- తమ్ముని వచనములకు శ్రీరాముడు దరహసితుడయ్యెను. శ్రీరాముడు సహజముగా నిత్యపవిత్రుడైనను శౌచ స్నానాదులను ఆచరించెను. అనుష్ఠానానంతరము గురుపాదములకు ప్రణమిల్లెను. జనక మహారాజు తనపురోహితుడైన శతానందుని విశ్వామిత్రునికడకు పంపెను. జనకుని విన్నపమును ఆతడు మునికి వినిపించెను. విశ్వామిత్రుడు సంతుష్టుడై సోదరులిద్దఱిని తన యొద్దకు పిలిచెను. (చౌ॥ 1-5)

శ్రీరాముడు శతానందులకు నమస్కరించి, గురువునొద్ద కూర్చొనెను. అప్పుడు విశ్వామిత్రుడు "నాయనా! పద. జనక మహారాజు పిలువనంపినాడు"- అనియెను. (దో॥ 239)

(మాసపారాయణము ఎనిమిదవ విరామము)

(నవాహ్నిక పారాయణము రెండవ విరామము)

# శివ ధనుర్భంగము

"మనము సీతాస్వయంవరమును చూడవలెను. భగవదనుగ్రహము ఎవరిపై ప్రసరించునో చూచెదము"- అని విశ్వామిత్రుడు పలుకగా లక్ష్మణుడు ఇట్లనెను. "ప్రభూ! మీకృప ఎవరిపై నుండునో వారే ఈ అదృష్టమునకు నోచుకొందురు."- లక్ష్మణుని ఈ మంచి మాటలను విని, సంతసించి, మునులు వారిని ఆశీర్వదించిరి. కృపానిధియైన శ్రీరాముడు మునులతోగూడి ధనుర్యాగశాలకు వెళ్లెను. సోదరులిద్దఱును రంగభూమికి వచ్చినట్లు తెలియగనే నగరమునందలి స్త్రీ పురుషులు, బాలురు, యువకులు, వృద్ధులు అందఱును తమ పనులనన్నింటిని విడిచిపెట్టి, అచటికి చేరిరి. ఆ మహాసమూహమునుగాంచి, జనకమహారాజు తనకు విశ్వాసపాత్రులైన సేవకులను బిలిచి, "మీరు వెంటనే సభకు వచ్చిన వారి నందఱిని ఉచితాసనములపై యథా యోగ్యముగ, కూర్చుండ బెట్టుడు"- అని చెప్పెను. (చౌ॥ 1-4)

ఆ సేవకులు వినయపూర్వకముగా మృదువచనములను బల్కుచు విచ్చేసిన వారినందఱిని (పెద్ద, చిన్న, ఉత్తమ, మధ్యమ తారతమ్యములను గమనించుచు) యథాయోగ్యముగ సుఖాసీనులను గావించిరి. (దో॥ 240)

మూర్తీభవించిన సౌందర్యములాయనునట్లు ఆ రాకుమారులు (రామలక్ష్మణులు)సభలో ఆసీనులైరి. వారి వన్నెచిన్నెలు సర్వాకర్షకములై ఒప్పుచుండెను. సద్గుణనిధులు, అస్త్రవిద్యావిశారదులు, మహావీరులు, ఐనట్టి, వారు తారాగణములమధ్య ఇద్దఱు చంద్రులవలె ఆ రాజసమూహములో ప్రకాశించిరి. సభలోని వారికందఱికిని వారివారి హృదయములలోని భావములకనుగుణముగా శ్రీరామచంద్రుడు కన్పట్టెను. శ్రీరామచంద్రప్రభువును రణధీరులైన రాజన్యులు ఆకృతిదాల్చినవీరరసముగా జూచిరి. కుటిలురు భయంకరమూర్తిగా గాంచి భీతిల్లిరి. రాజవేషములలోనున్న రాక్షసులు ప్రభువును కాలయమునిగా గాంచిరి. నగరవాసులు ఆ ఇరువురు సోదరులను నేత్రానందకరులైన పురుషోత్తములనుగా దర్శించిరి. (చౌ॥ 1-4)

స్త్రీలందఱును హర్షితహృదయులై తమతమ భావములననుసరించి, మూర్తీభవించిన శృంగార రసముగా గాంచిరి. (దో॥ 241)

పండితులు ప్రభువును అనేకములైన ముఖములు, చేతులు, పాదములు, శిరస్సులు గల విరాట్ స్వరూపునిగా దర్శించిరి. జనకుని బంధువులు ఆయనను తమఆత్మీయునిగా తలపోసిరి. జనకుని రాణులు ఆయనను వాత్సల్య భావముతో బాలునిగా భావించిరి. వారిప్రీతి వర్ణనాతీతము. యోగులు శుద్ధ శాంతస్వరూపుడైన పరబ్రహ్మగా కనుగొనిరి. భక్తులు ఆయిరువురిని సుఖప్రదాతలైన తమ ఇష్టదేవతలుగా తలంచిరి. సీతాదేవి ఆ ప్రభువును అనిర్వచనీయప్రేమానందమూర్తిగా గాంచెను. ఆమె తనహృదయములోగలిగిన ప్రేమసుఖానుభూతిని ప్రకటింపలేక పోయెను. ఇంక కవియెట్లు ప్రకటింప గలడు? ఈ విధముగా వారందఱును ఆ కోసలరాకుమారుని తమతమ హృదయములలోని భావములకు అనురూపముగా దర్శించిరి. (చౌ॥ 1-4)

శ్యామల, గౌరవర్ణ శరీరులైన ఆ అయోధ్యారాకుమారులు ఈ విధముగా అందఱిదృష్టిని ఆకట్టుకొని, సభలో విరాజిల్లిరి. (దో॥ 242)

వారిమూర్తులు సహజమనోహరములైనవి. కోటిమన్మథుల సౌందర్యములుగూడ వారి అందచందములకు సాటిగావు. శరత్పూర్ణిమాచంద్రుడుగూడ వారిముందు దిగదుడుపే- వారికమల నయనశోభలు అందఱికిని మనోరంజకములాయెను. వారిచూపులు అందఱికిని ప్రీతికరములాయెను, అవి మన్మథునిగూడ మురిపించుచుండెను, అవి వర్ణనాతీతములు, కపోలముల నిగనిగలు మనోహరములు, కర్ణకుండలములు చంచలములు, చుబుకములు, పెదవులు మిక్కిలి మనోజ్ఞములు, పలుకులు అతిమధురములు, చిఱునవ్వులు చంద్రకిరణములను పరిహసించును, కనుబొమలు, నాసికలు, ఫాలతిలకములు పరమాకర్షణీయములు. నల్లనికేశపాశములు మధుపాళిని మరపించుచుండెను శిరోభూషణములైన పచ్చనిఉష్ణీషముల (పాగాల) మధ్య గల పూలనగిషీలు నేత్రానందకరములు. శంఖములవంటి కంఠసీమలపై అలరారు త్రిరేఖలు ముల్లోకముల సౌందర్యములకు పరాకాష్ఠగా నుండెను. (చౌ॥ 1-4)

వారి హృదయసీమలను గజముక్తామణుల సుందరహారములు, తులసీమాలలు అలంకరించి యుండెను. వారిభుజస్కంధములు వృషభములమూపురములవలె బలిష్ఠములై సమున్నతములై యుండెను. నిలబడియున్నప్పుడు వారు సింహకిశోరములవలె ధీరగంభీరులై యుండిరి. వారి బాహువులు దీర్ఘములు, బలిష్ఠములు. (దో॥ 243)

తూణీరములు కటిఘటితములై యుండెను. పీతాంబరములతో, చేతులవిల్లంబులతో, మెడలపై యజ్ఞోపవీతములతో, ఆ రాకుమారులు ఆపాదమస్తకము మధురాకృతులు గల్గియుండిరి. అచటి వారెల్లరు వారిని రెప్పవాల్చక చూడసాగిరి. జనకమహారాజు వారిని జూచి ముచ్చటపడుచు విశ్వామిత్రుని పాదములకు ప్రణమిల్లెను. అతడు మునికి శివధనుస్సుకథను వినిపించి, రంగభూమిని చూపించెను. ముద్దులొలుకు రాకుమారులు వెళ్లిన ప్రతిప్రదేశమునందును జనులు ఆశ్చర్యచకితులైచూడసాగిరి. శ్రీరాముడు తమనే చూచుచున్నట్లు అందఱును భావించిరి. ఈ రహస్యమెవ్వరికిని బోధపడలేదు. మునీశ్వరుడు రంగభూమిని మెచ్చుకొనెను. జనకుడు సంతుష్టుడాయెను. (చౌ॥ 1-4)

సమున్నత సుందర-ఆసనములపై జనకుడు మునిని, రామలక్ష్మణులను ఆసీనులుగా జేసెను. (దో॥ 244)

శ్రీరామచంద్రునిజూచిన రాజన్యులందఱును రాకాసుధాకరునిముందు తారకలవలె తేజోవిహీనులైరి. "శ్రీరాముడే ధనుర్భంగముగావించును. ఇందు సందేహము లేదు"- అని అందఱును విశ్వసించిరి. "శివధనుర్భంగవిషయముమాట ఎట్లున్నను సీతాదేవి శ్రీరాముని కంఠమున విజయమాలను అలంకరించుట తథ్యము. కావున కీర్తి, ప్రతాపము, బలము, తేజస్సు- అన్నింటిని మఱచిపోయి, మన ఇండ్లకు పోవుదము. రండు"

అని కొందఱు తమనిశ్చితభావములను ప్రకటించిరి. వారి మాటలను విని, అవివేకులు, అజ్ఞానాంధులు, దురభిమానులు ఐన మఱికొందఱు రాజులు వారిని పరిహాసముచేయుచు "ధనుర్భంగము కావించినను శ్రీరామునివివాహము సీతతో జరుగుట అసంభవము. ధనుర్భంగము కానిచో అది యెట్లు జరుగును? కాల యముడే వచ్చి ఎదిరించినను అతనితో పోరుసల్పుటకు మేము సిద్ధము"- అని పల్కిరి. ఆ మూర్ఖులను జూచి, ధర్మశీలురు, హరిభక్తులైన రాజులు నవ్వుకొనిరి. (చౌ॥ 1-4)

వారు (ఆ సజ్జనులు) పలికిరి. "ఈ రాజులగర్వములనణచి శ్రీరాముడు సీతను తప్పకుండా పెండ్లియాడును. రణధీరులైన దశరథకుమారులను యుద్ధములో ఎదుర్కొని జయింపగల వారెవ్వరు? (దో॥ 245)

వ్యర్థ ప్రేలాపనలతో ప్రాణములను పోగొట్టుకొనవద్దు. ఊహాజనిత మధురపదార్థములతో ఆకలి తీరదు. మా పవిత్ర సూచనను పాటించి, సీతాదేవిని సాక్షాత్తు లోకమాతగా శ్రీరామచంద్రుని జగత్ పితగా ఎఱుంగుడు. ఆయన సౌందర్యమును కన్నులార ఆస్వాదింపుడు. సుందరులు, సుఖప్రదాయకులు సద్గుణసంపన్నులు ఐన రామలక్ష్మణులు ఎల్లప్పుడును శివుని హృదయములో నివసింతురు. ప్రక్కనే ఉన్న (సమీపముననేయున్న) అమృత సాగరమును వదలి ఎండమావులకై పరుగెత్తుచు ఏల మరణించెదరు? అనగా జగజ్జననియైన సీతాదేవిని వ్యర్థముగా ఏలకోరెదరు? సరే మీ ఇష్టమువచ్చినట్లు ప్రవర్తింపుడు. మేము మాత్రము మా జన్మలు ధన్యమైనట్లు తలంచెదము."- ఈవిధముగా పలికి, సజ్జనులైన ఆ రాజులు భక్తి తత్పరులై రాముని అనుపమసౌందర్యమును తనివితీరగ్రోలిరి. దేవతలు ఆకాశమున విమానములలో నుండి ఈ దృశ్యమును గాంచుచు పుష్పవృష్టిని గురిపించిరి. మధురగానములను వినిపించిరి. (చౌ॥ 1-4)

ఇదియే సరియైనసమయమని భావించి, జనకుడు సీతాదేవిని పిలువనంపెను. ఆమెను సుందరీమణులైన చెలులు స్వయంవరమునకు తోడ్కొని వచ్చిరి. (దో॥ 246)

జగజ్జననియైన సీతాదేవిసౌందర్యము వర్ణనాతీతము. ఆమె సద్గుణసౌందర్యరాశి. సామాన్య స్త్రీలను వర్ణించు సందర్భమున ఉపయోగింపబడు ఉపమానములెవ్వియును ఆమె విషయమున పనికిరావు. ఈ ఉపమానములతో సీతాదేవిని వర్ణించి, ఎవరు 'కుకవి'గా అపకీర్తిపాలగుదురు? వేఱొక స్త్రీతో పోల్చుదమనిన ప్రపంచమున అట్టి మఱియొకసౌందర్యవతి లేనేలేదు. సరస్వతీదేవి ఎక్కువగా మాట్లాడునది. భవాని అర్ధాంగిని, అనగా సగము స్త్రీ సగము పురుషుడు. మన్మథునిభార్య రతీదేవి తన భర్త 'అనంగుడు' అగుటచే విచారగ్రస్తయై యున్నది. విషము, మదిరలకు తోబుట్టువైన లక్ష్మీదేవితో ఈమెను పోల్చుట తగదు. లావణ్యమను అమృత సాగరమును పరమసౌందర్య మనెడి కూర్మమును కుదురుగా జేసి, శోభను త్రాడుగా జేసి, శృంగారరసమును మందరపర్వతముగా జేసి, మన్మథుడు స్వయముగా మథించినచో- (చౌ॥ 1-4)

అట్టి మథనమువలన శృంగారదేవతయైన లక్ష్మీదేవి ఉద్భవించినను ఆమె కూడ సీతాదేవికి సాటిరాదు. అనగా లావణ్య పరమ సౌందర్య శోభాశృంగారముల మధురాకృతియే సీతాదేవి. (దో॥ 247)

చతురలైన ఆమెసఖులు మధురగీతములను గానముచేయుచు ఆమెవెంట నడిచిరి. అందమైనవినూత్నవస్త్రములతో సుశోభితయైన జగజ్జనని (సీతమ్మ) నిరుపమానసౌందర్యరాశిగా శోభిల్లుచుండెను. సఖులచే సర్వాలంకారభూషితయై ఆమె అలరారుచుండెను. సీతాదేవి స్వయంవరసభలో అడుగిడినంతనే ఆమెదివ్యసౌందర్యశోభలకు స్త్రీపురుషులెల్లరును ముగ్ధులైరి. దేవతలు పరమానందముతో దుందుభులు మ్రోగించిరి. అప్సరసలు గీతములను ఆలపించుచు పుష్పవృష్టిగురిపించిరి. సీతాదేవికరకమలములయందు జయమాల శోభిల్లుచుండెను. ఆమె ఒక్కసారి సభలోని రాజన్యులనందఱిని పరికించి చూచెను. ఆమెచకితచిత్తము తహతహపాటుతో కేవలము శ్రీరాముని దర్శనమునకై ఆరాటపడసాగెను. రాజులందఱును మోహవివశులైరి. ముని

ప్రక్కన ఆసీనులైయున్న రామలక్ష్మణులను జూచి, ఆమెనేత్రములు నిధినిగాంచినట్లు ఆనందపరవశమైనవి. (ఆ చూపులు అచటి నుండి మఱలిరాలేదు.) (చౌ॥ 1-4)

సీతాదేవి గురుజనుల యెదుట ఇతర సదస్యుల సమ్ముఖమున సిగ్గు పడినదై, శ్రీరాముని తదేక దృష్టితో గాంచుటకు సంకోచించి, ఆయనరూపమును తనహృదయమునందే నిల్పుకొని, సఖులవైపు తిరిగెను. (దో॥ 248)

సభాసదులందఱును సీతారాములరూపవైభవములను రెప్పలార్పక చూడసాగిరి. వారు తమఆనందములను బయటికి ప్రకటింపక మనస్సులలోనే పదిలపఱచుకొనిరి. పిదప వారు బ్రహ్మదేవుని గూర్చి లోలోన ఇట్లు ప్రార్థించిరి. "ఓ విధాతా! జనకుడు పట్టుదలను వీడి, సముచితముగా ప్రవర్తించుగాక. తనప్రతిజ్ఞను ప్రక్కనబెట్టి నిస్సంకోచముగా సీతాదేవిని శ్రీరామునకిచ్చి, వివాహము చేయుగాక. ఇదియే సరియైన విధానము. అపుడు జనకుడు అందఱి మన్ననలను అందుకొనును. లేక అతడు పట్టుదలను వీడనిచో పశ్చాత్తాపపడక తప్పదు." అందఱును ఇట్లే అభిప్రాయపడుచుండిరి. జానకీరమణికి ఈ శ్యామ సుందరుడే తగిన వరుడని భావించుచుండిరి. రాజు వందిమాగధులను పిలిపింపగా వారు ఆయనకీర్తిని పొగడుచు వచ్చిరి. రాజు "మీరు వెళ్లి నా ప్రతిజ్ఞను చాటుడు" అని వారిని ఆదేశించెను. వారు సంతోషముతో వెళ్లిరి. (చౌ॥ 1-4)

వారు గంభీరముగా ఇట్లు పలికిరి. "ఓ రాజులారా! మేము జనకమహారాజుగారి దృఢప్రతిజ్ఞను ఎలుగెత్తి చాటుచున్నాము. (దో॥ 249)

రాజులభుజబలమనెడి చంద్రునకు ఈ శివధనుస్సు ఒక రాహువువంటిది. ఇది 'బరువైనది, కఠినమైనది' అను విషయమును ఎల్లరును ఎఱుగుదురు. మహాబలశాలురైన రావణుడు, బాణాసురుడు గూడ, దీనిని గాంచి, వెంటనే తిన్నగా నిష్క్రమించిరి. సాటిలేని ఈ శివధనుస్సును ఈ సభలో భంగము చేసిన వానిని జనకసుత వరించును. అతడు త్రిభువనవిజేతయే యగును." ఈ రాజప్రతిజ్ఞను విని, రాజన్యులెల్లరును పేరాసకులోనైరి. మనస్సులలో ఆరాటముతో దురభిమానులైన ఈర్ష్యాళువులు నడుము బిగించి, తమ ఇష్ట దైవములను స్మరించుకొనుచు ముందుకు రాసాగిరి. వారు ఆవేశముతో శివధనుస్సు వైపు చూచిరి. దానిపై దృష్టిని నిలిపి, బలమునంతయును ఉపయోగించుచు దానిని ఎత్తుటకు ప్రయత్నించిరి. కాని అది కదలనైన కదలలేదు. వివేకవంతులైన కొందఱు ఆ ధనుస్సుచాయలకే వెళ్లలేదు. (చౌ॥ 1-4)

మూర్ఖులైన రాజులు తమకముతో ధనుస్సును తాకు చుండిరి. కాని దానిని కదలింప లేక సిగ్గుతో తలవంచుకొని, వెనుకకు మఱలుచుండిరి. ఆ యోధుల బాహుబలములను గ్రహించి, ఆ ధనుస్సు ఇంకను బరువెక్కుచున్నట్లు ఉండెను. (దో॥ 250)

పిదప పదివేల మంది రాజన్యులు ఒక్కుమ్మడిగా ఆ ధనువును కదలింప ప్రయత్నించిరి. కాని వారి ప్రయత్నములెల్లను వమ్మయ్యెను. కాముకునిఇచ్చకపుమాటలు పతివ్రతమనస్సును చలింపజేయజాలనట్లు వారిబలములు శివధనుస్సును కదలింప లేకపోయెను. వైరాగ్యము లేని సన్యాసి వలె వారందఱును నవ్వులపాలైరి. వారు తమకీర్తిని, విజయమును, వీరత్వమును ధనుస్సునకప్పగించి, నిస్సహాయ స్థితిలో వెనుకకు మఱలిరి. రాజన్యులందఱును పరాజితులై నిరాశానిఃస్పృహలతో తమ తమ స్థానములకు చేరి చతికిలబడిరి. వారిని జూచి జనకమహారాజు కోపముతో పలికెను. "మేము చేసిన ప్రతిజ్ఞను విని, ప్రపంచము యొక్క నలుమూలలనుండి పెక్కుమంది రాజులు విచ్చేసిరి. దేవతలు, దైత్యులు గూడ మానవాకారములతో వచ్చినారు. వేనవేల వీరులు, యోధులు గూడ విచ్చేసిరి. (చౌ॥ 1-4)

మనోహారిణియైన కన్యకామణిని, అఖండవిజయమును, శాశ్వత కీర్తిని పొందదగిన మహావీరుని బ్రహ్మ ఇంత వఱకు సృష్టింపనే లేదని నాకనిపించుచున్నది. అట్లే అమోఘమైన ఈ ధనుస్సును, దీనిని భంగపఱచగలవీరుని

బ్రహ్మ సృష్టింపలేదు, సృష్టింపలేడు. అంతరార్థమేమనగా బ్రహ్మ సృష్టికి అతీతుడైన శ్రీరాముడు మాత్రమే శివధనుర్భంగముగావించి, మనోహారిణియైన కన్యకామణిని, అఖండ విజయమును, శాశ్వత కీర్తిని పొందగలడు. (దో॥ 251)

జనకుడు ఇంకను ఇట్లు వచించెను. "ఈ బహుమతులకై ఆశపడనివారు ఎవ్వరు? కాని ఎవ్వరూ శివధనుస్సును ఎక్కుపెట్టలేకపోయిరి. ఎక్కుపెట్టుట, విఱుచుట వేరే సంగతులు. వాటిని అటు ఉండనిండు కాని ధనుస్సును వారెవ్వరునూ ఇసుమంతయును కదలింపలేకపోయిరి. పృథ్విలో వీరుడైన వాడు ఒక్కడూలేడని నేను భావించినచో అభిమానము ఉన్నవాడెవ్వడును తప్పుగా తలంపరాదు. మీ ఆశలనన్నింటిని వదలుకొని, గృహోన్ముఖులు కండు. సీతావివాహమును బ్రహ్మ నిర్ణయింపలేదేమో? (సీతమ్మ బ్రహ్మ సృష్టికాదుగదా!) నేను నా ప్రతిజ్ఞను విరమించుకొన్నచో నా పుణ్యమును కోల్పోవుదును. ఇప్పుడు నేను చేయవలసినదేమి? రాజకుమారి కన్యగానే మిగులును. రాజన్యులారా! ఈ భూమిపై వీరులే లేరని తెలిసియున్నచో నేను ఈ ప్రతిజ్ఞను చేయకయే యుందును. ఇట్లు నవ్వులపాలు కాకపోవుదును." జనకుని మాటలు వినిన స్త్రీపురుషులందఱును జానకివైపు జూచి విచారగ్రస్తులైరి. కాని లక్ష్మణుడు కోపావేశమును అణచుకొనలేకపోయెను. ఆతని భ్రుకుటి ముడివడెను. పెదవులు వణికెను. కన్నులు నిప్పులు రాల్చెను. (చౌ॥ 1-4)

జనకుని మాటలు బాణములవలె అతని హృదయమున గ్రుచ్చుకొన్నను రామునకు భయపడి ఏమియు మాటాడక మిన్నకుండెను. కాని చివరకు శ్రీరాముని పాదపద్మములకు ప్రణమిల్లి, దృఢముగా పల్కెను. (దో॥ 252)

రఘువంశమణియైన శ్రీరామచంద్రుడు ఈ సభలోనే విరాజిల్లుచున్నాడని తెలిసియు జనకుడు ఇట్లు మాట్లాడుట అనుచితము. సభలో రఘువంశజుడైన వాడెవ్వడున్నను ఇట్లు మాట్లాడనే రాదు. ఓ సూర్యవంశతిలకా! నా అభిమానముతో గాక సహజముగానే పలుకుచున్నాను. మీరు అనుమతించినచో ఈ బ్రహ్మాండమునే బంతివలె ఎత్తగలను. (ఆదిశేషుడు గదా!) దానినొక మట్టికుండనువలె పగులగొట్టగలను కూడ. మేరుపర్వతమునుగూడ ముల్లంగినివలె ముక్కలు ముక్కలు చేయగలను. ఈ ప్రాతధనుస్సు ఒక లెక్కా? ప్రభూ! నాకాజ్ఞయిండు నేను చేయు అద్భుతములను తిలకింపుడు. తామరతూడునువలె ఈ ధనుస్సును వంచి, దానిని చేతబట్టి నూఱుయోజనములు పరుగెత్తగలను. (చౌ॥ 1-4)

ప్రభూ! మీ ప్రతాప ప్రభావములవలన నేను ఈ ధనుస్సును పుట్టగొడుగును వలె విరిచి వైచెదను. అట్లు చేయనిచో నేను ధనుర్బాణములనే ధరింపనని మీ పాదములపై ఒట్టు పెట్టుకొని చెప్పుచున్నాను. (దో॥ 253)

లక్ష్మణుని ఈ మాటలకు పృథ్వి కంపించెను. దిగ్గజములు గడగడలాడెను. అక్కడ నున్నవారితోగూడ రాజన్యులెల్లరును భయభ్రాంతులైరి. సీతాదేవి సంతోషపడెను. జనకుడు సిగ్గుపడెను. శ్రీరాముడును, విశ్వామిత్రాది మునీశ్వరులును ప్రశాంత చిత్తులై, పులకిత గాత్రులైరి. శ్రీరాముడు సంజ్ఞతో లక్ష్మణుని నివారించి, ప్రేమతో తన ప్రక్కన కూర్చొన జేసెను. ఇది సరియైన సమయమని గ్రహించి, విశ్వామిత్రుడు ప్రేమతో "రామా! లెమ్ము శివధనుర్భంగముగావింపుము. నాయనా! జనకరాజు విచారమును తొలగింపుము"- అని పలికెను. గురునాజ్ఞను వినినంతనే శ్రీరాముడు అయనకు పాదాభివందనమాచరించెను. ఆ రాముని మనస్సులో శోకముగాని, హర్షముగాని లేవు. సహజమైన శాంత స్వభావముతో శౌర్యమున సింహకిశోరమును మించుచు లేచి నిలబడెను.(1) (చౌ॥ 1-4)

---

1. అలకలల్లలాడగగని అరాణ్ముని యెటు పొంగెనో?
చెలువుమీఱగను మారీచుని మదమణచెడువేళ ॥ అలక ॥
ముని కనుసైగ దెలిసి శివధనువును విరిచెడి సమమున
త్యాగరాజవినుతుని మోమున రంజిల్లు ॥ అలక ॥ (త్యాగరాజ)